యండమూరి వీరేంద్రనాథ్

36వ్వోల్లో ఆడపిల్లా

వెన్నెల్లో ఆడపిల్ల

యండమూరి వీరేంద్రనాథ్

నవసాహితి బుక్ హౌస్

ఏలూరు రోడ్, విజయవాడ – 520 002

VENNELLO AADAPILLA (Novel)
(Serialised in `Andhra bhoomi' weekly)

By

YANDAMOORI VEERENDRANATH
36, U.B.I. Colony,
Road No. 3, Banjara Hills,
HYDERABAD - 500 034.
Ph: 924 650 2662
yandamoori@hotmail.com
yandamoori.com

SARASWAHI VIDYA PEETAM,
Kakinada - Samalkot Road,
MADHAVAPATNAM.

Publishers :
NAVASAHITHI BOOK HOUSE
Eluru Road, Near Ramamandiram,
Vijayawada - 520 002.
Ph. 0866 - 2432 885
navasahithiravi@gmail.com

This novel is digitized and brought to you by Kinige

ఆక్స్‌ఫర్డ్ అమ్మాయికీ

చదరంగం చాంపియన్‌కీ

జరిగిన నాజూకు పోరాటం

చిరు చిరు లెక్కల గిమిక్కుల నుండి పైతాగరస్

సిద్ధాంతం వరకు ____

టెలిఫోన్ డిపార్టుమెంట్ తీరుతెన్నుల

బ్యాక్ డ్రాప్‌తో _____

క్షణ క్షణం మిమ్మల్ని సస్పెన్స్‌లో పెట్టి,

నవల పూర్తయ్యాక ఒక మధురభావాన్ని

మీ మనసుల్లో కలకాలం నిలబెట్టే నవల

యండమూరి వీరేంద్రనాథ్

కలం జాలువారిన హరివిల్లు

పెన్నెల్లో ఆడపిల్ల

కథా స్థలం హైదరాబాద్ కాదు. కేవలం ఊహా జనితమైన స్థలం. కొన్ని ప్రదేశాలు మాత్రం సౌలభ్యం కోసం ఉపయోగించుకోవటం జరిగింది.

కథలో అక్కడక్కడా కొందరు ప్రసిద్ధ రచయితల కొటేషన్లు వాడుకోవటం జరిగింది. వారికి కృతజ్ఞతలు.

టెలిఫోన్ ప్రాతిపదిగ్గా చాలా రచన్లు చాలా భాషల్లో వచ్చినయ్. కానీ అబ్బాయిలూ, అమ్మాయిలూ ఫోన్‌లో చదరంగం ఆడుకోడం వెన్నెల్లో ఆడపిల్లకే ప్రత్యేకం....

- రచయిత

ఒక నీటిచుక్క కనుచివర నుంచి చెక్కిలి మీదకు జారి నాతో అన్నది :

"ప్రియతమా! ఇన్నాళ్ళూ నేను నీ గుండె లోతుల్లో నిక్షిప్తమై వుండిపోయాను. ఎన్నో అనుభవాల్ని నీతో పంచుకుంటూ వచ్చాను. విషాదమైనా, ఆనందం మరీ ఎక్కువైనా బైటకి రావటానికి ప్రయత్నించాను. కానీ నిన్ను వదిలి మాత్రం వెళ్ళలేకపోయాను. స్నేహితుడా! ఈ రోజు నీ గుండెల్లో ఉబుకుతూన్న ఈ వేదనా తరంగం నన్ను కుదిపివేస్తూంది. బైటకు తోసేస్తూంది. నేను కదిలి-కారి-జారి-ఆవిరైపోతాను. నేనిలా వెళ్ళిపోవటం నీ మనసు కేమాత్రం ఊరటనిచ్చినా... మిత్రమా - నా కంతకన్నా కావల్సిందేముంది?"

రమ్య స్మృతి

నాకు మీ సాహిత్య వివాదాలు తెలియవు -

నలుగుర్నీ మంచి చేసుకోవటం అంతకన్నా తెలీదు.

ఒక నక్షత్రం ఓరగా భూమ్మీదకు వంగి రహస్యం చెబుతున్న వేళ ఒంటరిగా నా గదిలో నేను మేల్కొని వ్రాసుకుంటూ ఉంటాను.

ఎదురుగా గోడమీద బల్లి... కిటికీ అవతల ఫెరన్ మొక్క...

ఎందుకు వ్రాస్తున్నానంటే ఏం చెప్పను? ఎలా చెప్పను?

నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు

నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే

అందమైన ఆడపిల్లలు

_____ అన్న తిలక్

_____ ఆ అక్షరాల్తో స్ఫూర్తి కలుగజేసినందుకు _____

మీరు బాధించినా ____ వేధించినా _____ వెలిచేసి బలిచేసినా _____

సర్వాన్నీ మరిచి ____

ప్రేమించే వారికీ - శ్లేషించే వారికీ - విమర్శనాగ్రేసరులకీ

స్కాండ్రల్స్ ప్రచారం చేసే స్పెసిమెన్స్‌కీ

సౌందర్య రసస్వానాంధులై విమర్శ పేరున వెర్రి వెర్రి కేకలేసిన వారికీ ___

ఈ ప్రేమ కానుక...

మీరు తృణీకరించినా - వెక్కిరించినా - సౌందర్యానికి కళ్ళు తెరిచి, ఏ కొందరో ఎక్కడో - ఏమూలో ఈకాన్కకోసం

కలలు కంటున్నారని - 'చివరి కాన్క' గీతాంజలిని ఇచ్చిన చలం

.... బ్రతకటం ఎందుకో నేర్పినందుకు...

.... వ్రాసిన ట్రాష్‌నే మెచ్చుకుంటూ - నాలో నమ్మకాన్ని కలుగజేసి - ఆ నమ్మకం పూలు పూచే సమయంలో ఏదో పనున్నట్టు హడావుడిగా వెళ్ళిపోయిన

వేణంకుల్

.... భిక్ష పెట్టినందుకు _____

యండమూరి వీరేంద్రనాథ్

వెన్నెల్లో ఆడపిల్ల

నామస్‌గాస్ ఉజ్‌బెకిస్తాస్

సమయం : 5-30 పి.యమ్.

విశాలమైన హాలు. హాల్లో మనుష్యులున్న అలికిడే లేదు. కానీ వందలాదిమంది విశాలమైన మెట్లలావున్న ఆర్చీల మీద కూర్చొని, ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. రెండు టెలివిజన్ కెమేరాలు నిశ్శబ్దంగా పనిచేసుకు పోతున్నాయ్. చప్పుడు కాకుండా దూరంగా నిలబడి లెన్స్ సహాయంతో ఫోటోలు తీసుకుంటున్నారు కొందరు.

పోలస్‌స్కీ ముందుకు వంగి ఎదుటి బల్లమీదకు తీక్షణంగా చూస్తున్నాడు. బల్లమీద తెలుపు గోధుమరంగు చదరపు గళ్ళు మనిషి జీవితపు గెలుపు ఓటమిల్లా పెనవేసుకుపోయి వున్నాయి.

తరువాత ఎత్తు వెయ్యవలసింది పోలస్‌స్కీ. అతడు గెడ్డం గోక్కుంటూ ఆలోచిస్తున్నాడు. అతడి మినిష్టర్ శత్రువుల మధ్య అష్ట దిగ్బంధనంలో వుంది.

హాలు మధ్యలో వున్న చదరంగపు బల్ల మీద పావులు ఏయే స్థానాల్లో వున్నాయో దానికి ఎదురుగావున్న ఎత్తయిన బోర్డుమీద ఎలక్ట్రానికి లైట్లు తెలుపుతున్నాయి. ఆ లైట్ల ఆధారంగా కొందరు ప్రేక్షకులు

తమ ముందున్న బోర్డులమీదే అదే ఆటని ఆడుతూ - నోట్సు వ్రాసుకుంటున్నారు. ఇదంతా నిశ్శబ్దంగా - ఎవరి ఏకాగ్రతకు భంగం కలిగించకుండా జరిగిపోతోంది.

పోలస్కీ మినిష్టర్ని వెనక్కి తీసుకొచ్చి రాజు ప్రక్కగా వుంచి ప్రత్యర్థివేపు చూసి నవ్వేడు.

ఏషియస్ ఛాంపియస్షిప్ పోటీలవి ఫైనల్స్.

రష్యన్స్ చదరంగంలో ప్రవీణులు. చదరంగం ఆట మనిషి మెదడుని ఎంతో వికసితం చేస్తుందని గ్రహించి, ఆ ఆటని చదువులో ఒక సబ్జెక్టుగా పెట్టినవాళ్ళు, బాబీ పిషర్ లాంటివాళ్ళు ఏ కొద్దిమందో తప్ప రష్యన్స్ని ఓడగొట్టి వరల్డు ఛాంపియన్షిప్ సంపాదించినవాళ్ళు ఎవరూ లేరు. అందులోనూ పోలన్స్కీ? అతడు గత పదేళ్ళుగా మకుటంలేని మహారాజుగా వెలుగుతున్నాడు. ఈ చిన్న ఏషియన్ ఛాంపియన్షిప్ అతడికో లెక్కలోనిది కాదు.

తన మంత్రిని ప్రతిపక్షపు పావుల మధ్యనుంచి వెనక్కి తీసుకొచ్చి రక్షించుకోవటమే కాకుండా - నైట్ ద్వారా 'చెక్' చెప్పటంలో పోలన్స్కీ తెలివితేటలు ప్రస్ఫుటమవుతున్నాయి. ఉన్నట్టుండి ఇప్పుడు భారత ఆటగాడివైపు వత్తిడి ఎక్కువయింది. భారత ఆటగాడు ఏం చేస్తాడా అని

కొద్దిగా హేళన మిళితమైన మొహంతో అతడివైపు చూస్తున్నాడు. అమ్మాయిలు మరీనూ - ఉన్నికోట్లు కప్పుకుని చిన్నటి నవ్వే కళ్ళతో.

భారత రాయబారి వూపిరి బిగబట్టి తనదేశపు ఆటగాడు ఏ ఎత్తువేస్తాడా అని చూడసాగేడు. ఆయనకి చదరంగంలో ఉత్సాహం వుంది. ఈ పోటీల ముఖ్య అతిథి ఆయనే! గెల్చిన వాళ్ళకి బహుమతి యివ్వటానికి వచ్చిన ఆయనే, ఆటగాళ్ళ కన్నా ఎక్కువ ఎగ్జైయిటింగ్‌గా వున్నాడు.

బయట బాగా మంచు కురుస్తూంది. కిటికీల్లోంచి తెల్లటి దూదిలా కనబడుతూంది.

అంత చలిలోనూ రేవంత్ నుదిటిమీద చెమట పడ్తూంది. అతడి మెదడులో ఆలోచనలు వేగంగా సాగుతున్నాయి. ఇది క్రీడాకారునిగా తన జీవన్మరణ సమస్య అని అతడికి తెలుసు. ఊహ తెలిసినప్పటినుంచి ఆడిన ఆటా, వేసిన ఎత్తులూ, చదివిన పుస్తకాలూ, వ్రాసుకున్న నోట్సులు అన్నీ రీళ్ళలా తిరగసాగేయి. అప్పుడప్పుడు వాచీవైపు చూస్తున్నాడు.

టైమ్ 'రన్ అవుట్' అవుతూంది.

చదరంగంలో ఎత్తుకీ ఎత్తుకీ మధ్య ఆటగాడు ఎక్కువ టైమ్ తీసుకోవటానికి వీల్లేదు. గంటకి పదహారు ఎత్తులు (మొదటి 2 1/2 గంటల్లో 40 ఎత్తులు) వెయ్యాలి.

రేవంత్‌కీ, పోలన్‌స్కీకి మధ్య వున్న చదరంగం బల్లకే రెండు స్టాప్ వాచీలు బిగించబడి వున్నాయి. ఒకరు ఎత్తు వెయ్యగానే తన వాచీ ఆపుచెయ్యాలి, వెంటనే రెండోవాచీ తనంతటతానే ప్రారంభం అవుతుంది. రెండో ఆటగాడు ఎత్తువేసి ఆపుచేసేవరకు అది తిరుగుతూనే వుంటుంది. ఎత్తు వేయగానే వాచీ ఆపుచేయటం మర్చిపోయి ఓడిపోయిన వాళ్ళు కూడా వున్నారు.

ఒక్కొక్కసారి వాచీ 'గంట' గడిచినట్టు చూపించేలోపులో పదహారు ఎత్తులు వేయకపోతే ఓడిపోయినట్టే. టైమ్‌లో ఆట పూర్తిచేయలేక వత్తిడి వల్ల తప్పు ఎత్తులు వేసి ఓడిపోయినవాళ్ళే యెక్కువమంది.

రేవంత్ ఇప్పుడు అదే స్థితిలో వున్నాడు.

ఇంకో అయిదు నిమిషాల్లో నాలుగెత్తులు వెయ్యాలి. ఎలా... ఎలా?

వాచీ ముల్లు తిరిగిపోతూంది. జనం చప్పట్లు కొట్టటానికి సిద్ధంగా వున్నారు. టి.వి. కెమేరామెన్ ఓడిపోతున్న రేవంత్ ముఖకవళికల్ని పట్టుకోవటం కోసం జూమ్‌లెన్స్‌తో మరింత ముందుకొచ్చాడు.

పోలన్‌స్కీ కుర్చీ వెనక్కివాలి పైకప్పుకేసి చూస్తూ రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాడు. ఇక నీ పని అయిపోయింది సుమా - అన్న సైకిలాజికల్ వీక్‌నెస్ ప్రత్యర్థిలో కలిగించటం అది! పోలన్‌స్కీకి ఇంకా పదిహేను

నిమిషాల టైమ్‌వుంది. ఎంత తాపీగా ఆడినా పర్లేదు. రేవంత్‌కి అలా కాదు. అయిదు నిముషాల్లో అప్పుడే అర నిముషం గడిచిపోయింది.

అతడు చూపుడువేల్తో శకటుని ముందుకు జరిపేడు.

పోలన్‌స్కీ వెంటనే నైట్‌ని తీసుకొచ్చాడు ముందుకి.

రేవంత్ బంటుని కదిపేడు. అతడు చాల డెస్పరేట్‌గా వున్నాడని చూసేవాళ్ళకి తెలుస్తూంది. టైమ్ ఇంకా రెండు నిముషాలుంది.

పోలన్‌స్కీ తేలిగ్గా మళ్ళీ ముందుకు జరిపాడు. జరిపి బంటుని తిన్నాడు.

కేవలం దానికోసమే చూస్తున్నట్లు రేవంత్ మూలనుంచి ఏనుగుని మధ్యకి తీసుకొచ్చి ''చెక్'' అన్నాడు. ఒక్క క్షణం పోలన్‌స్కీకి గానీ - చూస్తున్న వాళ్ళకిగానీ జరిగింది అర్థం కాలేదు. అంతా క్షణకాలంమీద జరిగిపోయినట్టుంది. అంత పెద్ద హాలూ అయోమయంతో కూడిన నిశ్శబ్దంతో క్షణకాలంపాటు స్థబ్దమైపోయింది. అయితే అది క్షణకాలం మాత్రమే, తరువాత ఆనకట్టని దాటి దూసుకొచ్చినట్టూ జనం హర్షధ్వానాలతో దూసుకొచ్చారు.

పోలన్‌స్కీ ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. పైకి డెస్పరేట్‌గా కనబడ్తూ - తనలో 'అహాన్ని' కలుగచేసి కొంచెం నిర్లక్ష్యంగా ఆడేటట్టు చేశాడన్న మాట ప్రత్యర్థి. అతడు తలెత్తి రేవంత్ వైపు చూసేడు.

జనం అప్పుడే రేవంత్ చుట్టూ చేరిపోయారు. అతడు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. దాదాపు మీదపడి ఆటోగ్రాపులు తీసుకుంటున్నారు. విలేఖర్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఒకదాని మీద ఒకటి ఆగకుండా ఫ్లాష్‌లు వెలుగుతున్నాయి. టి.వి. కెమేరాలు రకరకాల కోణాలకోసం హడావుడిగా తిరుగుతున్నాయి. భారత రాయబారి అయితే తన హోదా కూడా మరిచి రేవంత్‌ను గాలిలోకి యెత్తటానికి సాటి క్రీడాకారుడుగా ప్రయత్నం చేస్తున్నాడు.

సాధించింది తక్కువ విజయమేమీ కాదు. ఓడించింది పోలన్‌స్కీని! పది సంవత్సరాలుగా మకుటంలేని రాజుగా వెలుగుతూన్న ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుడ్ని!

వరల్డ్ ఛాంపియన్ అనాటలీ కార్పోవ్ స్వీడిష్ గ్రాండ్ మాస్టర్ అండర్సన్‌లు కూడా అతడితో ఆడటానికి కొద్దిగా వెనుకాడతారు. అటువంటి వాణ్ని ఓ ఇరవై అయిదేళ్ళ యువకుడు చివరి క్షణంలో చిత్తు చేసేడంటే - దాని వెనుక ఎన్నో సంవత్సరాల దీక్షా పట్టుదలా వుంటే తప్ప అది సాధ్యం కాదు. ఏదో చివర్లో హడావుడి చేసి గెలిచిన తాత్కాలికమైన గెలుపు కాదిది. తన 'హయాము' తీరిపోయిందనీ - తన స్థానం ఆక్రమించుకోవటానికి కొత్తతరం వచ్చేసిందనీ పోలన్‌స్కీకి తెలిసిపోయింది.

ఒకమ్మాయి రేవంత్ చేత చేతిమీద ఆటోగ్రాఫ్ తీసుకుంటూంది. ఓ పన్నెండేళ్ళ కుర్రవాడు రేవంత్‌ని సంభ్రమంగా చూస్తున్నాడు. ఒక ముసలివాడు అతడి భుజం ఆప్యాయంగా తడ్తున్నాడు.

అందరితో కలిసి రేవంత్ గుంపుగా ఆ గదిలోంచి బైటకు వచ్చేశాడు. అప్పుడే లైవ్ టి.వి. ద్వారా వార్త పాకిపోయినట్టుంది. జనం అక్కడికి చేరుకుంటున్నారు. ఆ ఆటపట్ల రష్యన్స్ కున్నంత అసక్తి ఇంకెవరికీ వుండదు.

అంతమంది చుట్టుముట్టడం వల్ల రేవంత్ మొహం చెమట పట్టింది. చూసుకుంటే జేబులో చేతిరుమాలు లేదు. ఆడుతున్నప్పుడు జారిపోయినట్టుంది.

ఇంతలో అనౌన్స్‌మెంట్ వినిపించటంతో అందరి దృష్టీ అటు మళ్ళింది. రేవంత్ చోటు చేసుకుని, తిరిగి హాల్లోకి వచ్చాడు. వరండాలోంచి వచ్చి, గుమ్మందాటి హాల్లోకి ప్రవేశిస్తూనే అతడు స్థబ్దుడై నిలబడిపోయాడు. విశాలమైన హాలు నిర్మానుష్యంగా వుంది. హాలు మధ్యలో చదరంగం బల్ల అలాగే వుంది. బల్ల కెదురుగా పోలన్‌స్కీ మాత్రం ముందుకు వంగి - మొహం చేతుల్లోకి దాచుకొని ఒక్కడే ఒంటరిగా కూర్చొని తనలో తాను రోదిస్తున్నాడు.

రేవంత్ అచేతనంగా చూస్తూ వుండిపోయాడు.

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఒక క్రీడాకారుడి నిష్క్రమణాన్ని ఆ స్థానాన్ని ఆక్రమిస్తున్న మరో క్రీడాకారుడు వ్యధతో పరిశీలిస్తున్నాడు. అతడికి 'స్టీక్' అన్న జాక్ లండన్ కథ జ్ఞాపకం వచ్చింది. ఇంకో పది సంవత్సరాలు తనీ రాజ్యాన్ని ఏలుతాడు. తరువాత నిష్క్రమిస్తూ తను రోదిస్తూవుంటే ఇంకో కుర్రవాడు తననీ ఇదే సానుభూతితో గమనిస్తాడు.

రేవంత్ చప్పుడు కాకుండా అక్కణ్ణుంచి తప్పుకుని బైటకు వచ్చేశాడు. వస్తూ అనుకున్నాడు ___

"విజయమా విజయమా --- వస్తూ శిఖరాన్నెక్కిస్తావు. వెళ్తూ పాతాళానికి తోస్తావు. నీకిది న్యాయమా?"

2

"కంగ్రాచ్యులేషన్స్."

"థాంక్యూ."

"హాయ్ రేవంత్ - కంగ్రాట్స్."

"థాంక్స్."

"కంగ్రాట్స్ మిస్టర్ రేవంత్!"

"థాంక్యూ సర్"

అతడు తల వంచుకుని మెట్లెక్కుతూ అభినందనలు తెలుపుతున్న వాళ్ళకి సమాధానం ఇస్తున్నాడు.

పెనున్సులా ప్రొడక్ట్స్ నాలుగో అంతస్థులో వున్నది. అదే అతడి ఆఫీసు. అందులో రేవంత్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్.

అతడు తన ఛాంబర్‌లోకి వచ్చేసరికి మానేజింగ్ డైరక్టర్ పిలుస్తున్నాడన్న కబురు వచ్చింది, వెళ్ళాడు.

"కంగ్రాచ్యులేషన్స్, ప్రొద్దున్నే పేపర్లో చూశాను..." ఇంగ్లీషులో అన్నాడాయన. థాంక్స్ చెప్పాడు రేవంత్.

"నీవల్ల కంపెనీకి కూడా మంచి అడ్వర్‌టైజ్‌మెంట్ లభిస్తుందోయ్"

రేవంత్ మాట్లాడలేదు. ఒక అత్యున్నతమైన పోటీలో తన ఉద్యోగి సంపాదించిన విజయాన్ని కూడా వ్యాపారదృష్టితో చూడగల ఆయన వ్యాపారదక్షతకి మనసులోనే జోహార్లర్పించాడు. ఈయనేగానీ వ్యాపారం మానేసి చదరంగం ఆడటం మొదలు పెడ్తే ఎప్పుడో ప్రపంచ ఛాంపియన్ అయిపోయి ఉండేవాడు.

అక్కణ్ణుంచి వచ్చేసేక జనరల్ మేనేజర్ దగ్గరికి వెళ్ళాడు రేవంత్. ఆయన దగ్గిర రేవంత్‌కి బాగా చనువుంది. ఆయనెప్పుడూ హడావుడిగా వుంటాడు. పనితప్ప ఇంకొకటి పట్టించుకోడు.

''రావోయ్ రా! ఎందులోనో ప్రైజ్ వచ్చిందని విన్నాను. ఎందులో ... కారంబోర్డా'' ఫైల్ చూసుకుంటూ అడిగాడు ఆయన.

''కాదండీ, చదరంగం.''

''ఓహో! వెరీగుడ్, నీ పేరు పెద్ద అక్షరాల్తో వేసేరే - నువ్వు టీమ్ కెప్టెన్‌వా?''

''కాదండీ, చదరంగం ఇద్దరే ఆడతారు.''

''ఓహో! అయితే ఎవరితో ఆడి గెల్చావు?''

''పోలన్‌స్కీ అని - వరల్డ్ ఛాంపియన్ సర్'' కొంచెం గర్వం తొంగిచూసింది రేవంత్ కంఠంలో.

''అతడెందు కొచ్చాడిక్కడికి?''

''కాదు సర్ - నేనే వెళ్ళాను.''

''ఎక్కడికి?''

''రష్యా''

''వ్వాట్? ఎప్పుడూ?''

''మీరే కద్సార్ నాకు శలవు ఇచ్చింది. క్రిందటివారం''

''అవునవును కదూ. ఇంతకీ ఎందుకు వెళ్ళావు రష్యా?''

''చదరంగం టోర్నమెంట్‌కి సర్''

''టోర్నమెంట్సా - ఓహో - అయితే మీ టీమ్ నెగ్గిందన్నమాట. గుడ్''

రేవంత్‌కి తనమీద తనకే జాలేసింది. ఇక ఈయనతో మాట్లాడి లాభం లేదని లేచాడు. బైటకొస్తూంటే ''.... ఏమిటి బయట చాలామంది వున్నట్టున్నారు'' అని అడిగాడు.

''ఈరోజు ఇంటర్వ్యూలు సర్'' అంటూ రేవంత్ జ్ఞాపకం చేశాడు.

''అవును కదూ! ఆ విషయమే మర్చిపోయాను. అన్నట్టు ఈరోజు పదకొండింటికి మీటింగ్ వుందే - ఎలా?'' తనలోతానే అనుకుంటున్నట్టు ఆయన అన్నాడు. రేవంత్ మాట్లాడకుండా బైటకి వచ్చేశాడు. అతడు తన ఛాంబర్స్ కొచ్చేసరికి అక్కడ కూర్చుని వున్న జేమ్స్ అతడిని చూసి నవ్వాడు. మామూలుగా కంగ్రాట్స్ చెప్పుకునే దానికన్నా ఎక్కువ స్నేహం వాళ్ళది. జేమ్స్ పెనున్సులా ప్రొడక్ట్స్ మార్కెటింగ్ మానేజర్.

జేమ్స్ అయిదడుగుల ఆరంగుళాల ఎత్తుంటాడు. ఎత్తుకుతగ్గ లావు. నల్లగావున్నా మొహంలో కళవుంది. నిర్లక్ష్యమైన కళ్ళు. ఆ నిర్లక్ష్యం పదోఏట తల్లి లేచిపోవటంతో పెరిగింది. తండ్రి తాగుబోతై పట్టించుకోవటం మానెయ్యటంతో పెరిగింది. స్త్రీ అంటే అతనికి గౌరవం లేదు. అది అతడి తప్పుకాదు. మనసుని తాకినవాళ్ళు లేరు. నిరాసక్తత కేరేపిన్‌ని చేసింది.

నిర్లిప్తత నాజూకుభావాల్ని చంపింది. తాగితే రాత్రంతా తాగుతూనే వుంటాడు. లేకపోతే ఓ నాలుగు నెలలు అసలు ముట్టుకోడు. చాలామంది చెడ్డవాళ్ళు మంచివాళ్ళుగా కనబడటానికి ప్రయత్నం చేస్తే - ఇతడు పనిగట్టుకుని చెడ్డవాడుగా కన్పించటానికి ప్రయత్నం చేస్తాడు. ఆడవాళ్ళలో ఆ పేరు చాలా సులభంగా సంపాదించాడు. కానీ మనసు పొరల్లోకి తరచిచూస్తే అంతా మంచే. ఓపిక ఎవరికుంది? ప్రేక్షకుడిగా వుండి జీవితాన్ని చూడటంతో నిర్లక్ష్యం నుంచి హాస్యం పుట్టింది. గీతలరూపంలో బైటపడేది అప్పుడప్పుడూ. కుదురుగా గీస్తే మంచి కార్టూనిస్టు అయివుండేవాడు. అయినా పత్రికల్లో పడుతూనే వుంటాయి. అతడంటేనే పడదు - పెనున్స్‌లా కంపెనీలో పనిచేసే ఎనిమిదిమంది అమ్మాయిల్లో ఏడుగురికి... ఇంకొక అమ్మాయి బాలవితంతువు.

రేవంత్ దీనికి పూర్తిగా వ్యతిరేకం. ఒకగొప్ప చిత్రకారుడు కుదురుగా కూర్చుని గీసిన చిత్రం అతడి జీవితం. చాలా సిస్టమాటిక్ అది. అయిదింటికే లేచి అయిదు గంటల పాటు ఆ చదరంగంతో ఆటాడి అరిస్టోక్రసీ కోటేసుకొని ఆఫీసుకొచ్చే ఆ అయిదడుగుల ఐదంగుళాల అబ్బాయి అంతరంగం ఆకాశంలా నిర్మలం, ఆకృతి అరవిందంలా కోమలం. పదవి కంఠంలో కమేండ్‌నీ, హోదా మనసులో బిడియాన్ని తీసుకురాలేదు.

విభిన్న ధృవాలు ఆకర్షించబడినట్టు వాళ్ళు స్నేహితులయ్యారు.

''ఎయిర్‌పోర్ట్‌కి వచ్చాను. కానీ నేను వచ్చేసరికి విమానం రావడం, వెళ్ళిపోవడం కూడా జరిగిందట'' అన్నాడు జేమ్స్.

రేవంత్ నవ్వి ''చాలా శ్రమ తీసుకున్నావే'' అన్నాడు.

''జెండా ఎగరేసి వచ్చావ్ కదా''

రేవంత్ మొహంలో నవ్వు మాయమై మ్లానమైంది. నెమ్మదిగా అన్నాడు. ''విమానం దిగగానే నా కళ్ళు వెతికాయి... నేను సాధించింది తక్కువ విజయమేమీ కాదని నాకు తెలుసు. నేను అభిమానుల్ని - పూలదండల్ని - ఘనస్వాగతాన్ని కోరుకోవటం లేదు. కానీ నీకు తెలుసా - జేమ్స్! కనీసం ప్రాంతీయ క్రీడామండలి సెక్రటరీ కూడా ఫార్మలిటీగా రాలేదు''

''కారణం నువ్వు క్రికెట్ అటగాడివి కాకుండా చదరంగం ఆటగాడివి కావటమా?''

''కాదు, తెలుగువాడిని కావటం''

పేరుకున్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ అతడు విషాదంగా అన్నాడు.

''నువ్వూ ఓ కళాకారుడివి. నీకు తెలియనిదేముంది? క్రీడాకారుడూ కళాకారుడూ చిన్నపిల్లల్లాటి వారు. రవ్వంత ఉత్సాహం వారిపట్ల చూపిస్తే పొంగిపోతారు. మీ విజయాన్ని మేం గమనిస్తున్నాం అని ఎవరయినా

అభిమానం కురిపిస్తే రెట్టించిన ఉత్సాహంతో మరింత కృషి చేస్తారు. ఆ అభిమానమే కొరవడుతూందీ రోజుల్లో...''

ఫోన్ మ్రోగింది.

రేవంత్ ఫోన్ ఎత్తి తన సహజమైన బిజినెస్ మోనోటోన్‌లో ''హలో'' అన్నాడు.

అవతలివైపు నుంచి వెంటనే సమాధానం రాలేదు. అతడు విసుగ్గా మరోసారి ''హలో'' అన్నాడు.

''హ __ హలో'' కొద్దిగా బెదురూ, కొద్ది ఎగ్జైయిట్‌మెంటు కొద్దిగా చిలిపితనం - అన్నీ మిళితమైన ఓ అందమైన స్వరం అవతల్నుంచి పలకటంతో రేవంత్ కుర్చీలో చప్పున కదిలి ''ఎవరూ?'' అన్నాడు.

''నేను .... నేను మీ అభిమానిని. మీకు కంగ్రాచ్యులేషన్స్ చెబుదామని ఫోన్ చేశాను.''

''థాంక్స్, మీ పేరు?'' అని అడిగాడు రేవంత్. అతడికిలా ఓ అపరిచిత వ్యక్తి ఫోన్‌చేసి అభినందనలు చెప్పటం క్రొత్త - అందులోను అమ్మాయి ఫోన్‌చేసి చెప్పటం మరీ కొత్త.

''పేరెందుకు?'' అందా అమ్మాయి.

రేవంత్ విస్మయంతో ‘‘అదేమిటి - పేరు చెప్తే వచ్చే నష్టం ఏముంది?’’ అన్నాడు.

‘‘పేరు చెబితే వచ్చే లాభం మాత్రం మీకేముంది? మీకు తెలియాల్సిందల్లా ఒకరు మీ అభిమాని అనీ, మీ విజయాన్ని గమనించి మీకు అభినందనలు తెలుపుతున్నారనీ... అంతేకదా’’ అన్నది.

‘‘కానీ చెప్పటం వల్ల నాకు కొద్దిగా సంతృప్తి వస్తుంది. మళ్ళీ ఎప్పుడైనా గుర్తు తెచ్చుకుంటే ఫలానా అమ్మాయి ఫోన్ చేసింది కదా అని వూహించుకోవటానికి బావుంటుంది’’ అన్నాడు సమర్థించుకుంటూ రేవంత్.

రేవంత్ పడుతూన్న అవస్థ చూచి జేమ్స్ ‘‘ఏమిటి విషయం?’’ అని అడిగాడు. రేవంత్ మౌత్‌పీస్‌కి చెయ్యి అడ్డుపెట్టి, ‘‘ఎవరో అమ్మాయి అభినందనలు చెబుతూంది’’ అన్నాడు. అని తిరిగి ఫోన్‌లో ‘‘ఏం నా ఆర్గ్యుమెంట్ కరక్టేనా?’’ అన్నాడు.

‘‘నా పేరూ...’’ అంటూ చెప్పబోయి ఆగి ‘‘నా పేరు మొదటి అక్షరం ఇంగ్లీషులో ‘ఆర్’ దీన్ని బట్టి కనుక్కోండి చూద్దాం’’ అన్నది.

అతడు తెల్లబోయి "" ఎలా కనుక్కోవటం?’’ అని అడిగాడు.

‘‘పెద్ద చదరంగం ప్లేయర్ కదా. ఆ మాత్రం కనుక్కోలేరా? ఆర్ అన్న అక్షరాలతో ప్రారంభం అయ్యే తెలుగు అమ్మాయిల పేర్లు ఎన్నుంటాయేమిటి’’ అని నవ్వి ‘‘అరగంట తర్వాత ఫోన్ చేస్తాను. ఈ

లోపులో వీలైనన్ని నోట్ చేసుకుని వుంచండి'' అని ఫోన్ పెట్టేసింది. రెండు నిమిషాల తర్వాత చూస్తే - స్నేహితులిద్దరు కాగితం కలాల్తో కుస్తీపడ్తున్నారు.

రాధ - రాధిక - రమణి - అన్న మూడు పేర్లు తట్టినయ్. రేవంత్ తల విదిలిస్తూ ''ఉహూ - ఇదేమీ లాభం లేదు'' అన్నాడు. అప్పటికే ఐదు నిమిషాలు గడిచినయ్. ఇంతలో పులిమీద పుట్ర అన్నట్టు జనరల్ మానేజర్ పిలుస్తున్నారని ప్యూన్ వచ్చి చెప్పాడు.

రేవంత్ జనరల్ మానేజర్ రూమ్‌కి వెళ్ళేసరికి ఆయన పియ్యేమీద ఎగిరిపడుతున్నాడు. ఇంకో గంటలో మీటింగ్ పెట్టుకుని ఇంటర్వ్యూలు ఎలా ఏర్పాటు చేశావని తిడుతున్నాడు. రేవంత్ వెళ్ళగానే ''చూడవోయ్, పదహారు మంది కాండేట్స్‌ని గంటలో ఇంటర్వ్యూ చెయ్యాలట. ఇదేమన్నా సాధ్యమా?'' అన్నాడు.

రేవంత్ మాట్లాడలేదు.

ఆయనే అన్నాడు. ''ఇదేం లాభంలేదుగానీ, రేవంత్ - వీళ్ళలో ఒక నలుగురిని కమిటీ రూమ్‌లో కూర్చొని నువ్వు సెలక్ట్ చెయ్యి, ఇదంతా అరగంటలో జరిగిపోవాలి.

ఆ నలుగుర్నీ నేను ఫైనల్‌గా ఇంటర్వ్యూ చేసుకుంటాను... క్విక్... మళ్ళీ పదకొండింటికి నాకు మీటింగుంది'' అంటూ ఫైలు చదవటంలో మునిగిపోయాడు.

రేవంత్, పియ్యే బైటికొచ్చారు. ఆయన గంటలో చెయ్యలేనిది తను అరగంటలో ఎలా చెయ్యగలడో అతనికి అర్థం కాలేదు. పోనీ గంటా తనకే ఇచ్చి ఒకర్ని సెలక్టు చెయ్యమనొచ్చుగా, ఉహూ, మళ్ళీ ఫైనల్ అధారిటీ తన చేతిలోనే వుంచుకోవాలి... అతనికి నవ్వొచ్చింది.

వరండా కుర్చీల్లోనూ, సోఫాల్లోనూ, సర్దుకొని కూర్చుని వున్నారు కాండేట్సు. తాయిలంకోసం చూచే చిన్నపిల్లల మొహాల్లా వున్నాయి వాళ్ళ మొహాలు. ఎనిమిదిమంది అబ్బాయిలూ, ఎనిమిదిమంది అమ్మాయిలూ అందరూ తెలివయిన వాళ్ళలాగే కనబడుతున్నారు.

వాళ్ళను చూసేసరికి ప్లాన్‌లాటి ఆలోచన తట్టింది రేవంత్‌కి.

''ఒక్కొక్కర్ని పంపమంటారా?'' సెక్రటరీ అడిగాడు.

''కాదు. అందర్నీ పంపు''

సెక్రటరీ అతడివైపు విచిత్రంగా చూసాడు. రేవంత్ అతడి అనుమానం గ్రహించి ''ఒక్కొక్కర్ని ఇంటర్వ్యూ చేయాలంటే అరగంటలో సాధ్యంకాదు. మాస్ ఇంటర్వ్యూ చేద్దాం'' అన్నాడు.

సెక్రటరీ బయటికి వెళ్ళిన నిమిషానికి బిలబిలమంటూ అభ్యర్థులు లోపలికి వచ్చారు. ‘‘కూర్చోండి’’ అన్నాడు రేవంత్. మధ్యలో బల్లవుంది. చుట్టూ వున్న కుర్చీల్లో కూర్చున్నారు వాళ్ళంతా.

రేవంత్ లేచి నిలబడి, కంఠం సర్దుకొని ఉపన్యాసంలా చెప్పటం ప్రారంభించాడు. ‘‘ఇటీవల కాలంలో కావల్సిన అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోవటంకోసం రకరకాల సైంటిఫిక్ పద్ధతులు వచ్చినయ్. పూర్వంలాగా చరిత్ర, భూగోళంలో ప్రశ్నలడగటం పాతపద్ధతి. తెలివితేటల్ని పరీక్షించటానికి ఓ కొత్తపద్ధతి ఇంటలిజెన్స్ కోషియెన్సీ టెస్ట్ అంటే ఐ.క్యూ. టేస్ట్! ఇప్పుడు మీకు ఆ పరీక్షపెట్టి మీలో నలుగుర్ని ఎన్నుకుని ఫైనల్ ఇంటర్వ్యూకి మా జనరల్ మేనేజర్ దగ్గరికి పంపే బాధ్యత నామీద పడింది’’ అతను వూపిరి తీసుకోవటానికి ఆగాడు.

అందరూ అతడేం చెప్తాడా అని చూడసాగేరు. అతడు తిరిగి చెప్పటం ప్రారంభించాడు. ‘‘.... ఐ.క్యూ. టేస్ట్‌లో ఏదయినా అడగవచ్చు. లెక్కలు, రంగుల కాంబినేషన్‌లు వగైరా, కానీ పెనున్సులా ప్రొడక్ట్సు తెలుగువారికి ప్రియమైనవి. ముఖ్యంగా తెలుగు అమ్మాయిలకి. అందుకని మీకో పరీక్ష పెడుతున్నాను. మీకు తెలిసిన తెలుగు అమ్మాయిల పేర్లు ఎన్ని వీలయితే అన్ని వ్రాయండి. కానీ ఒక షరతు, పేరు మొదటి అక్షరం ‘ఆర్’తో ప్రారంభం కావాలి. మీకు పదిహేను నిమిషాల టైమ్ యివ్వబడుతుంది. ఈ

సమయంలో ఎక్కువపేర్లు వ్రాసిన వాళ్ళని నలుగుర్ని ఫైనల్ ఇంటర్వ్యూకి పంపడం జరుగుతుంది'' అప్పుడే ఇద్దరు ముగ్గురు వ్రాసెయ్యటం మొదలు పెట్టటంతో మౌనం వహించాడు. కొంతమందికి వెంటనే అర్థం కాలేదు. నిముషం తర్వాత ట్యూబ్‌లైట్ వెలిగి, వాళ్ళు కలాలు కాగితాలమీద పెట్టారు.

మొదటి అయిదునిమిషాలూ తలెత్తకుండా అందరూ వ్రాసుకుంటూ పోయేరు. తరువాత తల పైకప్పుకేసి చూసేవాళ్ళు, గోళ్ళు కొరుక్కుంటు ఆలోచించేవాళ్ళు, ఓరగా ప్రక్కవారి కాగితాల్లోకి చూసేవాళ్ళు బయల్దేరారు. ఒకమ్మాయే ఎక్కువ వ్రాసింది. చాలామంది పది పదకొండు పేర్లకన్నా ఎక్కువ వ్రాయలేదు. కొంతమంది క్రిష్టియన్, ముస్లిమ్ పేర్లు కూడా వ్రాసేరు.

అందరికన్నా ఎక్కువ పేర్లు వ్రాసిన నలుగుర్ని సెలక్టు చేసి జనరల్ మానేజర్ దగ్గరికి ఫైనల్ సెలక్షన్‌కి పంపి ఆ కాగితాలు పట్టుకుని తన ఛాంబర్స్‌కి వచ్చేశాడు. అప్పటికి ఆ అమ్మాయి దగ్గర్నుంచి ఫోన్ రావటానికి ఇంకా పది నిమిషాలుంది.

ఛాంబర్‌లో కూర్చొని వున్న జేమ్స్ ''ఇంత ఆలస్యం అయిందే'' అని అడిగాడు. రేవంత్ తను చేసిన పని చెప్పాడు.

జేమ్స్ అదిరిపోయి ''గుడ్, నిజంగా చదరంగం బుర్రే నీది'' అన్నాడు.

నవ్వి, ‘‘అన్నీ అలా కలిసివచ్చినయ్’’ అన్నాడు రేవంత్ తన చేతిలో వున్న కాగితాల వంక చూస్తూ. ఆ తరువాత కామన్ పేర్లు తీసేసి, ఫైనల్ లిస్టు తయారు చేసేసరికి పదినిమిషాలు పట్టింది. పైన మరో అయిదు నిముషాలకి ఫోన్ మోగింది. దానికోసమే చూస్తున్న రేవంత్ చప్పున రిసీవర్ అందుకున్నాడు.

‘‘ఏం కనుక్కున్నారా?’’ అట్నుంచి చిన్న నవ్వుతో అమ్మాయి అడిగింది.

‘‘ఆ, చాలా పేర్లున్నాయ్’’

‘‘చెప్పండి. అందులో నా పేరుంటే ఈ రోజే మీ ఆఫీసు కొచ్చి స్వయంగా అభినందిస్తాను. చదరంగంలో గెల్చినందుకు కాదు, నేను పెట్టిన పోటీలో గెల్చినందుకు.’’

రేవంత్ మొహం ఉక్రోషంతో ఎర్రబడింది. ‘‘అంత కష్టమేమీ కాదనుకుంటాను. అయితే ఒక షరతు - మీ పూర్తి పేరు నేను చెప్పలేకపోవచ్చు. ఉదాహరణకి మీ పేరు ‘రమణీప్రియ’ అనుకోండి. నేను రమణి అని చెప్పినా అది కరెక్ట్’’ అన్నాడు.

రేవంత్ పేర్లు ఫైనలైజ్ చేసిన కాగితం తీసుకొని చదవటం మొదలు పెట్టాడు.

‘‘రాధా’’

''కాదు''

''రజనీ''

''కాదు''

జేమ్స్ ఊపిరి బిగపట్టాడు.

''రాజ్యలక్ష్మి.... రోజా''

అట్నుంచి నవ్వు. ''రెండోది తెలుగు పేరుకాదు. నాది చాలా అందమైన - అచ్చమైన తెలుగు పేరు. ఏ బాపూనో, విశ్వనాథో వింటే చటుక్కున సినిమాకు పెట్టుకునే పేరు'' అంది.

''రంగమ్మ, రౌడీ రంగమ్మ'' కసిగా అన్నాడు. అట్నుంచి ఉక్కిరి బిక్కిరి అయ్యేటంత నవ్వు.

''.... కాదు'' అందా అమ్మాయి.

అతడు గడగడా చదవసాగేడు.

''రామేశ్వరి, రమాలక్ష్మి, రాగిణి, రతి, రమాప్రభ, రాజసులోచన, రత్నప్రభ, రత్నకుమారి, రంగమణి, రమామణి, రత్నపాప, రోహిత, రమాతిలకం, రాగచంద్రిక, రోహిణి, రాణి, రంగ, రంగవల్లి, రామసీత, రుచిర, రాగమణి, రామభద్ర, రాజనర్తకి, రీతిగౌళ, రచన, రూప, రూపి, రాజిత, రుక్మ, రుక్మిణి, రంజిత, రంజన, రాధిక, రూమా, రమోలా, రసిక, రేణు, రేణుక,

రేవతి, రుద్ర, రేష్మి, రాగమయి, రాగవల్లి, రంభ, రూనా, రీమా, రసిత, రఘునందిని, రాగరాగిణి, రీతూ, రౌద్రి, రాజశ్రీ , రసమయి, రేరాణి, రుతు, రాజీవలోచన, రత్నావళి, రజనీగంధ, రసన, రమల, రవిచంద్రిక, రసమంజరి, రక్తి, రక్తోత్పల, రవళి, రహి.''

''ఉహూ __ ఇవేవీ కావు.''

రేవంత్‌కి వళ్ళు మండింది. ''.... రావులమ్మ, రామాయమ్మ, రత్తమ్మ, రత్తాలు, రుద్రమ్మ, రాయమ్మ, రంగాయమ్మ, రాంభద్రమ్మ వైఫ్ ఆఫ్ రాంభద్రయ్య'' అన్నాడు.

అట్నుంచి సింపిల్‌గా ''కాదు'' అని వినిపించింది.

''సినిమా యాక్టర్లు రాఖీ __ రేఖా''

''ఉహూ''

''ఆయుర్వేద మందులు __ రత్నావళి, రాజరత్న, రాజీవ''

''హోమియోపతి ట్రై చెయ్యండి.''

అతను పెదాలు బిగించి ''రస్న - రైనా - రస్నోసాంగ్'' అన్నాడు. ఈ లోపులో ప్రక్కనించి జేమ్స్ ''రసికప్రియ'' అని అందించాడు.

''ఆ - రసికప్రియ - రమణి - రతి'' అన్నాడు రేవంత్. అట్నుంచి ఫోన్ కట్టయింది. రేవంత్ హతాశుడై ''ఆ అమ్మాయికి కోపం వచ్చినట్టుంది.

అయినా రాకేం చేసుంది - ఏదో అభినందన కోసం ఫోన్ చేస్తే నేను రతి - రాత్రి - రహస్య - అన్న అమ్మాయిల పేర్లు చెబితే'' అని వాపోయాడు.

ఇంతలో తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది. ''మే ఐ కమిన్ సర్''

''యస్ ప్లీజ్''

ఇంటర్వ్యూలో అందరికన్నా ఎక్కువ పేర్లు వ్రాసిన అమ్మాయి లోపలికి వచ్చింది. ఆ అమ్మాయి మొహం ఆనందంతో వెలిగిపోతూంది. ''నేను సెలెక్టయ్యాను సార్!'' అంది. రేవంత్ నవ్వి, ''కంగ్రాట్స్! మీరు అన్ని పేర్లు వ్రాసినప్పుడే అనిపించింది మీరు సెలక్టవుతారని. గొప్ప 'ఐ.క్యూ.' మీది'' అని మెచ్చుకున్నాడు ఆమె తెలివితేటల్ని, విజ్ఞానాన్ని.

జేమ్స్ అందుకుని, ''పావుగంటలో పదిహేను అభ్యర్థులలో కావలసిన వారిని సెలెక్టు చేసుకోవటానికి మావాడు తన తెలివితేట లుపయోగించి కనుక్కున్న గొప్ప ఐ.క్యూ. పరీక్ష ఇది'' అని రేవంత్‌ని పొగిడాడు.

ఆ అమ్మాయి మాత్రం భక్తిగా ''అంతా మా నాన్నగారి చలవ'' అంది.

''ఆయనేం చేస్తూ వుంటారు'' అని రేవంత్ అడిగాడు.

‘‘నామకరణ మహోత్సవాల్లో జన్మదిన నక్షత్రాన్ని అనుసరించి పేర్లు పెట్టే పురోహితుడాయన.’’

స్నేహితులిద్దరూ గతుక్కుమని, ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. రేవంత్ వెంటనే సర్దుకొని ‘‘ఐ.క్యూ. దేముంది లెండి, మీకు అదృష్టం కూడా వుంది’’ అన్నాడు.

‘‘ఇంతకీ మీ పేరు?’’

‘‘రామచిలుక - నా జన్మనక్షత్రానికా పేరొక్కటే సరిపోయిందట.’’

3

దాదాపు నాల్గురోజులవరకూ మళ్ళీ ఫోన్ రాలేదు. మొదటిరోజు బాగా గుర్తొచ్చినా - తరువాత మర్చిపోయాడు దాని గురించి రేవంత్. నాల్గోరోజు సాయంత్రం పని కట్టెయ్యబోతూంటే మళ్ళీ ఫోన్ వచ్చింది.

ఆ అమ్మాయి ఏదో చెప్పబోతుంటే, ముందే రేవంత్ ‘‘మీరు నన్ను క్షమించాలి’’ అన్నాడు.

‘‘ఎందుకు?’’

‘‘మొన్న ఫోన్లో చివర్లో అసభ్యంగా మాట్లాడాను.’’

ఆ అమ్మాయి కొద్దిసేపు మౌనంగా ఉంది - నెమ్మదిగా అన్నది. ‘‘అందులో ఆశ్చర్యం లేదని నా ఉద్దేశం. ప్రతీ మనిషిలోనూ ఆ పెరానాయిడ్ సైకాలజీ కొద్దిగా ఉంటుంది. ముఖ్యంగా కళాకారుల్లో అది ఎక్కువ ఉంటుంది. అవతల వాళ్ళని శోధించే గుణం. ఉదాహరణకి నేను మీకు ఫోన్ చేశాను. ఎందుకు చేశాను? అందర్లాగే పేపర్లో వార్త చదివి వూరుకోవచ్చుగా? నేను మీ మీద చూపిస్తున్న ఈ అభిమానం వెనుక ఉద్దేశ్యం ఏమైవుంటుంది? అన్న ఈ అనుమానాలన్నీ మీకు కలుగుతాయి. అన్ని కోణాలనూ చివరకు చిలిపితనం వైపు వెళ్ళాలన్న కోణం కూడా ఒకటి. ఆ అనుమానం కూడా తీర్చుకున్నారు. ఇదంతా నేను స్త్రీని అవటం వల్ల వచ్చిన చిక్కు.’’

రేవంత్ కంగారుపడి, ‘‘నా ఉద్దేశ్యం అదికాదు’’ అన్నాడు.

‘‘మీది కాకపోతే మీ పక్కనే కూర్చొని మీకు పేరందించిన మీ స్నేహితుడిది’’ అంది. రేవంత్‌కి షాక్ తగిలినట్లు ‘‘నా ప్రక్కన ఆరోజు నా స్నేహితుడున్నాడు అని మీకెలా తెలిసింది>’’ అని అడిగాడు.

‘‘టెలిఫోన్‌లోనే ‘ఫోనీ’ అన్న శబ్దం నిక్షిప్తమై ఉంది. మీ ఎడమ చేతి దగ్గిరున్న బల్లమీద - అమాయకంగా కనబడే ఆ ఫోన్ రిసీవర్ క్రింది భాగంలో వుండే మౌత్‌పీస్ ట్రాన్స్‌మీటరు దగ్గిర - శబ్దతరంగాల్ని ఎలక్ట్రికల్ ఎనర్జీవేవ్స్‌గా ట్రాన్స్‌మిట్ చేయగల శక్తి నా దగ్గిరున్న ఫోన్ రిసీవర్

పైభాగంలో బలంగా బిగించబడివున్న డయాఫ్రమ్‌కి గాలి తరంగాల్ని సౌండ్ వైబ్రేషన్స్‌గా మార్చగలిగే శక్తి ఉన్నాయ్. మూడు నాలుగు అడుగుల దూరం నుంచి శబ్దాన్ని గ్రహించే అలవాటు ట్రాన్స్‌మీటర్‌కి ఉంది. కాబట్టి అతడు మీకు దగ్గిరగా కూర్చున్నవాడై వుంటాడు. ఇహపోతే మంచి పొజీషన్‌లో వున్న ఆఫీసర్‌కి మూడడుగుల దూరంలో కూర్చుని 'రసికప్రియ' అన్న పేరు అందించగలిగినవాడు నిశ్చయంగా అతడు స్నేహితుడే అయివుంటాడు. నా అంచనా కరెక్టేనా?''

ఆ అమ్మాయి అంత సూటిగా మనిషి మనసు లోతుల కుత్సిత చేదునిజాన్ని విప్పి చెబుతుందని అనుకోకపోవటంతో, అతడు విభ్రాంతుడై - అప్రయత్నంగా ''కరెక్టే'' అన్నాడు. ''ఆ రోజు మీతో 'రసికప్రియ' అని అనడం వల్ల తప్పు చేశానేమో... ఎవరో అమ్మాయి ఫోన్ చేసింది కదా అని అడ్వాంటేజి తీసుకుని లేకిగా ప్రవర్తించానేమో - అని ఈ మూడ్రోజులు బాధపడ్డాను. మీ మనసు దెబ్బతిన్నా - మళ్ళీ ఇలా ఫోన్‌చేసి వివరణ ఇవ్వటం ద్వారా నాకున్న గిల్టీ కాన్షస్‌నెస్ పోగొట్టారు. థాంక్స్! కానీ ఒక్క విషయం నన్ను వప్పుకోనివ్వండి. నా స్నేహితుడు అలా మాట అందివ్వకపోయినా ఇంకో నాల్గయిదు సార్లు మీరు ఫోన్ చేసివుంటే నేనే సంభాషణని ఆ కోణంలోకి తీసుకు వెళ్ళివుండేవాణ్ణి. ఇది చెప్పటానికి

సిగ్గుపడుతున్నాను. కాని లెట్ మి బి ఫ్రాంక్...'' అని సిన్సియర్‌గా అన్నాడు.

ఆమె అంది. ''అబ్బాయికీ అమ్మాయికీ మధ్య స్నేహంలో ఈ ప్రసక్తి - అంటే ఎవరు ఏం ఆశించి స్నేహం చేస్తున్నారూ? అనేది ఎప్పుడో ఒకప్పుడు వచ్చి తీరుతుంది. మరీ పద్దెనిమిదేళ్ళ అడాల్‌సెంట్ కుర్రవాళ్ళ స్నేహం ఉద్వేగం - ఉత్సాహం - ఆతృత - ఆవేశం - సెంటిమెంట్లతో నిండి ఉంటుంది. కాబట్టి వాళ్ళ సంగతి వదిలెయ్యండి. మనమధ్య ఈ టాపిక్ ఇంత తొందరగా వచ్చెయ్యటం నాకు సంతోషంగా వుంది. లేకపోతే మాటిమాటికి ఫోన్ చేస్తున్న ఈ అమ్మాయి ఎలాటిదో ఓ విసురు విసిరిచూద్దాం అన్న లేకితనం మీ మాటల్లో ఎప్పుడో ఒకప్పుడు కనబడి వుండేది. అది మీ మనసులో లేకపోయి వుండవచ్చు. అది వేరే సంగతి. మీలో ఆ లేకితనం కనబడేసరికి - 'అరే నేను స్నేహం కోసం ఎన్నుకున్నతడు ఇలాటివాడా' అన్న దురభిప్రాయం నాలో కలిగి ఉండేది... చూసేరా ఎంత పెద్ద కమ్యూనికేషన్ గ్యాప్‌ని మనం కొద్దిలో తప్పించుకున్నామో.''

ఆమె వాదానికి అతడు ముగ్ధుడై ''నాకు మిమ్మల్ని చూడాలని వుంది'' అని చప్పున అన్నాడు.

ఆ కంఠంలో సిన్సియారిటీని ఆమె గుర్తించి ''తప్పకుండా కలుసుకుందాం'' అంది. ''కానీ కొంతకాలం పోనివ్వండి. ఒకర్నొకరు నిజమైన స్నేహితుల్లా అర్థం చేసుకున్నాక అప్పుడు కలుసుకుందాం. కాని ఒకటి మాత్రం నిజం. ఏదో చౌకబారు ఇంగ్లీషు కథలోలా ఓ వారం రోజులు ఫోన్ చేసి చివర్లో మీ దగ్గరకొచ్చి అహ్హా - ఇన్నాళ్ళూ నీ కళ్ళముందు తిరుగుతూ ఫోన్ చేసినా నువ్వు పట్టుకోలేకపోయావ్ - చూసేవా అనను. సరేనా.''

అతడేదో అనబోతుంటే డోర్ చప్పుడయింది. జేమ్స్ లోపలికి వస్తూ రేవంత్ ఫోన్ పట్టుకున్న భంగిమ గుర్తించి ''ఆ అమ్మాయేనా'' అని అడిగాడు. రేవంత్ తలూపటంతో దాదాపు లాక్కొన్నట్లు అతడు చేతిలోంచి ఫోన్ తీసుకుని, ''హల్లో బాగున్నావా'' అని అడిగాడు. అతడు ఏకవచనంతో సంబోధించటం వినగానే రేవంత్ ఉలిక్కిపడి రిసీవర్ తిరిగి లాక్కోబోయాడు. కాని అతడు ఇవ్వలేదు. 'నాకు తెలుసు ఈ అమ్మాయి మళ్ళీ ఫోన్ చేస్తుందని' అన్నట్టు నవ్వాడు.

''బావున్నాను. మీరు'' అట్నుంచి వినబడింది. ఆ కంఠంలో రిటార్ట్ లేదు.

''ఎందుకీ టెలిఫోన్ భాగోతం - వచ్చి కలుసుకోవచ్చుగా'' కొద్దిగా కవ్వింపుగా అన్నాడు.

''మీరు కలుసుకోదగినంత గొప్పవాళ్ళో కాదో తెలియాలిగా''

జేమ్స్ దెబ్బతిని, ''అయితే ఎందుకిలా ఫోన్‌చేసి టైమ్ వేస్ట్ చేసుకోవటం'' అన్నాడు.

''స్నేహం చేద్దామని'' అంది.

''చూడమ్మాయ్! నేను పదిసంవత్సరాల్నుంచీ కార్టూన్లు వేస్తున్నాను. పత్రికల్లో ఎన్నోసార్లు నా పేరు పడింది. అమ్మాయిలు ఉత్తరాలు వ్రాసి మీతో పెన్ ఫ్రెండ్ షిప్ చెయ్యాలని వుందండీ అంటారు. బైదిబై నువ్వేం చదువుకున్నావ్?''

''టెన్త్ ఫెయిల్డ్'' నవ్వు దాచిపెట్టిన ధ్వని.

''నీ హాబీస్''

''స్టాంప్ కలెక్షన్, సినిమాలు చూడటం''

''నీ ఫేవరేట్ ఆక్టర్?''

చెప్పింది.

''ఇంక నేను చెబ్తాను విను. మా రేవంత్ ఎమ్.బి.ఎ. ఫస్టురాంక్. వాడు చదరంగం ఛాంపియన్. స్టాంప్ కలెక్షన్లూ, ఫేవరేట్ ఆక్టర్ల ఫోటోలు దాచిపెట్టుకోవటం లాంటి చిన్నపిల్లల అభిరుచుల్ని వాడు దాటి పదిహేను సంవత్సరాలైంది. వాడేమన్నా తోచక పుస్తకాలు చదివాడంటే అవి

'ఆసిమోవ్' 'ఆర్థర్ క్లార్క్' స్థాయికి తక్కువ ఉండవు. అలాటి వాడితో నువ్వు ఎందుకు స్నేహం చెయ్యటం? ఒక నెల తర్వాత కలుసుకున్నా మీరే 'ప్లేస్'లో మాట్లాడుకుంటారు? ఏ అనుభూతికి ఇద్దరూ ఒకేలా 'వైబ్రేట్' అవుతారు''

''నిజమేనండీ, మరెలా?'' అమాయకంగా అడిగింది.

''అందుకనే వెంటనే నువ్వు మా ఆఫీసు కొచ్చేయి, కబుర్లు చెప్పుకోవచ్చు.''

''అప్పుడు మాత్రం మా సంభాషణ ఏ 'ప్లేస్'లో జరుగుతుంది? ఆయన మాట్లాడే విషయాలు నాకు తెలియవుగా''

''కనీసం నువ్వెలా ఉన్నావో తెలుస్తుంది. పచ్చిగా మాట్లాడుతున్నానని ఏమనుకోకు. కళాకారుడికి ఇన్స్పిరేషన్ ఇచ్చేది - అందమైన స్త్రీ ఒక్కతే. కనీసం మీకు 'ఆ అందం' అనే క్వాలిఫికేషన్ అయినా ఉంటే మీ పరిచయం స్నేహంలోకి మారే వీలుంటుంది.''

రేవంత్ కుర్చీలోంచి ఒక్క ఉదుటున లేచి నిలబడి, ''జేమ్స్! ఏమిటిది - నీకు ఏమైనా మతిపోయిందా?'' అన్నాడు. జేమ్స్ మాత్రం మామూలుగానే వున్నాడు. తాపీగా ఫోన్లో అటువైపునుంచి ఆమె చెప్పేది విని ''నిజమే! అయామ్ బ్రూటల్లీ ఫ్రాంక్. కానీ అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మంచిది కదా'' అంటున్నాడు.

''కేవలం ఓ అమ్మాయితో స్నేహం చెయ్యాలంటే ఆ అమ్మాయి అందాన్నే చూస్తారా...''

''సమానమైన తెలివితేటలుంటే మంచిదే. అది లేని పక్షంలో మన కెదురుగా వున్న పది బొమ్మల్లో ఏదో ఒకటి తీసుకోదల్చినప్పుడు అందమైన దాన్నే ఎన్నుకోవటం సహజంకదా! నా దృష్టిలో ఆడపిల్లలకి అందం తప్ప ఇంకేం క్వాలిఫికేషనూ లేదు. ఎవరో - ఎక్కడో ఒకరిద్దరికి తప్ప.''

''జేమ్స్! జేమ్స్! జేమ్స్! ఏమిటి నువ్వు మాట్లాడుతున్నది. ఫోన్ ఇలా ఇవ్వు'' రేవంత్ అరిచాడు ఈ వాదన భరించలేక.

''మిమ్మల్ని చూస్తే జాలేస్తుంది'' అన్నదా అమ్మాయి. ''మీకున్న స్నేహితురాండ్రందరూ కలిసి మీకు అమ్మాయిలమీదా - స్నేహంమీదా మంచి అభిప్రాయాన్ని పోగొట్టారు. నా ఊహ నిజమయితే మీకు తల్లీ తండ్రీ లేరు. ఒకవేళ వున్నా వారితో గానీ మీ ఇంట్లో ఇంకెవరితో గానీ, మీకు సత్సంబంధాలు లేవు. ఒంటరితనపు ఫెసిమిజంలో నుంచి సినిసిజంవైపు వెళుతున్నారు మీరు.''

మృదువుగా, కానీ స్ఫుటంగా ఉన్న ఆ మాటలకి జేమ్స్ మొహం తెల్లగా పాలిపోయింది. ఆమె చెప్పిందంతా నిజమై అతను అచేతనుడవటం

చూసి రేవంత్ అతడి చేతిలోంచి ఫోన్ తీసుకుంటూ ‘‘ఏమైంది?’’ అని అడిగాడు.

ఆ ప్రశ్నకి అతడు సమాధానం చెప్పలేదు, కానీ - అట్నుంచి జవాబు వినిపించింది. ‘‘చిన్న షాక్ ట్రీట్‌మెంటు ఇచ్చాను’’ అని.

రేవంత్ అన్నాడు ‘‘మీరెవరో మీ పేరేమిటో నాకు తెలీదు. కానీ నా స్నేహితుడి తరపున క్షమాపణను వేడుకుంటున్నాను. క్షమించండి.’’

‘‘అతడన్నదాంట్లో నాకు తప్పేం కనపడలేదు. మీరు ఇంటర్నేషనల్ చెస్ ప్లేయర్. మీతో స్నేహం చేయాలని చాలామందికి ఆశ వుండవచ్చు. కానీ నా స్టాండర్డ్ కూడా నేను ఆలోచించుకోవాలిగా. మీరేమో హెమింగ్వే నుంచి జూపాల్ సాత్రే వరకు చదివినవాళ్ళు. నేనేమో ఇంట్లో అష్టా చెమ్మా ఆడుకునేదాన్ని. నేను వచ్చి ‘నాతో స్నేహం చెయ్యండి __ నాతో స్నేహం చెయ్యండీ’ అంటే మీరు ఇబ్బందిలో పడిపోరూ. నాకున్న ఒకే ఒక ఆయుధం అందం. స్నేహం సమానస్థాయిలో వుండాలి కాబట్టి మీ తెలివితేటల్ని నా అందంతో ఈక్వలైజ్ చెయ్యాలి - అని మీ స్నేహితుడు సలహా ఇస్తున్నాడు.’’

రేవంత్ బాధగా ‘‘మీరు వేళాకోళం చేస్తున్నారు. మమ్మల్ని క్షమించమన్నాగా’’ అన్నాడు.

''నేను వేళాకోళం చేయటంలేదు రేవంత్ బాబూ! మీ స్నేహితుడి మనస్తత్వాన్ని ఎనలైజ్ చేస్తున్నాను అంతే...''

తనలో తనే ఏదో ఆలోచిస్తూ - అప్పటివరకూ మౌనంగా వున్న జేమ్స్ కదిలి ''నాకోసారి ఫోన్ ఇవ్వు'' అన్నాడు. అతడి కంఠంలో కదలాడిన ఆర్తికి రేవంత్ విస్మయం చెంది ఫోన్ అందించాడు.

''అయామ్ సారీ - రియల్లీ సిస్టర్'' అన్నాడు జేమ్స్.

ఆమె ఫోన్‌లో కెవ్వున అరిచినంత పనిచేసి ''ఇదేమిటి ఉన్నట్లుండి నేను చెల్లెల్ని అయిపోయాను'' అంది.

''నో జోక్స్. నేను సిన్సియర్‌గా చెబ్తున్నాను.''

రేవంత్ అతడినుంచి ఫోన్ లాక్కొని ''వాడు చెబితే యిక అది అంతే! ఎందుకంటే వాడి నోటితో వాడింతవరకూ ఏ అమ్మాయినీ 'సిస్టర్' అనలేదు. మీరు ఒప్పేసుకోండి.'' అన్నాడు.

''.... సరే''

''థాంక్యూ, కానీ నాదొక్క అనుమానం''

''ఏమిటి?''

''రసికప్రియ అని మిమ్మల్ని అవమానం చేసేం. మావాడు మరీ దారుణంగా మిమ్మల్ని ఏకవచనంలో సంబోధించాడు. చాలా ఘాటయిన సంభాషణ, సంఘర్షణ జరిగినయ్! అయినా మీకెందుకు కోపం రాలేదు?''

''నాకు కోపం రావటం మానేసి దాదాపు ఆర్నెల్లయింది''

''అదేమిటి - ఎందుకు?''

''ఈ ఒక్క ప్రశ్నకి సమాధానం మనం కలుసుకున్నప్పుడు చెబుతాను రేవంత్‌బాబూ, నన్ను బలవంత పెట్టకండి'' ఆమె కంఠం ఎందుకో వణికింది. అతడు మాట మారుస్తూ ''ఇంతకీ మనం కలుసుకునేదెప్పుడు?'' అని అడిగాడు.

''కలుసుకోవాలనుకుంటే ఈరోజే కలుసుకోవచ్చు. నేనే ఫోన్ నెంబర్ నుంచి మాట్లాడుతున్నానో కనుక్కుంటే...'' అంది.

రేవంత్ హుషారుగా ''ఎక్కణ్ణుంచి మాట్లాడుతున్నారు?'' అని అడిగాడు.

''పబ్లిక్ ఫోన్ నుంచి''

''మరెలా కనుక్కోవటం?'' దిగులుగా అడిగాడు. జేమ్స్ కూడా పాత విషయం అంతా మర్చిపోయి ఉత్సాహంగా వినసాగాడు.

''నేను బూత్ దగ్గిర ఫోన్ పెట్టేసి మరో రెండు నిమిషాలు వేచి వుంటాను. ఈ లోపులో నేనిచ్చే హింట్స్ ద్వారా ఈ నెంబరు కనుక్కొని తిరిగి ఫోన్ చేస్తే వెంటనే మీ ఆఫీసుకొస్తాను. పేరెలాగూ కనుక్కోలేకపోయారు. కనీసం నెంబరు కనుక్కోండి. వెంటనే కనుక్కుంటే ఓ అందమైన అమ్మాయితో ఈ సాయంత్రం టీ త్రాగొచ్చు''

''ఏమిటా హింట్స్- తొందరగా చెప్పండి'' అన్నాడు రేవంత్ వాచీ చూస్తూ హుషారుగా.

''ఈ టెలీఫోన్ నెంబరు ఆరంకెల సంఖ్య. మొదటి అంకెకన్నా రెండో అంకె రెండెక్కువ. రెండో అంకెకన్నా మూడో అంకె మూడెక్కువ! మూడూ నాలుగూ అంకెల మధ్య తేడా ఎనిమిది. నాలుగో అంకెని రెండుపెట్టి గుణిస్తే అయిదో అంకె. దాన్ని రెట్టింపు చేస్తే అరో అంకె... క్విక్ ఇంకా రెండు నిమిషాలే టైముంది.''

ఆమె మాటలింకా పూర్తికాలేదు. ఫోన్ పెట్టేసి కాగితమూ, కలము తీసుకున్నాడు రేవంత్.

''రెండు నిమిషాలు మాత్రమే టైముంది తొందరగా'' అన్నాడు జేమ్స్.

రేవంత్ కాగితం మీద ఆ అమ్మాయి చెప్పిన లెక్క వేసుకుని చూస్తూ ''ఎలా? నాకేం అర్థం కావటంలేదు'' అన్నాడు.

అప్పటికే అరనిమిషం గడిచింది. ఇంకా ఒకటిన్నర నిముషమే వుంది.

‘‘మనల్ని ఏడిపించటానికి - రాని లెక్క చెప్పిందేమో’’ అన్నాడు జేమ్స్.

‘‘అలా అనుకోను. ఆ అమ్మాయి తెలివయినదాన్లానే కనబడుతోంది. ఇందులో ఏదో హింట్ వుండే వుంటుంది.’’ అంటూ వ్రాసుకున్నది చదివాడు.

‘‘మొదటి అంకెకన్నా రెండోది రెండెక్కువ

రెండో దానికన్నా మూడోది మూడెక్కువ.

మూడోదానికి నాలుగోదానికి తేడా ఎనిమిది’’

అంటూ ఏదో స్ఫురించినట్టు ఆగిపోయి, చప్పున తలెత్తి జేమ్స్ వంక చూసేడు. జేమ్స్ అతడివైపే చూస్తున్నాడు. రేవంత్ సాలోచనగా ‘‘రెండు అంకెల మధ్య తేడా ఎనిమిది __ అంటే ఆ అంకెలు

1 __ 9 గానీ,

9 __ 1 గానీ అయ్యుండాలి’’ అన్నాడు.

రేవంత్ ఆ ఆలోచన చెప్పగానే జేమ్స్ ఆనందంతో ‘యురేకా’ అని అరిచాడు. రేవంత్ కనుక్కున్న దానికి తన తెలివితేటలు జోడిస్తూ __

"సంఖ్యలు 1 __ 9 కావు. అవి నిశ్చయంగా 9 __1 అయ్యుండాలి." అన్నాడు.

"ఎలా చెప్పగలవు?"

"నాలుగో అంకెకి అయిదోది రెట్టింపుకదా. నాలుగో అంకె 9 అయిన పక్షంలో అయిదోది పద్దెనిమిది అయ్యుండాలి. టెలిఫోన్‌లో అది సాధ్యం కాదుగదా"

"కరెక్ట్ నెంబర్ వచ్చేసింది" అంటూ రేవంత్ కాగితం మీద పెన్సిలుతో నెంబరు వేశాడు.

"469124"

ఇంకా అరనిముషమే వుంది.

రేవంత్ మిషన్‌లాగా వంగి టెలిఫోన్ దగ్గరకు లాక్కున్నాడు. ఒక్కొక్క నెంబరే జాగ్రత్తగా డయల్ చేసేడు. అవతలివేపు రింగ్ అయి ఎవరో ఎత్తిన ధ్వని. జేమ్స్ ఆత్రంగా చూస్తున్నాడు. రేవంత్ స్నేహితుడి వైపు గర్వంగా చూసి, కంఠం నాజూగ్గా మార్చుకుని ఫోన్‌లో స్వీట్‌గా "హల్లో - చూసేరా గెల్చాను" అన్నాడు. జేమ్స్ వూపిరి బిగబట్టాడు. మాట్లాడుతున్న రేవంత్ మొహం అంతలోనే వాడిపోయింది.

"ఏమైంది" అడిగాడు జేమ్స్.

''గొర్రెమార్కు చుట్టల కంపెనీ అట అది'' అన్నాడు ఫోన్ పెట్టేస్తూ. జేమ్స్ తెల్లమొహం వేసి చేతిలో కాగితాల వంక చూసుకున్నాడు. అంతలోనే ఫోన్ మ్రోగింది.

''నేనూ'' అందా అమ్మాయి రేవంత్ ఫోన్ ఎత్తగానే - ''కనుక్కోలేకపోయారా నెంబరు''

''కనుక్కున్నాం, కానీ ఆ నెంబర్లో మీరు లేరు''

''ఏమిటా నెంబరు''

''469124''

''తప్పు''

''మరి''

''358000''

రేవంత్‌కి ఒకక్షణం అర్థం కాలేదు. ఆమె చెప్పిన అంకె కాగితం మీద వేసుకొని దానిపైపే అయోమయంగా చూసి, ఏదో అర్థమయినట్టు ఒక్కసారిగా ''ఇది అన్యాయం'' అని అరిచాడు.

అవతల్నుంచి చిన్న నవ్వు ''ఏమిటి అన్యాయం''

''నాలుగో సంఖ్యకి అయిదో సంఖ్య రెట్టింపు అన్నారు''

''అవును. సున్నాని రెండు పెట్టి హెచ్చవేస్తే సున్నాయేగా''

రేవంత్ పళ్ళు బిగించి ''ఇది మమ్మల్ని తప్పుదారి పట్టించటం'' అన్నాడు కోపంగా. ఆమె మాత్రం తాపీగా -

''చూడండి మిష్టర్ రేవంత్! మీరు ఇంటర్నేషనల్ చదరంగం ప్లేయర్. చదరంగంలోనే మాథ్‌మాటిక్స్ అంతర్లీనంగా కలిసివుంటాయని మీకు నేను చెప్పక్కర్లేదు. ఏ పావు ఎన్ని ఎత్తుల్లో ఏ గడి చేరుకుంటుందో మీరు నిరంతరం ఆలోచిస్తూ వుండాలి. అన్నిటికన్నా క్లిష్టమైనది గుర్రం. అవతలివాడి గుర్రం ఏ కోణంలోనుంచైనా వచ్చి మన పావుని చంపవచ్చు. దానికున్నన్ని పెర్మిషన్స్ అండ్ కాంబినేషన్స్ ఇంకే పావుకి లేవు. చదరంగంలో అన్ని రకాలుగా ఆలోచించగలిగే మీరు 9 __ 1 నే ఆలోచించారు తప్ప 8 __ 0 ఆలోచించలేదంటే అది విచారకరం'' అన్నది.

రేవంత్‌కి ఏం మాట్లాడాలో తెలియలేదు. ''మీరు చెప్పింది కొంత వరకూ కరక్టే''

''ఇప్పటికి మీకు రెండు హింట్స్ ఇచ్చాను. పేరూ కనుక్కోలేకపోయారు. - నెంబరూ కనుక్కోలేకపోయారు'' అన్నది.

''నెంబరు సర్లెండి. పేరు మరీ అన్యాయం. కేవలం ఒక్క అక్షరంతో ఎవరూ కనుక్కోలేరు''

''ఎందుకలా అనుకుంటున్నారు?''

''మామూలు పేర్లు ఎనభైదాకా చెప్పాను. అయినా అందులో లేదంటే - మీది విచిత్రమైన పేరు అయివుంటుంది. దాన్ని మానవమాత్రు డెవరూ కనుక్కోలేరు''

అట్నుంచి చిన్న నవ్వు ''ఎటువంటి విచిత్రమైన పేర్లు మీరు ఊహిస్తున్నారు మిస్టర్ రేవంత్?''

''రాష్మోకా... రంబాహో సాంబా...?''

పడిపడి నవ్వుతున్న ధ్వని కెరటాలు కెరటాలుగా... ''మీరు భలే మాట్లాడ్తారు రేవంత్. అయినా నా పేరు మీ పేరంత అందమైనదీ, చిత్రమైనదీ కాదులెండి.''

రేవంత్ గర్వంగా తలూపేడు. అతడికి తనపేరంటే చాలా ఇష్టం. ఆ పేరు పెట్టినందుకు తల్లిదండ్రుల్ని ఎప్పుడూ మెచ్చుకుంటూ వుంటాడు కూడా. అ విషయమే ఆమెకి ఫోన్లో చెప్పాడు.

''మీకంత అందమైన పేరు పెట్టిన మీ తల్లిదండ్రుల్ని అభినందించ వలసిందే.... కాని దాన్ని పెట్టబోయే ముందు వాళ్ళొకసారి నిఘంటువు చూసి వుంటే బావుండేది''

''రేవంత్ తెల్లమొహం వేసి, ''అంటే'' అన్నాడు.

"అదేమిటి రేవంత్? ఈ పాతిక సంవత్సరాల వయసులో ఒక్కసారైనా మీ పేరుకి అర్థం ఏమిటో మీకు తెలుసుకోవాలనిపించలేదా?"

రేవంత్ మాట్లాడలేదు.

"తరువాత ఫోన్ చేస్తాను. ఈ లోపుగా మీ పేరు పూర్వాపరాలు కనుక్కోండి. దానిమీద చర్చిద్దాం" అంటూ ఫోన్ పెట్టేసింది.

విషయం అర్థం కాని జేమ్స్ "ఏమిటి సంగతి?" అని అడిగాడు.

"రేవంత్ అంటే అర్థం ఏమిటి?"

"ఆ మాత్రం తెలుగొస్తే నవలలు వ్రాసుకొని బ్రతికేవాణ్ణి బ్రదర్! ఈ పెయ్యి రూపాయల ఉద్యోగం చెయ్యాల్సిన ఖర్మ దేనికి?"

రేవంత్ లేచి "పద" అన్నాడు. వెంటనే ఆ విషయం కనుక్కోవాలన్నట్టు.

"ఎక్కడికి?"

"మన అడ్వర్టయిజ్‌మెంట్ సెక్షన్‌కి."

పెనున్స్‌లా ప్రొడక్టు అమ్మాయిలకీ, ఆడవారికీ కావల్సిన కాటుక నుంచి బ్రాల వరకూ అన్నీ తయారుచేసిగానీ, కొనిగానీ, తమ పేర్లు పెట్టి అమ్మే సంస్థ. వాటికి అందమైన పేర్లు పెట్టటానికి ప్రకటన లివ్వటానికి ఒక సెక్షన్ వుంది. ఆ సెక్షన్ హెడ్ సరళ అని ఓ అమ్మాయి. ప్రకటనల్లో

బొమ్మలాగే అందంగా ఉంటుంది. వీరిద్దరినీ చూసి లేచి నిలబడి ‘‘వెల్‌కమ్ సర్’’ అంది. అసిస్టెంట్ చీఫ్ పనిగట్టుకుని తన సెక్షన్‌కి రావటం ఆమెకి ఆశ్చర్యంగా వుంది. బొమ్మలు కత్తిరిస్తున్నవాళ్ళూ, డిజైన్ మేకర్సూ తమ తమ పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

‘‘నాకోసారి డిక్షనరీ కావాలి మేడమ్!’’ అన్నాడు రేవంత్.

ఆమె ఆశ్చర్యపోతూనే డిక్షనరీ అందించింది. నిజానికి అతడు తన ప్యూన్‌ని పంపించి తెప్పించుకోవచ్చు. కాని అతడు పేజీలు తిప్పుతున్న తీరు చూస్తూవుంటే చాలా తొందర్లో వున్నట్టుంది. రా రీ రూ రే దగ్గిర ఆగి చూపుడు వేలితో ముందుకు సాగాడు.

రేక రేప రేయ రేవ

‘‘రేవంత్’’

అతని చెయ్యి వణికింది. దాని అర్థం చూసి మొహం తెల్లబడింది. స్నేహితుడి మొహంలో రంగులు మారటం చూసి జేమ్స్ ‘‘ఏమైంది గురూ’’ అంటూ ముందుకు వంగి పుస్తకంలోకి చూసేడు. రేవంత్ అన్న పదానికి అర్థం కనిపించగానే, దాన్ని చదివి చెయ్యి నోటికి అడ్డం పెట్టుకుని నవ్వసాగేడు.

ఇద్దర్నీ చూసి సరళ ముందుకొచ్చి ''ఏమైంది సార్!'' అని అడిగింది. జేమ్స్ ఏదో చెప్పబోతుంటే రేవంత్ ఆపుచేసి ''అయింది చాల్లే ఇక పద'' అంటూ బలవంతంగా బైటికి లాక్కొచ్చాడు.

వస్తుంటే జేమ్స్ నవ్వుతూ, ''ఆ అమ్మాయి ఎవరోగానీ లెఖ్కల్లోనే కాదు - తెలుగులో కూడా ప్రవీణురాలుగానే వుంది గురూ'' అన్నాడు.

రేవంత్ మాట్లాడలేదు. అతడి మొహం వుక్రోషంతో ఎర్రగా కందిపోయింది. తన పేరు మార్చుకునే విషయమై ఆలోచిస్తున్నాడు.

4

''ఇతరులు లోనికి రాకూడదు - హద్దు మీరు వారు శిక్షింపబడుదురు''

గేటుపైన వ్రాసున్న బోర్డు ప్రక్క స్టూలుమీద కూర్చొని గూర్ఖా గోడకానుకొని నిద్రపోతున్నాడు. అతనికి నిద్రాభంగం కలిగించకుండా - అతడిని దాటుకుని పక్కనుంచి లోపలకు వెళ్ళింది సులోచన.

అతడిని చూస్తే ఆమెకి నవ్వొచ్చింది. ''నీకు జీతం ఇస్తున్నది దేనికయ్యా'' అని అడుగుతే అతనంటాడు - ''స్టాఫ్‌నీ, ఆపరేటర్స్‌నీ తప్ప, ఇంకెవర్నైనా ఇటు వెళ్ళమనండి సార్, పట్టుకోకపోతే అప్పుడడగండి'' అని, కాని అప్పుడప్పుడూ చూసి చూడనట్టూ పెళ్ళికాని అమ్మాయిల బోయ్

ఫ్రెండ్స్‌ని కూడా వదిలిపెడ్తూ వుంటాడు. మరీ రోడ్డుమీద నిలబడితే బావోదని.

అది ఎనిమిది అంతస్తుల భవనం.

టెలిఫోన్ ఎక్సేంజ్!

క్రింది రెండు అంతస్థుల్లోనూ లోకల్ ఆటోమాటిక్ ఎక్సేంజి, తర్వాత రెండు అంతస్థుల్లోనూ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులున్నాయి. అయిదో అంతస్థులో ఎమర్జెన్సీ స్టాఫ్ క్వార్టర్స్, ఆరో అంతస్థులో లోకల్ సర్వీసెస్ ఏడో అంతస్థులో ట్రంక్ సర్వీసెస్ వున్నాయి. ఎనిమిదో అంతస్థులో ఏముందో ఆమెకు తెలీదు. ఆమె వెళ్ళలేదు.

ఆమె లిఫ్టు దగ్గర నిలబడింది. అతి సహజంగానే అది రావడానికి అయిదు నిముషాలు పట్టింది. ''హల్లో'' అని వినిపిస్తే పక్కకి తిరిగి చూసింది. పక్కనే అనసూయ నెలల పాపని ఎత్తుకుని వుంది. సులోచన కళ్ళతోనే విష్ చేసింది. లిఫ్ట్ మొదటి అంతస్తు చేరగానే అనసూయ వెళ్ళి పాపని 'క్రెచ్'లో వదిలేసి వచ్చింది. ఏం చేసినా చేయకపోయినా డిపార్ట్‌మెంట్ ఉద్యోగినుల కోసం ఈ సాయం చేసింది, చాలు... చెవులు పిండి పాతిక వసూలు చేస్తే చెయ్యవచ్చుగాక - అది వేరే సంగతి.

లిఫ్ట్‌బోయ్‌కి అనసూయ - సులోచన బాగా తెలుసు. ఎన్నో సంవత్సరాలనుంచీ వాడూ - వాళ్ళూ అక్కడే అలాగే పనిచేస్తున్నారు.

తొండ ముదిరితే ఊసరవెల్లి అయినా అవుతుందేమో కానీ టెలిఫోన్ ఆపరేటర్ మాత్రం ఎంత కాలమైనా ఆపరేటర్‌గానే ఉండిపోతుంది. మహా అయితే లోయర్ సెలక్షన్ గ్రేడ్ సూపర్‌వైజర్ అవుతుందేమో. ఇప్పుడిక అన్ని ఎక్సేంజీలు కలిపేశాక హయ్యర్‌గ్రేడ్ రావడం కలలోని మాట... భవిష్యత్తు లేని ఏకైక ఉద్యోగం! సులోచన పన్నెండు సంవత్సరాలనుంచీ ఆపరేటర్‌గా పనిచేస్తూంది.

ఆమె చూపుడు వేలు గోరుకి కొంచెం క్రిందుగా - డయల్ తిప్పీ తిప్పీ - రక్తప్రసరణ ఆగిపోయి మాంసం గట్టిపడి - చర్మం ఒరుసుకుపోయి కాయిలాగా మారింది. చాలామంది ఆపరేటర్స్‌కి ఇది పైకి కనబడేది... కనబడనిది ఇంకోకటి వుంది. అది నడుము నొప్పి!

ఎర్రగా కాలే కొలిమి ముందు కూర్చునే కార్మికుడు చల్లగాలి కోసం బైటకొస్తాడు. ఏకాగ్రతతో ఆపరేషన్ చేసే డాక్టరు అది పూర్తయ్యాక రిలాక్సవుతాడు. కానీ అనుక్షణమూ మిషనులాగా పనిచేసే ఆపరేటర్ ఒక్క క్షణం తన చెవులమీద నుంచి హెడ్ ఫోన్స్ పక్కకి తీసి కుర్చీలోంచి లేవాలంటే దానికి ఎంతో తతంగముంది. రోజుకి ఏడు గంటలపాటూ అలా మాట్లాడుతూనే వుండాలి. అలా వేళ్ళు తిరుగుతూనే ఉండాలి. రోజు తరువాత రోజు వస్తుంది. నెల తర్వాత నెల గడుస్తుంది.... యవ్వనం తర్వాత వృద్ధాప్యం వస్తుంది. ఆ వృద్ధాప్యంలో ''లుంబాగో'' వ్యాధి వస్తుంది.

ఉద్యోగంలో చేరిన కొత్తలో ఆమెకి రకరకాల చిత్రమైన కలలొచ్చేవి. డయల్ తిరుగుతున్నట్టూ... హెడ్ ఫోన్స్ జారుతున్నట్టూ, చిత్రమైన కలలు. నిద్రలోనే 'హల్లో ట్రంక్ బుకింగ్ ప్లీజ్' ... అనో... 'లోకల్ అసిస్టెన్స్ సర్' అనో కలవరించేది. "ఏమ్మా - ఏమైనా కలోచ్చిందా" అని తట్టి లేపటానికి ఎవరూ ఉండేవారు కాదు. పని అలవాటయిన తర్వాత ఆ కలవరింతలు తగ్గిపోయాయి కానీ కొత్త అలవాటు వచ్చిపడింది. అది... చూపుడువేలు గాలిలో రింగులు తిప్పటం. రోజు ఏడుగంటలపాటు డయల్ చేసీ చేసీ ఇంటికొచ్చిన తర్వాత కూడా వంట చేసుకుంటూ కాఫీపొడి డబ్బా మీదా - పుస్తకం చదువుకుంటూ పక్కమీదా - చూపుడువేలుతో సున్నాలు చుడుతూ వుండటం అలవాటయింది. పెళ్ళికాని ముప్పై అయిదేళ్ళ అమ్మాయి మాటిమాటికి అలా చూపుడు వేలు ఆడించడం అపార్థాలకి దారితీస్తుందని తెలిసినా ఆమె ఆ అలవాటు నుంచి బయటపడలేకపోయింది.

ఆమెకు మగవాళ్ళంటే అసహ్యం. దానికి చాలా కారణాలున్నాయి. ఈ అసహ్యం అనేది ఏదో ఒకసారి ఉద్భవించినది కాదు. కొద్దికొద్దిగా పేరుకున్నది. "ఫోన్స్" ఆమెలో మృదుత్వాన్ని చంపేశాయి. ఫోన్‌లో వినవచ్చే మగకంఠాలు ఆమెలోని స్త్రీ సహజమైన ప్రేమని సమాధి చేశాయి. ఆమె ఎక్కడో చదివింది - ఈ ప్రపంచంలో అందరూ చెడ్డవాళ్ళే! కొంతమంది

మంచివాళ్ళు వుండటానికి కారణం వాళ్ళకి చెడిపోవటం చేతకాక పోవటమే అని. ఆ విషయంలో ఫోన్‌లో మాట్లాడే మగవారిపట్ల నూటికి నూరుపాళ్ళు నిజం. చెవిలో ఆపరేటర్ తాలూకు కంఠం వినపడగానే ఆ కంఠం తాలూకు అమ్మాయి 'ఈజిలీ అప్రోచబుల్' అని అనుకుని సంభాషణ ప్రారంభిస్తారు.

విసుగొస్తుంది. కోపమూ, నిస్సహాయతా పెనవేసుకొంటాయి. అయినా ప్రదర్శించకూడదు.

''కోడ్ ఆఫ్ కాండక్టు'' అని ఒకటుంది.

''టెలిఫోన్‌లున్నవాళ్ళు కోపంగా ఏదైనా మాట్లాడినా మనం ఓర్పుతో, సహనంతో జవాబు ఇవ్వాలి'' అని ఆ కోడ్ చెబ్తుంది. ఆపరేటర్స్ చూపించే ఈ సహనాన్నీ తియ్యటి నవ్వునీ సబ్‌స్క్రైబర్స్ ఇంకోలా అర్థం చేసుకుంటారు - ముఖ్యంగా ఆఫీసుల్లో, హోటల్స్‌లో వుండే మగ రిసెప్షనిష్టులు, మగ ఆపరేటర్లు! వీళ్ళకి జీతం తక్కువొస్తుందనే ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్. లాడ్జర్స్ తరపునా ఆఫీసు తరపునా మాటిమాటికీ ట్రంక్‌కాల్స్ అవీ చేస్తూ వుండాలి కాబట్టి ఎక్కేంజి అమ్మాయిలతో పరిచయం ఏర్పడుతుంది. ఒకే ఉద్యోగం చేస్తున్నామన్న మిషతో పరిచయం పెంచుకోవటం - తమకి వస్తూన్న తక్కువ జీతం గురించి ఏడుపు - కాసింత సానుభూతి ఆశించటం... అది ఇస్తే ఆపైన చనువుకోసం ప్రయత్నించటం.

లిఫ్ట్ ఆరో అంతస్థులో ఆగింది. తలుపు తెరుచుకోగానే కదిలి, ''వెళ్ళొస్తాను'' అంది అనసూయ, ఆలోచనల్లోంచి తెప్పరిల్లి సులోచన తలూపింది. ఆమె వెళ్ళగానే లిఫ్ట్ కదిలింది.

మళ్ళీ ఆలోచనలు!

.... మొగవాళ్ళపట్ల సులోచనకి ఇంత అసహ్యం ఏర్పడటానికి అనసూయ జీవితం కూడా కొంత కారణం. అనసూయ హుషారైన, తెలివైన అమ్మాయి. పెళ్ళయ్యే సమయానికే రెండేళ్ళ సర్వీసు పుటప్ చేసింది. భర్త అనుమానం మనిషి. భార్య ఎక్సేంజిలో పనిచెయ్యటం ఇష్టం లేదు. వస్తున్న జీతం వదులుకోలేడు. ఏదో త్యాగం చేస్తున్నట్లు మాట్లాడేవాడు. నైట్ డ్యూటీలు కేన్సిల్ చేసుకొమ్మనేవాడు. అదెలా కుదురుతుంది. ఆ రోజు జీరో అవర్ ముందు షిఫ్ట్ రాత్రి పన్నెండింటికి ఇంటికి వెళ్ళలేని వారికోసం అక్కడే పడుకోవటానికి డార్మెటరీస్ వుంటాయి. ఎక్సేంజిలోనే శైలజ అని ఓ హుషారైన అమ్మాయి వుండేది. థ్రిల్ కోసం - గూర్ఖా కన్నుగప్పి టీ తాగటం కోసం పక్కనే వున్న రెస్టారెంట్‌కి తీసికెళ్ళింది. అదే కొంపముంచింది. సెకండ్ షో నుంచి వస్తూ భార్యని రోడ్డుమీద అర్ధరాత్రి చూచిన ఆ పురుషపుంగవుడి మనసులో అనుమానం ప్రవేశించి త్వరలోనే పెనుభూతమైంది. వాళ్ళు విడాకులు తీసుకొనే సమయానికి ఆమెకి మూడోనెల. ఆ రోజు సులోచన కసిగా అన్నది - ''పాతివ్రత్యం అనేది

ఫోన్‌లో మాట్లాడినా - నైట్‌డ్యూటీలు చేసినా పోదే! నీ మాజీ భర్తని ఒకసారి ఎక్సేంజికి రమ్మను, 181లో కూర్చోబెట్టి ఎందరు హైక్లాస్ ఫామిలీ లేడీస్ మధ్యాహ్నం పూట ఫోన్‌లో గంటల తరబడి మానసిక వ్యభిచారం చేస్తారో వినిపిస్తాను'' అని.

ఇటువంటి మనుషులు - పరిసరాలు - జీవితం - ఒంటరితనపు నిరాసక్తత వీటన్నింటిలోనుంచి ఆమెకి సంతోషాన్నిచ్చేది ఆమె కంఠం! ఫోన్‌లో అది ఎంతో మృదుమధురంగా వినిపించి అవతలి వాళ్ళని ముగ్ధుల్ని చేసేది. ఆమె రూపు చూడనివారు స్వరం విని ఆమెతో పరిచయం పెంచుకోవాలని ఉవ్విళ్ళూరి - దెబ్బతినేవాళ్ళు. ప్రపంచం మీదున్న కసిని తనకున్న పరిధిలో సాధ్యమైనంత వరకూ ఇలా తీర్చుకునేది. అయితే ఆమె శాడిస్ట్ కాదు. కసి.... కసి.... కసి..... అంతే.

లిఫ్ట్ ఏడో అంతస్థులో ఆగింది. ఆమె లాకర్స్ దగ్గరికి వెళ్ళి తన హేండ్ బ్యాగ్ అందులో పెట్టి హాల్లోకి వెళ్ళింది. ఎయిర్ కండిషను హాలు చల్లగా వుంది.

డిపార్ట్‌మెంట్‌లో ఒకప్పుడు ఏ సెక్షన్ కావలిస్తే అది ఇచ్చేవారు. సీనియర్సు అందరూ 181 (ట్రంక్ అసిస్టెన్స్) కోరుకునేవారు. అక్కణ్ణుంచయితే మనక్కావల్సిన ఫోన్‌లు చేసుకోవచ్చు. అయితే అబ్జర్వేషన్ సెల్ సంభాషణ టేప్ చేసి 'మెమో' ఇచ్చే అవకాశం కూడా

వుంది. 180 (ట్రంక్ బుకింగ్) పొజిషన్‌లో చాలా ఎక్కువ పని వుంటుంది. అందులోనూ పది అయిందంటే ఇక వర్షం కురిసినట్టే కాల్సు - ఆఫీసుల్నుంచీ బిజినెస్‌మెన్ నుంచీ. తమమీద ఇంత ప్రపంచం ఆధారపడి వుండటం.

ఆమెకి చిత్రంగా వుంటుంది ఒక్కసారిగా ఈ టెలిఫోన్స్ పనిచేయటం మానేస్తే ఏమవుతుంది. మానవజీవితం స్థంభించిపోదూ.

నవ్వుకుంటూ అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పట్టబోతూ ఆమె ఆగింది తన పేరు చూసి.

లోచన... అంటే కళ్ళు. సులోచన అంటే మంచి కళ్ళున్నది అని. రాజు సులోచన అంటే మంచివాటిలో గొప్పవైన కళ్ళున్నది అని. వెళ్ళి అద్దంలో తన కళ్ళని చూసుకోవాలన్న కోర్కె కలిగింది. కానీ సూపర్‌వైజర్ తిడుతుందని మానేసింది. ఆమెదా రోజు 181 పొజిషన్. పని కొద్దిగా తక్కువ వుంటుంది. అదే 199 లో అయితే లోకల్ అసిస్టెన్స్‌కి రోజుకి దాదాపు పదహారు వేలదాకా కాల్స్ వస్తాయి. ఒక్కో ఆపరేటరూ గంటకి అరవై కాల్స్‌దాకా అటెండ్ అవ్వాలి. అంటే నిముషానికి ఒకటి. మరి చూపుడువేలు కాయగాయక ఏం చేస్తుంది?... ఒకసారి ఆమె 199 లో పదిగంటలనుండి ఒంటిగంట వరకూ నాలుగువందల రెండు కాల్స్ అటెండయింది. రికార్డ్ బ్రేక్ అది.

"ఏమిటో ఆలోచిస్తున్నావ్ ?"

ఆమె ఉలిక్కిపడి నవ్వి "ఏం లేదు" అని కూర్చుంటూ ముందున్న ఆమెని రిలీవ్ చేసింది. మళ్ళీ పని.... ఏడుగంటల ఇరవయ్ నిమిషాల షిఫ్టు.

ఇంకో రోజు గడుస్తుంది. జీవితంలో ఒకరోజు గడిచిపోతుంది.

"మేడమ్ దిసీజ్ టూ ఫైవ్ టూ సిక్స్ వన్టూ ఫోర్. బొంబాయి కాల్. బుక్‌చేసి రెండుగంటలయింది. పొజిషన్ చెబ్తారా - "

"మేడమ్ కదిరిమెట్ల లైన్స్ ఎలావున్నాయి - "

"ఎస్.టి.డి. సంగతి యెవర్ని కనుక్కోవాలి మేడమ్. మిమ్మల్ని కాదా" ఇలా సాగిపోతుంది రోజు - నిరాసక్తంగా - నిర్లిప్తంగా - నిర్వేదంగా.

ఇంకోరోజు మొదలవ్వబోతుంది - అనుకుంటూ ఆమె పాడర్ ఆన్ చేసింది.

ఆ రోజు అన్ని రోజుల లాటిది కాదని, అందులో కొత్తదనం రాబోతూందని ఆమె ఆ క్షణం వూహించలేదు.

5

"**ఎక్కడో** డిటెక్టివ్ నవలలో చదివాను. పోలీసులు మనకొచ్చే ఫోన్స్ యెక్కణ్ణుంచి వస్తున్నాయో పట్టుకోగలరట"

"అవన్నీ నవలల్లో" అన్నాడు రేవంత్ నిస్సహాయంగా.

"లేదు బ్రదర్ - టెలిఫోన్ టాపింగ్ సిస్టమ్ అని ఒకటుందట. మనం పోలీసుల సహాయం తీసుకుందాం."

"ఇదేమన్నా క్రిమినల్ కేసా? ఏమని ఇస్తాం రిపోర్టు?"

"పోనీ ప్రయివేటు డిటెక్టివ్?"

"నోర్ముయ్యి"

"అయినా మనం ఒకసారి ప్రయత్నం చెయ్యటంలో తప్పులేదుగా" అంటూ ఫోన్ తీసుకొని డయల్ చేశాడు జేమ్స్.

"హల్లో - " అని అట్నించి వినపడింది

రేవంత్ కంగారుగా కుర్చీలోంచి లేచి, "ఎవరికి చేస్తున్నావ్ - పోలీస్ స్టేషన్‌కా!" అని అడిగాడు. జేమ్స్ మాట్లాడవద్దన్నట్టు చెయ్యి అడ్డుపెట్టి టెలిఫోన్‌లో సంభాషణ కొనసాగించాడు.

''మాక్కొద్దిగా సహాయం కావాలండీ! అబ్బెబ్బె టెలిఫోన్స్‌కి సంబంధించిన ఇన్ఫర్మేషనండీ - ఏమిటీ - మీది ట్రంక్ అసిస్టెన్సా - పి.ఆర్.వో.కి ఫోన్ చెయ్యమంటారా - అబ్బే ఎందుకండీ ఒక క్షణంలో మీరు చెప్పెయ్యొచ్చు అహహ, ఫోన్ పెట్టెయ్యకండి ప్లీజ్. మీ కంఠంలాగే మీ హృదయమూ మెత్తనిదని మాకు తెలుసు. భలేవారే, మరోలా అనుకోకండి, ఏదీ అసలు విషయం చెప్పకుండా ఉపోద్ఘాతంతోనే సరిపెట్టేస్తున్నాను...''

వింటున్న రేవంత్ 'ఓరి ఇడియట్, నిజంగా రాజకీయాల్లో వుండవలసిన వాడివిరా నువ్వు' అనుకున్నాడు.

''ఆ, అవునండీ మరే, మా ఫోన్, అబ్బెబ్బే, బ్లాక్ మెయిల్ కాదండీ, ఒక అమ్మాయి.... ఆ, నా మొహం, నాకే అమ్మాయి చేస్తుందండి! నా స్నేహితుడు రేవంత్ అనీ ఇంటర్నేషనల్ చెస్ ప్లేయరు, అతడి అభిమాని పేరు చెప్పకుండా చేస్తుంది. ఆమె ఏ నెంబర్ నుంచి చేస్తూందో కనుక్కోవాలి. అంతే! ఓహో పోలీసులు చెయ్యరా, అవున్లెండి వాళ్ళకిదేపనా ఏమిటి! అయితే మీ సలహా మమ్మల్నే ఒక ఫాల్స్ కంప్లయింట్ ఇమ్మంటారు - ఎవరికి అడ్రస్ చేయాలంటే 'జనరల్ మేనేజర్ టెలిఫోన్స్', ఒక్క నిముషం మేడమ్ వ్రాసుకుంటున్నా! 'థాంక్యూ' పెట్టేస్తున్నానండీ. బైదిబై మీలాంటి స్నేహశీలురు, త్యాగమూర్తులూ ఉన్న టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ ధన్యమైంది'' అంటూ ఫోన్ పెట్టేసేడు.

ఫోన్ డిస్‌కనెక్ట్ చేసేసి సులోచన కుర్చీ వెనక్కి వాలి పడిపడి నవ్వసాగింది...

చాలా కాలం తర్వాత మనస్ఫూర్తిగా.

''ఏమిటి నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్'' అని అడిగింది శైలజ.

''ఏం లేదు. ఎవరికో అసిస్టెన్స్ కావాలంటే చేశాను. ట్రంక్ అసిస్టెన్స్ కాదులే, పెర్సనల్ సహాయం'' అంటూ ఫోన్‌కాల్ ట్రాప్‌చెయ్యటం గురించి చెప్పింది. వాళ్ళిద్దరూ మాట్లాడుకొంటూంటే సూపర్‌వైజర్ వచ్చింది. ఆమెకి నలభై ఏళ్ళదాకా వుంటాయి. స్థూలకాయం. వాళ్ళు మాట్లాడుకోవటం చూసి మొహం చిట్లించి -

''బోర్డు చూడు, కాల్స్ పెండింగ్‌లో వున్నట్టున్నాయ్'' అన్నది శైలజతో, ఆమె కంఠంలో విధి నిర్వహణ కన్నా హోదా చూపించాలన్న తపనే ఎక్కువ వుంది. శైలజ నిర్లక్ష్యంగా, తల ఎగరేసి బోర్డువైపు తిరిగింది.

సులోచనకి నవ్వొచ్చింది. శైలజకీ, ఆమెకీ ఒక్కక్షణం పడదు. చాలా రోజుల క్రితం జరిగింది అది. శైలజ 102లో వుంది. ఆ రోజు ఓ అబ్బాయి ఫోన్లో ఆమెని వేధించసాగాడు. ఆమె కంఠం చాలా బాగుందనీ - ఆమెని చూడకపోతే అంబులెన్స్ గతి అని వగైరా.

సాధారణంగా ఆపరేటర్స్ ఇటువంటి కాల్స్ పట్టించుకోరు. వారికిది మామూలే. మరీ శృతిమించితే కంప్లయింట్ చేస్తారు. ఆమె ఎన్నిసార్లు

డిస్‌కనెక్ట్ చేసినా మళ్ళీ చేసేవాడు. పొజిషన్ 102 అవటంతో ఆమెకే వచ్చేది.

102 కాల్‌కి ఛార్జి ఉండదు.

''ఏవండీ, రేపు తిరిగి వూరెళ్ళి పోతున్నాను. ప్లీజ్ - ఈ రోజు కలవండి'' అంటూ వేధించసాగాడు. గుంటూరులో అతడికి పొగాకు బిజినెస్ వుందట. బి.కామ్. పాసయ్యాడట. వగైరా వగైరా వివరాలు అన్నీ చెప్పసాగేడు. ఆమెకు వళ్ళు మండిపోతూంది. 'ఊరు వెళ్ళబోయే ముందు ఒక సాయంత్రం గడపటానికి ఇంకెవరూ దొరకలేదన్నమాట' అని తిట్టుకొని సూపర్‌వైజర్‌కి చెబ్దామా అనుకొని మళ్ళీ ఎందుకులే అని వూరుకుంది. అందులోను సూపర్‌వైజర్ మనస్తత్వం ఆమెకి తెలుసు. ఇలాంటి అవకాశం దొరికితే అన్యాపదేశంగా ఏదో విసుర్లు విసురుతూ వుంటుంది.

శైలజ మౌనాన్ని మరోలా అర్థం చేసుకొని ఆ కుర్రవాడు మరింత ముందుకు సాగేడు. రాత్రి సినిమా గురించీ, డిన్నర్ గురించీ కూడా మాట్లాడసాగేడు.

ఇక లాభం లేదనుకుని ''మీ వయసెంతండీ'' అని అడిగింది.

ఆమె ఆ మాత్రం ఇంటరెస్ట్ చూపించేసరికి అతడు పొంగిపోయి ''ఇరవై'' అన్నాడు, 'ఇరవయ్యేళ్ళకే ఇంతలా తయారయ్యావా నాయనా' అనుకుని ''మరి నన్నెలా గుర్తుపడ్తారు?'' అని అడిగింది.

‘‘దాన్దేముందండి - మీ ఆఫీసు అయ్యే టైముకి నేను వచ్చి గేటు దగ్గర నిలబడ్తాను. అట్నుంచి అటే సినిమాకి... ఆ తర్వాత డిన్నర్‌కి... ఆ తర్వాత...’’ అని అంటూ నసిగేడు.

వస్తూన్న కోపాన్ని బిగపట్టి శైలజ, ‘‘మరి నన్నెలా గుర్తుపడతారు?’’ అని అడిగింది.

‘‘చెప్పండి. మీరే రంగు చీర కట్టుకున్నారు?’’

ఇంతలో భుజం పక్కనుంచి ‘‘ఏమిటమ్మాయ్? ఎవరూ?’’ అని వినిపించడంతో డిస్‌కనెక్ట్ చేసింది. సూపర్‌వైజర్ మంగళ క్రూరంగా చూస్తూ వుంది. నల్లచీరెలో కాళిలా ఆ క్షణం కనబడింది.

ఆమె వెళ్ళిపోయిన నిముషం తర్వాత మళ్ళీ ఫోన్ మ్రోగింది. ‘‘ఏమిటి డిస్‌కనెక్ట్ చేసేరు?’’

‘‘అబ్బే, ఏం లేదు. సాయంత్రం ఐదింటికి ఎక్సేంజికి వచ్చేయండి. నేను బస్‌స్టాప్‌లో నిలబడి వుంటాను. గుర్తు పట్టడం చాలా తేలిక. ఈ రోజు కట్టుకున్నది నల్లచీర, కొంచెం లావుగా వుంటాను. పోతే మీరు నన్ను చూసి డిస్సపాయింట్ అవుతారేమో - నావయసు నలభై.’’

‘‘అబ్బెబ్బె - ఏమీ పర్లేదు. అసలు ఆ వయసు వాళ్ళంటేనే నాకిష్టం’’ అన్నాడు. ‘ఓహో - అలాగా ఇడియట్’ అని మనసులో అనుకొని ‘‘మీరెలా వస్తారు ఆటోలోనా?’’ అని అడిగి అతడు అవుననగానే, ‘‘ఆటో మీరు

ఆపగానే నేను ఎక్కితే బాగోదు. చూసేవాళ్ళు ఏమైనా అనుకుంటారు'' అంది.

''మరేం చేద్దాం?''

''నేను నిలబడిన దగ్గర ఆటో ఆపి, దిగి 'హల్లో మంగళా!' అని పలకరించండి. నా పక్కనెవరూ లేకపోతే వెంటనే వచ్చేస్తాను. పక్కన ఎవరైనా వుంటే పరిచయం చెయ్యటానికి ప్రయత్నిస్తాను. మీరు మాత్రం ఆగకుండా 'పదవోయ్ - సినిమాకి టైము అయిపోతూంది' అని తొందర పెట్టెయ్యాలి. మొత్తం మీద మీరు నాకు దగ్గిర బంధువైనట్టూ చూసేవాళ్ళకి అనిపించాలి. అదేదో నవల్లో హీరో హీరోయిన్ రెక్క పట్టుకుని కుదేసినట్టు చేసినా పర్లేదుకానీ - మీరూ నేనూ అదే మొదటిసారి కలుసుకోవటం అన్న అభిప్రాయం ఎవరికైనా కలిగిందంటే మాత్రం నా పరువుపోతుంది. అందులోనూ ఆ సమయంలో అక్కడ మా ఆఫీసువాళ్ళు చాలామంది ఉంటారు.''

''పర్లేదు. అంతా నేను చూసుకుంటాగా'' అంటూ హుషారుగా అన్నాడు. శైలజకి సాయంత్రం అవుతున్న కొద్దీ టెన్షన్ ఎక్కువ కాసాగింది. జరిగిందంతా సులోచనకి చెప్పింది.

సాయంత్రం ఐదింటికి బస్‌స్టాప్ దగ్గిర సీన్ జరిగింది.

సూపర్‌వైజర్ మంగళగారు బస్‌స్టాప్ దగ్గిర నిలబడి వుండగా ఆటో ఆమె ముందు ఆగింది. మూడో అంతస్థు కిటికీ అద్దాల్లోంచి సులోచనా, శైలజా ఊపిరిబిగపట్టి చూస్తున్నారు. ఆగిన ఆటోలోంచి ఒకబ్బాయి దిగి ఆమెతో ఏదో అనటం - ఆమె కంగారుపడి పక్కామెవైపు తిరగటం - ఆ అబ్బాయి మరింత దగ్గిరకి వచ్చి చనువుగా ఏదో అనటానికి ప్రయత్నించటం - అబ్బాయి చెంప ఛెళ్ళుమనటం - అంతా సినిమాలోలా గిర్రున తిరిగి పోయినయ్. దూరంనుంచి చూస్తున్న ఇద్దరికీ నవ్వు ఆగటం లేదు. అంతా అయ్యాక మాత్రం శైలజని సులోచన తిట్టింది. ‘‘వాడుగానీ 102 సంగతి చెప్పివుంటే నీ పని ఏమయివుండేది’’ అని. శైలజ నవ్వేసి ‘‘ఆ మాత్రం రిస్కు తీసుకోకపోతే థ్రిల్ ఏముంది’’ అంది.

నిజమే!.... నిస్సారమూ, నిరాపేక్షమూ, నిర్వీర్యమూ అయిన ఆ ఉద్యోగంలో ఇలాంటి చిన్న చిన్న అనుభవాలే చెణుకులు.

పగటికన్నా రాత్రి డ్యూటీల్నే ఎక్కువగా కోరుకునేది. ఇరుకుగది, ఒంటరితనపు జీవితం.... నిరర్థకమైన రాత్రి తాలూకు శూన్యతా ఆమెని భయపెట్టేవి. రాత్రిళ్ళు పనికూడా తక్కువే వుంటుంది. ముఖ్యంగా జీరో అవర్ దాటిన తర్వాత....

డార్మెటరీస్‌లో నిద్ర పట్టేది కాదు. 'వాగుబోతు అమ్మాయిలు' తెల్లవారే వరకూ మిగతా వాళ్ళకి నిద్రాభంగం కలిగిస్తూ బిగ్గరగా మాట్లాడుకునే వాళ్ళు.

డ్యూటీలో వుంటే ప్రొద్దునే నాలుగింటికి WAKE UP CALLS మొదలయ్యేవి. అలారం పెట్టుకుని లేవటానికి బద్ధకమైన కస్టమర్సు ఫోన్లో ఫలానా టైముకి లేపమని చెప్పవచ్చు. మామూలు సమయాల్లో ఇలాంటి 'మేలుకొలుపులు' రోజుకి ఏడొందలుదాకా వుంటే, రంజాన్ - క్రిస్ట్‌మస్‌లాటి సమయాల్లో పదిహేనువందల్దాకా ఉంటాయంటే అతిశయోక్తి కాదు. వాళ్ళు చెప్పిన టైముకి వాళ్ళకి సుప్రభాతం పాడి లేపాలి. పదిమందిదాకా ఆపరేటర్లు మిషన్స్‌లాగా పనిచేసినా ఈ సుప్రభాతసేవ పూర్తి అయ్యేది కాదు. ''అయిదింటికి లేపమంటే అయిదుంపావుకి లేపుతావా'' అని కోప్పడే కస్టమర్లు కొందరూ, నిద్రనుంచి లేవడానికి విసుక్కునేవాళ్ళు కొందరూ.

తాగుబోతుల్తో ఫోన్ అనుభవాలు గమ్మత్తుగా వుండేవి. ఒకరెవరో రాత్రి రెండింటికి ఫోన్ చేసేడు. బాగా మందు కొట్టినట్టున్నాడు. ''నిద్ర పట్టటంలేదు మేడమ్; నాతోపాటు మీరూ ఎంజాయ్ చెయ్యండి'' అంటూ అడవిరాముడు పాటల టేప్ ఫోన్ పక్కనే పెట్టి పడుకున్నాడు. గంటవరకూ

అది మ్రోగుతూనే వుంది. పని లేనప్పుడల్లా ఆ ''కీ'' ఓపెన్ చేసుకుని విన్నది ఆ రాత్రి.

చాలా థ్రిల్లింగ్ అనుభవాలు.

ఒకరోజు ట్రంక్స్‌లో వుంది. ఫోన్స్ సరిగ్గా పనిచెయ్యలేదు. ఆ రోజు అవతల స్ట్రీ లైన్‌లోకి వచ్చాక లోకల్ కనెక్షన్‌లో ఫాల్టు వచ్చింది. సులోచన క్షమాపణలు చెప్పి తిరిగి ప్రయత్నించసాగింది. ''పర్లేదు మాడమ్, నెమ్మదిగా ట్రై చెయ్యండి'' అంది ఆమె. ఢిల్లీ నుంచి వచ్చిన కాల్ అది. కనెక్షన్ యిచ్చాక సగంలో తిరిగి డిస్కనెక్ట్ అయింది. ఇవతల మంత్రిగారు కంగారుపడి ''వెంటనే సరిచెయ్యండి. అవతలున్నది ప్రైమ్మినిస్టర్'' అన్నాకగానీ సులోచనకి తెలిసిందికాదు. తనని ''మేడమ్'' అని సంబోధించినది ప్రధానమంత్రి ఇందిరాగాంధి అని.... వళ్ళంతా టెన్షన్, కంగారు.... జీవితంలో మరపురాని అనుభూతి.

డిసెంబర్ 31 రాత్రి డ్యూటీలో వుంటే ఇక ఒకటే అభినందనల పరంపర. ఎందరో మహానుభావులు కొత్త సంవత్సరం గ్రీటింగుల్ని కొత్తాపాతా లేకుండా ఫోన్‌లో అందించేవారు... ప్లెయింగ్ కిసెస్‌తో.

వచ్చిన కొత్త సంవత్సరం పాతబడితే మళ్ళీ ఇంకో కొత్తసంవత్సరం పాతబడడం కోసం వచ్చేది - వచ్చి వెళ్ళిపోయే కొత్తపాతల మధ్య తనుమాత్రం నిశ్చలంగా, నిర్వేదంగా నిద్రమాత్రల సాయంతో నిర్లిప్తంగా.

* * * * *

అసిస్టెంట్ ఇంజనీర్ టేబిల్‌కి ఎదురుగా కూర్చుని కంప్లెయింట్ వ్రాసుకున్నాడు రేవంత్.

అయ్యా,

నా టెలిఫోన్ నెంబరు 13414. ఒక వ్యక్తి ఈ నెంబరుకి ఫోన్‌చేసి మాటిమాటికి నన్ను బెదిరిస్తున్నాడు. ఇది నాకు చిరాకుగా వుంది. ఆ మాలిషస్‌కాల్ ఎక్కడినుంచి వస్తుందో తెలుసుకుని ఆ నెంబరు నాకు చెప్పిన ఎడల కృతజ్ఞుడిని.

ఇట్లు - రేవంత్.

అని సంతకం పెట్టి అందించాడు.

''పోలీస్ కంప్లైంట్ యిచ్చారా''

రేవంత్ గతుక్కుమని, అంతలో వెంటనే తేరుకుని ''ఇచ్చాను'' అన్నాడు.

''నాల్గయిదు రోజుల్లో మీ ఫోన్ తీసేసి ఇంకో ఫోన్ పెడతాము. దానికి ఒక బటన్ వుంటుంది. మీకు ఆ వ్యక్తి ఫోన్ చెయ్యగానే బటన్ నొక్కండి. మేం ట్రేస్ చేసేవరకూ మాత్రం సంభాషణ కొనసాగిస్తూ వుండాలి''

''అలా ఎంతసేపు?''

“మీకు వచ్చే కాల్ ఇదే ఎక్సేంజినుంచి అయితే మూడు నిముషాలు చాలు. ఇంకో ఎక్సేంజి అయితే అయిదు నిమిషాలదాకా పడుతుంది. ఫోన్ పదిరోజులపాటూ ఇలా అబ్జర్వేషన్‌లో వుంచుతాం. ఈ లోపులో ఆ బ్లాక్‌మెయిలరు ఫోన్ చేస్తాడనే ఆశిద్దాం”

“పదిరోజులెందుకు? ప్రతిరోజు చేస్తుంది” అని వెంటనే నాలుక్కరుచుకున్నాడు.

“చేస్తుంది - అంటే ఆడబ్లాక్‌మెయిలరా?” ఆశ్చర్యంగా అడిగాడు ఇంజనీరు.

ఈ లోపులో రేవంత్ సర్దుకుని, “అవునండీ! ఈ మధ్య ఆడవాళ్ళే ఎక్కువ నేరాలు చేస్తున్నారు” అంటూ లేచి అతడికి షేక్‌హేండ్ ఇచ్చి బయటికొచ్చేశాడు. వస్తూ అనుకున్నాడు. ‘ఇంకెక్కడికి పోతావ్ పిల్లా ఈసారి - ఎలా తప్పించుకుంటావ్?’ అని.

రేవంత్ దగ్గిర అప్లికేషన్ తీసుకున్న ఇంజనీరు యువకుడు. అతడి పేరు విశ్వం.

రేవంత్ వెళ్ళిపోయాక అతడు సెకండ్ ఫ్లోర్‌లోకి వెళ్ళాడు. అక్కడ వున్నది స్విచ్‌రూం. ఒక్కసారి తలుపు తీయగానే అందులో వినబడిన శబ్దానికి అప్రయత్నంగా అడుగు వెనక్కి వేశాడు.

ఆ ఎక్సేంజి ఏరియాలోవున్న టెలిఫోన్లన్నింటికి ఆ గదిలో స్టోర్ వుంది. రేవంత్ టెలిఫోన్ వున్నది స్ట్రోగేర్ ఎక్సేంజిలో. ఇదిగాక ఇంకా మాన్యువల్ అనీ, క్రాస్‌బార్ అనీ ఇంకో రెండు రకాలున్నాయి.

హైదరాబాదులాంటి నగరంలో 41,000 టెలిఫోన్‌లున్నాయి. రోజు దాదాపు 8,500 ట్రంకాల్స్ వెళతాయి. ఆశ్చర్యం ఏమిటంటే వచ్చే కాల్స్ 4000 కన్నా ఎక్కువ వుండవు. లోకల్‌కాల్స్ రోజుకు దాదాపు పది లక్షలదాకా వుంటాయి. అందుకే అ స్విచ్‌రూంలో అంత శబ్దం.

స్విచ్‌రూంలో వరుసగా గోడల్లాంటి ప్లానెల్స్ ఉన్నాయి. విశ్వం 13414 దగ్గిర నిలబడి ఆ పిన్‌ని అబ్జర్వేషన్‌లోకి తీసుకొని మానిటర్ ఏర్పాటు చేశాడు.

ఆ రోజునుంచి రేవంత్ ఫోను అబ్జర్వేషన్‌లో ఉంచబడింది.

* * * * *

ఆ తరువాత రెండురోజులకి ఆమె దగ్గర్నించి ఫోన్ వచ్చింది. ఆ రెండ్రోజులూ రేవంత్ చాలా టెన్షన్‌తో గడిపాడు. ఏ కాల్ వచ్చినా అతని చూపుడువేలు ఫోన్ మీదకు వెళ్ళేది.

"…. హల్లో" అని ఆమె గొంతు తియ్యగా వినిపించగానే బటన్ నొక్కాడు, వెంటనే స్విచ్ రూంలో బజ్జర్ మోగింది. క్షణాలమీద 'బ్యాక్‌వర్డ్ ట్రేసింగ్' మొదలయింది?

ఇక్కడ ఇంజనీర్లు ఈ పనిమీదుంటే అక్కడ రేవంత్ ఆ అమ్మాయితో తాపీగా మాట్లాడుతున్నాడు.

''.... నేను నాపేరు మార్చుకుందామనుకుంటున్నాను''

''ఎందుకు రేవంత్ - మీ పేరు చాలా బాగుంది. నాకెంతో నచ్చింది.''

''కానీ అర్థ...'' నసిగాడు.

''పర్లేదులెండి. ఎలాగో ఒకలా సర్దుకుందాం. ఎల్లయ్య - పిచ్చయ్యలకన్నా బాగానే వుంది కదా''

రేవంత్ మొహం ఎర్రబడింది. ''ఇంతకీ మీరెవరు?'' అని అడిగాడు ఉక్రోషాన్ని దాచుకుంటూ.

''కంఠంబట్టి తెలుస్తుంది కదా అమ్మాయిని! వెంట్రిలాక్విస్ట్‌ని కానీ, మిమిక్రిస్టు (కంఠాన్ని మార్చే వ్యక్తి)ని కాను. పదోక్లాసు వరకూ చదువుకున్నాను''

''మీరు అమ్మాయే కానీ - మీ క్వాలిఫికేషను మాత్రం పదోక్లాసు కాదు. పందెం కడతాను.''

ఆ అమ్మాయి నవ్వి ''సర్లెండి.... అబద్ధమే చెప్పాను. సరేనా'' అంది.

''మీరిలా పేరూ, అడ్రస్ చెప్పకుండా ఎందుకు ఫోన్ చేస్తున్నారు?''

''రెండు సార్లు హింట్ ఇచ్చాను - కనుక్కోలేకపోతే అది నా తప్పు కాదుకదా''

''కలుసుకోకుండా వూరికే ఇలా ఫోన్ చెయ్యడం టైం వేస్టుకదా!''

''ఎందుకు కలుసుకోలేం రేవంత్? తప్పకుండా కలుసుకుందాం. మీ స్నేహితురాలిని అవ్వాలనేకదా ఇంత కష్టపడి ఫోన్స్ చేస్తున్నది. ఈ లోపులో కాస్త థ్రిల్‌కోసం ఈ ఫోన్స్. అంతే, ఇదీ వద్దంటే రేపే మీ ఆఫీసుకి వచ్చి కలుసుకుంటాను.''

''వద్దులెండి. రేపట్లోగా కనుక్కోవటానికి ప్రయత్నిస్తాను''

''ఎలా''

''స్వయంశక్తి ఉపయోగించి.''

''ఇంకో హింట్ ఏమన్నా ఇమ్మంటారా?''

''వద్దులెండి.''

''అయితే పెట్టేస్తాను.''

రేవంత్ కంగారుపడి ''అబ్బెబ్బె - ఇంకొంచెం సేపు ఏదైనా మాట్లాడండి''

అన్నాడు. అప్పటికి ఒక నిముషమే గడిచింది. ఇంకా నాలుగు నిముషాలుంది. ఇక్కడ ఈ సంభాషణ జరుగుతూవుంటే అక్కడ బ్యాక్‌వర్డ్

ట్రేసింగ్ ఆపరేషన్ చాలా తొందరగా జరుగుతూంది. ఇద్దరు అసిస్టెంట్లు స్విచ్‌రూమ్‌లో చకచకా పనిచేస్తూ పాయింట్లు పరిశీలిస్తున్నారు.

''మీ గురించి నేను తెలుసుకోకుండా ఎలా స్నేహం చేయగలను?'' అని అంటున్నాడు రేవంత్.

''నా ఇష్టాలూ, అభిరుచులూ అన్నీ ఫోన్‌లో చెప్తాగా.''

''అయినా మిమ్మల్ని చూడాలి''

''ఎందుకు?''

పెంటనే సమాధానం దొరకలేదు. ''మీరెవరో - ఎలా వుంటారో తెలియకుండా యెలా స్నేహం చెయ్యను?'' ఇబ్బందిగా - సిన్సియర్‌గా అడిగాడు.

''ఎలా వుంటే ఏముంది రేవంత్? ఏ అమ్మాయికైనా రెండు బుగ్గలూ, రెండు చెవులే కదా వుండేది.''

''కానీ కొందర్ని చూస్తే స్నేహం చెయ్యాలనిపిస్తుంది. కొందర్ని చూస్తే అకారణంగా ఏవగింపు కలుగుతుంది. మనం ఫోన్లో కొంత కాలం స్నేహితులయ్యాక కలుసుకున్నామనుకోండి - అప్పుడు నేను వూహించుకున్న దానికి మీరు భిన్నంగా వుంటే నాకు ఆశాభంగం

కలగదా? దీనికి రెండు కళ్ళూ, ఒక ముక్కూ అన్న స్టాటిస్టిక్స్ యెందుకు? అనుభూతిని లెక్కల్లో చెప్పటం అంత మంచి పని కాదనుకుంటాను.''

ఆమె ఒక క్షణం మౌనంగా వుండి, ''నేను స్నేహితురాలిగా మిమ్మల్ని డిస్సపాయింట్ చెయ్యననే అనుకుంటున్నాను రేవంత్!'' అంది.

''చెయ్యకపోతే మంచిదే. కానీ చేస్తారేమో అన్న సందిగ్ధంలో నేను చేసే - స్నేహంలో పరిపూర్ణత వుండదు. ఒకర్నొకరు చూసుకోకుండా చేసే 'కలం' స్నేహాలు వాళ్ళ కలయిక తర్వాత ఘోరంగా ఫెయిలవడానికి కారణం అదే.''

''మిగతా వాళ్ళ విషయంలో అలా అవొచ్చేమోకాని - మన విషయంలో అలా అవ్వదు.''

''అంత ఖచ్చితంగా యెలా చెప్పగల్గుతున్నారు?''

''ఈ ప్రశ్నకి సమాధానం మనం కలిసినప్పుడు చెబ్తాను.''

ఆ తరువాత అతడికి ఏం మాట్లాడాలో టాపిక్ దొరకలేదు. టైమ్ మూడు నిమిషాలే అయింది. ఇంకా రెండు నిముషాలు మాట్లాడాలి. ఇంతలో ఆ అమ్మాయే అన్నది. ''ఏమంటున్నాడు మీ స్నేహితుడు?'' అని.

‘ఎవరు జేమ్సా?..’’ అన్నాడు రేవంత్. ‘‘బాగానే వున్నాడు. అతను మీ గురించి ఏవన్నాడో తెలుసా?’’

‘‘ఏవన్నాడు?’’

‘‘మీరో సైకిక్ అట. సాధారణంగా ఇలా ఫోన్‌లు చేసేవాళ్ళలో చాలా తక్కువమంది చిలిపిగా అల్లరిచేసే అమ్మాయిలు వుంటార్ట. చాలామంది తమ మానసిక వ్యధ తప్పించుకోవటానికి ఇలా ‘అవుట్‌లెట్’లు చూసుకుంటారట.’’

‘‘అతడు నిజమే చెప్పాడు. కాని నేను ‘చాలామంది’లోకి రాను. తక్కువ మందిలోకి వస్తాను’’మామూలుగా అంది. రేవంత్‌కి ఆశ్చర్యం వేసింది. తన మాటలకి కోపం వస్తుందనుకున్నాడు. కాని నిజాన్ని నిజంగా తీసుకుంటుందని అనుకోలేదు. ఆమెకి కోపం తెప్పించాలనే అతడి ఉద్దేశ్యం కూడా. ఆ కోపంలో తన గురించి చెబ్తుందని ఆశ.

‘‘అంటే మీరు చిలిపిగా అల్లరి చేసే అమ్మాయన్నమాట.’’

‘‘ఆహా’’ అంటూ నవ్వింది. ‘‘ప్రత్యూషం రాకముందే పాల వెన్నెల్లో పరికిణీ కుచ్చిళ్ళు పైకి కట్టి ‘గొబ్బెళ్ళోయమ్మ గొబ్బిళ్ళో’ అని పాడుకుంటో ముగ్గువేసే ఆడపిల్ల...’’

‘‘.... వెన్నెల్లో ఆడపిల్ల’’ చప్పున అన్నాడు.

''పేరు బాగుంది.''

''అలాగే పిలుస్తాను.''

''నాకు అభ్యంతరం లేదు'' అని ఆగి, నెమ్మదిగా ''మొన్న ఎందుకు టెలిఫోన్ ఎక్ఛేంజికి వెళ్ళారు రేవంత్'' అని అడిగింది.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడి, ''మీకెలా తెలిసింది?'' అని అడిగాడు.

''అదేమిటి రేవంత్? మీతో స్నేహం చేయబోయే ముందు మీ దినచర్య గురించి తెలుసుకోకపోతే యెలా?''

''అవును. చిన్న పనివుండి వెళ్ళాను'' అంటూ వుండగా అతడికి ఒక ఆలోచన వచ్చింది. తను ఆమె ఫోన్ నెంబర్ కనుక్కోబోతున్నట్టు ఆమెకు తెలిసిందేమో! అందుకనే ఇంటిదగ్గర్నుంచి కాకుండా బైట్నుంచి యెక్కడనుంచి అయినా చేస్తుందేమో! ఇప్పుడు ఆమెని ఆ ఫోన్ దగ్గిరే తను అక్కడికి వెళ్ళేవరకూ ఆపుచెయ్యాలి. అతడో క్షణం ఏం చెయ్యాలా అని ఆలోచించి, కంఠం అమాయకంగా మార్చి, ''మీరు మొన్న ఒక లెక్క చెప్పారు జ్ఞాపకం వుందా - అలాంటి లెక్కే ఇంకొకటి చెప్పండి'' అన్నాడు. ''అప్పుడు కనుక్కోలేకపోయాను. ఈసారి కనుక్కోగలనేమో ప్రయత్నిస్తాను.''

''ఏది? నా టెలిఫోన్ నెంబర్‌కి సంబంధించిన లెఖ్కా?''

''అవును. మీ నెంబర్ కనుక్కుంటాను. పోతే నాకు ఐదు నిముషాలు టైమివ్వాలి'' అన్నాడు. అతని మనసులో ఆలోచన వేరు. ఆమెని ఎలాగైనా అయిదు నిముషాలపాటు ఆ ఫోన్ దగ్గిర ఆపుచేయాలి.

''మొన్న చెప్పిన నెంబరంటే - మిమ్మల్ని తప్పుదారి పట్టించటానికి అనువుగా వుంది. ఇప్పుడు చేస్తున్న ఫోన్‌కి అలాంటి ప్రత్యేక అర్హతలు యేమీ లేవే.''

''ఏదో ఒక ప్రత్యేకత అంటూ లేని నెంబరు ఏదీ వుండదు. ప్రయత్నించి చూడండి'' ప్రోత్సహించాడు.

''ఒక్క నిముషం ఆగండి'' అంటూ ఆమె అవతలివైపు ఆలోచిస్తున్నట్టు మౌనంగా వుండిపోయింది. రేవంత్ ఊపిరి బిగపట్టాడు.

''ఆ, దొరికింది.''

''ఏమిటి'' టెన్షన్ నిండిన స్వరంతో అడిగాడు.

''ఇప్పుడు నేను చేస్తున్న నెంబరు చాలా చిత్రమైనది రేవంత్! అయిదు నిముషాల్లో మీరు కనుక్కోగలరనే ఆశిస్తాను.

''చెప్పండి.''

''ఈ నెంబరు అయిదంకెల మొట్టమొదటి ప్రైమ్ నెంబర్ - సంఖ్యాశాస్త్రంలో'' అని ఫోన్ డిస్‌కనెక్ట్ చేసేసింది.

రేవంత్ కూడా పెట్టేశాడు. వెంటనే ఎక్సేంజి నుంచి వివరాలు వస్తాయనుకున్నాడు. కానీ రాలేదు. అతడు కాగితమూ, కలమూ తీసుకున్నాడు.

"ప్రైమ్ నెంబర్స్" అంటే దేనితోనూ భాగింపబడని సంఖ్యలు. ఉదాహరణకి రెండంకెల ప్రైమ్ నెంబర్లు 11, 13, 17,19.

ఇలాంటి అయిదంకెలది - ఆమె టెలిఫోన్ నెంబరు. అతడు లెక్కకట్టడం ప్రారంభించాడు.

సంఖ్యా శాస్త్రంలో మొట్టమొదటి అయిదంకెల సంఖ్య 10000. ఇది పదిచేత భాగింపబడుతుంది కాబట్టి టెలిఫోన్ నెంబర్ అదికాదు.

తరువాతది 10001. ఇది 73 చేత భాగింపబడుతుంది.

అతడు లెక్కలు ఫాస్టుగా చేస్తున్నాడు. టైమ్ వేగంగా ముందుకు కదిలిపోతుంది. అతడికి ఒకందుకు ఆశ్చర్యంగా వుంది. ఆ అమ్మాయి తన ఫోన్ నెంబర్ ప్రత్యేకతని అంత తొందరగా యెలా పట్టుకోగలిగిందా అని! ఈ అమ్మాయి లెక్కల పరిజ్ఞానం శకుంతలాదేవితో సమానంగా వుండి వుండాలి.

తరువాతి అంకె 10003. ఇది ఏడుతో భాగింపబడుతుంది.

10004, 10005, 10006 వరుసగా రెండు, మూడు, రెండులతో భాగింపబడ్డాయి.

తరువాత సంఖ్య 10007. టెలిఫోన్ డిపార్టుమెంట్‌ను తిట్టుకుంటూ టైమ్ అయిపోతూవుందన్న కంగారుతో అతడు లెక్కపెట్టాడు. అదే నెంబర్ అని తెలుసుకుని ఆనందంతో 'యురేకా' అని అరవబోతూవుంటే టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తి 'హల్లో' అని అన్నాడు.

''టెలిఫోన్ డిపార్టుమెంట్ నుంచి మాట్లాడుతున్నాం సార్! మీకు ఇప్పుడొచ్చిన కాల్ 10007 నుంచి.... హోటల్ హరిప్రియ.''

''ఇంకో అరగంట అయ్యాక చెప్పలేకపోయారా'' అని కోపంగా ఫోన్ పెట్టేసి, ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచాడు. ఇంక రెండు నిముషాలే టైమ్ వుంది.

అతడు వేగంగా మెట్లు దిగి కారువద్దకి పరుగెత్తాడు. హోటల్ హరిప్రియ ప్రక్క స్ట్రీటులోనే. చేరుకొనేసరికి మూడు నిముషాలు పట్టింది. అతడు రిసెప్షనిస్టు దగ్గరికి వెళ్ళి ''ఇప్పుడొక అమ్మాయి మీ హోటల్ నుంచి ఫోన్ చేసింది. ఆమె ఎక్కడుంది'' అని అడిగాడు.

''మీరెవరు?''

''సి.ఐ.డి. పోలీస్, క్రైమ్‌బ్రాంచ్. సి.బి.ఐ.'' అని నోటికొచ్చిన పేర్లు చెప్పాడు. దాంతో రిసెప్షనిస్టు బెదిరి ''మేం అమ్మాయిలకి రూంలు - ఫోన్లూ ఇవ్వమండీ'' అన్నాడు.

''ఇప్పుడీ నెంబర్ నుంచే మాకు ఫోన్ వచ్చింది'' అని గద్దించాడు.

రిసెప్షనిస్టు నసుగుతూ ''ఒక 314 లో మాత్రం ఒక అమ్మాయి దిగిందండీ. గంట అయింది'' అన్నాడు. రేవంత్ మరి ఆగలేదు. లిఫ్టుకోసం కూడా చూడకుండా మూడో అంతస్తుకి పరుగెత్తాడు.

రూమ్ నెంబర్ 314 చీకటిగా వుంది. తలుపు తోసుకుని లోపలికి ప్రవేశించాడు. ఒక్కసారిగా వెలుతురు నుంచి చీకట్లోకి ప్రవేశించటంవల్ల కళ్ళు కనబడడం లేదు. తడుముకుని స్విచ్ వేశాడు.

అంతే!

కెవ్వున రాబోయిన కేక గొంతులోనే ఆగిపోయింది! పిడికిళ్ళు బిగుసుకున్నాయ్! అతికష్టంమీద తనని తను కంట్రోలు చేసుకుంటూ వెనుదిరిగాడు.

అప్పుడే ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆ గదిలోకి ప్రవేశిస్తున్నాడు. గది మధ్యలో పదహారేళ్ళ అమ్మాయి శవం వేలాడుతూంది.

గంట తరువాత రేవంత్ పోలీసుస్టేషన్లో మొహం దాచుకుని నిస్సహాయంగా కూర్చుని వున్నాడు. చాలా సేపు టఫ్ ఇంటరాగేషన్ జరిగింది. అతడికున్న పలుకుబడీ, ఇంటర్నేషనల్ ఫేమూ దేనికీ పనికిరాలేదు.

ఆ అమ్మాయెవరో తీరిగ్గా హోటల్లో రూమ్ తీసుకుని - ఇన్స్పెక్టర్‌కి ఫోన్‌చేసి మరీ చచ్చిపోయింది.

"మీరా రూమ్‌కి ఎందుకు వెళ్ళవలసి వచ్చింది రేవంత్?" ఇన్స్పెక్టర్ అడిగాడు.

"పొరపాటున."

"అయితే ఏ రూమ్‌కి వెళ్ళబోయి పొరపాటున ఆ రూమ్‌కి వెళ్ళారు?"

ఆ ప్రశ్నకి రేవంత్ వద్ద సమాధానం లేదు.

"రిసెప్షనిస్టుకి మీరు సి.ఐ.డి. అని ఎందుకు చెప్పారు? అది నేరం కాదా?"

"రేవంత్ మాట్లాడలేదు. అతడికి సుందర్రామ్మూర్తి పాట జ్ఞాపకం వచ్చింది. 'ఎరక్కపోయి వచ్చానూ' అని పాడుకోవటమే తరువాయి. ఇప్పుడిక ఇన్వెస్టిగేషన్ ఇంకా ముందుకు సాగుతుంది. తను టెలిఫోన్

డిపార్టుమెంటులో ఇచ్చిన కంప్లెయింట్ వివరాలు బైటపడ్తాయి. ఎవరో తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని వ్రాసిచ్చిన కంప్లెయింట్ బైటపడ్తుంది. ఈ మధ్య ఆడ బ్లాక్‌మెయిలర్లు కూడా బయల్దేరుతున్నారని తను అన్న మాట ఆ ఇంజనీరు పోలీసులకు చెబుతాడు. తనకి ఆ రోజు 10007 నుంచి ఫోన్‌కాల్ వచ్చిందన్న విషయం తనకి చెప్పామని స్విచ్ రూమ్ అసిస్టెంట్లు వాగ్మూలం ఇస్తారు. వెంటనే తను హోటల్ హరిప్రియకి బయల్దేరి - ఆ రూమ్‌లోవున్న బ్లాక్‌మెయిలర్ అమ్మాయిని హత్యచేసి __'

'గోవిందో గోవిందా' అనుకున్నాడు.

ఇక తన పరువు - ప్రతిష్ట అన్నీ వెంకట్రమణ గోవిందా! వాటి సంగతి దేవుడెరుగు. ఉద్యోగం - జైలు - జీవితం తిరుక్షవరం!

''మిస్టర్ రేవంత్! మీరు కూడా మా ప్రశ్నలకి దేనికీ సరిగ్గా జవాబు చెప్పటంలేదు. మీరు చదువుకున్నవారు. మీ మీద థర్డ్ డిగ్రీ ఉపయోగించటం నాకు ఇష్టం లేదు.''

రేవంత్ ఉలిక్కిపడ్డాడు. తనని నేరం వప్పుకోమని ఇన్‌స్పెక్టర్ ఇన్‌డైరెక్టుగా చెబ్తున్నాడు.

అతడికి దుఃఖం రాలేదు. తన మూర్ఖత్వం మీద తనకే జాలి వేసింది. ఎవరో అమ్మాయి ఫోన్‌చేస్తే ఆమెకి 'వెన్నెల్లో ఆడపిల్ల' అని పేరు పెట్టుకున్నాడు. ఆ అమ్మాయిని వెతకటానికి పెద్ద హీరోలా బయల్దేరాడు.

దీనికి వెనుక ఒక ముఠా వున్నదని - తనచుట్టూ జాగ్రత్తగా వల బిగించడానికే ఈ నాటకం ఆడారని తెలుసుకోలేకపోయాడు. వాళ్ళక్కావలిసిన హత్య వాళ్ళు చేసేసి, తనని అందులో ఇరికించారు. అమ్మాయి సంబరంలో తనా ట్రాప్‌లో ఇరుక్కుపోయాడు.

ఇడియట్‌లా....

మరో అరగంటసేపు ఇంటరాగేషన్ జరిగింది. అది వాదోపవాదంగా మారింది. ఇన్‌స్పెక్టర్ కోపంతో ''ఓకే మిస్టర్ రేవంత్! మేజిస్ట్రేట్ ముందు మిమ్మల్ని హాజరుపరుస్తాం. ఆ తరువాత మిగతాది చూసుకుందాం'' అన్నాడు.

''మీరు రావటానికి రెండు నిముషాల ముందే నేను హోటల్ గదిలోకి వెళ్ళాను. ఆ విషయం రిసెప్షనిస్టు చెప్తాడు. ఈ రెండు నిముషాల్లోనూ నేను చంపటమూ, వ్రేలాడగట్టటమూ జరిగిందంటారా'' ఆవేశంగా అడిగాడు రేవంత్.

ఇన్‌స్పెక్టర్ తాపీగా ''ఆ లాజిక్ అంతా కోర్టులో చెప్పుకుందురుగానీ'' అని, పోలీస్‌వైపు తిరిగి - ''ఇతడిని లాకప్‌లో పెట్టు'' అన్నాడు. ఆమాట వినగానే రేవంత్ చువ్వలా కుర్చీలోంచి లేచి, ''ఇది అన్యాయం'' అని అరిచాడు. ''సాక్షిగా తీసుకొచ్చి, నా లాయర్‌ని కలుసుకునే అవకాశం ఇవ్వకుండా ఇక్కడికిక్కడ నామీద ఛార్జెస్ ఫ్రేంచెయ్యటం అన్యాయం.''

ఇన్‌స్పెక్టర్ కోపంగా, ''మిస్టర్ రేవంత్, ఏ పని ఎప్పుడు చెయ్యాలో మాకు తెలుసు'' అని గద్దించాడు.

అతడిని లాగి కొడ్డామన్నంత కోపం వచ్చింది. మళ్ళీ అదో నేరం అవుతుందని వూరుకున్నాడు. నిస్సహాయతతోనూ, రోషంతోనూ అతడి కళ్ళవెంట నీళ్ళు రావటమే తరువాయి. నవ్వులాటకి చూస్తూ చూస్తూ వుండగానే ఎలా ఇందులో ఇరుక్కుపోయాడు! ముందు అరెస్టు - తరువాత – బెయిలు - తరువాత జడ్జిమెంటు - జైల్లో జీవితం -

''పదండి'' అన్నాడు పోలీసు దగ్గరకొచ్చి.

రేవంత్ అతడివైపు అయోమయంగా చూసేడు. ఇన్‌స్పెక్టర్ టేబుల్‌కి పది అడుగుల దూరంలో ఊచల అవతల్నుంచి ఒక జేబులు కొట్టే ఖైదీ చోద్యం చూస్తున్నట్టు నవ్వుతున్నాడు.

రేవంత్ లేవకపోవడంతో పోలీసు భుజం పట్టుకున్నాడు. ''ఓ ఐదొందలు వాళ్ళ మొహాన పడెయ్యండి సాబ్ - వాళ్ళ వాన్‌లో ఇంటికి మర్యాదిచ్చి పంపిస్తారు'' అన్నాడు ఖైదీ. లాఠీవాడి మొహంమీద తగిలింది.

ఇన్‌స్పెక్టర్ నవ్వుతున్నాడు.

గత్యంతరం లేనట్లు రేవంత్ లేచాడు. అతడికి ఇదంతా కలో నిజమో అర్థం కావటంలేదు. నిద్రలో నడిచినట్టు లాకప్‌వైపు నడిచాడు.

నడుస్తూ వుండగా ఫోన్ మోగింది.

ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యంగా ఫోన్ ఎత్తి ''హల్లో __ టూటౌన్'' అన్నాడు. కానీ క్షణంలో అతడి కంఠంలో అకస్మాత్తుగా మార్పొచ్చింది.

చప్పున లేచి నిలబడి అటెన్షన్‌లోకి వచ్చి ''యస్సార్'' అన్నాడు కంపిస్తున్న గొంతుతో. అతడిలో వచ్చిన ఆ మార్పుని రేవంత్ ఆశ్చర్యంగా గమనిస్తున్నాడు. ఇన్‌స్పెక్టర్ నుదుటిమీద చెమటని మాటిమాటికి తుడుచుకుంటున్నాడు. ఫోన్ పట్టుకున్న చెయ్యి కంపిస్తూంది.

''యస్సార్ - ఔన్సార్'' అని తప్ప ఇంకేమీ అనటం లేదు. అతడి ధోరణి చూస్తూంటే ఆవల్నుంచి ఫోన్ చేస్తున్నది ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కి తక్కువ హోదాలో వున్న వ్యక్తి కాదనిపిస్తూంది.

''లేద్సార్ - ఆత్మహత్య నోట్ పెట్టే చనిపోయింది.''

''.....''

''ఔన్సార్! నాకు ఫోన్ చేసింది, జీవితంమీద విరక్తి చెందిందట''

''.....''

''ఇప్పుడే వచ్చాడు సార్! రిసెప్షనిస్టు చెప్పాడు''

''.....''

''ఆ, వదిలేస్తున్నా సార్, ఫైల్ మూసేస్తున్నాను.''

ఫోన్ టక్కున పెట్టేసి తనవైపే చూస్తున్న రేవంత్ దగ్గరికి సాదరంగా వెళ్ళి తోడ్కొని వచ్చాడు ఇన్‌స్పెక్టర్.

''రండి - కూర్చోండి మిస్టర్ రేవంత్ - వుయ్ ఆర్ సారీ - అసలు ఆత్మహత్యే అది, అనుమానాస్పద పరిస్థితిలో మీరు కనబడ్డారు కాబట్టి మిమ్మల్ని ఇంటరాగేట్ చెయ్యవలసి వచ్చింది. జరిగిందంతా మర్చిపోండి. ఏయ్ టు - నాట్ ఫోర్.... ఒక కాఫీ తీసుకురా అయ్యగారికి''

రేవంత్‌కి ఆశ్చర్యంగా వుంది. తన నిరపరాధిత్వం - తన సిన్సియర్ కన్‌ఫెషన్ - దొరికిన ఋజువులు - సాక్ష్యాలు - వీటన్నిటికన్నా ఒక ఫోన్ కాల్ ఎక్కువ ఫలితాన్ని చూపించటం.

అంతలో బయట కారు వచ్చి ఆగిన శబ్దం.

రేవంత్‌తోపాటూ ఇన్‌స్పెక్టర్ బైటవరకూ వీడ్కోలు ఇవ్వటానికి వచ్చాడు.

బైట ఎండలో టయోటా మిలమిల మెరుస్తూంది. ఆ డ్రైవర్ నమ్రతగా డోర్ తెరచి పట్టుకున్నాడు. రేవంత్ కూర్చున్నాక ఇన్‌స్పెక్టర్ తలుపు వేసేడు. కారు కదులుతుంటే రేవంత్ అడిగాడు. ''ఎవరు మీకు ఫోన్ చేసింది?''

''డి.ఐ.జి. సర్!''

కారు కదిలింది. ఎయిర్ కండిషన్డ్ కారు అవటంతో చల్లగాలి రివ్వున కొడ్తూంది. సీటు వెనక్కి వాలి నిస్త్రాణగా కళ్ళుమూసుకున్నాడు. అతడి వంట్లో సత్తువంతా ఈ సంఘటన లాగేసినట్టుంది. డ్రైవర్ని కూడా ఏమీ ప్రశ్నలు వెయ్యాలనిపించలేదు.

అతడి ఆఫీసుముందు కారాపి డ్రైవర్ దిగి, వెనుక తలుపు తీసి పట్టుకున్నాడు. రేవంత్ దిగగానే అతడి చేతిలో ఒక కవరు పెట్టి ''అమ్మగారు ఇమ్మన్నారు, సార్!'' అని వెళ్ళిపోయాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది రేవంత్‌కి, తను కనీసం ఆ కారు ఎవరిదీ అనైనా అడగలేదని, అప్పటికే అది దూరంగా మలుపు తిరుగుతూ వుంది. చేతిలో కవరు చింపి - గులాబీరంగు కాగితం బైటకి తీసేడు.

ముత్యాల సరాల్లా - నీలాకాశం చంద్రుడి కిరణానికి లేత ఎరుపైతే ఆ తెరమీద అమర్చిన నక్షత్రాల్లా అందమైన అక్షరాలు.

''సరదాగా అనుకున్నది ఇలా మలుపు తిరుగుతుందని కలలో కూడా అనుకోలేదు, నన్ను క్షమించండి. క్షమిస్తారు కదూ. కళ్ళనిండా నీళ్ళతో.

- మీ ''వెన్నెల్లో ఆడపిల్ల''

అతడు స్థాణువులా నిలబడిపోయాడు. అతడికి ఇప్పుడు పోలీస్‌స్టేషనూ - ఆ అనుభవాలు జ్ఞాపకం లేవు. తను చేసిన తప్పు

అర్థమైంది. కనీసం కారు ఎవరిదీ అనైనా అడగలేదు. డ్రైవర్‌ని అడిగితే ఆ అమ్మాయి సంగతి అంతా చెప్పేసి వుండేవాడు.

తనని తను తిట్టుకుంటూ ఛాంబర్‌లోకి వచ్చేసరికి ఫోన్ మోగింది.

''హమ్మయ్య! వచ్చేశారు కదా. నేనెంత కంగారు పడ్డానో'' తేలిగ్గా ఊపిరిపీలుస్తూ అన్నది.

''మీరా'' అన్నాడు రేవంత్.

''నేను, డ్రైవర్ వచ్చి చెప్పేవరకూ నా మనసు మనసులో లేదు. అసలు మీరా రూంకి ఎందుకు వెళ్ళారు రేవంత్?''

''314 రూంలో అమ్మాయుందని రిసెప్షనిస్టు చెప్పాడు. నేను ఇంకేమీ ...''

''ఈ ఊళ్ళోనేవుంటూ, కేవలం మీకు ఫోన్ చెయ్యటం కోసం రూం ఎందుకు తీసుకుంటాను రేవంత్? అందులోనూ మీరు మీ ఫోనుని అబ్జర్వేషనులో పెట్టాక...''

రేవంత్ ఉలిక్కిపడి ''అయితే మీకంతా తెలుసా?'' అని అడిగాడు.

''తెలుసు, అయినా మీరు చెప్పినట్లే అయిదు నిమిషాలపాటూ నేను అక్కడే వున్నాను. ఒక్క విషయం మాత్రం నిజం రేవంత్! నేను మీతో దాగుడుమూతలు ఆడటంలేదు, ఇది మాత్రం నమ్మండి. మీకు ఫెయిర్

ఛాన్స్ ఇస్తూనే వచ్చాను. మీరు హడావుడిగా రిసెప్షనిస్ట్ దగ్గరకు వచ్చి ''సి.ఐ.డి: పోలీస్ క్రైంబ్రాంచి; సి.బి.ఐ.'' అని గంభీరంగా నటిస్తూవుంటే నవ్వాపుకోలేక చచ్చాను. మీరు ఎటూచూడకుండా మూడో అంతస్థులోకి వెళ్ళిపోయారు. కొంచెం తల తిప్పి చూసివుంటే లాంజ్ సోఫాలో నేను కనబడి వుండేదాన్ని'' నవ్వుతూ అంది.

అంతలో ఆమె కంఠం మారిపోయింది.

''మీరు మళ్ళీ పప్పులో కాలు వేసేరని నాలో నేను నవ్వుకుంటూ లేవబోతుంటే ఇన్‌స్పెక్టర్ రావడం కనబడింది. హోటల్‌లో క్షణాలమీద కలవరం మొదలైంది. రిసెప్షనిస్టు మీకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాడు - దాంతో నాలో కంగారు బయల్దేరింది. ఈ లోపుల వాన్‌లో ఇన్‌స్పెక్టర్ మిమ్మల్ని పోలీస్‌స్టేషనుకి తీసుకెళ్ళటంతో పరిస్థితి విషమించింది. నాకు ఏం చెయ్యాలో తోచలేదు. ఇక ఏడుపు ఒక్కటే తరువాయి. పరిగెత్తుకెళ్ళి నాన్నగారితో అంతా చెప్పేసేను. ఆయన డి.ఐ.జి.కి ఫోన్ చేసేరు.''

వింటున్న రేవంత్ ఉలిక్కిపడ్డాడు. ''మీ నాన్నగారికి... నాన్నగారికి అంతా తెలుసా'' అన్నాడు తడారిన గొంతుతో.

''తెలుసు''

ఇద్దరి మధ్యా చాలాసేపు నిశ్శబ్దం. దాన్ని చీలుస్తూ ఆమె అన్నది, ''రేవంత్ - నీకో విషయం చెప్పాలి. ముందు చెప్పకూడదనే

అనుకున్నాను. కానీ ఇప్పుడు చెప్పేస్తాను... రేవంత్! నేను ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువు పూర్తిచేసుకుని మొన్న మొన్ననే వచ్చాను. నాన్నగారికి ఒక్కతే కూతుర్ని; చాలా పలుకుబడి, డబ్బూ వున్న తండ్రి ఆయన. అరిస్టోక్రాటిక్‌గా తన కూతురు ఫారిన్‌లో సెటిల్ అవ్వాలనీ, అల్లుడు కూడా పెద్ద అంతస్థులో వుండాలనీ ఆశ. కానీ నా ఆశ వేరు - గోదావరి ఇసుకతిన్నెలమీద పడుకుని కృష్ణశాస్త్రి పాట పాడుకుంటూ ప్రకృతిని ఆస్వాదించాలన్నది నా అభిరుచి. ఒక అందమైన, తెలివైన భర్తకి గృహిణిగా మన దేశంలో మన తెలుగుగడ్డమీద కన్ను మూయాలన్న కోర్కె.... ఇద్దరికీ ఘర్షణ జరిగింది. చివరికి నేనే గెల్చాను. అయితే నాన్నగారో మాట అన్నారు. ''అమ్మాయ్ నాకు తెలిసిన వాళ్ళందరూ బిజినెస్ మాగ్నెట్స్. వాళ్ళ అబ్బాయిలు కూడా అలాంటివాళ్ళే. తెలివితేటలూ - అందం వరకూ అయితే పర్లేదు కానీ నువ్వు వాటితో పాటు అమాయకత్వమూ - భావకవిత్వం కూడా కలిసి వుండాలనుకుంటున్నావ్. నా ఉద్దేశ్యంలో అలాటి అబ్బాయిలెవరూ ఈ భూమ్మీద దొరకరనే అనుకుంటున్నాను'' అని. అంతేకాదు, అలాంటి అబ్బాయిని ఎవర్నైనా చూచి తనకు చూపిస్తే - ఆ అబ్బాయినే బహుమతిగా ఇస్తానన్నారు. ఇంకో మాటలో చెప్పాలంటే నా పెళ్ళికొడుకుని నేనే వెతుక్కోవాలన్న మాట. నేనూ అది ఛాలెంజిగా తీసుకున్నాను. కానీ తొందర్లోనే తెలిసిపోయింది నాకు, నాన్నగారు చెప్పింది అక్షరాలా కరెక్టని! అందమూ, తెలివితేటలూ,

అమాయకత్వమూ, భావుకత్వం ఈ నాలుగు కాదు కదా - కనీసం ఈ నాలుగింట్లో మూడువున్న అబ్బాయి ఎవరూ నాకు దొరకలేదు. నేను ఓడిపోతున్నా ననుకుంటున్న సమయంలో ఒక పార్టీలో మిమ్మల్ని చూడటం తటస్థించింది. ఎవరితోనూ కలవకుండా దూరంగా, ఒంటరిగా నిలబడ్డ మిమ్మల్ని చూసి 'ఎవరీ అందమైన ముద్దపప్పు' అనుకున్నాను....''

వింటూన్న రేవంత్ మొహం ఉక్రోషంతో ఎర్రబడింది. ఆమె చెప్పుకుపోతూంది.

''కోపం తెచ్చుకోకండి. మిమ్మల్ని చూడగానే నేను అనుకున్న మొదటిమాట అది! కాని అంతలో ఎవరో చెప్పారు. మీరు పెనున్స్‌లా ప్రొడక్ట్స్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అని. నేను కొంచెం ఆశ్చర్యపోతూ వుండగానే ఇంకెవరో మీ చదరంగం ప్రావీణ్యత గురించి చెప్పారు. ఇక నాకు తెలిసిపోయింది.... నా సమవుజ్జీ దొరికాడనీ - భాగస్వామి అవ్వొచ్చనీ -''

రేవంత్ ఉలిక్కిపడ్డాడు. ''ఏమిటి మీరంటున్నది -'' అన్నాడు.

''నాన్నగారికి చెప్పాను రేవంత్! ఆయనకి నేనిష్టపడిన ఎవరైనా పర్లేదు. అందులో మీరు ఆయనకి మరీ నచ్చారు.''

''దిసీజ్ ఇడియాటిక్. నేనేమన్నా బజార్లో దొరికే వస్తువునా? మీరు, మీ నాన్నగారు ఇష్టపడి కొనుక్కోడానికి! అసలు 'నేను' మిమ్మల్ని చూసి ఇష్టపడాలి - అదీ కావల్సింది.''

''మీకు ఉక్రోషం ఎక్కువనుకుంటానే'' అంటూ నవ్వింది.... ''మరీ ఆంధ్రదేశపు అబ్బాయిలా మాట్లాడుతున్నారు. ఇక్కడ పెళ్ళిచూపుల్లో అందరూ అబ్బాయినే అడుగుతున్నార్ట - అమ్మాయి నచ్చిందా అని! అమ్మాయి ఒప్పుకోలు ముఖస్తుతి కోసమే.''

అంతలో ఆమె కంఠం మారిపోయింది.... ''నేను మీ హక్కుల్ని కాదనటం లేదు రేవంత్ బాబూ! కానీ ముందు మిమ్మల్ని చూసింది నేను! చూసి ఇష్టపడ్డాను. అందుకే ప్రపోజ్ చేస్తున్నాను. ఇందులో తప్పేమన్నా వుందా''

అతడు వెంటనే జవాబు చెప్పలేక పోయాడు. అవుననటానికి అహం అడ్డొస్తూంది. కానీ దాన్ని తొందర్లోనే జయించి ''తప్పులేదు'' అన్నాడు. ''కానీ నేను మిమ్మల్ని చూడకుండా ఏం చెప్పగలను! అఫ్‌కోర్స్, నాకు తండ్రి లేడు, నా తల్లితో చెబితే కాదనదు. సంతోషిస్తుంది కూడా. కానీ... కానీ...'' ఇంకేం చెప్పాలో తెలియలేదు.

ఆమె అందుకుని, ''మీ ఉద్దేశ్యం అర్థమైంది. పెళ్ళి చూపులు లేకపోయినా - కనీసం కలుసుకోవటమైనా జరక్కపోతే ఎలా? అని

అంతేగా?'' అన్నది. రేవంత్ మాట్లాడలేదు. అతడి మౌనాన్ని అంగీకారంగా తీసుకుని ఆమె కొనసాగించింది. ''ఈ పెళ్ళిచూపుల్ని చూస్తే నవ్వొస్తుంది నాకు. ఫుల్‌సూట్‌లో బిగుసుకుపోయి కూర్చొన్న పెళ్ళి కొడుకు - సిగ్గుతో భూమిలోకి తల పాతేసుకున్న పెళ్ళికూతురు కలసి తామిద్దరూ జీవితమంతా కలిసి వుండాలన్న నిర్ణయాన్ని మూడు నిముషాల్లో తీసుకుంటారు. ఎంత నిరర్థకమైన తతంగం ఇది?''

''అంటే విదేశాల్లోలాగా డేటింగ్ వుండాలా?''

''అమ్మో - అది మరీ దారుణం. మన వాతావరణంలో తొందరగా శృతిమించే ప్రమాదం వుంది.''

''పెళ్ళికి ముందు ఒకరి గురించి ఒకరు తెలుసుకోవాలి! కానీ వాళ్ళు కలుసుకోకూడదు. భలే చిత్రమైన స్థితి ఇది... ఎలా సాధ్యం అవుతుంది!'' అని అడిగాడు రేవంత్.

''వాదనలో సరిగ్గా నేను అనుకున్న చోటికే వచ్చారు మీరు రేవంత్! ఎందుకు సాధ్యం కాదు - ఫోన్ ద్వారా సాధ్యం అవుతుందిగా'' తాపీగా అన్నది. ''లేకపోతే ఉత్తరాల ద్వారా అవుతుంది.''

అచేతనుడయ్యాడు రేవంత్. ఈ లాజిక్ అతడిని కట్టిపడేసింది. ఏం మాట్లాడాలో తెలియలేదు. తనని వాదనలో పెట్టి ఎక్కడికి తీసుకెళ్ళాలో అక్కడికి తీసుకెళ్ళింది. ఈమె క్వాలిఫికేషన్ తను ముందనుకున్నట్టూ

లెఖ్కలు - తెలుగు అయ్యుండదు. లాజిక్ అయ్యుంటుంది. లేకపోతే తప్పకుండా పాలిటిక్స్ అయి ఉంటుంది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

రేవంత్ ఆలోచన్ల నుంచి తేరుకుని, "ఏంలేదు" అన్నాడు.

"ఇలా నా అంతట నేను ప్రపోజ్ చెయ్యడం వల్ల మీకు చులకనగానూ, తేలిగ్గానూ కనబడుతున్నానా?"

రేవంత్ కంగారుపడి "లేదు లేదు" అన్నాడు. నిజంగా లేదు. "అటువంటి అభిప్రాయం ఏమీ పెట్టుకోకండి, పోతే మొగవాణ్ణి అవటం వల్ల నేనే ఈ నిజాన్ని అన్వయించుకోవటానికి కష్టపడుతున్నా. మీరు చేసింది చాలా మంచిపని. మీరు మీ నాన్నగారికి మామూలుగా చెప్పివుంటే ఆయన పెళ్ళిచూపులు అరేంజ్ చేసివుంటే - మీరన్నట్టూ మూడు నిమిషాల్లో మన వివాహం జరిగిపోయి వుండేది.... మీ అభిప్రాయం నాకు అర్థమైంది."

" థాంక్స్!"

"కానీ నాకు అర్థం కానిది ఒకటి వుంది, ఇప్పుడు ఫోన్‌లో మాత్రం నాగురించి అన్నీ సరి అయిన వివరాలు ఇస్తానని నమ్మకం ఏమిటి? ఉదాహరణకి మీకు 'భావుకుడు' అంటే ఇష్టం. నేనెక్కడో కీట్స్ పద్యాలు సంపాదించి మీ మెప్పుకోసం ఫోనులో చదివి వినిపించవచ్చుగా"

అట్నుంచి నవ్వింది. ‘‘మీరలా చెయ్యరు రేవంత్! నేను భావకవిత్వం గురించి చెప్పగానే మీరు కీట్స్ గురించి కనీసం మాట్లాడగలిగారు కదా!’’

అతడు దానిగురించి పట్టించుకోకుండా ‘‘మీకేమిటి నమ్మకం?’’ అని అడిగాడు రెట్టించి.

కొంచెంసేపు నిశ్శబ్దం. ‘‘మీ గురించి ఏమీ తెలుసుకోకుండా ఏదో పార్టీలో చూసేసి దానికి లవ్ ఎట్ ఫస్ట్ సైట్ - అని పేరు పెట్టేసి, యిలా ఫోన్‌లు మొదలు పెట్టానంటారా?’’ ఆమె కంఠంలో అదోలాంటి స్పష్టత ధ్వనించింది.... ‘‘జీవితాన్ని నేను చాలా కాలిక్యులేటెడ్‌గా తీసుకుంటాను రేవంత్. దయచేసి దీన్ని మీరు గర్వం అనుకోవద్దు. మిమ్మల్ని నేను చూసినప్పటి సమయానికి - మీకు మొదటిసారి ఫోన్ చెయ్యడానికి మధ్య రెండు నెలలు టైము గడిచింది. నేను స్నేహితుడిగా ఎన్నుకోబోయే వ్యక్తి నాకు తగినవాడే అన్న నిర్ణయానికి రావటానికే నాకు ఇంత టైము పట్టింది. ఈ టైములో మీ గురించి అంతా తెలుసుకున్న తర్వాతే మీకు ఫోన్ చేశాను.’’

రేవంత్ ఉత్సాహంగా ముందుకు వంగి, ‘‘నా గురించి ఏం తెలుసుకున్నారు, మీరు?’’ అని అడిగాడు.

‘‘అంతా’’

‘‘అంటే’’

''మీ అభిరుచులూ, మీ అలవాట్లూ, మీ వ్యక్తిత్వం వగైరా __ అంతా చెప్పాలంటే చాలా టైమ్ పడ్తుంది.''

''పర్లేదు, చెప్పండి. నేను ఖాళీగానే వున్నాను'' అన్నాడు రేవంత్. అతడికి చాలా ఆత్రంగా తన గురించి ఆ అమ్మాయి ఏం చెబ్తుందో తెలుసుకోవాలని వుంది. తన తండ్రి బ్రతికి వున్నప్పుడు ఏం చేసేవాడు? తాము ఎంతమంది సంతానం - తన జీవితం - ఆ వివరాలన్నీ చెబ్తుంది అనుకున్నాడు. కానీ అతడు ఊహించినట్టుగాక ఆమె వివరణ మరోలా సాగింది.

''మీరు చాలా సెన్సిటివ్ రేవంత్! మీరెంత సెన్సిటివ్ అంటే ఎవరైనా మీకు సాయం చేయబోయినా ఆ సాయాన్ని పొందటం మిమ్మల్ని మీరు తక్కువ జేసికోవడంగా భావిస్తారు. అందువల్ల మీరు మీ చుట్టూ గిరిగీసుకుని బ్రతుకుతున్నట్లూ బైటవారికి కనిపిస్తారు. మిమ్మల్ని అర్థం చేసుకోవటానికి చాలా ఓర్పు కావాలి. మీ జీవితాశయాన్ని ఎప్పుడూ ఎత్తులో ఉంచుకోవటం - దాన్ని సాధించుటం కోసం నిరంతరకృషి చెయ్యటం వీటితోనే మీకు సరిపోతుంది కాబట్టి 'మామూలు ఆనందాల' జోలికి పోరు. మీతో జీవితాన్ని పంచుకోబోయే భాగస్వామికి అదొక్కటే కష్టం - అయితే మీకెప్పుడూ కోపమూ, విసుగు రాదు కాబట్టి అది అదృష్టం. జీవితం పట్ల మీకు చాలా నిర్దుష్టమైన అవగాహన వుంది. మన వయసువాళ్ళకి చాలా

మందికి లేని అర్హత... ఏ వాతావరణంలోనైనా ఏ పరిస్థితుల్లోనైనా చొచ్చుకుపోయి దాన్ని మీరు మీకు అనుగుణంగా మార్చుకుంటారు. అందుకే అదో రకమైన వికర్షణీయమైన స్టయిల్ మీది.

డబ్బు విషయంలో చాలా కరుగ్గా ప్రవర్తిస్తారు. ఖర్చు పెట్టే ప్రతీపైసాకీ మార్షల్ థియరీ ఆఫ్ మార్జినల్ యుటిలిటీ లెక్క కడ్తారు. ఈ ప్రపంచంలో మీరు ప్రేమించే ఏకైక వ్యక్తి మీ తల్లి గారు. అయిదు గంటలపాటూ చదరంగం ఎలా మీ దినచర్యలో పాలుపంచుకుంటుందో - ఒక గంటపాటూ మీ తల్లి గారితో గడపకపోతే మీరు ఏదో కోల్పోయినట్టూ బాధపడ్తారు. మీ స్నేహితుడు జేమ్స్‌లా మీరు జీవితం పట్ల నిరాసక్తంగా, నిస్సారంగా, నిర్వేదంగా మారకుండా వుండటానికి కారణం మీ తల్లిగారూ - ఆమె ఆప్యాయతే. ఉద్యోగం విషయంలో మీరు ఎటొ ఏవరేజి అంతే. మీ దృష్టి అంతా చదరంగం మీదే. కనీసం మీ చుట్టూ రోజు తిరిగే పెనున్స్‌లా ప్రొడక్ట్స అమ్మాయిల పేర్లు కూడా మీకు తెలియవు. ఆ విధంగా మీక్కాబోయే భార్య అదృష్టవంతురాలు. పోతే చదరంగం మీ మొదటి భార్య కాబట్టి ఆ కోణంలో దురదృష్టవంతురాలు. పదహారేళ్ళ అమ్మాయితో మాట్లాడటం కన్నా చదరంగం బల్ల ముందు కూర్చోవటం మీకు బావుంటుంది. మీ ఆలోచన్లని ఇతరులతో పంచుకోవటం కన్నా మీలో మీరే దాచుకోవటానికి ఎక్కువ ఇష్టపడతారు. మెదడుకన్నా హృదయానికి

ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. మీకేమీ వ్యసనాలు లేవు. అలా అని మీకులేని అలవాటు లేదు. అన్నిటి కన్నా గొప్ప విషయం - మీలో నాకు నచ్చింది ఏమిటంటే జీవితాన్ని మీరు తీర్చి దిద్దుకునే విధానం... ఒక లక్ష్యం కోసం దాన్ని చాలా సిస్టమాటిక్‌గా వుంచుకోవటం... గత అయిదు సంవత్సరాలుగా మీరెప్పుడూ అయిదు దాటి నిద్రపోలేదు. ఇక మీకున్న చెడ్డ అలవాట్లలో అన్నిటికన్నా పెద్దది ఏమిటంటే ఆఫీసుకు వచ్చేముందు అరగంటసేపు ఆడపిల్లలా అద్దం ముందు కూర్చోవటం...''

వింటున్న రేవంత్ మొహం ఎర్రబడింది.

''ఇంకో గుణం ఏమిటంటే ఏ చిన్న విషయం మీకు వ్యతిరేకంగా విన్నా మీ మొహం ఎర్రబడటం, ప్రస్తుతం అలాగే ఎర్రబడి వుండడం.''

రేవంత్ ఉలిక్కిపడ్డాడు, ఆమె కంఠం మారిపోయింది.

''ఇవన్నీ ఎంతో కష్టపడీ - ఎంతో ఖర్చు పెట్టి నేను సంపాదించుకున్న వివరాలు. ఇప్పుడు చెప్పండి రేవంత్, మూడు నిముషాల పెళ్ళిచూపుల్లో కన్నా ఎక్కువ వివరాలు సేకరించి పెట్టుకున్నానా లేదా??'

రేవంత్ మాట్లాడలేదు. ఏదో అద్భుతమైన దృశ్యాన్ని చూస్తున్నట్టూ ఒక వినూత్నమైన విషయాన్ని వింటున్నట్టు స్తబ్ధంగా ఉండిపోయాడు. అసలు ఇదంతా ఎలా సాధ్యమయిందో... అతడికి అర్థం కావటంలేదు.

''చెప్పండి రేవంత్, నేనిలా మిమ్మల్ని ఎన్నుకోవడంలో తప్పు లేదనీ - మీకు ఫోను చెయ్యటం స్త్రీ సహజమైన సరిహద్దుల్ని అతిక్రమించలేదనీ చెప్పండి. మీరు మౌనంగా వుంటే మీకు స్నేహితురాలు కాబోయే అమ్మాయి ఇంతలా తెగించటం మీకు ఇష్టంలేదని నేను భావించవలసి వుంటుంది....''

ఆమె మాటల్ని మధ్యలో ఖండిస్తూ, ''లేదు లేదు'' అన్నాడు రేవంత్. ''నేనింకా షాక్ నుండి తేరుకోలేదు.... అసలు నాకు నమ్మశక్యం కాకుండా ఉంది ఇదంతా, మేరెలా కనుక్కున్నారు?''

''ఆ విషయం ఇక వదిలి పెట్టేద్దాం. నేనడిగినదానికి చెప్పండి. ఈ అమ్మాయేమిటి - పెద్ద మొగరాయుడిలా నా గురించి అన్నీ వాకబు చేసి మరీ ప్రపోజు చెయ్యటమేమిటి అని మీకు అనిపించటం లేదుకదా.''

''లేదు'' అన్నాడు రేవంత్. ''కానీ నేనొక విషయం మాత్రం చెప్పదల్చుకున్నాను. మనం కలుసుకుని నేను మిమ్మల్ని చూసేక నా అంతిమ నిర్ణయం చెప్తాను''

ఆమె అట్నుంచి నవ్వింది, ''.... నేను అందవికారాన్ని కప్పిపుచ్చుకోవటం కోసం, ముందే ఇలా ఫోన్ చేసి నా తెలివి తేటల్తో మిమ్మల్ని ఇంప్రెస్ చేయటానికి ప్రయత్నిస్తున్నానని మీరు అనుకోవటంలో తప్పులేదు. కాని నేను మిమ్మల్ని డిస్సపాయింట్ చెయ్యను లెండి''

''ఎందుకంత రిస్కు? ... మనం వెంటనే కలుసుకుంటే?'' అని ఆత్రంగా అడిగాడు.

''అమ్మ! ఆశ!!'' అంది కవ్వింపుగా, ''.... ఎంతో మందిలో మిమ్మల్ని వెతికి పట్టుకున్నాను. ఇక నన్ను వెతికే బాధ్యత మీది.''

''ఎలా కనుక్కోగలను?''

''చాలా రీజనబుల్ హింట్స్ ఇస్తునే వస్తున్నాగా రేవంత్! ఇకముందు కూడా అలాగే ఇస్తాను. ఒక నెల రోజులు టైమ్ ఇస్తాను. ఈ లోపులో నా మనసులో భావాలు చెప్పుకోవడానికి ఉత్తరాలు కూడా వ్రాస్తాను. నేనిచ్చే హింట్స్ ద్వారా నా ఫోన్ నెంబరు కనుక్కున్నా, లేకపోతే నేనెవర్నో కనుక్కున్నా ఆరోజే మనం కలుసుకుందాం. ఒకవేళ మీరు కనుక్కోలేకపోతే సరిగ్గా ఈ రోజు నుంచి ఒక నెల తర్వాత నేను మిమ్మల్ని కలుసుకుంటాను. అయితే నాక్కాబోయే భర్త ఇంత మాత్రం తెలివి లేనివాడే - ఇన్ని హింట్స్ ఇచ్చినా నన్ను కనుక్కోలేకపోయాడే అన్న విచారంతో మిమ్మల్ని ఆరోజు కలుసుకుంటాను సరేనా?''

రేవంత్ మొహం ఎర్రబడింది. ''ఎలాగైనా నెలలో మిమ్మల్ని పట్టుకోగలను'' అన్నాడు పట్టుదలగా.

''ఈ రోజు పదమూడోతారీఖు. వచ్చేనెల పదమూడో తారీఖు సాయంత్రం అయిదింటిలోపల మీరు నన్ను కనుక్కోలేకపోతే

ఓడిపోయినట్లే'' అంది. ఆమె పదమూడు అనగానే అందులో ఏదో అపశృతి ధ్వనించినట్లయింది అతడికి. అయినా ''సరే'' అన్నాడు.

''ఈ లోపులో మీరు నన్ను కనుక్కోలేకపోయినట్లయితే ఆ రోజు సరిగ్గా అయిదు గంటల ఒక్క నిముషానికి మా కారు మీ ఆఫీసుముందు నిలబడి ఉంటుంది. ఓడిపోయిన మిమ్మల్ని సాదరంగా మా ఇంటికి పెళ్ళిచూపులకి ఆహ్వానించటానికి... అప్పుడిక దాంతో సంతృప్తి పడాల్సిందే...''

రేవంత్ ఉక్రోషంతో ''సరే'' అన్నాడు. మనసులో 'నా చదరంగపు పరిజ్ఞానం అంతా ఉపయోగించైనా మిమ్మల్ని పట్టుకుంటాను' అనుకున్నాడు. పైకి ''.... మీరు మాత్రం నాకు అన్నీ సరి అయిన హింట్సే ఇవ్వాలి. తప్పుదారి పట్టించకూడదు'' అన్నాడు.

''అలా ఎప్పుడూ చెయ్యను. నా ఫియాన్సీ తెలివైనవాడన్న విషయం నిరూపణ అయితే నాకు మంచిదేగా! మళ్ళీ ఇంకోసారి చెట్టున్నా రేవంత్! మీతో దాగుడుమూత లాడాలని నా కెప్పుడూ లేదు. కేవలం మీ ఐ.క్యూ. కనుక్కోవటం కోసమే ఇదంతా... కావాలంటే మీకు ఒక మంచి హింట్ ఇస్తాను.''

''ఏమిటి?''

''నేను మీకో వాక్యం చెబ్తాను. అందులో మా ఇంటిఫోను నెంబరు నిబిడీకృతమై వుంది. మీరు ఆ వాక్యం ద్వారా మా ఫోను కనుక్కోటానికి నెలరోజులు టైముంది - ఇక మీదే ఆలస్యం.''

రేవంత్ ఆత్రంగా ''ఏమిటా వాక్యం'' అడిగాడు.

''I ATE NOTHING FOR SIX గంటలు.''

అతడికి అర్థంగాక ''ఏమిటీ?'' అన్నాడు. ఆమె తిరిగి చెప్పింది. అతడు కాగితంమీద ఆ వాక్యాన్ని వ్రాసుకుని దాన్నే చూడసాగేడు.

''ఏమిటాలోచిస్తున్నారు?''

''ఏం లేదు. ఈ సారి ఎలాగైనా మిమ్మల్ని పట్టుకుంటాను.''

''మీ గురించి ఇంకో విషయం చెప్పటం మర్చిపోయాను. మీరు ఎక్స్‌లెంట్ డ్రైవరు. మీకు ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్సు వుంది. అవునా?''

''అవును''

''బైట వర్షం కురుస్తూందా?''

రేవంత్ కిటికీలోంచి చూసి, ''లేదే'' అన్నాడు. ''ఇక్కడ కురుస్తూంది. మీరు క్లాక్‌టవర్ దగ్గరికి రండి. నేనూ అక్కడికి టాక్సీలో వస్తాను. మీరు వేగంగా వస్తే నన్ను చూడొచ్చు.''

రేవంత్ రక్తం వడివడిగా ప్రవహించసాగింది. అంతలోనే అనుమానం వచ్చి, ''మీరు అక్కడికి దగ్గర్లోనే వున్నారేమో! నేను వచ్చేసరికి వెళ్ళిపోతారేమో'' అన్నాడు.

''మీ డ్రైవింగ్ ప్రావీణ్యత అంతా చూపిస్తే అలా జరగదు. దూరం లెఖ్కకట్టే ఉంచాన్లెండి''

అతడు మరి ఆలస్యం చేయకుండా ఫోను పెట్టేసి గాలికన్నా వేగంగా మెట్లు దిగి కారువద్దకు వచ్చాడు. మరుక్షణం అది బయల్దేరింది.

ట్రాఫిక్ రూల్స్‌ని - జనాన్ని దేన్నీ పట్టించుకోవటం లేదు. అతడి నుదుటిమీద నుంచి చెమట ధారాపాతంగా కారుతూంది. గంటకి ఎనభై కిలోమీటర్లు స్పీడుతో డ్రైవ్ చేస్తున్నాడు. వాహనాల మధ్యనుంచే బాణంలా దూసుకుపోతున్నాడు.

సరిగ్గా ఎనిమిది నిమిషాల్లో అతడు క్లాక్‌టవర్ చేరుకున్నాడు.

అక్కడ టాక్సీ ఏదీలేదు.

అతడు తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు. ఇక ఆమె రావటమే తరువాయి... తన డ్రైవింగ్ గురించి తెలియక ఈ పందెం కట్టివుంటుంది.

అతడు రిలాక్స్‌డ్‌గా సీటు వెనక్కి వాలబోతూ వుంటే దూరంనించి టాక్సీ నెమ్మదిగా రావటం కనిపించింది. అతడు నిటారుగా అయి భరించలేని టెన్షన్‌తో - వస్తూన్న టాక్సీవైపు చూడసాగేడు.

టాక్సీ వచ్చి అతడి కారు ప్రక్కనే ఆగింది.

ఆగిన టాక్సీలోంచి డ్రైవర్ దిగుతున్నాడు. టాక్సీ ఖాళీగా వుండటం చూసి రేవంత్ హతాశుడయ్యాడు.

"సలాం సాబ్!" అన్నాడు డ్రైవర్.

ఆ అమ్మాయి ఏదైనా కబురు ఇచ్చి వుంటుందన్న ఆశతో రేవంత్ "ఏవోయ్! ఇప్పుడు నీ కారు ఎవరైనా ఎక్కారా?" అని అడిగాడు.

"ఓ అమ్మాయిగారు ఎక్కారు సార్! అదిగో ఆ టైప్ ఇన్‌స్టిట్యూట్‌లోకి వెళ్ళారు."

రేవంత్ చువ్వలా ఆ ఇనిస్టిట్యూట్‌లోకి పరుగెత్తాడు. లోపల నాలుగైదు మిషన్లున్నాయి. కానీ స్టూడెంట్సు ఎవరూలేరు. ప్రొప్రైటర్ మాత్రం సీరియస్‌గా ఏదో వ్రాసుకుంటున్నాడు.

రేవంత్ బైటకొచ్చేసరికి టాక్సీ వెళ్ళిపోతూంది.

ఇంతలో అలికిడికి యజమాని తలెత్తి చూశాడు.

రేవంత్ ఆత్రంగా ''ఇప్పుడెవరైనా అమ్మాయి లోపలికి వచ్చిందా సార్?'' అని అడిగాడు - కనీసం ఆమె రూపురేఖలైనా కనుక్కుందామని. రేవంత్ మాటలు అతడు విన్నట్టులేదు. తల పైకెత్తి శూన్యంలోకి చూస్తూ గంభీరంగా ''వచ్చేవాళ్ళకోసం - వెళ్ళేవాళ్ళ కోసం విప్లవం ఆగదు! అది నిరంతరం? ఇంక్విలాబ్ జిందాబాద్'' అని తిరిగి వ్రాసుకోవటం మొదలుపెట్టాడు.

రేవంత్ అదిరిపడ్డాడు. అనుమానం వచ్చి తరువాత తలవంచి చూశాడు. అతడు పదం క్రింద పదం వ్రాసుకుంటూ పోతున్నాడు. అది వచనగేయం అని అర్థమైంది. అతడిని ఎలా భావ ప్రపంచం నుంచి బైటకు తీసుకురావాలా అని ఆలోచించి రేవంత్ కూడా గంభీరంగా, ''నీ రక్తం ఎరుపు - నా రక్తం ఎరుపు.... ఎరుపూ ఎరుపూ కలిస్తే మెరుపు....'' అన్నాడు.

ఆ మాటలకి ఆ బట్టతలతను రేవంత్ వైపు ఓ క్షణం అయోమయంగా చూసి, ఎగిరి గంతేసినంత పనిచేశాడు. పెన్ను మూసి పక్కనబెడ్తూ ''చెప్పు బ్రదర్, నీకేం కావాలి?'' అని అడిగాడు. రేవంత్ 'అమ్మయ్య' అనుకుని ''ఇప్పుడొక అమ్మాయి మీ ఇన్‌స్టిట్యూట్‌లోనికి వచ్చి వెళ్ళింది సార్! ఆమె ఎలా వుంటుంది?'' అని అడిగాడు.

అతడి మొహం మారిపోయింది మళ్ళీ. ''.... అందానికి విలువలేదు కామ్రేడ్... శ్రామిక శక్తే చివరకు మిలిలేది'' అన్నాడు కటువుగా. అంతలో అతడి చూపు తళతళా మెరుస్తున్న రేవంత్ కారుమీద పడింది. ఆ కారును చూస్తూ -

''సమసమాజ సౌధానికి గొడ్డలి పెట్టయిన పెట్టుబడిదారీ విధానాన్ని పునాదుల్తో సహా పెకలించి, కార్మికవర్గపు సౌభాగ్యంకోసం దాన్ని వరుసలు తీసిన గోతుల్లో పాతిపెట్టి ఆ సమాధులమీద నవసమాజాన్ని నిర్మించాలి. పీడిత ప్రజల దాహానికి బూర్జువా రక్తపు ద్రాక్షాసారా నీరును కర్షకుల స్వేదంతో తడిసిన క్షేత్రంలో జల్లి - ఈ వేళ్ళు నాగళ్ళుగా దున్ని అన్నార్తుల ఆకలికి ఆశల ఆహారాన్ని పండించేరోజు తొందర్లోనే వస్తుంది కామ్రేడ్!'' అన్నాడు.

''అవును వస్తుంది'' అన్నాడు రేవంత్ పది లంఖణాలు చేసినవాడిలా.

''కార్లున్నవాళ్ళు కాలినడకన ప్రయాణంచేసే ఆ రోజు కోసం పదండి ముందుకు.''

రేవంత్‌కి లింకు దొరికినట్లయింది. ''నా కారుచూసి అనుమానపడకు కామ్రేడ్! మాది బెజవాడ. మా వూళ్ళో సమసమాజం కోరే చాలామందికి ఇలాంటి కొత్త కార్లున్నాయి'' అని అతడిని మెప్పించటంకోసం ''కారుకీ

కారుకీ మధ్య బేకారుగా తిరిగే సామాన్యుడా! నీకు జోహారు'' అన్నాడు - కీర్తికోసం పేదవాళ్ళని పొగిడే కవిలా! దాంతో అతడి మొహం విప్పారింది. ''చెప్పు బ్రదర్ - నీకేం కావాలి?'' అని అడిగాడు.

రేవంత్‌కి ఒక్కసారి సత్తువ వచ్చినట్లయి, ''ఒక అమ్మాయి ఇప్పుడు ఇక్కడికి వచ్చింది. ఎందుకొచ్చింది, వచ్చి ఎటువైపు వెళ్ళింది?'' అని అడిగేడు.

''అవును వచ్చింది, ఏం చెప్పకుండా గిర్రున తిరిగి వెళ్ళిపోయింది. ఎందుకొచ్చిందో తెలీదు.''

తనని ఫూల్ చెయ్యటానికే ఆమె అలా అక్కడకు వచ్చి వెళ్ళిపోయిందని రేవంత్‌కి అర్థమైంది. కనీసం ఆ టాక్సీవాడిని అడిగినా ఆమె ఎక్కడ ఎక్కిందో చెప్పేవాడు. ఇప్పుడు అంతా అయిపోయిన తరువాత లాభం ఏమిటనుకొని, ''మీరా అమ్మాయిని చూశారా?'' అని అడిగేడు.

''చూశాను''

రేవంత్ రక్తం వడివడిగా ప్రవహింపసాగింది. టేబిల్‌మీద చేతులు ఆన్చి ఆత్రంగా ముందుకు వంగి, ''ఆమె ఎలా వుంటుందో కాస్త వున్నదున్నట్లుగా వర్ణించు కామ్రేడ్!'' అన్నాడు.

అతడు మౌనం వహించి తన ప్రపంచంలోకి వెళ్ళిపోయి, కొంచెంసేపటికి ఉన్నట్లుండి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. రేవంత్ కంగారుపడ్డాడు. కానీ అంతలోనే సర్దుకొని, ‘‘ఆ రోజులు మళ్ళీ రావు’’ అన్నాడు.

‘‘ఏ రోజులు!’’

‘‘మా ఆవిడతో కలిసివున్న రోజులు’’

‘‘ఇప్పుడు లేదా ఆవిడ.’’

‘‘ఎదురింటి దర్జీవాడితో లేచిపోయింది. అప్పట్నుంచే నేను మార్క్సిజానికి అంకితమయ్యాను.’’

అప్పటివరకూ సామాజిక స్పృహ, ఆకలి ఈ రెండే విప్లవాన్ని సృష్టిస్తాయనుకున్నాడు రేవంత్. కాని సంసారం సుఖం లేకపోయినవారు కూడా మార్క్సిజం నీడలో ఆశ్రయం పొందుతారనుకోలేదు. ఓదార్పుగా ‘‘అంతకు ముందు ఏం చేసేవాడివి?’’ అని అడిగాడు.

‘‘వచనగేయాలు, భావకవిత్వం వ్రాసేవాడిని.’’

‘‘నీ భావకవిత్వపు ఊహకి ఇప్పుడొచ్చిన అమ్మాయి సరిపోలేదా కామ్రేడ్?’’ అంటూ సటైర్లోకి లాగడానికి ప్రయత్నించాడు రేవంత్.

అతడు గాఢంగా నిశ్వసించి ‘‘ఆ అమ్మాయిని చూశాకే నా పూర్వపు రోజులు గుర్తొచ్చినాయ్. నిజంగా ఆ అమ్మాయి... అవి కళ్ళు కావు, తామరాకు దొప్పలు! ఆ ముక్కు... ముక్కు’’ అంటూ తడుముకున్నాడు.

‘‘పోలిక కోసం ఆగకు కామ్రేడ్, అమ్మాయి ఎలా వుందో చెప్పు చాలు. అందంగా వుందా?’’

‘‘అందమే! అసలు, అందమే ఆమెని చూసి నేర్చుకోవాలి? ఆ ముక్కూ -’’

‘‘ముక్కు సంగతి వదిలిపెట్టు బ్రదర్... తెల్లగా వుందా?’’

‘‘తెలుపా? ఇదిగో ఈ మెల్లె... దీనికన్నా తెల్లగా వుంది.’’

నేలమీద పడిన మల్లెని చూడగానే రేవంత్ గుండె వడివడిగా కొట్టుకోవడం ప్రారంభించింది. దాన్ని జాగ్రత్తగా అందుకుని భద్రంగా దాచుకున్నాడు. ఆమె జడనుండి జారిన మల్లె.

అందుకుంటూ, ‘‘ఆ అమ్మాయి ఇంకా ఎలా వుంది?’’ అని అడిగాడు.

‘‘బంగారుబొమ్మ కామ్రేడ్! పోతే నా నోటినుంచి ‘బంగారం’ అన్న పదం వచ్చినందుకు క్షమించు. కానీ ఆ అమ్మాయిమాత్రం బంగారుబొమ్మే. బొమ్మలా వచ్చింది. మౌనంగా మెట్లుదిగి వెళ్ళిపోయింది. చంద్రబింబంలా

గుండ్రని మొహం, పోకచెక్కలా చిన్న నోరు, అన్నిటికన్నా ముఖ్యంగా ఆ ముక్కూ.... ముక్కూ!''

రేవంత్ ఏడుపు మొహం పెట్టి ''ఆ ముక్కు సంగతి వదిలిపెట్టు బ్రదర్! ఇంకో విషయం చెప్పు'' అన్నాడు.

''ఇంకో విషయమా! అయితే విప్లవం'' అంటూ అతడు ప్రారంభించేసరికి 'బాబో' అంటూ రేవంత్ బైటకొచ్చేశాడు. ఇక అతడి దగ్గర వివరాలు రాబట్టటం తివిరి ఇసుమున తైలము తీయటమే అనుకుని.

రేవంత్ కారు స్టార్ట్‌చేసి కొద్దిగా ముందుకు పోనిచ్చాడో లేదో వెనుకనుంచి ''ఆగు కామ్రేడ్! ఒక ముఖ్య విషయం గుర్తొచ్చింది'' అని వినిపించింది. రేవంత్ చటుక్కున బ్రేక్ వేసి ఆత్రంగా వెనుతిరిగి విండోలోంచి చూశాడు.

అతడు పరుగెత్తుకుంటూ దగ్గరకొచ్చి రొప్పుతూ అన్నాడు. ''కామ్రేడ్.... ఆ పోలిక ఏమిటి అని కొట్టుక చస్తున్నాను.... గుర్తొచ్చింది.... ముక్కు సంపెంగ.''

6

ఆరోజు బోర్డు చాలా బిజీగా వుంది. కారణం తెలీదు. కారణం లేకుండగనే ఒక్కోరోజు ఎందుకో పని ఎక్కువ అవుతూ వుంటుంది. దానికి

తోడు ఆ రోజు ఎలక్షన్ రిజల్ట్స్ వచ్చినయ్. ఎంతోమంది ఆపరేటర్లు స్పెషల్ సర్వీస్ ఫోన్‌లలో బోర్డుమీద వ్రాయబడివున్న ఎన్నికల వివరాల్ని విసుగూ, విరామం లేకుండా చెపుతూ వున్నారు - 176లో.

సులోచన ఆ రోజు లోకల్ అసిస్టెన్స్‌లో వుంది.

ఆమె మూడ్ ఆరోజు ఎందుకో బావోలేదు. పొద్దున్నించీ చిరాగ్గానే వుంది. ఎవరో ఫోన్ చేసి నెంబర్ ఇమ్మన్నారు. ప్రయత్నించి అది ఎంగేజ్డ్ రావడంతో ''నెంబర్ బిజీ సార్'' అంది. కొంచెం సేపయ్యాక మళ్ళీ అదే నెంబర్ ఆమెకి లాండ్ అయింది. రెండోసారి ప్రయత్నంచేసి విఫలమై ''నెంబర్ ఫాల్టీ అనుకుంటాన్సార్!'' అంటూ డాకెట్ ప్రిపేరు చేయటానికి ఆయత్తమవబోతూ వుంటే అవతల్నుంచి ''అనుకుంటానేమిటి? సరిగ్గా చెప్పలేవా?'' అని కటువుగా వినిపించింది. ఆమె వస్తూన్న కోపాన్ని దిగమింగుకొంది.

ఎక్ఛేంజిలో అమ్మాయిలు నేర్చుకునే మొదటిపాఠం ఓర్పు కోల్పోకుండా ఉండటం! ''సబ్‌స్క్రైబర్ మన యజమాని'' అన్న ధోరణిలో మాట్లాడాలనీ, అవతలి వ్యక్తి నోరు జారినా మనం సహనంతో నవ్వుతూ జవాబు ఇవ్వాలనీ ట్రైనింగులో చెప్పబడ్తుంది.

''గొప్పవాడు కానీ - సామాన్యుడు గానీ
ఎవరైనా అతను మన కష్టమరు.
ఎంతో ముఖ్యమైన విషయాన్ని
అవతలి వ్యక్తికి ఫోన్లో చెప్పాలని
ప్రయత్నించీ ప్రయత్నించీ
విఫలుడై మన సాయం కోరుతున్నాడు
ఆ విషయం ఆనందం కావొచ్చు
విషాదం కావొచ్చు
కోపం - విచారం - నిస్పృహ
ఆశ - నిరాశ ఏదైనా కావొచ్చు
ఇరిటేషన్ - ఫ్రస్ట్రేషన్
కలిసిన డెస్పిరేషన్లలో
మనకు జీతమిస్తున్న యజమాని
వున్నప్పుడు
మర్యాదగా చిరునవ్వు కలగలిపి
జవాబు ఇవ్వటం మన విధి''
అని ఒక ఆపరేటరు గేయం కూడా వ్రాసుకుంది.

సులోచన అదే ఓర్పుతో ''నెంబర్ ఫాల్టీయే సార్! రిపోర్టు చేస్తాను'' అన్నది.

''మరి ముందు ఎంగేజ్డ్ అని ఎందుకన్నావ్?''

''అపుడు ఎంగేజ్డ్ టోన్ వచ్చింది''

''అందుకని రెండుసార్లు ఫోన్ చెయ్యాలన్నమాట. పనీపాట లేనివాళ్ళందరూ అక్కడ చేరేది పని చెయ్యటానికేనా?''

సులోచన ఎర్రబడ్డ మొహంతో ''మర్యాదగా మాట్లాడండి'' అంది.

''ఫోన్‌లలో.... వాళ్ళతో మర్యాదేమిటి'' అన్నాడు ఓ బూతుమాట ఉపయోగిస్తూ.

అతడామాట అనేసరికి ఆమె ఇక ఆవేశం పట్టలేక, ''యు సన్నాఫె బిచ్! షటప్'' అని అరిచింది, ఇరుపక్కలా ఉన్న ఆపరేటర్లూ, గదిలో వున్న మిగతా జనం అంతా పని ఆపేసి ఒకసారిగా ఆమెవైపు తిరిగారు. ఎప్పుడూ నిగ్రహంగా వుండే ఆమె మొహం ఆ క్షణం జేగురు రంగుకి తిరిగి వుంది. ఆవేశంలో ఆమె వణికిపోతూ వుంది. దుఃఖం ఏ క్షణాన్నైనా చెలియకట్ట దాటటానికి సిద్ధంగా వుంది.

సూపర్‌వైజర్ దగ్గర కొచ్చింది. ఆమె అనుభవం వున్నావిడ. ఏం జరిగిందని ఎవరూ అడగలేదు. అందరికీ తెలుసు, తోటి ఆపరేటర్ మొహం అలా మారిందీ అంటే దానికి కారణం. సూపర్‌వైజర్ భుజం తట్టింది. సులోచన అతికష్టం మీద గుటకవేసి తనను తాను నిభాయించుకుంది.

మళ్ళీ ఎవరి పనిలో వాళ్ళు మునిగిపోయాక ఆమె చెయ్యి కూడా యాంత్రికంగా పనిచెయ్యసాగింది.

‘‘అసిస్టెన్స్ సర్ - నెంబర్ బిజీ సర్ - నో రిప్లయ్ సర్ - లైన్ అవుట్ ఆఫ్ ఆర్డర్ సర్ -’’

జీవితమే అవుట్ ఆఫ్ ఆర్డర్ .... మేడమ్.

* * * * *

సరిగ్గా ఆ సమయానికి.

అప్పటికి కరెంట్ పోయి పది నిమిషాలైంది. జేమ్స్ ఫోన్‌తో కుస్తీ పడుతున్నాడు.

‘‘హలో ఆపరేటర్ గారా... చూడండీ, నేను సీతారామపురంలో వుంటున్నాను. మా ఇంట్లో కరెంటు పోయింది, ఏమిటీ.... మీది ట్రంక్ అసిస్టెన్సా? డైరెక్టరీ ఎంక్వయిరీకి చెయ్యాలా? ఆ నెంబరెంతండీ?’’

అట్నుంచి ‘‘డైరెక్టరీ చూడండి.’’ అంది ఆపరేటర్.

‘‘ఇక్కడేమీ కనబడిచావట్లేదండి. అబ్బెబ్బె మిమ్మల్ని చావమని కాదండి. ఇక్కడ కరెంట్ లేదు.’’

‘‘ .....’’

‘‘మీమీద కంప్లెయింట్ చేస్తాను .... ఏమిటీ చేసుకోమంటారా .... నెంబర్ కూడా చెప్తారా. ఆ నెంబర్ చెప్పేబదులు ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్ నెంబరే చెప్పొచ్చు కదండీ.’’

అటువైపు ఫోన్ కట్టయింది.

జేమ్స్ డైరెక్టరీలో 'కంప్లయింట్స్' అని వున్న దాన్ని వెతికి పట్టుకొని 198కి చేసేడు. వాళ్ళు "ఫోనులు" పాడయిన కంప్లెయింట్స్ మాత్రమే తీసుకుంటామన్నారు.

ఇక సామ దాన భేద దండోపాయాల్లో మొదటిదే మంచిదనుకొని అసిస్టెన్సుకి ఫోన్ చేసి కంఠం తీయగా మార్చుకొని, "హలో చూడండీ, మాది సీతారామపురం. మా ఇంట్లో కరెంట్ పోయింది" అన్నాడు.

"అయ్యో! అలాగా ఎప్పుడండీ" అంటూ కుశలం అడిగాడు ఆపరేటర్. వీడెవడో ఇంతసేపటికి మంచివాడు దొరికాడనుకొని "ఓ పది నిముషాలవుతుంది" అన్నాడు.

"మీ ఇంట్లోనే పోయిందా? వీధి అంతా పోయిందా?" ఆ వీధి తాలూకు ఎమ్మెల్యేలా యోగక్షేమం కనుక్కున్నాడు.

"ఒక్క మా ఇంట్లోనే పోయింది."

"సీతారామపురం కరెంటు ఆఫీసు నెంబరు కావాలా మీకు?"

"అవునండీ!"

"197 డైరెక్టరీకి ఎంక్వయిరీ చేసి అడగండి" అని ఓ సలహా పారేసి ఫోను పెట్టేసాడు. అవతలివైపు ఎదురుగా వుంటే లాగి తందామన్నంత కోపం వచ్చింది జేమ్స్‌కి. బూతులు తిట్టుకుంటూ 197కి చేసేడు.

టెలిఫోను డిపార్టుమెంటులో పనిచేసేవాళ్ళు మాటల అతివృష్టి అనావృష్టితో బాధపడుతూ వుంటారు కాబోలు.

''హల్లో, నాకు సీతారామపురం సబ్‌స్టేషన్ నెంబర్ ఇస్తారా?'' అని 197 ఆపరేటర్‌ని అడిగాడు చిరాగ్గా.

''ఒక్క నిముషం సార్'' అంటూ ఆపరేటర్ వెతికి మర్యాద నిండిన కంఠంతో ఆ నెంబర్ చెప్పింది. మనసులోనే ఆమెని మెచ్చుకుంటూ ఆ నెంబర్‌కి చేసేడు.

''హల్లో సీతారామపురం సబ్‌స్టేషన్?''

''ఆ గదే'' అని అవతల్నుంచి విన్పించింది.

''చూడండి, మా ఇంట్లో కరెంటు పోయింది. ఇంటి నెంబరూ'' అని చెప్పబోతూ వుంటే.

''అయ్యలేడు. ఇంటికి బోయిండు'' అన్నాడు.

''ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్ వాళ్ళు రాత్రిపూట ఆఫీసుల్లో వుండకుండా ఇళ్ళకు పోతే ఫ్యూజ్ ఎవరేస్తారు?''

''ఏమో నాకు దెల్వదు ఆల్లనే అడగాల''

''మరి నువ్వెవరివి?''

''సీతారామపురం వాటర్ వర్క్స్‌స్టేషన్‌లో ఫ్యూన్‌ని.''

ఒక ఫైరింజన్ నిండా పెట్రోలు తీసికెళ్ళి టెలిఫోను ఎక్చేంజి కాల్చేద్దామన్నంత కోపం వచ్చింది. ఈసారి 199కి ఫోన్ చేశాడు.

నిముషం గడిచింది.

రెండు నిముషాలైంది. ఫోను మోగుతుంది కానీ ఎంతసేపటికి అటువైపు నుంచి ఎవరూ ఎత్తలేదు.

అతడు రిసీవర్ విసిరికొట్టబోతూంటే ఆపరేటర్ లైనులోకి వచ్చి ''హల్లో'' అంది. ఫోన్‌లో ఇతరుల సంభాషణలు వినబడ్తున్నాయి.

జేమ్స్ గొంతు పగిలిపోయేలా ''అయిదు నిముషాల్నుంచీ రింగవుతున్నా ఒకరూ ఎత్తరేం? చచ్చారా మీరందరూ'' అని అరిచాడు.

''మాకేం వెయ్యిచేతులు లేవు. ఒక్కసారి ఇక్కడకొచ్చి చూడండి, ఎలా పనిచేస్తున్నామో'' అని అంత విసురుగానూ వినిపించింది.

జేమ్స్ గతుక్కుమన్నాడు. టెలీఫోనువాళ్ళు అలా విసుక్కోవటం కొత్త.

అతడి కంఠంలో సంస్కారం వుంది. మంచి ఇంగ్లీషులో సంస్కారయుతంగా సభ్యతగా మాట్లాడే అబ్బాయిలంటే ఆపరేటర్లకి ఇష్టమే. అందువల్ల అతడికి ఇప్పటివరకూ ఈ అనుభవం కాలేదు. అయినా అతడు

గతుక్కుమనటానికి కారణం అవతల్నుంచి వినబడిన కంఠంలో విసుగుగాదు... ఆ కంఠం.

అది అతనికి తెలుసు.

''హల్లో మీరా'' అన్నాడు.

''నేనూ! మొన్న మీకు మాలిషస్‌కాల్ కోసం ఫోను అబ్జర్వేషన్‌లో ఎలా పెట్టాలీ అని అడిగి వివరాలు సంపాదించినవాణ్ణి.''

సులోచన ఆశ్చర్యపోయి ''నేనే అప్పుడు మీకు ఆ వివరాలు అన్నీ చెప్పింది అని ఎలా గుర్తుపట్టారు?'' అని అడిగింది.

''ఫ్రీక్వెన్సీని బట్టి కంఠం గుర్తుపట్టటం నాకు తెలుసు''

''చాలా గొప్ప ఆర్టు అది.''

''థాంక్యూ, మీ పేరు?''

''సులోచన'' అంటూ డిస్‌కనెక్ట్ చేసింది. అంతకుముందు జరిగిన సంభాషణ ప్రభావం నుంచి ఆమె సర్దుకుంది. నిజానికి అవి కొత్తకాదు. కొత్తలో చాలా బాధగా వుండేది. అనుభవం రాటు దేల్చింది.

ఆమె మరో అరగంట పనిచేసి డ్యూటీ పూర్తి చేసింది. రిలీవర్‌కి బోర్డు అప్పజెప్పి బైటకొచ్చి లాకర్‌లోంచి పుస్తకాలు తీసుకుని లిఫ్టువైపు నడవబోతుంటే ''ఎక్స్‌క్యూజ్‌మి'' అని వినబడింది.

ఆమె తలతిప్పి చూస్తే ముప్పైఏళ్ళ యువకుడు అటు వస్తూ ‘‘సులోచనగారూ’’ అన్నాడు సందిగ్ధంగా.

‘‘నేనే’’

‘‘గుడ్ ఈవెనింగ్, నా పేరు జేమ్స్! రమ్మన్నారుగా వచ్చేసాను.’’

ఆమెకి అర్థం కాలేదు. అతడివైపు అయోమయంగా చూసింది. ‘‘మాకేం వెయ్యి చేతులు లేవు. ఒక్కసారి ఇక్కడికొచ్చి చూడండి ఎలా పనిచేస్తున్నామో’’ అన్నాడు ఆమె కంఠాన్ని అనుకరిస్తూ - ఆమెకి నవ్వొచ్చింది.

‘‘మీరా’’ అన్నది.

* * * * *

‘‘మీరాపక్కనే వుండి నన్నంతదూరం రప్పించటంలో వుద్దేశ్యమేమిటి? నేనెంత వేగంగా డ్రయివ్ చేసుకుంటూ వచ్చానో తెలుసా? అంత వేగంగా వచ్చినా మీరు కనబడలేదంటే ఇది కేవలం నన్ను ఫూల్‌ని చేయటానికే... ఇలా అయితే నేను కాదు కదా, మిమ్మల్ని బ్రహ్మదేవుడు కూడా పట్టుకోలేడు. దయచేసి నా సమయం వృధా పర్చకండి’’ కోపంగా అన్నాడు రేవంత్.

''నేను చెప్పానుగా, మీతో దాగుడుమూతలు ఆడటం నా ఆశయం కాదని, మీకు రీజనబుల్‌గా హింట్స్ ఇస్తూనే వచ్చాను. కనుక్కోలేకపోతే అది నా తప్పు కాదు.''

''ఏమిటిచ్చారు? మీ ఇల్లు ఆ క్లాక్‌టవర్ దగ్గర్లోనే. నేను ఇంత దూరం నుంచి వచ్చేసరికి మీరు వెళ్ళిపోయారు. ఇదేం పందెం.''

''నేనెక్కిన టాక్సీవాడిని మీ దగ్గిరికి వెళ్ళమని చెప్పాను. వాణ్ణి మీరు 'ఎందుకు' అడగలేదు - ఆ అమ్మాయి ఎక్కడ ఎక్కిందిరా అని అడిగివుంటే వాడు నేను వుండే లొకాలిటీ చెప్పి వుండేవాడు. అంతకుముందే మా ఇంటి ఫోన్ నెంబరు తాలూకు హింట్ ఇచ్చి వున్నాన్నేను. ఆ రెండూ కలిపి అన్వయించుకుంటే మీకు నెంబరు పూర్తిగా అర్థమయివుండేది.''

రేవంత్ దెబ్బతిన్నాడు. అయినా సర్దుకొని తనని తను సమర్థించుకొంటూ ''ఏమో, టాక్సీడ్రయివర్‌కి మీరు అబద్ధం చెప్పమన్నారేమో'' అన్నాడు.

''అది వేరే సంగతి కానీ మీరు అసలు అతడినేమీ అడగలేదుగా.''

''మీరు టైపు ఇన్‌స్టిట్యూట్‌లో వున్నారనే అక్కడికి పరుగెత్తాను.''

''అది తొందరపాటు. ఒకవేళ టైప్ ఇన్‌స్టిట్యూట్‌లోనే నేను వుండివుంటే అక్కణ్ణుంచి పారిపోనుగా. ముందు దొరికిన డ్రయివర్‌ని వదిలిపెట్టి 'టూ ఇన్ ది బుష్' కోసం అక్కడికి ఎందుకు వెళ్ళారు?''

''డ్రయివర్‌ని అసలు మీరు ఒక్క ప్రశ్న కూడా అడిగే అవసరం లేదు. మీరు బయలుదేరేముందు ఒక్క ప్రశ్న అడిగాను జ్ఞాపకం వుండా? 'అక్కడ వర్షం పడుతుందా' అని. లేదన్నారు. మీరు పరిశీలనగా నేనొచ్చిన టాక్సీని చూసివుంటే అది వర్షంలో తడిసి వుండటం కనిపించి వుండేది. ఆ చిన్నజల్లు ఈ లోకాలిటీలో ఎక్కడ పడిందో కనుక్కోవటం మీకు పెద్ద కష్టం కాకపోయి వుండేది. దాంతో ఆ డ్రయివర్ నిజం చెబుతున్నాడో, అబద్ధం చెబుతున్నాడో తెలుసుకోవడం సులభమయ్యేది. ఇలా ఆలోచించడం మానేసి అనవసరంగా టైప్ ఇన్‌స్టిట్యూట్‌లోకి... పరుగెత్తారు.''

అతడు సిగ్గుపడుతున్నట్టు ''నేనంత లోతుగా ఆలోచించలేదు'' అన్నాడు నిజాయితీగా ఓటమి ఒప్పుకుంటూ.

''పోన్లెండి. ఇంకా ఇరవై ఆరురోజులు ఉన్నాయిగా. ఆఖరికి చివరి రోజు కనుక్కున్నా మీరు గెల్చినట్టే.''

''చెప్పటం మర్చిపోయాను. మీ గురించి టైప్ ఇన్‌స్టిట్యూట్ యజమాని వర్ణించాడు.''

చిన్న నవ్వు ''..... ఏమని?''

''దేవకన్యకి తక్కువ లెవెల్‌లో లేదు ఆ వర్ణన''

ఆమె కొంచెంసేపు మౌనం వహించి నెమ్మదైన కంఠంతో అన్నది, ''నేను మిమ్మల్ని డిస్సప్పాయింట్ చెయ్యనని అనుకుంటున్నాను రేవంత్ బాబూ!''

''నాకు మిమ్మల్ని వెంటనే చూడాలని వుంది.''

''ఇంకా ఇరవై ఆరురోజులు ఆగాలి. ఈ లోపులో మీరు కనుక్కుంటే సరేసరి. అన్నట్టు మర్చిపోయాను. మీకు ఉత్తరాలు రాస్తానన్నాగా. ఈరోజే ఒక ఉత్తరం వ్రాసి పోస్టు చేసేను. వారానికో ఉత్తరం చొప్పున ఇంకా మూడు ఉత్తరాలు....''

''ఈ లోపులో నేను కనుక్కోలేకపోతే''

''కనుక్కోగలరనే ఆశిద్దాం''

రేవంత్ పట్టుదలగా ''నాకున్న తెలివితేటల్ని ఉపయోగించి మిమ్మల్ని కనుక్కుంటాను. ఓడిపోతే అది వేరే సంగతి'' అన్నాడు.

ఆమె నవ్వింది.

''ఈ ప్రపంచంలో తెలివితేటలున్న వాళ్ళు చాలామంది ఉన్నారు. కానీ తెలివితేటల్తోపాటు సమయస్ఫూర్తి - తార్కిక జ్ఞానం వున్నవాళ్ళు చాలా తక్కువ. అమ్మాయిలు కోరుకునేది ఆ రెండోది వున్న

బోయ్‌ఫ్రెండ్స్‌ని! తలతిక్కగా ఆలోచించే అబ్బాయిలంటే అమ్మాయిల కెంతో ఇష్టం. ఈ విషయం చాలామంది అబ్బాయిలకి తెలీదు.''

''ఉహు, నా కర్థం కాలే'' దన్నాడు రేవంత్.

''ఉదాహరణకి ఒక ఇంటి కప్పుమీద పది కాకులు కూర్చొని ఉన్నాయి. ఒకడు తుపాకి పేల్చి ఒకదాన్ని చంపేడు. ఎన్ని కాకులుంటాయి కప్పుమీద''

''ఏమీ వుండవ్. ఎగిరిపోతాయ్'' అన్నాడు రేవంత్ చప్పున.

''అది మామూలు వాళ్ళు చెప్పేది''

''ఒకటి వుంటుంది చచ్చిపడిన కాకి''

''అది కొద్దిగా తెలివైనవాడు చెప్పేది!''

''తొమ్మిది వుంటాయి.... తుపాకీ దూరం నుంచి కాల్చి ఆ శబ్దం మిగతా వాటికి వినబడకపోతే....''

''అది అతితెలివివున్నవాడు చెప్పేది''

రేవంత్ రోషంతో - ''ఇంకేమిటి ఆన్సరు'' అని అడిగాడు.

''ప్రశ్నకి సమాధానం చెప్పేముందు కొంచెం తార్కికంగా ఆలోచిస్తే మీకో విషయం బోధపడుతుంది. ప్రశ్న.... కాకులు ఎన్ని మిగిలివుంటాయి అని కాదు - కప్పుమీద ఎన్ని వుంటాయి అని. అంటే మనం తిరిగి

అడగాలి కప్పు వాలుగా ఉందా? లేక ఫ్లాటుగా ఉందా అని. ఇంటికప్పు ఫ్లాట్‌గా వున్న పక్షంలో - తుపాకి దూరం నించి కాల్చి వుంటే పది కాకులూ (చచ్చిన కాకితో సహా) కప్పుమీదే ఉండే వీలుంది.... తెలివయిన కుర్రవాడు తన ఆలోచనలలో ఏ విధమైన లొసుగూ ఉంచుకోడు. రేవంత్ మీరీ పంథాలో ఆలోచిస్తే నెలరోజులక్కర్లేదు - పదిరోజుల్లో నన్ను కనుక్కుంటారు!''

రేవంత్ అప్రతిభుడయ్యాడు ''మీరేం చదువుకున్నారు?''

నవ్వింది, ''ఏం చదువుకున్నానునుకున్నారు?''

''ముందు లెక్కలు అనుకున్నాను. తరువాత ఇంగ్లీషు అనుకున్నాను. ఇప్పుడేమో లాజిక్ అనుకున్నాను.''

''ఊహూ ఇవేమీ కావు. మీరు యూనివర్సిటీకి ఫోనుచేసి కనుక్కోనంటే చెబ్తా.''

''కనుక్కోను చెప్పండి.''

''ఫిలాసఫీ! మీరు చెప్పిన ఆ సబ్జెక్ట్స్ అన్నీ అందులోంచి వచ్చినవే...''

'నిజమే' అనుకున్నాడు.

''మరి నేను పెట్టేస్తున్నాను. రేపు మీకు ఉత్తరం అందుతుంది. బై''

''ఒక్క నిముషం'' కంగారుగా అన్నాడు ''మీ నెంబరు గురించి ఇంకో హింట్ ఏదైనా ఇవ్వండి... ప్లీజ్''

''ఏ నెంబరు? మా ఇంటి నెంబరా?''

''మీరు 'ఐ ఏట్ నథింగ్' అన్నారే - దాని గురించి.... ఆ నెంబరు.''

''సరే అయితే - వ్రాసుకోకుండా వినండి'' అని చెప్పసాగింది.

''అయిదంకెల సంఖ్య. మొత్తం అంకెలన్నీ కలిపితే పంతొమ్మిది. మొదటి అంకెకి రెండోది ఎనిమిది రెట్లెక్కువ. చివరి మూడంకెలూ ఒకదాన్నొకటి గుణిస్తే 24 గాని సున్నా గానీ వస్తుంది. నాలుగో అంకె మూడో అంకె కలిపి, అయిదు అంకెలలోంచి తీసేస్తే రెండు'' అని ఫోన్ డిస్‌కనెక్ట్ చేసింది.

ఆమె ఫోను పెట్టెయ్యగానే రేవంత్ మరి ఆలస్యం చేయకుండా తిరిగి వెంటనే ఫోన్ డయల్ చేశాడు.

ఆమె ముందు అతడు కొద్దిగా దెబ్బతింటున్నాడు గానీ అతడి లెక్కల పరిజ్ఞానం సామాన్యమైనదేమీ కాదు. ఆమె ప్రశ్న చెబుతూవుండగానే అతడు లెక్కకట్టసాగేడు.

మొదటి అంకెకి రెండో అంకెకి ఎనిమిదిరెట్లు అనగానే అవి 1, 8 అని తెలిసిపోయింది. చివరి మూడంకెల మొత్తము పది. వాటి లబ్ధము

ఇరవైనాలుగూ అనగానే అవి 6,4,0 గానీ 6,2,2 గాని అయివుండాలని అర్థమయింది. ఆఖరి సంఖ్య అన్నిటికన్నా పెద్దది కాబట్టి తేడా రెండు కాబట్టి, ఆ నెంబరు -

18226 - 18406 - 18046.

ఈ మూడింటిలో ఏదో ఒకటి అవ్వాలని నిశ్చయమైపోయింది. ఫోను దగ్గిరికి లాక్కొని ముందు మొదట నెంబరుకి చేసేడు.

''హల్లో'' అన్నాడు అవతల్నుంచి.

''ఇప్పుడో అమ్మాయి అక్కణ్ణించి ఫోను చేసింది.''

''అమ్మాయా - అసాధ్యం. ఎవరో ఆడగొంతుతో చేసివుంటారు'' అంటూ నవ్వాడు అవతలి వ్యక్తి. రేవంత్ కోపం దిగమింగుకుంటూ ''అంత నిశ్చయంగా ఎలా చెప్పగలరు?'' అని అడిగాడు.

''ఇది పిచ్చాసుపత్రి కాబట్టి....'' అంటూ ఫోను డిస్‌కనెక్ట్ చేసేడు అవతలి మనిషి.

రేవంత్ తనని తిట్టుకుంటూ రెండో నెంబర్‌కి చేసేడు.

''దిసీజ్ కేన్సర్ హాస్పిటల్ ప్లీజ్'' అంటూ ఓ ఆడగొంతు తీయగా పలికింది. టాప్‌మని పెట్టేసి మూడో నెంబర్‌కి చేసేడు.

ముందో పెద్ద దగ్గు ''హల్లో... వ్... టి.బి. హాస్పిటల్''

రేవంత్ చేతిలోంచి రిసీవర్ జారిపోయింది.

ఒక్క క్షణం ఆలోచించాడు. ఆమె మాటలు జ్ఞాపకం వచ్చాయి...

"తెలివైనవాళ్ళు ఏ విధమయిన రిస్కూ తీసుకోరు... తార్కికంగా ఆలోచిస్తారు."

వెంటనే టెలిఫోన్ డైరెక్టరీ తీసుకుని,

ఆ మూడు ఆస్పత్రుల నెంబర్‌లూ చూసేడు. ఆ అమ్మాయి టెలీఫోను దగ్గిరే వుండి తనకి 'పిచ్చాసుపత్రి' అని చెప్పిందేమోనని. మూడు ఆస్పత్రుల నెంబర్‌లూ వరుసగా 18226, 18406, 18046 వే.

... అంటే తనే నెంబరు తప్పుగా లెక్ఖ కట్టాడన్నమాట!

ఇంకేదో నెంబరు వుండాలి.

... రేవంత్ కాగితమూ, కలమూ తీసుకుని పజిల్ సాల్వ్ చేయబోతూవుంటే సీతారాం వచ్చాడు. సీతారాంకి నలభై ఏళ్ళుంటాయి. మనిషిలో సినిజం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. పేరా సైకాలజీ బాగా చదివానని చెప్పుకుంటూ తిరుగుతూ వుంటాడు, నుదుటబొట్టు, మొహంమీద వెకిలి నవ్వు ఆభరణాలు.

"మిమ్మల్ని ఒకసాయం కోరదామని వచ్చాను సార్!" అన్నాడు రాగానే.

''ఏమిటి?'' అన్నాడు రేవంత్ తొందరగా అతడిని వదిలించుకునే ఉద్దేశ్యంతో.

''మీరు వ్రాసిన పుస్తకం - మీరేమీ అనుకోకపోతే నాకు అంకితం ఇవ్వాలి''

రేవంత్‌కి ఒకక్షణం అర్థంకాలేదు. అతడు చెబ్తున్నది అర్థమయ్యాక మరింత అసహ్యమేసింది.

రేవంత్ తన అనుభవాలు, తనకు తెలిసిన విషయాలు క్రోడీకరించి 'చదరంగం ఆడటం ఎలా?' అని ఒక పుస్తకం ఇంగ్లీషులో వ్రాశాడు. ఒక ప్రముఖ సంస్థ దాన్ని ప్రచురిస్తూంది. ఇప్పుడు సీతారాం దాన్ని తనకి అంకితం ఇమ్మని అడగటానికి వచ్చాడు.

రేవంత్ అతి కష్టంమీద తనని తను కంట్రోల్ చేసుకుని ''చూడు సీతారాం! అంకితం అనేది ఇష్టమైన వ్యక్తులికి ఆప్యాయంగా ఇచ్చేది. అంతేకానీ అడిగి పుచ్చుకునేది కాదు. నాకు మరింత కోపమూ, అసహ్యమూ పుట్టి తిట్టకముందే ఇక్కణ్ణుంచి వెళ్ళు'' అన్నాడు.

''మీరు నలుగురుకీ తెలిసినవాళ్ళు - మీలాంటివాళ్ళు కాస్త నాగురించి వ్రాస్తే నాకూ గుర్తింపు వస్తుంది'' బీదగా నవ్వుతూ అన్నాడు. సీతారాం చిన్న చిన్న ఆర్టికిల్స్ వ్రాస్తూ వుంటాడు. కీర్తి కాంక్ష ఎక్కువ.

రేవంత్ ఓర్పుతో, ''చేతిలో కళ అంటూ వుంటే గుర్తింపు ఎప్పటికైనా వస్తుంది. అంతేకానీ ఇలా అంకితాలు 'అడిగి' తీసుకోవటం వల్ల రాదు. ఇక వెళ్ళు'' అన్నాడు.

అతడు కదల్లేదు, జేబులోంచి వంద రూపాయలు తీసి బల్లమీద పెడుతూ ''ఇది వుంచండి'' అన్నాడు. ఆ మరుక్షణం అతడు గాలిలోకి లేచాడు. కాలర్ పట్టుకుని అతడిని గాలిలోకి లేపుతూ ''రాస్కెల్ - నిన్ను - నిన్నూ'' అంటూ ''వెళ్ళు, ఇంకెప్పుడూ ఇలా చెయ్యకు -'' అని వంద రూపాయలనోటు అతడి జేబులో తిరిగి కుక్కి, ''ఇది ఒకరోజు నా లంచ్ ఖర్చు. మైండిట్! నౌ గెటౌట్....'' అరిచాడు.

సీతారాం బాధపడలేదు. అదే సెల్ఫ్‌పిటీ నవ్వుతో, ''క్షమించండి సార్!'' అన్నాడు.

''గెటౌట్'' ఉచ్చస్వరంతో అన్నాడు రేవంత్. అతడు వెళ్ళిపోయాక ప్యూన్‌ని పిలిచి, ''మళ్ళీ వీడు ఈ ఛాయలకొస్తే లోపలికి రానివ్వక'' అని చెప్పాడు.

దాదాపు మెడ పట్టుకుని బైటకి గెంటబడ్డ సీతారాం మొహం ఆగదిలోంచి బైటపడేవరకు ఆ జాలి నవ్వుతోనే నిండివుంది. గడప దాటగానే నవ్వు మాయమై వికృతంగా మారింది. ఒకసారి తల తిప్పి రేవంత్ గదివైపు చూశాడు.

తల పంకించి బైటకు వెళ్ళిపోయాడు.

* * * * *

''ఆ మాట పట్టుకుని ఇంతదూరం వచ్చారా'' అంది సులోచన.

''కాదనుకోండి మాలిషస్ కాల్ గురించి సాయం చేసినప్పుడే మీకంఠం నచ్చింది. అప్పుడే ఎక్సేంజి చూడటానికి వస్తానండీ అని అడుగుదామనుకున్నాను. కానీ బాగోదని వూరుకున్నాను. రెండోసారి ఈ రోజు కూడా మీరే ఫోన్‌లో తటస్థపడటంతో - ఇది యాదృచ్ఛికంకాదని దేముడే మనం కలుసుకోవటానికి ఇష్టపడుతున్నాడని అనుకొని పేరు అడిగాను. మీరు చెప్పేశారు, నేను వచ్చేశాను'' అన్నాడు జేమ్స్ - అదేదో సర్వసామాన్యమైన విషయంలా.

ఈ మాటలకి ఆమె అతడి మొహంలోకి చూసింది. అతడి మొహం భావరహితంగా వుంది.

''మా సూపర్‌వైజర్ ఏమన్నా అంటుందో ఏమో!''

''పర్లేదులెండి, వెళ్ళిపోదాం'' అన్నాడు. నిజానికి అతడికి ఎక్సేంజి చూడాలన్న ఆశ ఏమీలేదు, ఆమెని చూడాలనే తప్ప.

ఆమె ఒక క్షణం తటపటాయించి ''కొంచెం ఆగండి'' అని లోపలికి వెళ్ళి తిరిగివచ్చి ''రండి'' అంది.

ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

గాజు అద్దాల తలుపు తెరుచుకుని అతడు లోపలికి అడుగు పెట్టీ పెట్టగానే ఒక నమ్మలేని దృశ్యం చూస్తున్నట్టు నిలబడిపోయాడు. అప్పటివరకు అతడికి ఎక్సేంజి అన్నా - ఆపరేటర్లన్నా ఒక తేలిక అభిప్రాయం వున్నది.

ఒక మూల నలుగురైదుగురు అమ్మాయిలు ఓ బల్ల దగ్గిర నిలబడి టిఫిన్ క్యారియర్ డబ్బాల్లో తెచ్చుకున్న లంచ్ తింటూ వుంటారనీ; ఇంకోమూల, పనిచెయ్యకుండా ఇంకోగుంపు చీరెల గురించి కబుర్లు చెప్పుకుంటూ వుంటారనీ అతడు అనుకునేవాడు.

కానీ ఇక్కడ....

దాదాపు యాభైమంది పొడవాటి బల్లముందు కూర్చుని కనీసం తలకూడా ఎత్తకుండా పక్కకి తిరగకుండా డైరెక్టరీ తిప్పుతూ నెంబర్స్ డయల్ చేస్తూ క్షణంకూడా వృధా పర్చకుండా పని చేస్తున్నారు.

ఏ ఆఫీసులోనూ, ఏ కార్యాలయంలోనూ, ఏ ఫ్యాక్టరీలోనూ, ఏ కార్మికుడిలోనూ కనబడని ‘‘టైమ్‌సెన్స్’’ అక్కడ కనబడుతుంది.

మరెందుకు ఈ డిపార్టుమెంట్ అంటే జనానికి అంత చులకన? అతడికి ఓ మిత్రుడు అన్న మాట జ్ఞాపకం వచ్చింది. ప్రతి డిపార్టుమెంటు తన తప్పులవల్లా, సరిగ్గా పనిచేయక పోవడంవల్ల లాభం పొందుతుంది. తప్పుడు బిల్లింగ్స్‌వల్ల ఫోను వాడకపోయినా వేలకివేలు బిల్ రావటం,

ట్రంక్‌లైన్సు సరిగ్గా అందకపోవటం, మాటిమాటికి రాంగ్ నెంబర్లు రావటం కొద్దిగా వర్షం పడితే ఫోను పనిచెయ్యకపోవటం.

అన్నిటికన్నా ముఖ్యంగా...

ఎంక్వయిరీ కోసమో, నెంబరు సాయంకోసమో ఎక్సేంజికి ఫోనుచేస్తే 199 లోనూ 197 లోనూ ఎంతసేపటికీ ఎవరూ ఎత్తకపోవటం...

అదే ఆమెని అడిగాడు.

"చాలా తప్పు అభిప్రాయం అది, ఉదాహరణకి ఇదిగో ఈ 199ని తీసుకోండి" అన్నది. దాదాపు ఆరుగురు అమ్మాయిలు ఆ లైన్‌లో పని చేస్తున్నారు. వారి ముందున్న బోర్డుమీద లైట్లు వెలుగుతున్నాయి. ఆరుగురూ మాట్లాడుతున్నారు ఫోనులో.

"ప్రస్తుతం ఈ ఆరుగురు కష్టమర్లకి సాయం చేస్తున్నారు. కానీ ఆ లైట్లు వెలుగుతున్నాయీ అంటే అప్పుడే మరో ఆరుగురు కష్టమర్లు లైనులోనికి వచ్చివున్నారు అన్నమాట. దీన్నే 'కాల్ క్యూ సిస్టమ్' అంటారు."

ఇక్కడ బైట ప్రపంచానికి అర్థంకాని విషయం ఒకటి వుంది.

ఈ లైనులోకి వచ్చిన కష్టమర్లకి 'ఎంగేజ్‌డ్ టోన్' వినిపించదు. టెలిఫోను మ్రోగుతున్న ధ్వనే వినిపిస్తుంది. వాళ్ళేమో, ఎవరూ ఫోను

ఎత్తటం లేదేమిటి అని చిరాకుపడుతు వుంటారు. నిజానికి ఆ 'మోగటానికి' అర్థం ఏమిటంటే 'ఆపరేటర్ ఎవరితోనో మాట్లాడుతుంది. తరువాత ఛాన్సు మీదే, కొద్దిసేపు లైన్‌లో వుండండి' అని. ఇది అర్థం చేసుకోక ఎక్సేంజిమీద దురభిప్రాయం పడుతూ వుంటారు ప్రజలు.

''నేనూ అదే అభిప్రాయంలో వుండేవాడిని. ఆపరేటర్లు హెడ్‌ఫోన్‌లు తీసి పక్కన పెట్టేసి కబుర్లు చెప్పుకుంటూ వుంటారని, బైదిబై మీ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎవరు?''

ఆమె ఆశ్చర్యంగా ''ఎందుకు'' అని అడిగింది.

''అతడి బదులు నన్ను నియమించుకోండి. అసలు ఈ విషయాలన్నీ జనాలకి అర్థం అయ్యేటట్టు చెప్పే బాధ్యత అతడిదే.''

''అతడు మాత్రం ఏం చేస్తాడు? అతడి సమస్యలు అతడికి ఉన్నాయి.''

ఇద్దరూ బైటకు వచ్చారు. లిఫ్టులో దిగుతుంటే అతడు తను ఎలక్ట్రిసిటీ సబ్‌స్టేషన్ నెంబర్ కనుక్కోవటం గురించి పడిన తిప్పలు వర్ణించాడు. అతడు చెబుతూంటే ఆమెకి నవ్వు ఆగలేదు. నవ్వుతూ వుంటే బుగ్గమీద చిన్న నొక్కు పడుతుంది. అది ఎంతో బావుంది.

లిఫ్టు ఆగేక ''వెళ్ళొస్తాను'' అంది.

‘‘మీ ఆఫీసు కొచ్చిన అతిథులకి కాఫీకూడా ఇవ్వకుండా పంపించేస్తారా?’’

ఊహించని ఈ ప్రశ్నకి ఆమె విస్తుబోయి, వెంటనే నవ్వేస్తూ, ‘‘మా కాంటీన్ కాఫీ తాగితే మీరు జీవితంలో ఇక కాఫీ తాగరు’’ అంది.

‘‘అయితే బైటెక్కడన్నా తాగుదాం’’ అని వాచీ చూసుకొని ‘‘ఈ టైంలో కాఫీ ఏమిటి? మీకోసం ఎవరైనా ఎదురు చూస్తూ వుంటారా?’’ అని అడిగాడు. ఆమె లేదనేసరికి ‘‘అయితే కలిసి భోంచేద్దాం’’ అన్నాడు.

తటపటాయించకుండా ఆమె తలూపింది.

అప్పుడు రాత్రి తొమ్మిది కావొస్తుంది. నగరం విశ్రమించటానికి ఇంకా ఉపక్రమించలేదు. అతడి మోటార్ సైకిల్ ఆ విశాలమైన వీధులగుండా వేగంగా పయనిస్తుంటే ఆమెకి భయం వేసింది, చెట్టామనుకుంది. కానీ మొహమాటం వేసింది.

పట్టుకోవటానికి ఏమీ లేదు. అతడి నడుము తప్ప.

7

ప్రియమైన మీకు,

ఇది నేను మీకు వ్రాసే మొదటి ఉత్తరం. కాని పోస్ట్ చెయ్యని ఉత్తరాలు ఇప్పటికే వూహల్లో ఎన్ని వ్రాసేసేనో తెలుసా! అసలీ

ఉత్తరంతోపాటూ నాఫోటో కూడా పంపిద్దామనుకున్నాను, కానీ భయపడ్డారని వూరుకున్నాను. అయినా నన్ను వెంటనే చూసెయ్యాలని మీ కెందుకంత కుతూహలం? ఫోన్లో మీ కంఠం ఎందుకంత ఆత్రంగా వినిపిస్తుంది? భలే నవ్వొస్తుంది నాకు. ఇంకెంతకాలం! ఇరవైనాలుగు రోజులేగా! ఓపిక పట్టలేరూ - అంతవరకూ.

'ఎంకెవ్వరని లోకమెప్పుడైనా అడిగితే ఎలుగు నీడలకేసి వేలుసూపింతు' అనండి.

నా గురించి చెప్పమన్నారు. ఏం చెప్పను? నింగికి ఎగిరేందుకు రెక్కలే బరువైన పక్షిని నేను. స్నేహితులూ, బంధువులూ, నౌకర్లతో, రైల్వే ప్లాట్‌ఫాంలాంటి మా యింట్లో పుస్తకాలే మంచి స్నేహితులు. ఇంద్రనాధ్ కోసం శ్రీకాంత్ ఎన్నిసార్లు చదివానో... శ్రీకాంత్ చదివిన తరువాత అనిపించింది, ప్రతీ కలయికా ఒక విడిపోవటానికి నాంది అని! కలయికనీ విడిపోవటాన్నీ - ఒక కర్మగా తీసుకోగలగాలంటే దానికి గొప్ప డిటాచ్‌మెంట్ కావాలి అనుకుంటా.

ఫిలాసఫీకి నిర్వచనం ''విజ్‌డం ఆఫ్ లవ్'' అని ప్లాటో చెట్టాడు. నిజమేనేమో. ఏ విధమైన కోరికా లేకుండా ఉండటం ఫిలాసఫీకాదు. అన్నీవుండి అన్నిటికీ దూరంగా ఉండటం ఫిలాసఫీ. అసలా మాటకొస్తే

ప్రేమే వేదాంతం. అరెరె - నాలో ఇంత ప్రేమవుందన్న సంగతి నాకు ఇప్పుడే తెలుస్తూంది సుమా? థాంక్యూ (ఎందుకు చెబుతున్నానో తెలుసుగా).

మైగాడ్! ఏం వ్రాద్దామనుకుని ఏం వ్రాస్తున్నాను,

తెలుగు సరిగ్గా రాదేమో అన్న ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌ని పోగొట్టుకోవటంకోసం మరీ అర్థంలేని తెలుగుని తప్పుల తడకగా వ్రాస్తూవుంటాను. ఏమీ అనుకోకండేం.

ఇప్పుడు టైమెంతయిందో తెలుసా? పదకొండున్నర.

కిటికీ బైటంతావెన్నెల.... ప్రపంచం నిద్రపోతూంది. నల్లటిరాత్రిని తెల్లటి వెన్నెలలో ముంచి ఆకాశం మీద ఆరవేసినట్టున్నాడు సృష్టికర్త. తెల్లారేసరికి ఈ వూరి పొలిమేరల్ని దాటాలని పందెం వేసుకొని పరుగెడ్తున్నాయి మబ్బులు. వెన్నెల్లో పూసిన సన్నజాజుల్ని చూడటంకోసం కనురెప్పలల్లార్చే సమయంకూడా వృధాపర్చకూడదన్న అత్యాశ నాది. అన్నట్టు సన్నజాజులంటే గుర్తొచ్చింది. ఫోన్లో మీకంఠం విన్నప్పుడల్లా గుప్పెడు సన్నజాజులు గుండెల మీదకు జారిన ధ్వని. తెల్లారేలేచి మద్రాసునుంచి వచ్చే 'తిరుప్పావై' వింటూ ఇంటిముందు ముగ్గులేస్తూంటే లేత చలి వణికించే ఆనందం చాలా ఆనందంగా వుంటుంది కదా!

కార్తీకమాసం వస్తే చాలు జలుబు చేస్తుంది, ఆక్స్‌ఫర్డ్‌లో కార్తీకమాసాలు నవరాత్రి ఉత్సవాలూ ఉండవు. స్నో, ఆటమ్‌ల మధ్య స్టారమ్‌లాటి జీవితం. తెల్లారే అమ్మతో గుడికి వెళ్ళటం కోసం స్నానంచెయ్యాల్సి రావటంతో జలుబు. అమ్మకి భక్తి ఎక్కువ. నాన్న డబ్బులో మునిగితేలుతూ ఉంటే, అమ్మ భక్తిలో స్నానం చేస్తూంటుంది. మరి నాది భక్తి అంటారో లేదో తెలీదు. ఏది ఏమైనా గుడికి వెళ్ళటం మాత్రం గొప్ప అనుభూతి.

నడుస్తూంటే దూరంగా మసక వెన్నెల్లో కుప్పలా శివాలయం. ఏటి ఒడ్డున నీటి పువ్వులాటి జీవితాన్ని - స్వప్నం నుంచి వేరు చేస్తున్నట్టూ క్షితిజరేఖ. వెలుగురేఖల్ని వెదజల్లుతూ తూర్పు ముఖాన్ని ఎరుపు చేస్తూన్న ఆకాశం. ఆ నీరవంలో జంటగా పాటపాడే భరద్వాజ పక్షులు, మాష్టారూ! జీవితానికెంత అందమైన విలువుందో కదూ? ఒంటరి నక్షత్రాన్ని తోడు తీసుకుని గుడికి వెళ్తూంటే గుండెల్నిండా ఓంకారనాదం.

మరికొంతసేపటికి నగరం నిద్రలేస్తుంది. అప్పుడు ఆకాశమంతా రెక్కలు జల్లేసి అందర్నీ చూసి నవ్వేసి ఈ మెటీరియలిస్టిక్ ప్రపంచంనుంచి వెళ్ళిపోవాలని ఉంటుంది.

సంధ్య ప్రసవవేదనతో చీకటిపడ్తూన్న కాలంలో ఆరుబైట కుర్చీలో కూర్చుని టీ త్రాగుతూ కీట్స్ ఓడ్ ఆన్ గ్రీషియస్ ఆర్న్ చదువుకుంటూ

ఉండటం గొప్ప అనుభూతి. నా గురించి నేను నిర్మించుకున్న ఈ ప్రపంచం నాది. దీనికి రాణిని నేను. నా యీ చిన్న సామ్రాజ్యంలోకి మీరెప్పుడు వస్తారు? మీకోసం ఎన్ని ఊహల హర్మ్యాలు కనుల వెలుగుల దివిటీల్తో నింపి ఉంచానో తెలుసా?

నా రాముని పాదచరణాలనుండి, బుద్ధుని వాల్చిన కనురెప్పల మాటున జారిన శాంతి - షెల్లీ భావుకతలోంచీ, రోడెన్ శిల్పాకృతిలోంచీ, బిథోవిన్ రససృష్టికి ఒపేరా థియేటర్ లోని ఒంటరి ఆనందాన్ని ఆపాదించుకొని - రవీంద్రుని తాదాత్మ్యతలోంచి మరో ఇంద్రుని నిశ్శబ్దంలోకి వెన్నెల మైదానాలమీద రెక్కలు దింపేసి మత్తుగా సోలిపోవాలని - గులాబీ బావుంది అనటానికి సైన్సు అడ్డొచ్చే ఈ మహానుభావుల్నుంచి దూరంగా పారిపోవాలనీ కోర్కె.

I listen to his foot steps, he comes, he comes, ever he comes...

మా యూనివర్శిటీలో ప్రొఫెసర్ హాకిన్స్ అని ప్రొఫెసర్ వుండేవాడు. జిడ్డు కృష్ణమూర్తి తత్వశోధన గురించి ఆయన చెబుతుంటే గంటల తరబడి వింటూ వుండిపోవాలని అనిపిస్తుంది. రేవంత్! మనిషి జీవితంలో ప్రతి కదలికా దేముడే వ్రాస్తాడని అనుకోవాలంటే అదోలా వుంటుందికదూ. మా యూనివర్శిటీకి దక్షిణాన పొడవాటి చెట్లు వుండేవి. 'స్నో లాన్' అనేవారు

వాటిని. రాత్రంతా దట్టంగా కురిసిన మంచు ఆ కొమ్మల్లో దాక్కొని, కొద్దిగా వూపితే ముత్యాల్లా రాలేది.

.... ఎన్ని సరదాల అగరువత్తులు వెలిగించుకున్నాను.

- 'ఎంత కాంక్షా శ్రీగంధమ్ము మైనలది కొన్నాను' అన్నాడు తిలక్.

అన్నట్టూ మనం కలుసుకున్నప్పుడు మొట్టమొదటిసారి మీరేం మాట్లాడుతారు? 'పొట్టేలు పున్నమ్మ చూసేరా' అనకండి. రవీంద్రుని పోస్ట్‌మెన్ గుర్తొస్తుంది.

గాలిబ్ గేయాలు చదివారా? 'నిదురించే ప్రియురాలి ఎర్రని పెదవుల్ని ముద్దు పెట్టుకున్నాను. ఎంత అందమైన దొంగతనం అది' అంటాడు"? కానీ ఎందుకో గాలిబ్‌కన్నా ఉమర్ ఖయ్యాం నచ్చుతాడు నాకు.

రేవంత్!

ఏమిటీ అమ్మాయి? తన స్వాప్నిక జగత్తులో నిరంతరం కలలు కంటూనే వుంటుందా - అనుకుంటున్నారా? తప్పు - తప్పు, ఎప్పుడైనా చెప్పాపెట్టకుండా మీరు హఠాత్తుగా మా ఇంట్లోకి అడుగుబెడ్తే - నా గది అంతా డిస్కోతోనో, టినా ఛార్లెస్ గొంతుతోనో నిండి వుంటుంది. 'మరీ ఏమిటా గెంతులమ్మాయ్ చిన్న పిల్లలా' అన్న అమ్మ తిట్లు ఆ పాట మధ్యలో బీజిమ్స్‌లా వినిపిస్తూ వుంటాయి. జీన్స్ వేసుకున్న ఓ అమ్మాయి జింబో నగర ప్రవేశంలో హీరోయిన్‌లా అక్కడ దర్శనమిస్తుంది

మీకు. కంగారు పడకండి. చిన్నపిల్లనేగా నేను... 'ఆబా' కానీ, 'బీటిల్స్' కానీ కృష్ణశాస్త్రి వ్రాసిన పాటలు పాడితే వినాలన్న పెర్వర్టెడు వయసులో వున్నదాన్ని. 'ఈ వయసులో గెంతులెయ్యకపోతే తెలుగు సినిమా హీరోయిన్ వయసొచ్చాక చెయ్యమంటావా' అని అమ్మతో వాదిస్తుంటాను. టీన్‌బీట్స్ లేటెస్ట్ రికార్డు, 'కమాన్ డాన్స్' అన్నపాట - మొన్నే రిలీజ్ అయింది విన్నారా? నిజంగా డాన్స్ చెయ్యాలనిపిస్తుంది కదూ.

ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే వంటింట్లో కూడా డిస్కో చేస్తూ పోపు మాడబెడ్తుందా అన్న అనుమానం వద్దు మీకు రేవంత్! గృహిణినయ్యాక అలా చెయ్యనని స్టాంపు పేపరుమీద వ్రాసిస్తాను. పోతే బెడ్ రూమ్‌లో మీ వూపిరినిండిన గాలి పీలుస్తూ - కిటికీ అవతల వెన్నెల్నీ, జారిపడే సన్నజాజుల్నీ చూస్తూ వుండిపోయి, మిమ్మల్ని మర్చిపోతే మాత్రం క్షమించాలి.

రేపు సోమవారం. మళ్ళీ తెల్లారిలేచి కాలంతో పరుగులు తీయాలి. నిద్రరాని మనసు ఎక్కడికో ఎగిరిపోవాలనుకుంటుంది. అక్కడ సన్నజాజులే వుంటాయో - ఇసుక తిన్నెలే వుంటాయో జవాబు మీకు తెలిస్తే చెప్పండి. మళ్ళీ ఎల్లుండి మీకు ఫోను చేస్తాను. అప్పటిదాకా ఊహల నక్షత్రాల్ని పోగులు పెడితే అవి ఎగిరి మీ ఇంటి ముంగిట్లో చిరుదివ్వెలుగా వెలుగుతాయి. ఆ వెన్నెల వెలుగులో ఓణీ పరికిణీల్తో ఓ పిల్ల...

- వెన్నెల్లో ఆడపిల్ల''

మనసు దివ్యానుభూతికి లోనయినట్టూ - ఆలోచనల్లమీద ఎవరో దేవకన్య మంచిగంధం జల్లినట్టూ అతడు చిత్తరువులా అలానే కూర్చుండిపోయాడు. తరువాత కలలోనుంచి లేచినట్లు లేచి ముందు హాల్లోకి వెళ్ళాడు. అక్కడ తల్లి ఉయ్యాల బల్లమీద కూర్చుని ఏదో కుడుతున్నది. అతడు నిశ్శబ్దంగా వెళ్ళి నేలమీద కూర్చొని చిన్నపిల్లాడిలా ఆమె వళ్ళో మొహం దాచుకునాడు.

ఆమె ఆప్యాయంగా కొడుకు జుట్టులోకి వేళ్ళు జొనిపి ''ఏమిరా రేవూ అలా వున్నావ్?'' అన్నది, అతడు మాట్లాడలేదు. ఆ క్షణం అతడిని చూసిన వారెవరూ అతడో అంతర్జాతీయ ఆటగాడు అనుకోరు. పది ఎత్తుల ముందే ఎదుటివాడి ఆటని పసిగట్టగల సమర్థుడు అంటే ఎవరూ నమ్మరు. అంతవాడు ఈ క్షణం తల్లి చీర చెరగులో మొహం దాచుకుని జ్ఞాపకాల తీయటి అశాంతిని నెమరువేసుకుంటున్నాడు.

ఆ అశాంతి శరీరం తాలూకుదేమోనని భ్రమపడి, ఆమె ''వళ్ళు బాగానేవుంది కదరా రేవుడూ'' అంది కంగారుగా.

ఆమె తనని మాటిమాటికి 'రేవుడూ' అని పిలవటంతో అతడు ఉక్రోషం చెంది, ''నాకీ పేరు పెట్టింది ఎవరమ్మా?'' అన్నాడు రోషంతో తన ప్రేమ సంగతి తాత్కాలికంగా మర్చిపోయి.

''అప్పట్లో ఎవరికి సంతానం కలిగినా మీ మేనత్తే కదరా పేరు పెట్టేది'' అంది ఆవిడ. రేవంత్ మేనత్త రచయిత్రి, ఇప్పటికీ పుంఖానుపుంఖాలుగా వ్రాస్తుంది, కానీ, కొత్త రచయిత్రులు వచ్చాక ఆవిడవి వేసుకోవడం మానేసేరు ఎడిటర్లు - పబ్లిషర్లు.

''డిమాండు తగ్గిపోయిన రోజుల్లో నేను పుట్టివుంటానమ్మా! ప్రపంచం మీద కసంతా ఇలా నామీద తీర్చుకుని వుంటుంది'' అన్నాడు.

''అసలేమైందిరా?''

''రేవంత్ అంటే ఏమిటో తెలుసా?''

''ఏమిటి?''

''గుర్రాలకు ట్రైనింగ్ ఇచ్చేవాడు. ఇహపోతే నువ్వు ముద్దుగా పిలిచే రేవుడూకి అర్థం ఏమిటో తెలుసా - రజకుడు'' అని కోపంతో అక్కణ్ణుంచి లేచిపోయాడు.

* * * * *

''గుడ్ మార్నింగ్ సర్, నన్ను ప్రొఫెసర్ రామన్ పంపేరు''

''ప్లీజ్ కమిన్!''

రేవంత్ కుర్చీలో కూర్చొని, ఉత్తరాన్ని అతని ముందు పెడుతూ కాస్త సిగ్గుతో ''ఇదేమీ క్రిమినల్ కేసు కాదు'' అన్నాడు.

ఆయన నవ్వి ‘‘నాకు రామన్ చెప్పారు. ఏమి ప్రశ్నలు వేయకుండా మీ పని చేసి పంపమని’’ అన్నాడు. రేవంత్ మరింత సిగ్గుపడి ‘‘సారీ - చాలా సిల్లీ పనికోసం మీ కాలాన్ని వృధా చేస్తున్నాను’’ అన్నాడు.

‘‘పర్లేదు, నాకు హుషారుగా వుంది. ఈ అమ్మాయి ఎవరో మీకు తెలియదా -’’

‘‘ఉహూ - కేవలం ఈ చేతివ్రాత చూసి నేనా అమ్మాయి గురించి వివరాలు తెలుసుకోవాలనుకుంటున్నాను. బైదిబై, మీరు సైకాలజిస్టా?’’

‘‘కాదు. కనీసం డాక్టర్‌ని కూడా కాదు. కేవలం ‘గ్రాఫాలజిస్టు’ని మాత్రమే. హాండ్ రైటింగ్‌ని బట్టి మనస్తత్వాన్ని కనుక్కునే శాస్త్రాన్ని గ్రాఫాలజీ అంటారు. ఇది ఎవరయినా నేర్చుకోవచ్చు. హాబీగా పెంపొందించుకోవచ్చు కూడా.’’

‘‘ప్రొఫెసర్ రామన్ చెప్పారు. నాకైతే ఇలాంటి టెక్నిక్స్ ఉన్నాయని కూడా తెలీదు.’’ అంటూ ఆ అమ్మాయి వ్రాసినది అందించాడు.

ఆయన నవ్వి, ‘‘రేపు రండి. ఎనలైజ్ చేసి ఉంచుతాను’’ అన్నాడు.

- రేవంత్ మరుసటిరోజు వెళ్ళేసరికి రెండు పేజీల టైప్‌మేటర్ ఆయన అందించాడు.

రేవంత్ ఆశ్చర్యంగా, ‘‘ఒక చిన్న లెటర్ ఆధారంగా ఇంత సైకో అనాలిసిస్సా’’ అన్నాడు ఆ కాగితాలు అందుకుంటూ.

‘‘ఉత్తరం తెలుగులో వుంది కాబట్టి కొంచెం తక్కువ పరిశోధనే సాధ్యమైంది. ఇంగ్లీషయితే ఇంకా ఎక్కువ వివరణ ఇచ్చివుండేవాణ్ణి.’’

చేతిలో కాగితంవంక చూస్తూ ‘‘ఇదంతా నాకు నమ్మశక్యం కాకుండా వుంది’’ అన్నాడు.

‘‘చేతివ్రాత చూసి ఒక్క మనస్తత్వాన్నేకాదు - ఫామిలి గురించి కూడా చెప్పవచ్చు. అక్షరాల సైజు, ఫుల్‌స్టాప్ పెట్టే విధానం, వాక్యనిర్మాణం అన్నిటికన్నా ముఖ్యంగా ఉత్తరం పూర్తిచేసి చివర్లో సంతకం పెట్టేటప్పుడు కనబడే విసుగూ, మర్చిపోయిన వత్తులూ, కొమ్ముదీర్ఘాలూ, భావాల్ని వెలిబుచ్చే విధానం - ఉత్తరం మొదలుపెట్టినపుడు వ్రాసినంత గుండ్రంగా చివరివరకూ అక్షరాలున్నాయా లేదా అన్నది - ఇవన్నీ మనకి సాయపడతాయి. మీరొక వ్యక్తిగురించి అతడితో అయిదు సంవత్సరాలు స్నేహంచేసి కనుక్కున్నదాన్ని - అతడు వ్రాసిన ఒక్క ఉత్తరపు చేతివ్రాత సాయంతో కనుక్కోవచ్చు. అంతగా డెవలప్ అయింది ఈ సైన్సు.’’

‘‘నాకూ ఈ ఆర్ట్ నేర్చుకోవాలని వుంది’’ అన్నాడు రేవంత్.

"ముందు ప్రేమలో విజయం పొందండి. గ్రాఫాలజీ దేముంది." షేక్‌హేండ్ ఇస్తూ అన్నాడాయన. "…. అసలే మీరు బిడియస్తులు, ఆ అమ్మాయిని నెగ్గుకు రాగలరా?"

రేవంత్ తల మునకలయ్యేటంత ఆశ్చర్యంతో "నేను బిడియస్తుడనని మీకెలా తెలిసింది?" అని అడిగాడు.

"విజిటింగ్ స్లిప్‌మీద మీరు మీ పేరు వ్రాసేరుగా, స్వంత దస్తూరీతో ఆ మాత్రం ఇన్ఫర్మేషన్ చాలు - మీగురించి తెలుసుకోవటానికి - అదే గ్రాఫాలజీ" అన్నాడు ఆయన నవ్వుతూ.

8

"**మీ గురించి** నాకు చాలా తెలిసిపోయింది."

"ఏం తెలిసింది?"

"మీ అభిరుచులూ, మేకేమేమి ఇష్టాలో అదీ, కారెక్టరైజేషనూ - అంతా."

"ఎలా తెలిసిందబ్బా!"

"అది మాత్రం చెప్పను."

"పోనీ, ఏం తెలిసిందో చెప్పండి."

అతడు ఆమె గురించి తయారుచేయబడిన ఆ రెండు పేజీల వివరణనీ ఫోన్లో చెప్పాడు. సునిశితమైన రిపోర్టు అది. ఆమె వ్యక్తిత్వం గురించీ, ఫ్రాంక్‌నెస్ గురించీ, దయాగుణం గురించీ, ఈస్తెటిక్ సెన్స్, సెన్స్ ఆఫ్ ప్రాగ్మాటిజం, జీవితంలోవున్న ప్రాక్టికాలిటీ, మిత్భరాండ్రతో ప్రవర్తన వగైరా అన్నిటి గురించి వివరణా అతడు ఇచ్చేసరికి ఆమె దిగ్భ్రమ చెంది, ''ఇదంతా మీరెలా కనుక్కున్నారు'' అని అడిగింది.

అతడు కొద్దిగా గర్వం నిండిన కంఠంలో ''మీలా నేనెవర్నో ముందు తెలుసుకొనీ, గూఢచారుల్ని నియమించీ, రెండు నెలలు కష్టపడి మాత్రం కాదు'' అన్నాడు.

ఆమె బతిమాలుతున్నట్టూ ''చెప్పరూ - ప్లీజ్'' అంది - ఉద్విగ్నత నిండిన కంఠంతో.

''దాంతో అతడు మరీ బెట్టుచేస్తూ ''అబ్బా ఆశ? మీ గురించి మీరేం చెప్పరుగాని నేను మాత్రం ఇదంతా ఎలా కనుక్కున్నానో ఎందుకు చెప్పాలి'' అన్నాడు.

''సరే, మా ఇంట్లో నన్ను ఏమని పిలుస్తారో చెప్తాను గానీ మీరు ఇది చెప్పండి'' అంది రాజీకి వస్తూ.

'గుడ్' అనుకుని ''గ్రాఫాలజీ'' అన్నాడు.

''మైగాడ్! అదా'' అంది. ''అంత ఆలోచన నాకు రాలేదుసుమా.''

‘‘ఊ ఇప్పుడు చెప్పండి. మీ ముద్దు పేరు.’’

‘‘ఒక కాగితమూ, కలమూ తీసుకోండి.’’

తీసుకున్నాడు.

‘‘ఒక కోడిగుడ్డు ఆకారంలో 26 చుక్కలు పెట్టుకుంటూ పోండి. ఏదో ఒక చుక్కదగ్గర 3 అన్న అంకెను వెయ్యండి. క్లాక్‌వైజ్ (గడియారం ముల్లు) వెళ్ళే దారిలో ఆ చుక్క తరువాత పన్నెండో చుక్కమీద 4 అంకె తరువాత ఒక చుక్క వదిలేసి 5 అంకె వెయ్యండి.’’



‘‘వేసేను’’ అన్నాడు.

‘‘జాగ్రత్తగా వినండి. అయిదు అక్షరాల ఇంగ్లీషు పేరు నాది. మొదటి అక్షరము మీకు తెలుసు. ఆర్. రెండో అక్షరంకూడా చెప్పేస్తున్నాను. అది ఎ. ఇక మిగిలిన మూడు అక్షరాల గురించి హింట్ ఇస్తాను. మీరు ఇరవై ఆరు చుక్కలు పెట్టారు కదా. ఏదో ఒక చుక్క దగ్గర ఎ పెట్టి వరుసగా బి సి డి లు అలా జడ్ వరకూ వ్రాసుకుంటూ పొండి. ఒక్క చుక్క దగ్గిర 3 అన్న అంకె వేసేరుకదా! ఆ చుక్క దగ్గిర ఏ అక్షరం వస్తే అది నా పేర్లో మూడో అక్షరం.

అలాగే నాలుగూ, అయిదు అక్షరాలు అదే వరుసలో వుంటాయి. మీరు కనుక్కోవలసిందల్లా, ఏ చుక్క దగ్గర్నుంచి 'ఎ' ప్రారంభించాలి అన్నది. అది కనుక్కుంటే అంతా తెలిసిపోయినట్టే! గుడ్ లక్."

"ఇది అన్యాయం" అన్నాడు రేవంత్ కంగారుగా. "ఇలా మీ పేరు కనుక్కోవాలంటే నేను 27 కాంబినేషన్లు వెయ్యాలి"

"అది లెక్కల పండితుడు చేసేది? కొంచెం కామన్‌సెన్స్ వున్నవాడు చాలా సులభంగా కనుక్కోగలడు దాన్ని" అని "రేవంత్ బాబూ! మీకో విషయం చెప్తాను వినండి. మీకున్న అద్భుతమైన తెలివితేటల్తోపాటూ రవ్వంత ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు కూడా ఉన్నదేమో అనిపిస్తుంది. అనవసరంగా మీరు మీ స్నేహితులసాయం తీసుకొంటున్నారు. వాళ్ళు మిమ్మల్ని తప్పుదారి పట్టించటానికి తప్ప దేనికీ పనికిరారు. మీరే స్వయంగా ప్రయత్నిస్తే చాలా సులభంగా ఈ పేరు కనుక్కోగలరు. నేను లైన్లో వుంటాను. ప్రయత్నించండి...."

అతడు కలం చేతిలోకి తీసుకున్నాడు. మరుక్షణం అత్యంత ఏకాగ్రతతో ఆడే చదరంగం ఆటగాడు అయిపోయాడు.

నిముషం గడిచింది. రెండు నిముషాలైంది. అతడి నుదిటి మీద చెమట పడుతూంది. మొదటి రెండు అక్షరాలూ R A అని తెలుసు.

''కనుక్కోగలరు రేవంత్! ప్రయత్నం చేయండి'' అవతల్నుంచి ప్రోత్సాహం ఇస్తూంది ఆ అమ్మాయి. మూడో అక్షరానికీ, నాలుగో అక్షరానికీ మధ్య తేడా....

వచ్చేసింది.

అతడు చిరునవ్వుతో - ''మీరు ఫోన్ కొంచెం చెవికి దగ్గరగా పెట్టుకుంటారా'' అని అడిగాడు - తన విజయం సంగతి చెప్పకుండా.

''ఊ....'' అని ''ఎందుకు?'' అంది.

ఆప్యాయతా, ప్రేమా, కొద్దిగా చిలిపిదనమూ రంగరించిన స్వరంతో ఆమె పేరుని తీయగా ఉచ్చరించాడు.

కెవ్వున అరిచినంత పనిచేసి, ''మైగాడ్, కనుక్కున్నారు'' అంది.

''..... థాంక్స్''

''ఇలా అయితే చాలా తొందర్లో నా ఫోన్ నెంబరు కూడా కనుక్కోగలరు''

''తప్పకుండా కనుక్కుంటాను'' ఆత్మవిశ్వాసంతో అన్నాడు. ''కానీ రెండు రోజులు టైమ్ యివ్వండి. ఈ రెండ్రోజులు చదరంగం పోటీలు వున్నాయి.''

''అవును! పేపర్‌లో చదివేను. మీరు తప్పకుండా ఆడాలా రేవంత్?''

అతడు ఆశ్చర్యంగా ''ఏం? ఎందుకు?'' అని అడిగాడు. ఆమె మాట్లాడలేదు. ''రష్యా నుంచి పోలన్‌స్కీ కూడా వస్తున్నాడు.'' అన్నాడు.

''అందుకే నాకు అనుమానంగా వుంది. రష్యన్లు ఓటిమిని అంత సులభంగా తీసుకోరు.''

రేవంత్ తేలిగ్గా తీసుకుంటూ, ''ఆ మీరు అనవసరంగా కంగారు పడుతున్నారు. పోలన్‌స్కీ అలాంటివాడు కాదు. చాలా మంచివాడు. స్పోర్టివ్'' అన్నాడు.

(అయితే ప్రమాదం పోలన్‌స్కీ నుంచి రాలేదు. సీతారాం నుంచి వచ్చింది. ఇక్కడ ఫోన్లో ఈ సంభాషణ జరుగుతున్న సమయానికి అతడు ఒక నిమ్మకాయలోకి కోడి రక్తాన్ని ఇంజెక్ట్ చేస్తున్నాడు. ఆ తరువాత ఆ కాయలోకి ఒక గుండుసూది గుచ్చాడు. అతడి మొహంనిండా వికృతమైన కసీ, పగా, ద్వేషం నిండి వుంది.)

''పోలన్‌స్కీ మంచివాడే కావచ్చు. కానీ అమెరికన్ మాగజైన్ 'ది గేమ్' అన్న పత్రికలో పడిన వ్యాసం చదివారా?'' అన్నది ఆమె.

రేవంత్ ఆ వ్యాసం చదివాడు. ''రష్యన్లకు బుద్ధి చెప్పిన భారతీయుడు'' అన్న హెడ్డింగ్‌తో పడిన వార్త అది.

'ది గేమ్' అన్న పత్రిక ఎల్లోజర్నల్ లాంటిది. ఇష్టం వచ్చినట్లుగా వ్రాసింది.

''అన్ని క్రీడారంగాల్లోనూ యూరోపియన్ దేశంగా చలామణి అయ్యే రష్యా చదరంగంలో ఆసియన్ ఛాంపియన్‌షిప్ కోసం ఎందుకు ప్రయత్నించింది?... కేవలం చదరంగంలో తాము మకుటంలేని మహారాజులమని నిరూపించుకోవటం కోసమేనా? అందుకే ఈ పోటీలని మాస్కోలో నిర్వహించకుండా ఆసియాలోవున్న ఉజ్బెకిస్తాన్‌లో నిర్వహించినట్టు కనబడుతూంది. రష్యన్ల చౌకబారు ఎత్తులకు బుద్ధి చెప్పిన భారతీయ ఆటగాడిని 'ది గేమ్' అభినందిస్తూంది.''

రేవంత్ దీని గురించి పట్టించుకోలేదు.

కానీ పోలన్‌స్కీ ఒక రష్యన్ పత్రికకి ఇచ్చిన ఇంటర్వ్యూ అతడిని ఆకర్షించింది.

విలేకరి అతడిని అడిగాడు. ''.... ఒకానొక దశలో మీరు చాలా సులభంగా రేవంత్‌ని గెలిచేస్థితిలో వున్నారు - కానీ ఎలా ఓడిపోయారు?''

''ఎలాగూ గెలవబోతున్నాను కదా అని కొంచెం నిర్లక్ష్యంగా ఆడాను'' పోలన్‌స్కీ నిజాయితీగా సమాధానం ఇచ్చాడు.

''కానీ ప్రత్యర్థి ఏ ఎత్తు వేస్తాడా అన్న విషయాన్ని పది ఎత్తులు ముందే గ్రహించగలరని మీకు పేరున్నది! అలాంటిది నాలుగు ఎత్తుల్లో ఎలా ఓడిపోయారు?''

‘‘చెప్పానుగా ఓవర్ కాన్ఫిడెన్స్. అతడి మినిష్టర్ పోతుందనుకున్నాను. అదీగాక టైమ్ రన్ అవుట్ అయిపోతున్నది మరొకవైపు’’

‘‘కానీ మీ ఆట కేవలం రూక్ (ఏనుగు)తో కట్టబడింది. మిస్టర్ పోలన్‌స్కీ, అది మీరు చిన్నతనంగా భావించటంలేదా?’’

‘‘ఆ క్షణం నాకేమీ తోచలేదు’’

ఆ పత్రిక అదే హెడ్డింగ్‌తో ‘ఆ క్షణం నాకేమీ తోచలేదు’ అని పెట్టిన ఇంటర్వ్యూని ప్రచురించింది. రేవంత్‌ని చివర్లో పొగిడింది కూడా.

రేవంత్ అది జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నాడు.

‘‘ఏమిటి మౌనంగా వున్నారు""

‘‘ఊహు - ఏదో ఆలోచిస్తున్నాను’’

‘‘నేను చెప్పిన విషయం గురించేనా’’

‘‘అవును’’

‘‘ఎందుకో ఏదో జరగబోతూ వుందని నా మనసు చెబుతూంది’’ అందామె. ‘‘పోలన్‌స్కీతో ఈసారి ఆడటం తప్పించుకోవటానికి వీల్లేదా?’’

‘‘అంతా అయిపోయిన తరువాత ఇప్పుడెలా కుదురుతుంది?’’ అన్నాడు రేవంత్. ‘‘పోలన్‌స్కీ అప్పుడే ఇండియన్ మాస్టర్స్ హసన్,

రవిశేఖర్, ఆరన్‌లతో వరుసగా కలకత్తా, ఢిల్లీ, బొంబాయిలలో ఆడి ఇక్కడికి వస్తున్నాడు. ఇక్కడి మాస్టర్స్ అయిన నేనూ, ప్రభాకర్ ఆడాలి. మాలో గెల్చినవాళ్ళతో అతడు ఆడతాడు. పైగా ఇవేమీ పోటీలు కావు. కేవలం స్నేహపూర్వకంగా ఆడే ఆటలు''

''అయినా నాకెందుకో భయంగా వుంది. మీరీ ఒక్కసారి తప్పుకోకూడదూ''

అతడు తేలిగ్గా నవ్వి, ''నాకు అభిమన్యుడూ, ఉత్తరల కథ జ్ఞాపకం వస్తూంది'' అన్నాడు. తీరా అనేసాక తన చొరవకి ఆమెకి కోపం వస్తుందేమో అనుకున్నాడు. కానీ ఆమె మౌనంగా వుండిపోయింది. అతనే అన్నాడు, ''ఇందులో ప్రాణాలు పోయేదేమీ లేదుగా. అన్నిటికన్నా ఎక్కువలో ఎక్కువగా జరిగేది ఏమిటంటే - నేను ఓడిపోవటం! ఫ్రెండ్లీ గేమ్ కాబట్టి వచ్చే నష్టం ఏమీ లేదు''

''మీకు ఇన్‌ట్యూషన్ గురించి తెలుసా?''

''తెలుసు. కానీ అలాంటివాటిని నేను నమ్మను. ప్రతీవాళ్ళూ అలాంటి శక్తి ఏదో తమకు వుందనే అనుకుంటూ వుంటారు.''

దాంతో ఆమె ఇక మాట్లాడలేకపోయింది. ''మరి వుంటాను. రేపు ఫోన్ చేస్తాను'' అని పెట్టేసింది అయిష్టంగా.

9

విశాలమైన హాలు.

రేవంత్ వెళ్ళేసరికి అక్కడ ఏర్పాట్లు జరిగివున్నాయి. అతడు వెళ్ళిన పది నిముషాలకి పోలన్‌స్కీ వచ్చాడు. రేవంత్‌తో కరచాలనం చేసి స్నేహపూర్వకంగా నవ్వేడు.

అంతలో ప్రభాకర్ కూడ అక్కడికి వచ్చాడు. అతడెప్పుడూ సీరియస్‌గా అజీర్తి రోగిలా వుంటాడు. పోలన్‌స్కీని మాత్రం పలకరించి వూరుకున్నాడు.

రేవంత్ టేబిల్ దగ్గరికి నడిచాడు.

చదరంగంలో టాస్ వెయ్యడం ద్వారాగానీ, చేతిలో పావు పట్టుకోవడంద్వారా గానీ ఎవరు ముందు ఎత్తు వెయ్యాలా అన్న నిర్ణయం జరుగుతుంది.

ప్రభాకర్ నాణెం ఎగురవేసేడు.

'హెడ్' అన్నాడు రేవంత్.

టెయిల్ పడింది.

ప్రభాకర్ తెల్ల పావులవైపు కూర్చుని వున్నాడు.

స్టాప్ వాచీలు ప్రారంభమయ్యాయి. పోలన్‌స్కీ జాగ్రత్తగా రేవంత్ అటని గమనించసాగేడు.

ప్రభాకర్ కింగ్‌పాన్‌ని రెండు గళ్ళు ముందుకు జరిపాడు. (పి.కె. 4) రేవంత్ వెంటనే క్వీన్ పక్కనేవున్న బిషప్ పాన్‌ని ముందుకు జరిపాడు. ప్రభాకర్ నైట్‌ని ముందుకు జరపగానే (ఎస్.కె.బి.కి) రేవంత్ పెదవుల చిరునవ్వు వెలిసింది.

అతనిని సిసీలియస్ డిఫెన్స్‌లో కొట్టగలిగేవాళ్ళు ఎవరూ లేరు. అలాగే బర్డ్ ఓపెనింగ్‌లో కూడా. సిసీలియస్ డిఫెన్స్‌లో అతడు అఖండుడు. ఈ ప్రభాకర్ కోరి కోరి తన చేతికి అస్త్రాన్ని ఇస్తున్నాడు.

రేవంత్ నైట్‌ని ముందుకు జరిపాడు. (ఎస్.క్యూబి.కి)

ప్రభాకర్ సిగరెట్ వెలిగించి అగ్గిపెట్టెని చేతివేళ్ళ మధ్య తిప్పసాగేడు. అతడు ఇలాంటి చౌకబారు ట్రిక్స్ ప్రయోగించడంలో ప్రసిద్ధి. ఎదుటి వ్యక్తి ఏకాగ్రతని దెబ్బతీయటం కోసం సిగరెట్ పొగని రింగు రింగులుగా వదలడం వగైరాచేస్తూ వుంటాడు.

రేవంత్ దాన్ని పట్టించుకొనలేదు. తరువాత ఎత్తు గురించి ఆలోచించసాగేడు.

రెండున్నర గంటలు గడిచేసరికి బల్లమీద సగం పావులు ఖాళీ అయినయ్. కానీ అప్పటికే ప్రభాకర్ ఆట అడ్వాంటేజిగా వుంది. బిషప్‌తో

రేవంత్ తాలూకు నైట్‌నీ, రూక్‌తో బిషప్‌ని పిన్ చేసేడు. చూసేవాళ్ళకి అతడు గెల్చేటట్టే వున్నాడు. అది పైకి కనబడేది మాత్రమే. రేవంత్ రెండు రూక్స్‌నీ కోల్పోయాడు. అయినా అతడు గుర్రాల్ని నడిపించడంలో ప్రావీణ్యం గలవాడు. అతడి నైట్స్ రెండూ శత్రుశిబిరంలోకి ప్రవేశించి విధ్వంసకాండని ప్రారంభించినయ్. తన పాన్స్‌ని వదులుకోవటం ద్వారా నైట్‌ని ముందుకు తీసుకెళ్ళటం అతని ప్రత్యేకత.

అతడి ఒక్క నైట్‌నన్నా చంపాలని ప్రభాకర్ శతవిధాల ప్రయత్నం చేస్తున్నాడు.

సాయంత్రం అయిదు కావొస్తుంది.

చదరంగంలో రోజు చివరిలో ఆఖరి ఎత్తు వెయ్యరు. అలా వేస్తే ప్రత్యర్థికి ఆ రాత్రంతా ఆలోచించుకోవటానికి టైమ్ ఉంటుంది. అందువల్ల ఆఖరి ఎత్తు కాగితంమీద వ్రాసి కవరులో పెట్టి సీల్‌వేసి, రెఫ్రీకి ఇస్తారు. మరుసటి రోజు ఆ ఎత్తునుంచి ఆట ప్రారంభం అవుతుంది.

రేవంత్ బిషప్‌తో పాన్‌ని తిన్నాడు. ఆఖరి ఎత్తు ఆ రోజుకి తన దవ్వాలని ప్రభాకర్ ఆశ.

రూకు ముందుకు జరిపి, రేవంత్ తాలుకు బిషప్‌ని తినేసి, గర్వంగా రేవంత్ మొహంలోకి చూసేడు. అయితే రేవంత్ మొహంలో

అతనాశించినట్టు ఓటమి కనబడలేదు. కాగితం మీద ఏదో వ్రాసి కవరులో పెట్టి రెఫ్రీకి ఇచ్చాడు.

బల్లవేపు చూసిన ప్రభాకర్‌కి ఏదో అనుమానం వచ్చింది. తను రూక్‌ని జరిపే తొందరలో మినిష్టర్ని చూసుకోలేదు. రేవంత్ వేయబోయే ఎత్తు తెలిసిపోయింది.

రేవంత్ నైట్‌ని వెనక్కి తీసుకొచ్చి తన రాజుకీ మంత్రికి 'ఫోర్క్' వేస్తాడన్నమాట. దాంతో తన పని ఆఖరు. మంత్రిని వదులుకోవాలి.

నుదుటిమీద పట్టిన చెమటని తుడుచుకుంటూ ప్రభాకర్ తలెత్తేసరికి హాలంతా ఖాళీగా కనిపించింది. కనీసం సానుభూతి చెప్పటానికైనా ఒక్కడు మిగల్లేదు. నీరసంగా లేవబోతూ హాల్లో ఒక మూల ఒంటరిగా నిలబడి తనవేపే చూస్తున్న వ్యక్తిని గమనించాడు.

అతడు సీతారాం.

* * * * *

"చూసేరా మీరు! అనవసరంగా కంగారు పడ్డారు. చాల సులభంగా గెలవబోతున్నాను రేపు..."

ఇంట్లో - బెడ్ రూమ్‌లో బోర్లా పడుకుని అతడు ఆమెతో మాట్లాడుతున్నాడు.

తప్పు వప్పుకుంటున్నట్టు ‘‘సారీ - నేను అనవసరంగా కంగారు పడ్డట్లున్నాను’’ అన్నది.

‘‘పర్లేదు’’ అన్నాడు ‘‘ఇంతకీ నాకు రెండో ఉత్తరం ఎప్పుడు వ్రాస్తున్నారు?’’

‘‘ఉత్తరమా?.... చూస్తూంటే మీకు నన్ను కలుసుకోవడం కన్నా ఆ ఉత్తరాలు చదవటంలోనే ఎక్కువ వుత్సాహం కలుగుతున్నట్టుందే’’

‘‘అవున్నిజమే’’ అన్నాడు. ‘‘నేనెన్ని వూహలు అల్లుకుంటున్నానో తెలుసా?’’

‘‘ఈ లోపులో మూడు వారాలు గడిచిపోతాయి’’

‘‘చదరంగంలో నాదో ప్రత్యేకమైన టెక్నిక్! చివరవరకూ ఓడిపోతున్నట్లు ప్రత్యర్థికి నమ్మకం కలిగించి - చివర్లో దెబ్బ కొట్టటం. మిమ్మల్నీ అలాగే గడువు లోపులో కనుక్కోగలను అనుకుంటున్నాను.

‘‘కానీ నేను మీ ప్రత్యర్థిని కాను రేవంత్! ఎంత తొందరగా కలుసుకుంటే అంత ఎక్కువగా మీ తెలివితేటలవల్ల నాకు నమ్మకం ఏర్పడుతుంది.’’

‘‘కానీ మీరు మీ లాజిక్‌తో నన్ను కన్‌ఫ్యూజ్ చేస్తున్నారు. లాజిక్ లేకుండా వుట్టి మాథమాటిక్స్ చెప్పండి. అర నిముషంలో చేస్తాను’’

''నిజమా''

''పందెం"

''అయితే మా స్నేహితురాలి ఫోన్ నెంబర్ చెప్తాను. అయిదంకెల సంఖ్య... ఒక అంకెని అదే అంకెతో హెచ్చవేస్తే వచ్చే నెంబరు అది!''

''పెర్ ఫెక్ట్ స్క్వేర్ అన్నమాట''

''ఆ, అదే! ఇంకో హింట్ ఏమిటంటే ఆ సంఖ్యలో మొదటి అంకె స్క్వేరూ - చివరి అంకె స్క్వేరూ కలిపితే మధ్య అంకె వస్తుంది. ఇందులో ఏ లాజిక్కు, కామన్‌సెన్సూ లేదు'' అంది.

ఆమె మాట పూర్తి కాకుండానే రేవంత్, ''101 x 101 = 10201" అన్నాడు. ఆమె విస్మయం ధ్వనించే కంఠంతో ''మైగాడ్! అంత తొందరగా ఎలా కనుక్కున్నారు?'' అని అడిగింది.

రేవంత్ కాలర్ సర్దుకొని ''చూసేరా మరి'' అన్నాడు.

''కంగ్రాచ్యులేషన్స్ - ఇంత తొందరగా లెక్కకట్టి చెప్పేస్తారనుకోలేదు'' అంది.

''మీకు నా తెలివితేటలపట్ల చాలా తేలికైన అభిప్రాయం వున్నట్టుందే'' అన్నాడు. ''పందెంకట్టి చెప్తున్నాను! ఏ లెక్క అయినా మీకన్నా తొందరగా నేను చేయగలను.''

''కానీ, ఏ అమ్మాయి అయినా తన మొగుడు కొద్దిగా కామన్‌సెన్స్ వున్నవాడూ, తొందరపాటు లేనివాడూ అయివుండాలని కోరుకుంటుందే తప్ప, లెక్కల మాష్టారు అవ్వాలని కోరుకోదుగా! మిమ్మల్ని చేసుకుంటే వంకాయల కిలో ధరకి స్క్వేర్‌రూట్ పచ్చిమిరపకాయలు వందగ్రాముల ధర అనేటట్టున్నారు.'' అని నవ్వేసి ఫోన్ పెట్టేసింది.

రేవంత్ మొహం ఎర్రబడింది. అంతలో ఒక అనుమానం వచ్చింది. తొందరపాటు లేనివాడు అని ఎందుకు అన్నది? తను తొందరపడి చెప్పాడా నెంబరు?

ఫోన్ దగ్గరికి లాక్కుని 10201కి ఫోన్ చేసి ''హల్లో'' అన్నాడు. సూపర్ ఫైన్ హెయిర్ కట్టింగ్ సెలూన్ సర్ అని వినిపించింది.

రేవంత్ టక్కున ఫోన్ పెట్టేసేడు. మళ్ళీ కాగితమూ, కలమూ తీసుకుని జాగ్రత్తగా లెక్క కట్టేడు అలాంటి అర్హతలున్న మరోసంఖ్య!

110 x 110 = 12100 వచ్చింది.

దానికి డయల్ చేసేడు.

''యస్ ప్లీజ్'' అంది అవతల్నుంచి ఓ అమ్మాయి.

రేవంత్ తాపీగా, కంగారు పడకుండా, ''మిమ్మల్ని డిస్టర్బ్ చేసున్నందుకు క్షమించండి మేడమ్! మేము పెనున్సులా ప్రొడక్ట్ నుంచి

మాట్లాడుతున్నాము. మీకు అభ్యంతరం లేకపోతే ఒక రెండు నిముషాలు స్టాటిస్టిక్స్ తీసుకుంటాము. మీరు మాకు సాయం చేస్తారని అశిస్తున్నాము.'' ఇంగ్లీషులో అన్నాడు. ఇలా ఫోన్‌లో ఇంటర్వ్యూ చేసే పద్ధతి విదేశాల్లో ఈ మధ్యే అమలుపరుస్తున్నారు.

''మీకు ఏ వివరాలు కావాలి?''

''పద్దెనిమిదీ ఇరవైరెండు సంవత్సరాల మధ్య వయసున్న అమ్మాయిలు మీ ఇంట్లో ఎవరైనా వున్నారా?''

''వాట్'' కోపంగా వినిపించింది.

''కోపగించుకోకండి మాడమ్! కేవలం మా వస్తువుల అమ్మకం పెంచుకోవటం కోసమే ఈ వివరాలు సేకరిస్తున్నాం. అలాంటి అమ్మాయిలెవరైనా వున్నారంటే - వాళ్ళ అభిరుచులు ఏమిటో కనుక్కోవటమే మా ఆశయం. దానికి తగినట్టుగా మా వస్తువుల ఉత్పత్తిలో మార్పు తెచ్చుకుంటాం. ఇలాటివి పెర్సనల్‌గా వచ్చి అడిగితే బావోదని ఫోన్లో అడుగుతున్నాం! దయచేసి మా కోర్కెని అర్థం చేసుకొండి'' అన్నాడు ఓపిగ్గా - 'ఎంత కథ అల్లవలసివచ్చిందిరా భగవంతుడా' అనుకుంటూ.

''అందుకే ఫోన్‌లో అడుగుతున్నారా?''

''అవును మేడమ్'' మర్యాద నిండిన కంఠంతో అన్నాడు.

''పర్సనల్‌గా అడుగలేనివి అంటున్నారు - కొంపతీసి 'బ్రా సైజు - ఆ టేస్టూ' అడుగుతారా మమ్మల్ని'' అల్లరిగా అంది అవతల్నుంచి.

''అబ్బెబ్బె - అలాటి ప్రశ్నలడగము మేడమ్! కేవలం బొట్టు, రంగులు, మొహానికి వాడే క్రీములూ, వాటి వివరాలూ అడుగుతాం. దయచేసి మీ ఇంట్లో ఆ వయసున్న అమ్మాయిలు ఎందరున్నారో చెబ్తారా?''

''ఒక్కరే ఉన్నారు. నేనే మాట్లాడుతున్నాను.''

''థాంక్యూ మేడమ్! 'నువ్వు నీ స్నేహితుల గురించి చెప్పు - నేను నీ గురించి చెబ్తాను' అన్నాడో కవి. మీ అభిరుచుల గురించి చెప్పేముందు మీ స్నేహితురాండ్ర గురించి చెప్పండి. మీకు విదేశాల్లో గానీ, విదేశాల్లో చదువుకుని వచ్చినవారు గానీ స్నేహితులు వున్నారా?''

''ఆ ఒకరున్నారు. మొన్నే ఆక్స్‌ఫర్డ్ నుంచి వచ్చింది.''

రేవంత్ గుండెలు వేగంగా కొట్టుకుంటూ వుంటే, ''ఆ అమ్మాయి పూర్తిపేరు, అడ్రసూ చెప్తారా'' అని అడిగాడు.

''ఎందుకు?''

''అలా విదేశాల్లో చదివిన అమ్మాయిల టేస్టు ఏమిటో తెలుసుకోవాలని...''

''పూర్తి పేరు కావాలా?''

''యస్, మేడమ్!''

''అడ్రస్ కూడా!''

''అవును'' ఆత్రంగా అన్నాడు.

ఆమె ఫోన్ ఎవరికో అందించిన ధ్వని - ''చెప్పండి, నేనే మాట్లాడుతున్నాను. మీకేం వివరాలు కావాలి? నేను పెట్టుకున్న బొట్టు రోజ్, మొహానికి ఎల్లప్పుడూ పాండ్స్‌క్రీమ్‌నే వాడెదను నేను.''

రేవంత్ జావకారిపోయి, ''మీరక్కడే వున్నారా'' అని అడిగాడు.

నవ్వి, ''మీకు కామన్ సెన్సు మరీ ఎక్కువ అని తెలుసు. అందుకే జాగ్రత్తలో వున్నాను. అయినా మన కాంట్రాక్టు ప్రకారం నేను కనుక్కోమన్నప్పుడే కనుక్కోవాలి తప్ప మాట వరసకి అన్న మాటలు పట్టుకుని వెతుక్కుంటూ రాకూడదు అవునా'' అంది.

''అవును'' అన్నాడు నీరసంగా. జవాబు చెప్పి ఫోన్ పెట్టేసేడు రేవంత్.

* * * * *

మరుసటి రోజు ప్రొద్దున్నే పదింటికి, రేవంత్ ఆట జరిగే స్థలానికి చేరుకున్నాడు.

అప్పటికి చాలా కొద్దిమంది జనమే వున్నారు. పోలన్‌స్కీతో ఆట మధ్యాహ్నం ప్రారంభం అవుతుంది. చాలామంది అప్పుడు వద్దాంలే అని వూరుకున్నట్టున్నారు. ప్రభాకర్ ఇంక కొద్దిసేపట్లో ఓడిపోతాడని నిన్న రాత్రే తెలిసిపోయింది.

రేవంత్ మెట్లు ఎక్కబోతుంటే గుమ్మ దగ్గర సీతారాం తగిలి ''గుడ్ మార్నింగ్ సర్!'' అన్నాడు. రేవంత్ అతడిని చూసి మొహం చిట్లించాడు.

''మీ గురించీ - మీ విజయం గురించీ నిన్నంతా పూజలు చేసేన్సార్! మీరు తప్పక గెలుస్తారు.''

రేవంత్ మర్యాదకి 'థాంక్యూ' అని లోపలికి వెళ్ళబోయాడు, అతడు వదిలిపెట్టకుండా ''ఈ నిమ్మకాయ మీ దగ్గర వుంచండి సార్!'' అంటూ ఇచ్చి ''మీకు అఖండ విజయాన్ని సంపాదించి పెడ్తుంది ఇది'' అన్నాడు.

రేవంత్‌కి ఇటువంటివాటిమీద నమ్మకం లేదు.

''కానీ నా తృప్తికోసం సార్!'' బలవంతం చేస్తూ అన్నాడు.

అతడు దాన్ని క్యాజువల్ గా అందుకుని లోపలికి ప్రవేశించాడు.

పదిన్నరకి ఆట ప్రారంభం అయింది.

రేవంత్ తన కవర్ తీసుకుని విప్పి, అందులో ఎత్తు ప్రకారం రాజుకీ మంత్రికీ ఫోర్క్ వేసాడు - నైట్‌తో.

ప్రభాకర్ చాలాసేపు ఆలోచించి, మంత్రిని వదులుకున్నాడు. చూసేవాళ్ళకి అతడు ఎందుకు అంతసేపు దాని గురించి (వేరే ఇంకో ఎత్తు లేనప్పుడు) ఆలోచించాడో అర్థంకాలేదు.

రేవంత్ బిషప్‌తో మళ్ళీ చెక్ చెప్పాడు. ప్రభాకర్ తన బిషప్‌ని తీసుకొచ్చి అడ్డువేశాడు. ఇతడికేమైనా మతిపోయిందా అనుకుంటున్నారు చూసేవాళ్ళు.

అసలు మంత్రి పోగానే రిజైన్ చెయ్యవలసిన ఆట ఇంకా ఎందుకు ఆడుతున్నాడో తెలీదు.

రేవంత్ అతడి బిషప్‌ని కూడా తిని మళ్ళీ చెక్ చెప్పాడు. ప్రభాకర్ తల రెండు చేతుల్లో పట్టుకుని పావులకేసి చూస్తూ కూర్చున్నాడు. గడువు పూర్తికావొస్తూంది.

అందరూ అతడివైపే చూస్తున్నారు.

ఉన్నట్టుండి అతడు లేచి ''నాకేదో అవుతుంది'' అన్నాడు. ఎవరికీ అతడు చెపుతున్నది అర్థంకాలేదు.

ప్రభాకర్ తల పట్టుకుని ''నన్ను ఎవరో హిప్నటైజ్ చేస్తున్నారు. నాకు ఏం ఎత్తు వెయ్యాలో తెలియటంలేదు'' అన్నాడు. కొందరప్పుడే రేవంత్‌వైపు అనుమానంగా చూడసాగేరు. చాలామంది ఉత్సాహంగా ఏం జరగబోతుందా అన్నట్టు దగ్గిరకొచ్చారు.

రెఫ్రీ కల్పించుకుని, ‘‘మిష్టర్ ప్రభాకర్! మీరలా నెపం వెయ్యడానికి వీల్లేదు. మీరు ఆట కొనసాగించని పక్షంలో ఓడిపోయినట్టు ప్రకటించవలసి వస్తుంది జాగ్రత్త!’’ అని హెచ్చరించాడు.

(ప్రపంచ ఛాంపియన్ కార్పోవ్‌తో అంతర్జాతీయ చదరంగపోటీల్లో విక్టర్ కార్సినాయ్ ఆడుతున్నప్పుడు ఆట మధ్యలో కార్సినాయ్ లేచి అలాగే తనని కార్పోవ్ హిప్నటైజ్ చేస్తున్నాడని ఆరోపించాడు. అతడి దృష్టి దోషంనుంచి తప్పించుకోవటానికి ముందు వరుసలో ఒక కాషాయ బట్టలు కట్టుకున్న యోగిని కూర్చోబెట్టుకున్నాడు కూడా. అయితే వీటికి రెఫ్రీ వప్పుకోక కార్పోవ్ గెలిచినట్టు ప్రకటించాడు.... రచయిత)

రేవంత్ ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. ప్రభాకర్ వైపే అయోమయంగా చూడసాగేడు. ప్రపంచ పోటీల్లోనే ఈ ఆరోపణ తప్పనిసరి అయినప్పుడు తనెంత?

ప్రభాకర్ రేవంత్ వైపు చూస్తూ ‘‘నేను ఎత్తు వేయబోయే టైమ్‌కి అతడేదో మంత్రాలు చదువుతున్నాడు. లేకపోతే అంత మూర్ఖంగా బిషప్‌ని ఎలా తీసుకొస్తాను?’’ అన్నాడు. ఆ చివరి మాట మాత్రం నిజమే. చదరంగంలో ఏ మాత్రం పరిచయం వున్నవాడైనా కాపు లేకుండా ఆ ఎత్తు వెయ్యరు. అయితే నిజంగా రేవంత్ ప్రభావంవల్లే అతడు అలా ప్రవర్తించాడా? ఎద్దు యీనిందంటే దూడని కట్టెయ్యమనే జనం మనవాళ్ళు.

రేవంత్‌ని జవాబు చెప్పమనట్టు చూసేరు. ''రెఫ్రీ మాత్రం టైమ్ రన్ అవుట్ అవుతూంది ప్రభాకర్!'' అని హెచ్చరించాడు.

తనింక ఆడనన్నట్టు ప్రభాకర్ లేచి నిలబడ్డాడు.

రేవంత్ కూడా లేచాడు.

ప్రభాకర్ చూపు రేవంత్ ఫాంట్ ఫ్రంట్ జేబుమీద పడింది. ''అదుగో అదేమిటి'' అని అరిచాడు. అందరూ అటు చూసేరు. జేబు ఎత్తుగా వుంది. ఒక్కక్షణం రేవంతుక్కూడా తన జేబులో ఏమిటో అర్థం కాలేదు. అప్రయత్నంగా బైటకు తీసేడు ఏమిటో చూద్దామని.

అది నిమ్మకాయ. గుండుసూది గుచ్చబడి వున్నది. మధ్యలో ఎర్రగా వున్నది.

రెఫ్రీ కూడా ఒక క్షణం అప్రతిభుడయ్యాడు.

ఇదంతా రెప్పపాటులో జరిగిపోయింది.

విలేఖర్లు టెలిప్రింటర్ల మీద ఈ వార్త పంపడం కోసం నోట్ పుస్తకాల్లో వ్రాసుకుని అక్కణ్ణుంచి పరుగెత్తసాగారు. జనంలో కలకలం బయల్దేరింది. రేవంత్‌ని ఒక వింతమృగంగా చూడసాగేరు. ఎవరో అతడిచేతిలోంచి నిమ్మకాయ తీసుకుని అందులోంచి గుండుసూదిని బైటకులాగేడు.

పెద్ద తుఫాను మధ్యలో మైదానంలో ఒంటరిగా నిలబడి వున్నట్టు అచేతనంగా నిలబడివున్నాడు రేవంత్! అతనికి తనచుట్టూ జరుగుతున్నది తెలియటంలేదు. మనసంతా స్తబ్దంగ నొక్కిపట్టినట్లు వుంది. రణరంగంలో తనవాళ్ళు ఒక్కసారిగా ఎదురుతిరిగి వెన్నుపోటు పొడిచినట్టు....

ప్రభాకర్ విజయం సాధించినవాడిలా హాలు బైటకి నడిచాడు. హాలు ఖాళీ అయింది.

చదరంగం బల్లముందు రేవంత్, అతనితో పాటు నిశ్శబ్దం మిగిలేయి.

ఆ ఒంటరితనంలో ఆ నీరసంలో నిస్సత్తువగా కుర్చీలో కూర్చుండి పోయాడు. గుండెల్ని నొక్కి పట్టివుంచిన వేదన అప్పుడు కట్టలు తెంచుకుంది. చేతుల్లో మొహం దాచుకున్నాడు. ఆ విశాలమైన నిర్మానుష్యపు హాలులో అతడు అలా ఎంతసేపు ఉండిపోయాడో తెలీదు.

భుజంమీద చెయ్యిపడితే తడి కళ్ళతో తలెత్తి చూశాడు.

పోలన్‌స్కీ!

పోలన్‌స్కీ మాట్లాడలేదు. భుజం తట్టి వూరుకున్నాడు. ఆ క్షణం ఆ ఓదార్పు చాలు, ఇద్దరు క్రీడాకారులూ ఆ గదిలోంచి నిశ్శబ్దంగా బైటకు వచ్చేశారు.

* * * * *

అయితే ఈ సమస్య ఇంత సులభంగా తేలిపోలేదు. మరుసటిరోజు స్పోర్ట్స్ కాలమ్‌నిండా ఈ వార్తలే ''గ్రాండ్ మాష్టర్ విజయం వెనుక వున్న అసలు రహస్యం''

''క్షుద్రశక్తుల సాయంతో గెలుస్తున్న గ్రాండ్ మాస్టర్'' వగైరా వార్తలు వచ్చాయి. ప్రఖ్యాత చదరంగపు ఆటగాడు, బాబి ఫిషర్ పట్ల జనంలో ఎంత సంచలనం రేగిందో రేవంత్ పట్ల అలాగే ప్రారంభం అయింది.

మద్రాసు నుండి వచ్చే తమిళ పత్రిక ఇంకా ముందుకెళ్ళింది.

కొంతకాలం క్రితం ఒక రష్యన్ మాగ్‌జైన్ పోలన్‌స్కీతో ఇంటర్వ్యూ చేసి ప్రచురించిన వ్యాసం తాలుకు హెడ్డింగ్‌ని పట్టుకుంది. ''ఆ క్షణం నాకేమీ తోచలేదు'' అన్న హెడ్డింగ్ అది. పోలన్‌స్కీ కూడా రేవంత్‌తో ఆడేటప్పుడు తనకేమీ తోచలేదు అన్నాడు. అంటే పోలన్‌స్కీ మీద సాధించిన విజయంలో కూడా ఇదే ట్రిక్ ఉపయోగించాడన్నమాట రేవంత్!

పోలన్‌స్కీయే ఇలా అన్నాడంటే ఇక ఎదురేముంది?

తనే సందర్భంలో అలా అన్నాడో వివరించటానికి, అంతక్రితం రోజే పోలన్‌స్కీ వెళ్ళిపోయాడు. అయినా పరిస్థితి ఎలా వచ్చిందంటే పోలన్‌స్కీయే స్వయంగా వచ్చి 'నేనలా మాటవరసకి అన్నాను' అన్నా వినిపించుకొనేటట్టులేరు జనం. రేవంత్ కళ్ళలో నిజంగా హిప్నాటిక్ పవర్ వున్నదా అన్న చర్చలో తలమునకలై వున్నారు.

మరుసటిరోజు సాయంత్రం ప్రాంతీయ క్రీడామండలి సర్వసభ్యసమావేశం జరపటానికి నిర్ణయమైంది.

''మన దేశంలో ఇంతవరకూ గ్రాండ్ మాస్టర్స్ లేరు. మొట్టమొదటివాడివి నువ్వే. బహుశా అందుకేనేమో ఇంత అలజడి'' అన్నాడు జేమ్స్.

రేవంత్ మాట్లాడలేదు.

అతడి గడ్డం పెరిగింది. దాదాపు ముప్పయిఆరు గంటల్నుంచీ, అతడు మౌనంగా, నిశ్శబ్దంగా, అదోరకమైన ట్రాన్స్‌లో వున్నాడు. నిరాసక్తత వేదాంత భావం అన్నీ మిళితమైన మౌనం అది.

జేమ్స్ తిరిగి ఏదో అనబోతూ వుంటే గుమ్మం దగ్గిర అలికిడి వినిపించింది. సీతారాం లోపలికి వస్తూ కనిపించాడు. వస్తూనే ''నన్ను క్షమించండి'' అన్నాడు రేవంత్ చేతులు పట్టుకుని. ''నిండు మనసుతో మీకు ఇచ్చిన దేవీప్రసాదం ఇంత అనర్థానికి దారితీస్తుందని కలలోకూడా అనుకోలేదు.''

రేవంత్ మాట్లాడలేదు.

సీతారాం అయిదు నిమిషాలసేపు ఏదేదో మాట్లాడాడు. ఈ విషయంలో తప్పంతా తనదేననీ... తనే ఆ నిమ్మకాయని రేవంత్‌కి ఇచ్చాననీ ప్రపంచానికి చెబ్తానని హామీ ఇచ్చాడు. గుడ్డిలో మెల్ల

అనుకున్నాడు రేవంత్. కానీ అంతలో సీతారాం నసుగుతున్నట్లు ‘‘మీ పుస్తకం నాకు.... అదే.... అంకితం’’ అని ఆగేడు.

శ్రోతలిద్దరికీ అర్థమైంది అతడి బిజినెస్ ప్రొపొజిషన్! నువ్వు నాకీ సాయం చెయ్యి! నేను నీకా సాయం చేస్తాను...

రేవంత్ కోపాన్ని అతికష్టంమీద ఆపుకొని, ‘‘గెటౌట్’’ అన్నాడు. సీతారాం అతడివైపు వెకిలిగా చూసి, బైటికి నడిచాడు.

జేమ్స్ కూడా చప్పున గదిలోంచి బైటకొచ్చి అతడ్ని అనుసరించాడు.

‘‘సీతారాం! నువ్వేమీ అనుకోకు. రేవంత్ మనసేమీ బావోలేదని నీకూ తెలుసు. అతని తరపున నేను మాట్లాడతాను’’ అన్నాడు. సీతారాం మొహం విప్పారింది.

‘‘పరిస్థితిని మీరు గ్రహించగలిగారు సార్!’’ అన్నాడు.

‘‘ప్రత్యర్థిని ఓడగొట్టడం కోసం మంత్రించిన నిమ్మకాయ ఇమ్మని నన్ను రేవంత్ అడిగాడు - అని నువ్వో పేపర్ స్టేట్‌మెంట్ ఇస్తే ఇక రేవంత్ బ్రతుకుతాడా? ఇంత చిన్న విషయం అతడు అర్థం చేసుకోడేం.’’

‘‘అదేసార్ నేను చెబుతున్నదికూడాను. నా మంచితనం ఆయన అర్థం చేసుకోవటం లేదు. అప్పుడే పేపర్ వాళ్ళు నన్ను అప్రోచ్ అవుతున్నారు కూడా’’

‘‘నువ్వేగానీ ‘ఆ నిమ్మకాయ సంగతి రేవంత్‌కి ఏమీ తెలీదు. నేనే అతనికి మేలు జరగాలని ఇచ్చాను’ అని చెప్పావనుకో - రేవంత్‌కి పోయిన ప్రిస్టేజీ అంతా తిరిగివస్తుంది కదా’’

‘‘ఎందుకురాదు!’’

‘‘అంత సాయం చేసిన నీకు తన పుస్తకం అంకితం ఇవ్వటంలో తప్పేమి వుందో నాకు అర్థం కావటం లేదు. రేవంత్‌కి చెబ్తాను.’’

‘‘అది, అలా చెప్పండి.’’

‘‘మరి ప్రభాకర్ వూరుకోడేమో’’ అనుమానంగా అడిగాడు జేమ్స్, ‘‘నువ్వు తనవైపు వున్నావని అనుకుంటున్నాడుగా.’’

‘‘వాడేం చేస్తాడు సార్ మనల్ని?’’

‘‘అదేమిటయ్యా - రేవంత్ దగ్గిర నిమ్మకాయ వున్నట్టు అతను తెలుసుకోగలిగాడూ అంటే అతడు సామాన్యమైనవాడై వుండడు.’’

‘‘అబ్బే, అదేం లేదు. నేనే చెప్పాను అతడికి.’’

‘‘అయితే అందులో అతని గొప్పేం లేదన్నమాట. నువ్వేచెప్పావు’’

''అవును, నేనే చెప్పాను.''

ఆ మాట పూర్తికాకముందే అతడి శరీరం గాలిలోకి లేచింది. అది క్రిందబడకముందే మళ్ళీ లేచింది. ధ్వనికన్నా కాంతి వేగంగా ప్రయాణం చేస్తుంది. కంటిముందు మెరుపు మొదట తెలుస్తుంది. తరువాత దెబ్బ తాలూకు బాధ మెదడుకు అందుతూంది. అయిదు నిమిషాలు గడిచేసరికి బొగ్గుగనుల్లో పనిచేసే కార్మికునిలా తయారు అయ్యాడు సీతారాం. అతడి కాలర్ పట్టుకుని లేపుతూ జేమ్స్ అన్నాడు. ''.... నేను రేవంత్‌లా సున్నితుణ్ణి, లేత మనసున్న వాణ్ని కాను. ఆ విషయం గుర్తుంచుకో.''

* * * * *

అఫీసులో పని చేసుకుంటూ వుండగా రేవంత్‌కి మానేజింగ్ డైరెక్టర్ నుండి పిలుపువచ్చింది. పెన్ను మూతపెట్టి అతడు ఆయన ఛాంబర్‌లోకి వెళ్ళాడు.

''కూర్చో...''

రేవంత్ కూర్చున్నాడు, ఆయన ఓ రెండు నిముషాలు మాట్లాడలేదు. తరువాత పేపర్ వెయిట్ వేళ్ళ మధ్య తిప్పుతూ మాట్లాడసాగాడు.

''రేవంత్! బాటాలాంటి పెద్ద కంపెనీలు, బాంకులూ క్రికెటర్లకి ప్రోత్సాహం ఇస్తున్నాయి. ఎయిర్‌ఫోర్స్, రైల్వేస్‌లాంటివి హాకీప్లేయర్స్‌ని

తమసంస్థలో చేర్చుకుంటున్నాయి. కానీ నాకు తెలిసినంతవరకూ చదరంగం ఆటగాళ్ళని ఎవరూ ఆ క్వాలిఫికేషన్ కారణంగా తమ సంస్థలో చేర్చుకోవటం లేదు.'' ఆగాడు.

''.... నిజం చెప్పాలంటే ఇందులో మా స్వార్థమూ కొంత వుంది. అది కాదనను. ఉదాహరణకి పెనున్సులా ప్రొడక్ట్స్ గురించి ప్రతి దినపత్రికలోనూ, మాగజైన్‌లోనూ ఒక్క అడ్వర్టయిజ్‌మెంట్ ఇవ్వాలంటే దాదాపు యాభైవేలు ఖర్చవుతుంది. అలాటిది ఒకసారి నువ్వు నేషనల్ ఛాంపియన్‌షిప్ గెలిస్తే, ఫలానా రేవంత్ పెనున్సులా ప్రొడక్ట్స్‌లో పని చేస్తున్నాడు అని ప్రతి పత్రికా వ్రాస్తుంది. పాఠకులకి సంబంధించినంత వరకూ మన సంస్థకి ఇదే గొప్ప అడ్వర్టయిజ్‌మెంట్ - అంటే, ఇంకో విధంగా చెప్పాలంటే - నీ ఒక్కొక్క విజయమూ మన సంస్థకి దాదాపు యాభైవేల విలువచేసే వ్యాపార ప్రకటనని ఇన్‌డైరెక్ట్‌గా ఇస్తుందన్నమాట. పెద్ద పెద్ద సంస్థలు క్రికెటర్లని చేర్చుకొనేది అందుకే....''

రేవంత్ మాట్లాడలేదు. ఆయన నెమ్మదిగా విషయంలోకి వస్తూ అన్నాడు ''.... కేన్వాసింగ్ ఎంత బాగా పనిచేస్తుందో రేవంత్! నువ్వు చిన్నవాడివి, నీకు తెలియకపోవచ్చు - ఆన్టీ కేన్వాసింగ్ (వ్యతిరేక ప్రచారం) ఒక్కొక్కప్పుడు అంత అపాయకరంగా పనిచేస్తుంది.... అర్థం చేసుకోగలవనుకుంటాను... నౌ యు కెన్ గో....'' తూచి తూచి ఆయన

చాలా తక్కువ మాట్లాడాడు. కానీ తరచి చూసేకొద్దీ అందులో ఎన్నో అర్థాలు కనబడ్డాయి. రేవంత్ మొహం వాలిపోయింది. సత్తువంతా కాళ్ళలోకి తీసుకొని లేచి, అతికష్టంమీద గదిలోకి వచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

ఇన్ని వైపులనుంచి ఉప్పెన ఒక్కసారి వస్తుందనుకోలేదు. ఈ ప్రపంచం మీదే తెలియని కసి... ఏదో చెయ్యాలి... తనేదో చేసెయ్యాలి. ప్రపంచం నుంచి పారిపోవాలి. ఫోన్ ఎత్తి ఎకౌంట్సు డిపార్టుమెంట్‌కి ఫోన్ చేసాడు. ''నా గ్రాట్యుయిటీ అదీ మొత్తం ఎంతొస్తుందో చెబ్తారా'' -

రెండు నిముషాల తర్వాత వాళ్ళు చెప్పారు.

కాగితం కలం తీసుకొని రాజీనామా పత్రం వ్రాయసాగాడు.

తన కసికీ - ద్వేషానికీ అవుట్‌లేట్ తనమీద తనే పగతీర్చుకోవటం. నాలుగైదు వాక్యాలకన్నా ఎక్కువ వ్రాయలేదు. తననింతకాలం బాగా చూసుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ పత్రం ముగించాడు.

అతడు దాన్ని పుచ్చుకుని లేవబోతూంటే ఫోన్ మ్రోగింది. ''మీరా'' అన్నాడు రిసీవర్ అందుకొని.

''ఐయామ్ సారీ...''

ఇద్దరూ నిశ్శబ్దంగా వుండిపోయారు. ఆ మౌనాన్ని చీలుస్తూ ఆమె అన్నది ''ఏం చేస్తున్నారు?''

అతడు తన చేతిలోని కాగితంవంక చూసుకొని పేలవంగా నవ్వుతూ చెప్పాడు చేస్తున్నది.

''మీ కేమన్నా మతిపోయిందా'' అంది.

... అతడు చెప్పటం ప్రారంభించాడు. గుండెలోతుల్లో కరడు కట్టుకున్న పర్వతంలాంటి వేదన అంతా స్నేహపూర్వకమైన స్వాంతనతో తిరిగి మాటల రూపంలో ప్రవహించసాగింది. ఆమె అడ్డురాలేదు. అతనిని చెప్పనిచ్చింది. అతడు ఆమెకి చెప్పటంలేదు. ఈ ప్రపంచానికి చెబుతున్నాడు. కనిపించని ప్రజానీకాన్ని ఊహించుకొని, కళ్ళు మూసుకుని మాట్లాడుతున్నాడు.

''మీకు తెలీదు! చదరంగం నాజీవితంలో ఎంతలా పెనవేసుకు పోయిందో మీకు తెలీదు! నా ఎనిమిదో ఏట ఈ తెలుపు నలుపు గళ్ళు నా జీవితంలో ఒక భాగమయ్యాయి. అప్పటినుంచి ఇప్పటివరకూ ఒక ఋషిలా ఒక మునిలా దాన్ని నిర్వర్తిస్తూ వచ్చాను. చదరంగాన్ని నేనెప్పుడూ ఒక ఆటలా భావించలేదు. అదో మహాయజ్ఞం. అర్ధరాత్రి మెలకువ వస్తే కప్పుకేసి చూస్తూ నైట్సునీ, రూక్స్‌నీ వూహించుకొనేవాడిని. గచ్చు నాపరాళ్ళు గళ్ళుగా ఊహా ప్రపంచంలో ప్రత్యర్థితో పావులు జరిపేవాణ్ణి. భారతదేశపు మొట్టమొదటి గ్రాండ్ మాస్టర్ అవ్వాలన్న తపనతో కుర్ర వాళ్ళు హాయిగా అనుభవించే ప్రతిఆనందాన్ని నా పన్నెండో

ఏట వదులుకున్నాను. నా జీవితాన్ని పణంగా పెట్టి కృషిచేశాను. ఇదంతా నేను గర్వంగా చెప్పటంలేదండీ! నాబాధని చెప్పుకుంటున్నాను. ఇంతచేసి - ఇన్ని మెట్లు ఎక్కి ఈ శిఖరం చేరుకున్న తర్వాత ఇప్పుడు... కనీసం నావైపు చూపుడు వేలైనా సూటిగా సారించ తాహతులేని అనామకులందరూ మాటలనగలుగుతున్నారు. అయినా పర్లేదు. కానీ నా జీవితంలో ఒక భాగంగా పెనవేసుకుపోయిన చదరంగాన్ని, నానుంచి వేరు చెయ్యాలని ప్రయత్నిస్తున్నారు'' అతడి గొంతు గద్గదికమైంది.

ఆమె వెంటనే జవాబు చెప్పలేదు. అతడి బాధని అర్థం చేసుకుంటున్నట్టు మౌనంగా వుండి తరువాత అంది.

''మీకు చెప్పేటంత గొప్పదాన్ని కానుకానీ, నాకెందుకో జపనీయుల తత్వశాస్త్రం గుర్తొస్తుంది. సూక్ష్మాతి సూక్ష్మమైన 'అమీబా' ప్రాణి జీవితం నుంచే - అఖిలాండ శూన్యం వరకూ ఒక పెద్ద చక్రమనీ - ప్రతి ప్రాణి అస్థిత్వమూ తన జీవితంలో ఒకచోటనుంచి ప్రారంభమై - సెమీసర్కిల్‌లో పైకి ఎగిరి మళ్ళీ కాన్వెక్స్‌గా క్రిందికి దిగుతుందనీ - అలాంటి చక్రాల సముదాయమే ఒక జాతీ, ఒక నాగరికత, ఒక ఇండివిడ్యువల్ జీవితపు పరిణామం అనీ వాళ్ళు భావిస్తారు. సామాన్యుడి జీవితంలో 'ఉద్యోగమూ', 'తండ్రి కావటమూ' లాటి తాత్కాలికమైన గెలుపులు అతడి జీవితపు సర్కిల్స్‌లో ఉచ్చస్థాయీ స్థితుల్ని నిర్మిస్తే - మహానుభవుల జీవితాల్లో

సెల్ఫ్ కన్‌స్ట్రక్షన్‌లతో ఈ పరిణామ చక్రం బ్రద్దలై విభిన్న రూపాలు చెంది రేఖగా మారి ఎత్తు పల్లాలతో అత్యున్నత స్థాయికి చేరుకొంటుంది. అందుకే వారు గెలుపుని మర్చిపోయి ఓటమి నుంచి నేర్చుకుంటూ వుంటారు...''

''ఇప్పుడు నేనేం చెయ్యను?''

''ఏం చెయ్యలేరు? మీరు ఏదైనా చెయ్యగలరు. కొప్పు అంటూ వుండాలేగానీ ఎన్ని సిగలైనా వెయ్యొచ్చు. మీ చేతిలో ఆర్టుంది. దాంతో దెబ్బ కొట్టటం అంత కష్టమేమీకాదు''

''దెబ్బ కొట్టటమా?'' నవ్వేడు అతడు. ''రేపే ప్రాంతీయ క్రీడామండలి సమావేశం. ఆ మీటింగులో అందరూ చేరి రేవంత్ కళ్ళల్లో హిప్నాటిక్ పవర్ వున్నదా లేదా అని నిర్ణయించటానికి ఒక కమిటీని వేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు''

''వారికన్నా ముందే మీరో ప్రకటన చేసేరనుకోండి''

''ఏమని?''

ఆమె చెప్పింది. అది వింటుంటే అతడి చేతిలోంచి ఫోన్ జారిపోయింది. కష్టంమీద సంబాళించుకుని ''మీ కేమన్నా మతిపోయిందా? ఏమిటి మీరంటున్నది?'' అన్నాడు.

ఆమె మామూలుగా నవ్వేసింది. పూర్వపు సీరియస్ లేదు. ‘‘మీరు ఆ పని చేయగలరు రేవంత్! నాకు తెలుసు. మీలో ఆ సామర్థ్యం వున్నది. మీ కృషీ - పట్టుదలా - మీ ఇరవై సంవత్సరాల చదరంగపు అనుభవం - వీటిని తక్కువ అంచనా వెయ్యొద్దు.’’

‘‘కానీ ఏ మాత్రం పొడయినా అభాసుపాలవుతాం’’ అపనమ్మకంగా అన్నాడు అతడు.

‘‘నా ప్లాన్ పొడవదు’’ అందామె.

అతడి శక్తిమీద ఆమెకు అనుమానం లేదు. అతడికి కావాల్సింది ప్రోత్సాహమే! ఆ విషయం ఆమెకు తెలుసు.

మరుసటిరోజు పేపర్‌లో పెద్ద అక్షరాల్తో పడింది.

REVANTH ANNOUNCES BLIND-FOLD

పేపరులో అనౌన్స్‌మెంట్ యీ విధంగా కొనసాగింది.

‘‘ఇండియన్ గ్రాండ్ మాస్టర్ రేవంత్ కళ్ళల్లో వశీకరణ శక్తి ఉన్నదనీ, దానివల్లే అతడు ప్రత్యర్థుల ఆటని సులభంగా కట్టిస్తున్నాడని తోటి ఆటగాడు ‘ప్రభాకర్’ ఆరోపించాడు. అదే సమయంలో రేవంత్ వద్ద మంత్రించిన నిమ్మకాయ ఉండటంవల్లా, అంతకుముందు కొన్ని రోజుల క్రితం ప్రఖ్యాత రష్యన్ ఆటగాడు పోలన్‌స్కీ ఒక పత్రికకి యింటర్వ్యూ ఇస్తూ

'ఆ క్షణంలో నాకేమీ తోచలేదు' అనటంవల్లనూ, చాలామంది ఈ ఆరోపణలపట్ల ఉత్సాహాన్ని చూపించారు.

తనకు ఏ మానవతాతీత శక్తులూ లేవని నిరూపించుకోవటం కోసమూ తన కళ్ళ ద్వారా హిప్నటైజ్ చేసే ప్రసక్తే లేదని ప్రేక్షకులకు తెలపటం కోసమూ రేవంత్ అత్యంత సాహసమైన ఒక నిర్ణయాన్ని తీసుకున్నారు.

ప్రత్యర్థి అయిన ప్రభాకర్‌తో పాటు ఆరుగురితో ఆయన బ్లెయిండ్ పోల్డ్ ఆడతారు. కళ్ళకి గంతలు కట్టుకొని ఆడటంవల్ల ఇక తన కళ్ళల్లో వున్న శక్తి (ఒకవేళ అటువంటి దేదైనా వుంటే) పని చెయ్యదనీ, అందువల్ల యీ పోటీకి వప్పుకోవాలని ఆయన కోరాడు.

ప్రాంతీయ క్రీడామండలి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభాకర్, ఈ పోటీలో పాల్గొనటం తన కిష్టమేననీ, రేవంత్ కళ్ళు శక్తిహీనమైన పక్షంలో అతడి ఆటని నలభై ఎత్తుల్లో కట్టి వెయ్యగలననీ ప్రకటించాడు.

ఎంతో ఉత్సాహకరంగా సాగబోయే ఈ పోటీలకి పోలన్‌స్కీ రెఫ్రీగా వ్యవహరిస్తారు. ఈ పోటీలో గెల్చినవారికీ, పోలన్‌స్కీకి మామూలు షెడ్యూలు ప్రకారం జరగవలసిన ఈ రోజు ఆట పదిరోజుల తరువాత ఢిల్లీలో జరుగుతుంది. ప్రాంతీయ క్రీడామండలి మెయిన్‌హాలులో రేపు ప్రొద్దున్న

పదింటికి ప్రారంభం కాబోయే ఈ ఆసక్తిదాయకమైన ఆటలకి చదరంగంలో ఆసక్తివున్న వాళ్ళేగాక మామూలు ప్రేక్షకులు కూడా వందల సంఖ్యలో వస్తారని అనుకుంటున్నారు.''

10

మరుసటి రోజు తొమ్మిదిన్నరకే అక్కడ జనం చేరుకోసాగేరు. పేపర్లో వ్రాసింది నిజమే అయింది. చదరంగం ఆట తెలీని వాళ్ళు కూడా యీ బ్లయిండ్ ఫోల్డు చూడటానికి వచ్చారు.

చాలామంది రేవంత్‌కి మతిపోయిందనే అనుకున్నారు. కళ్ళుమూసుకుని ఒక చదరంగపు బోర్డుని జ్ఞాపక పెట్టుకోవడమే కష్టం. అలాంటిది ఏడు బోర్డుల్లో ఆటని ఎలా జ్ఞాపకం పెట్టుకుంటాడు?

సరిగ్గా పది నిముషాల పదికి రేవంత్ కారు కార్యాలయం ముందు ఆగింది. జనం గుంపులు గుంపులుగా అతడివైపు చూడసాగేరు. అతడెవరితోనూ మాట్లాడలేదు. మౌనంగా తలవంచుకొని హాల్లోకి వచ్చేశాడు. పోలన్‌స్కీతో మాత్రం కరచాలనం చేశాడు. పోలన్‌స్కీకి తెలుసు. అతడి ఏకాగ్రతని భంగం చెయ్యకూడదని. అందువల్లే అతడిని పలకరించలేదు.

తాను చెయ్యబోతున్నది సామాన్యమైన సాహసం కాదని రేవంత్‌కి తెలుసు. తన పరువు, ప్రతిష్ట, చదరంగంలో తనకున్న విశిష్టస్థానం అన్నీ ఈ రోజు ఈ ఆటమీద ఆధారపడి వుంటాయని కూడా తెలుసు. అతడిని మిత్రులు కొందరు హెచ్చరించారు. ప్రభాకర్ ఆరోపణవల్ల 'మెటీరియల్'గా జరిగేది ఏదీలేదనీ, ప్రభాకర్ ఓడిపోయినట్లేనని... కానీ రేవంత్ తన నిర్ణయం మార్చుకోలేదు. చదరంగం రూల్స్ ప్రకారం తను గెల్చినట్టే కానీ ప్రజల్లో అప్పటికే నాటుకుపోయిన భావాన్ని కూకటి వేళ్ళతో సహా పెరికివెయ్యాలి. అదే నిజమైన గెలుపు.

అందుకే అతడు రిస్కు తీసుకోదల్చేడు.

ప్రొద్దునే అయిదింటికి లేచాడు. దాదాపు గంటసేపు గదిలో ఒంటరిగా కళ్ళుమూసుకుని కూర్చున్నాడు. అది మెడిటేషన్ కాదు. కళాకారులూ, క్రీడాకారులూ తమ వృత్తిలో లీనమైచేసే యజ్ఞం - ఋషులు, బైరాగులూ, చెప్పే మెడిటేషన్ కంటే గొప్పది. అతడు ప్రార్థిస్తున్నది భగవంతుని కూడా కాదు, తనలోని శక్తిని. దాన్నే భగవంతుడు అంటే అతడికి అభ్యంతరం లేదు.

సముద్రపు కెరటాలవలె పారే ఆలోచన్ల హోరు మొదటి పదినిముషాల్లో తగ్గింది. మనసు ప్రశాంతమైంది. తరువాత అది దర్పణమైంది. ఏళ్ళ తరబడి చేసిన సాధన దానికి సాయపడింది. సరిగ్గా

గంట గడిచేసరికి అతడి మనోఫలకంమీద ఎనిమిది అడ్డుగళ్ళు - ఎనిమిది నిలువుగళ్ళతో ఒక చదరంగపు బోర్డు ముద్రించబడింది.

ఆ ఏకాగ్రత చెడకుండా అతడు అలాగే బయల్దేరి వచ్చేశాడు.

హాలు మధ్యలో ఏడు బల్లలున్నాయి.

ఒకవైపు - మూడు. మరొకవైపు .... మధ్యలో ఇంకొకటి.

ఏడు బల్లలమీద ఏడు చదరంగపు బోర్డులున్నాయి.

మధ్యకుర్చీలో ప్రభాకర్ కూర్చున్నాడు. మిగతా ఆరుగురూ జూనియర్స్. అయినా చదరంగంలో ప్రావీణ్యులు. ఇటు ముగ్గురూ, అటు ముగ్గురూ కూర్చున్నారు.

పోలన్‌స్కీ టాస్ వేశాడు ఏడుసార్లు.

రేవంత్ నాలుగుసార్లు సరిగ్గా చెప్పగలిగేడు.

మొదటి ఇద్దరితో నల్లపావులు తరువాత ఆటగాడితో తెలుపు. ప్రభాకర్‌తో నలుపు, తరువాత ముగ్గురితో తెలుపు. అలా ప్రారంభం చెయ్యాలి ఆట.

తరువాత అతడి కళ్ళకి గంతలు కట్టబడ్డాయి. ప్రేక్షకుల్లోంచి ఇద్దరు ముగ్గురువచ్చి వాటిని పరీక్షించారు.

బ్లయిండ్ ఫోల్డ్ ప్రారంభం అయింది.

హాలు జనంతో కిక్కిరిసి వుంది. అందరూ ఉత్సుకతతో చూడసాగేరు.

ఎడమవైపు మొట్టమొదట కూర్చున్న ఆటగాడు తన పావుని ముందుకు జరిపాడు.

"బోర్డు నెంబర్ వన్. ఎస్.కె.బి. 3" అని బిగ్గరగా అన్నాడు పోలన్‌స్కీ. రేవంత్ మెదడులో సంక్షిప్తమైన చదరంగ బోర్డు ఏడుగా విడిపోయింది. ఇప్పుడు వాటిమీద పావులు నిండుగా వున్నాయి. పోలన్‌స్కీ ఆ మాట అనగానే బోర్డు నెంబర్ వన్‌లో తెల్లపావు ముందుకు కదిలింది. అతడు "పి.కె. 4" అన్నాడు నెమ్మదిగా అది తన ఆటగా.

పోలన్‌స్కీ అతడు చెప్పిన ప్రకారం అతడి తరపున పావుని కదిపి రెండో బల్ల దగ్గరికి వెళ్ళాడు. అతడితోపాటు రేవంత్ కూడా నడిచాడు. అలా ఏడుగురితో ఏడు ఎత్తులు వేసి మళ్ళీ మొదటి ఆటగాడి దగ్గరికి వచ్చే సరికి అతడు నైట్‌ని కదిపాడు. అష్టావధానంలోలా మొదటి అతడు ఏం ఆడేడో జ్ఞాపకం వుంచుకొని ఎత్తు వెయ్యాలి.

వచ్చి తన సీట్లో కూర్చుని రేవంత్ రెండో ఎత్తు చెప్పాడు.

ఇలా ఆట కొనసాగింది.

దాదాపు రెండున్నర గంటలు గడిచేసరికి ఇద్దరు రిజైన్ చేసేరు. నలభై రెండో ఎత్తులో మరొకడు రిజైన్ చేసేడు.

రేవంత్ కుర్చీలో కూర్చొని వున్నాడు. అతడి స్మృతి పథంలో నాలుగు చదరంగం బోర్డులూ స్పష్టంగా కనబడుతున్నాయి. ఆ గదిలో సూది పడితే వినబడేటంత నిశ్శబ్దం వ్యాపించి వుంది. అతడో ఋషిలా వున్నాడు. పోలన్‌స్కీ మాటలు మాత్రం అతడి మెదడుని చేరుతున్నాయి. వెంటనే వాటికి జవాబు ఇస్తున్నాడు. కనులు తెరచి ఆడే వారికంటే అరగంట ఎక్కువ టైమ్ 'గెయిన్' చేశాడు.

అతడిని తికమక పెడుతున్నది ప్రభాకర్ ఒక్కడే. బ్లయిండ్ ఫోల్డ్‌లో ఎక్కువ పావుల్ని చంపకూడదు. కళ్ళు మూసుకుని ఆడే ఆటగాడిని మరింత కన్‌ఫ్యూజ్ చెయ్యటం కోసం బోర్డుమీద ఎన్ని పావులుంటే అంత మంచిది. అదే టెక్నిక్ ఫాలో అవుతున్నాడు ప్రభాకర్. అతడేమీ తక్కువ ఆటగాడు కాదు. భారతదేశపు అతితక్కువ మాస్టర్స్‌లో ఒకడు. మిగతా వారిదేముంది, ఇంకో అరగంటలో చెక్ చెప్పగానే తప్పుకున్నారు.

తరువాత అసలు యుద్ధం ప్రారంభం అయింది. ఒక పద్ధతి ప్రకారం ఆడటంలేదు ప్రభాకర్. రేవంత్ బలం అంతా అతడి గుర్రాల్లోనే వుంటుందని తెలుసు. అందుకే తన బిషప్‌నీ రెండు రూక్స్‌నీ ఇచ్చేసి రేవంత్ తాలూకు రెండు గుర్రాల్నీ తినేసేడు. అయితే ఆ తర్వాత మిగతాపావుల్ని అసలు వదులుకోలేదు. రేవంత్ తాలూకు మిగతా వాటిని ''పిక్'' చేశాడు.

తన నైట్స్ పోగానే రేవంత్ క్వీన్‌మీద ఆధరపడ్డాడు. సరిగ్గా నాలుగెత్తుల్లో దాన్ని బైటికి తీసుకొని శత్రుపక్షంలో జొరబడ్డాడు. అతడు కళ్ళుమూసుకునే ప్రభాకర్ పది ఎత్తుల తరువాత ఏం ఆడతాడా అన్నది వూహించగల్గుతున్నాడు. ఈ కళ ఒక్క బాబీఫిషర్‌కే వున్నదని ప్రతీతి. అతడు పదిహేను ఎత్తుల ముందే ప్రత్యర్థి ఎత్తుని "ఫోర్స్" చేయగలిగేవాడట. ప్రభాకర్ తన క్వీన్‌ని ఇచ్చి రేవంత్ క్వీన్‌ని తినక తప్పలేదు. ఇదయ్యేసరికి రేవంత్ తన రూక్స్‌ని రంగంలోనికి తీసుకొచ్చి బిషప్ మీద పడ్డాడు. ప్రభాకర్ తాలూకు బిషప్, రేవంత్ తాలూకు రూక్ పోయినయ్. ఈ మధ్యలో పాన్స్ టపాటపా ఎగిరిపోయినయ్.

ఆట ఈ స్టేజికొచ్చేసరికి రేవంత్ తన రాజుని స్వయంగా ముందుకు తీసుకొచ్చాడు.

అప్పటివరకూ ఒకే కోణంలో ఆలోచిస్తున్న ప్రభాకర్ బోర్డుచూసి ఉలిక్కి పడ్డాడు. బోర్డు సగంకన్నా పైగా ఖాళీగా వుంది. అంటే రేవంత్ మెదడు అంతక్లియర్‌గానూ తయారయిందన్నమాట. అది ఒక్కటే కాదు. ఆట ప్రారంభంలో రేవంత్ ఫేవరెట్‌లయిన నైట్స్‌ని తినేందుకుగానూ తన బిషప్‌ని రెండు రూక్స్‌నీ వదులుకున్నాడు. ఇప్పుడు దాదాపు ఖాళీ అయినస్థితిలో రేవంత్ రూక్ సాయంతో రాజుని స్వయంగా తీసుకువస్తున్నాడు. తనకన్నా అతడికి ఒక రూక్ ఎక్కువ ఉంది.

మరో నాలుగెత్తులు ఆడేసరికి ప్రభాకర్‌కి ఒక విషయం తెలిసిపోయింది. రేవంత్ తన నైట్స్‌ని తినడు. ఖాళీ అయిన టేబిల్‌మీద నైట్స్ ఎందుకూ కొరగావు. మరోవైపు రేవంత్ తాలూకు రూక్ స్వైరవిహారం చేస్తూంది. టేబిల్ ఖాళీ అవటం గమనించక పోవటంలోనే తను పప్పులో కాలు వేసేడు.

ఇప్పుడిక రేవంత్ కళ్ళకి గంతలు కట్టుకొని ఆడినా ఒకటే, నాలుగు కళ్లతో ఆడినా ఒకటే. తను ఎలా ఆడదామనుకున్నాడో సరిగ్గా దానికి వ్యతిరేకంగా ఆడించాడు తనచేత! టేబిల్ తనతోనే ఖాళీ చేయించాడు! ఇప్పుడిక ఆట కొనసాగించి లాభంలేదు. ఇంకో నాలుగెత్తుల్లో కింగ్‌కీ,. నైట్‌కీ ఫోర్క్ చెయ్యటం ఖాయం.

అతను టైమ్ చూసేడు.

ఇంకా అయిదు నిముషాలుంది. నాలుగు ఎత్తులు వేయటానికి.

మరికొంత సేపు ఆడి సమయం వృధా చెయ్యటం అనవసరం.

ఆడేకొద్దీ ఫూల్ అవటం తప్ప మరేమీ లేదు.

లేచి నిలబడి ‘‘నేను వదులుకుంటున్నాను’’ అన్నాడు.

అతడు దూరంగా వుండటం చేత రేవంత్‌కి అతడు అన్నది అర్థం కాలేదు. మొదట వినబడింది చెవులు బ్రద్దలయ్యేలా కరతాళ ధ్వనులు.

తరువాత తల దగ్గిర పోలన్‌స్కీ వేళ్ళస్పర్శ. అతడు స్వయంగా విప్పుతూ ''కంగ్రాచ్యులేషన్స్ మైబాయ్'' అంటున్నాడు. అప్పుడర్థమైంది అతడికి తను గెల్చానని. ఈ లోపులో జనం అతడిని చుట్టుముట్టారు. చాలాసేపట్నుంచి మూసుకొని వుండటంచేత కళ్ళు మండుతున్నాయి. నీళ్ళు కారుతున్నాయి కూడా. అయితే ఆ నీళ్ళు మంటవల్ల వచ్చినవికావు. ఆనందం వల్ల వచ్చినవి. ఆ హర్షాతిరేకాన్ని అనుభవిస్తే తప్ప అనుభూతి అర్థం కాదు. ఏమనుకున్నాడో ఏమో ప్రభాకర్ కూడా వచ్చి కరచాలనం చేసేడు. కెమేరాలు క్లిక్ మంటున్నాయి. ఒకడెవరో ఖాళీ చదరంగం టేబిల్స్‌ని కూడా ఫోటోలు తీస్తున్నాడు.

''చాలా గొప్పవిజయం సాధించావ్'' నవ్వుతూ అన్నాడు పోలన్‌స్కీ.

''మాస్టర్ మీదా గెలుపు గొప్పదే. ఏడుగురితో బ్లయిండ్ ఫోల్డ్ మామూలే. నిజం చెప్పండి. ఇలాటి పందెం ఆడవలసివస్తే మీరు ముప్పై మందితో ఒకేసారి బ్లయిండ్ ఫోల్డ్ ఆడలేరూ!''

పోలన్‌స్కీ అతడివైపు సూటిగా చూసేడు. రేవంత్ అన్నది నిజమే! వరల్డ్ చాంపియన్ కార్పోవ్ డెబ్భైమందితో ఒకసారి కళ్ళకి గంతలు కట్టుకుని ఆడగలడని ప్రతీతి.

కళ గొప్పది, అందుకే కళాకారుడికి ఎప్పుడూ సంతోషం లేదు. వెళ్ళేకొద్దీ సాధించవలసింది కనబడ్తూనే వుంటుంది. ఆ తపనతోనే విషాదమూ, ఆనందమూనూ.

టీ.వీ కెమేరా నిశ్శబ్దంగా తిరుగుతూంది. ఆటోగ్రాఫ్ చేస్తూ అతడు ఆలోచిస్తున్నాడు. గెలుపుకీ ఓటమికీ తేడా ఎంత చిన్నది. ఒక చిన్న తప్పుడు ఎత్తువేసి ఓడిపోయి వుంటే ఈ జనం - హర్షాతిరేకంతో ఇప్పుడు చప్పట్లు కొడుతూన్న ఈ జనం - హేళనతో ఎగతాళి చేసి వుండేవారు. కనీసం ప్రయత్నాన్ని అర్థం చేసుకొని ఉండేవారు కూడా కాదు.

ఆ క్షణం అతడికి చిత్రమైన అనుభూతి కలిగింది. అతడో ఎత్తైన శిఖరం మీద నిలబడి వున్నాడు. గెలుపుకీ ఓటమికీ అతీతమైన భావం మొహంలో ప్రతిబింబిస్తూ వుండగా, ఋషిలా అతడు మరింత పైకి నడుస్తూ వెళ్ళిపోతున్నాడు. సూర్యరశ్మికి చేతులు కళ్ళకి అడ్డుపెట్టుకుని వేలవేల మంది జనం అతడి నిష్క్రమణని చూడటానికి ప్రయత్నిస్తున్నారు.

ఇదంతా క్షణకాలమే. క్షణంలో అతడు మామూలు మనిషి అయ్యాడు. క్షణమాత్రపు ఆ అనుభూతిలో అహంగానీ, గర్వంగానీ లేవు. కానీ జీవితం తాలూకు గొప్ప సత్యం వుంది.

* * * * *

"కంగ్రాచ్యులేషన్స్!"

''నిజానికి నేనే మీకు చెప్పాలి'' అన్నాడు రేవంత్, ఉద్వేగం నిండిన కంఠంతో. ''ఆ క్షణం మిమ్మల్ని చూడాలని ఎంత అనిపించిందో తెలుసా? అందరూ నన్ను అభినందిస్తూ ఉంటే నేను అనుకున్నాను ఈ అభినందనలన్నీ నాకు కాదు, మీకు చెందాలి అని.''

''మీరు అనవసరంగా నన్ను మునగచెట్టు ఎక్కిస్తున్నారు.''

''లేదండీ. ఆ క్షణం నేనెంత సెల్ఫ్‌పిటీతో కృంగిపోయానో చెప్పలేను. మీరుగాని ఆ ధైర్యం చెప్పకపోయివుంటే నా కేరీర్ అంతటితో ఆఖరయిపోయేది. ఎక్కడో చదివాను, మొగవాడి ప్రతి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందని, సానుభూతి చెప్పటంకన్నా మానసికస్థైర్యం ఇవ్వడం గొప్పది. మీరా రెండోపని చేసేరు. ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో నాకు తెలియటం లేదు.''

''స్నేహితుల మధ్య కృతజ్ఞతలు ఏమిటి?'' అందామె నెమ్మదిగా. ''మీలో ఆ శక్తి ఉందని నాకు తెలుసు. అందుకే నాకు చేతనైనంత ప్రోత్సాహం ఇచ్చాను. మీరు గెలిచారు, అంతే! పోతే ఈ ప్రపంచంలో నేను అధికంగా అసహ్యించుకొనేది 'సెల్ఫ్ పిటీని', రేవంత్!''

''కానీ మీరేగానీ ఈ సాయం చెయ్యకపోయివుంటే...'' అంటూ అతనేదో అనబోయాడు.

ఆమె మధ్యలో ఆపుచేసి, ''మనమిక ఈ యూ స్క్రాచ్ మై బ్యాక్, ఐ స్క్రాచ్ యువర్ బ్యాక్ మానేద్దామా'' అంది.

రేవంత్ సిగ్గుపడి ''ఐయామ్ సారీ'' అన్నాడు. ఆమె మూడ్ మారుస్తూ ''మీ ఈ విజయం సందర్భంలో మీకో చిన్న బహుమతి పంపిస్తున్నాను, తీసుకోండి'' అంది.

''ఏమిటి?''

''ఊహు, చెప్పను. అది సస్పెన్స్.''

''మీతో ప్రతీదీ సస్పెన్స్‌లా వుందే. ఫోన్ నెంబరు, మీ పూర్తి చిరునామా.''

''నా తప్పులేదు. నేను హింట్స్ ఇస్తూనే వున్నాను. మీరే కనుక్కోవటం లేదు.''

''మీ ముద్దుపేరు కనుక్కున్నాగా'' ఆమె అట్నుంచి నవ్వింది.

''ఎందుకు నవ్వుతున్నారు?''

''ముద్దు అంటే చిన్నప్పుడు చదువుకున్న 'గదిలో కరెంట్ పోయిన లెక్క' జ్ఞాపకం వచ్చింది. అన్నట్టూ నన్ను కనుక్కోవటం విషయం ఏం చేసేరు. ఇంక పది రోజులు కూడా లేదు, మనం పెట్టుకున్న గడువు. మిమ్మల్ని చూస్తుంటే అసలు ఏ ప్రయత్నం చేస్తున్నట్టు లేదు''

''లేదని మీరెందుకు అనుకున్నారు? ఐ ఏట్ నథింగ్ ఫర్ సిక్స్ గంటలు అర్థం ఏమిటా? అని ఆలోచిస్తునే ఉన్నాను.''

''ఈ లోపులో పుణ్యకాలం కాస్త గడిచిపోతుంది.''

''పుణ్యకాలం అంటే జ్ఞాపకం వచ్చింది. నేను మిమ్మల్ని కనుక్కోవడానికి ఇంకా పది రోజుల కాలం గడువుంది కదా. చివరి ఆ రెండు రోజులూ నేను ఢిల్లీలో ఉంటాను.''

''అంటే ఇంకో రెండ్రోజులు ఎక్కువ టైమ్ ఇమ్మంటారా?''

''అబ్బెబ్బే! నా ఉద్దేశ్యం అదికాదు, చెబుతున్నానంతే. అయినా పదిరోజు లెందుకు. ఇంకో రెండు మూడు రోజుల్లోనే కనుక్కుంటాను. మీ టెలీఫోన్‌లో మొదటి రెండు నెంబర్లూ తెలిసిపోయినయ్ అప్పుడే.'' అంటూ చెప్పాడు.

''ఒకటి ఎనిమిది''

''కరెక్టే ఎలా కనుక్కున్నారు'' నిజంగా అన్నదో - వెక్కిరింతగా అన్నదో తెలియదు.

''రెండోది మొదటిదానికన్నా ఎనిమిదిరెట్లు అన్నారుగా.''

''గుడ్'' అందామె.... ''మూడో అంకె, నాలుగో అంకె చెప్పనా?''

''చెప్పండి'' అన్నాడు ఉత్సాహంగా ముందుకు వంగుతూ.

''మూడు నాలుగు అంకెలకన్నా వాటిని తిరగేస్తే వచ్చే అంకె పది రెట్లు ఎక్కువ.''

''ఊ ఇంకా.''

''ఇంకా ఏమిటి?''

''ఇంకేమీ లేదా'' నీరుకారిపోతూ అడిగాడు.

''ఈ మాత్రం హింట్ చాలు సాధారణమైన ఐ.క్యూ. ఉన్నవాడికి మూడో అంకె కనుక్కోవటానికి.''

రేవంత్ చప్పున ఏదో అర్థమై ''మూడో అంకె ఏమిటో తెలిసింది.'' అన్నాడు.

''ఇక ఆ చీకట్లో ముద్దు కథకూడా చెప్పేసేనంటే ఫోను నెంబర్ అంత తెలిసిపోతుంది. మీరు కనుక్కున్న మొదటి రెండు నెంబర్లు కరెక్టయిన పక్షంలో...'' అంది.

''ప్లీజ్ ప్లీజ్ ఆ కథ ఏమిటో చెప్పరూ'' అన్నాడు రేవంత్ అభ్యర్థిస్తున్నట్టూ.

''ఒక వూళ్ళో ఒక 'కాలేజీ' వుందట. అ కాలేజీ అమ్మాయిలు కొంతమంది కాలేజిడే అయిపోయాక ఒక హాల్లో పార్టీ చేసుకుంటున్నార్ట.

వాళ్ళలో ఒకే ఒక అబ్బాయికూడ వున్నాడట. అమాయకంగా పాలబుగ్గల్తో అచ్చు రేవంత్‌లా.''

రేవంత్ పళ్ళు బిగించి ''ముందు లెక్క చెప్పండి'' అన్నాడు. ఆమె నవ్వి ''ఏముందీ? ఇంతలో కరెంట్ పోయిందట. ఆ చీకట్లో ప్రతిచిన్నారికీ రేవంత్‌ని ముదు పెట్టుకోవాలనిపించింది.'' అంది.

''రవీంద్ర సరోవర్ సంఘటనలా అన్నమాట.''

''ఆ! అలాగేకానీ అ చీకట్లో రేవంత్ ఎక్కడున్నాడో ఎలా కనబడ్తాడు? కనబడ్డు కదా.'' అందుకని వాళ్ళలో లీడర్ లాటి అమ్మాయి స్నేహితురాళ్ళతో, ''ఒసేవ్, మీరందరూ ఎక్కడి వాళ్ళు అక్కడే కదలకుండా నిలబడండి. అందర్నీ వరసగా ముద్దు పెట్టుకుని నేను హాలు బైటకి వెళ్ళిపోతాను అని అందట.''

''మైగాడ్! ఒక అబ్బాయిని ముద్దు పెట్టుకోవటం కోసం అంత స్వజాతి చర్యకి పాలుపడే రిస్కు తీసుకుందా.''

''మరేం చేస్తుంది పాపం. రేవంత్ బుగ్గలకి అంత డిమాండ్ ఉందన్నమాట.''

రేవంత్ కోపంగా ఫోన్ పెట్టెయ్యబోతూ లెక్క ఇంటరెస్టింగ్‌గా ఉండటంతో ''తరువాత ఏమైంది?'' అని అడిగాడు.

''ఆ అమ్మాయిని చూసి ఇంకో అమ్మాయి కూడా అలాగేచేసి బైటకొచ్చిందట. అరగంట గడిచేసరికి రేవంత్ ఒక్కడే ఎర్రగా కందిపోయిన బుగ్గల్తో మిగిలిపోయాడు పాపం.''

''ఆ తరువాత''

''బైట్ ఫ్యూజ్ వేస్తున్న ఎలక్ట్రీషియన్‌కి గదిలోంచి 1081 సార్లు ''మ్చ్'' అని చప్పుడు వినిపించిందట.''

''మైగాడ్!''

''ఆ గదిలో ఎంతమంది అమ్మాయిలున్నారో అదే నా టెలీఫోన్‌లో చివరి రెండు అంకెలు'' అని ఫోన్ డిస్‌కనెక్ట్ చేసిందామె.

* * * * *

''ఒరేయ్ రేవూ, నీగురించి ఎవరో వచ్చార్రా'' అన్న తల్లిమాటలకి, గదిలోంచి బటకి వచ్చాడు రేవంత్. హాల్లో ఒక కాఖీ బట్టలు వేసుకున్న వ్యక్తి ఉన్నాడు. ఒక పెద్ద ప్యాకెట్టు, ఒక చీటీ అందించాడు. చీటిలో ''అఖండ విజయానికి గుర్తుగా అభినందిస్తూ'' అని వుంది. దాని క్రింద చిన్న అక్షరాల్తో..

''పి.యస్. మీ డిటెక్టివ్ తెలివినీ, పత్తేదారు చర్యల్నీ దయచేసి ఈ అమాయక ప్రాణిమీద ప్రయోగించకండి'' అని వ్రాయబడి వుంది. అతడికి నవ్వొచ్చింది.

కాగితాన్ని ముడుస్తూ ''ఏమిటి ప్యాకెట్టు'' అని అడిగాడు కుతూహలంగా.

అతడు పాకెట్టు విప్పుతూ, ''మీ టెలిఫోన్ ఎక్కడ సార్'' అని అడిగాడు. రేవంత్ అతడిని తన బెడ్ రూమ్‌లోకి తీసుకెళ్ళాడు.

ఆ పాకెట్‌లో చిన్న ఎలక్ట్రానిక్ కాలిక్యులేటర్ లాటిది వుంది. దాన్ని ఫోన్‌కి అమరుస్తూ అన్నాడు. ''ఇందులో వంద బటన్స్ ఉన్నాయి సర్! మీ స్నేహితులకీ, పరిచయస్తులకీ ఫోన్ చెయ్యవలసినప్పుడు ఇక మీరు నంబర్లు డయల్ చేయనక్కర్లేదు. మీకు కావల్సిన వంద నెంబర్ల దాకా ఇందులో సంక్షిప్త పరచవచ్చు. మీరు బటన్ నొక్కితే ఆ నెంబర్ అదే యిస్తుంది. ఒకవేళ అవతలి వారి ఫోన్ ఎంగేజ్డ్ అయితే డయల్ చేసి అది వచ్చేవరకూ ఇది అలా చేస్తూనే ఉంటుంది. ఇది, మీ టైమ్‌ని ఎంతో సేవ్ చెయ్యటమే కాకుండా, యస్.టి.డిలు చెయ్యటానికి చాలా ఉపయోగపడ్తుంది'' అంటూ ఇంకో ఆపరేట్‌ని తీసి రెండోవైపు అమర్చాడు.

''మీరు ఇంట్లో లేనప్పుడు ఈ బటన్ నొక్కి వెళ్తే చాలు. మీకు బైట్నుంచి ఎవరన్నా ఫోన్ చేస్తే ఇదిగో ఇలా వినబడ్తుంది వాళ్ళకి'' అంటూ బటన్ నొక్కాడు. ఒక అమ్మాయి కంఠం వినబడింది. ''ఎక్స్‌క్యూజ్ మీ సర్? రేవంత్ ఇంట్లో లేరు. ఆయనకి మీరు ఏదైనా మెసేజి ఇవ్వదలిస్తే చెప్పండి'' టప్ మన్న చప్పుడుతో టేపు తిరగడం ప్రారంభం అయింది.

మెకానిక్ టేప్‌ని ఆఫ్ చేస్తూ అన్నాడు. ''మీరు ఇంటికి వచ్చిన తరువాత ఈ టేప్‌ని రివైండ్ చేసుకుని వింటే మీకు ఎవరెవరు ఫోన్‌చేసి ఏంచెప్పదల్చుకున్నది తెలుస్తుంది.''

రేవంత్ విస్మయంతో ఆ పరికరాలవైపు చూస్తున్నాడు. సైన్సు ఎంత అభివృద్ధి చెందిందో చూస్తుంటే అతడికి ఆశ్చర్యంగా వుంది. ఇలాంటి పరికరాలు వున్నాయని ఎక్కడో చదివాను. ఇప్పుడు వాటిని ప్రత్యక్షంగా ఇండియాలో - అది తనింట్లో చూస్తూంటే సంభ్రమాశ్చర్యాలు కలిగాయి.

''ఎవరు పంపించారు వీటిని?'' అని అడిగాడు.

''అమ్మాయిగారు.''

రేవంత్ ఆసక్తిగా ముందుకు వంగి ''అదే ఎవరు?'' అని అడిగాడు. ఆ మెకానిక్కు నిర్లిప్తంగా మరో కాగితం తీసి అందించాడు. అందులో ఇలా వుంది.

''మీరు అడుగుతారని తెలుసు బుచ్చబ్బాయ్‌గారూ! అందుకే ఈ కాగితాన్ని కూడా వ్రాసి పెట్టాను.''

చదివి, రేవంత్ తలెత్తేసరికి ఆ మెకానిక్ లేదు.

* * * * *

''కంగ్రాచ్యులేషన్స్''

''థాంక్యూ!''

''కంగ్రాట్స్''

''థాంక్యూ!''

రేవంత్ తన చాంబర్ లోకి వచ్చి కూర్చున్న అయిదు నిముషాలకి మేనేజింగు డైరెక్టర్ వద్దనుంచి పిలుపువచ్చింది. మళ్ళీ ఏమైందిరా భగవంతుడా అనుకుంటూ అతడు వెళ్ళాడు.

''రా కూర్చో!'' అన్నాడు ఆయన. రేవంత్ ఎదుటి కుర్చీలో కూర్చున్నాడు.

''కంగ్రాచ్యులేషన్స్! పేపర్లు నీ గురించి బాగా వ్రాసినయ్. నిజంగా అభినందించవలసిన విషయం అది.''

రేవంత్ ఆశ్చర్యపోయాడు. నాల్రోజులక్రితం తనని ఇన్‌డైరెక్టుగా రాజీనామా చెయ్యమన్నాయనేనా ఈయన? ఇప్పుడు అసలేమీ జరగనట్టూ ఎంత మామూలుగా మాట్లాడుతున్నాడు. ఇందుకేనేమో వీళ్ళు యీ బిజినెస్‌లో ఇంత పైకి రాగలిగింది.

''ఇద్దరు ముగ్గురు బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఫోన్ చేసి నీ గురించి వాకబు చేసేరు. వచ్చే మీటింగ్‌లో నీ ప్రతిభకు గుర్తింపుగా రెండు ఇంక్రిమెంట్లు సజెస్ట్ చేస్తున్నాను.''

‘‘థాంక్యూ సర్!’’ అంటూ లేచి ఆయనతో కరచాలనం చేసి వచ్చేశాడు. అతనికి నవ్వొచ్చింది.

విజయమా విజయమా! వెళుతూ వెళుతూ అధఃపాతాళానికి తోస్తావు. వస్తూ వస్తూ అందలాన్ని ఎక్కిస్తావు. నీకు ఇది న్యాయమా?

అతడు తన ఛాంబర్‌లోకి వచ్చేసరికి అక్కడ జేమ్స్ కూర్చొని వున్నాడు. ఎప్పుడూ నవ్వుతూ ఈజీ టైప్‌లో వుండే అతడి మొహం తీక్షణంగా, ఏదో ఉద్వేగంతోనూ, ఉద్విగ్నతతోనూ నిండి వుంది. ‘‘ఏమిటి విశేషం?’’ అన్నాడు పలకరింపుగా.

జేమ్స్ చేతి గోళ్ళవైపు చూసుకుంటూ ‘‘రేవంత్ నీకో విషయం చెప్పాలి’’ అన్నాడు.

అతడి కంఠంలో కనబడిన సీరియస్‌నెస్‌కి రేవంత్ విస్మయం చెంది ‘‘ఏమిటి? ఏదైనా గొడవ జరిగిందా?’’ అని అడిగాడు.

‘‘మొగవాడి జీవితంలో పెళ్ళి అనేది పెద్ద గొడవ అనుకుంటే, అదే జరగబోతోంది’’

రేవంత్‌కి అర్థం కాక ‘‘అంటే’’ అన్నాడు.

‘‘మనం ఒక అమ్మాయితో ఫోన్‌లో మాట్లాడేం జ్ఞాపకం వుందా! ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను’’ తాపీగా అన్నాడు.

''ఆ అమ్మాయిని నువ్వెప్పుడు కలుసుకునావు?''

''మొన్నరాత్రి''

''మొన్న రాత్రి కలుసుకొని ఈ రోజు అప్పుడే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నావా?''

''ఏం? కలుసుకున్న రెండు మూడు సంవత్సరాల వరకూ పెళ్ళి చేసుకో కూడదంటావా?''

''మీరందరూ జీవితానికి ఎందుకంత ప్రాముఖ్యత ఇస్తారో నాకు అర్థంకాదు. పరస్పర ఆకర్షణ, భావుకత్వం, ఆహాహా చందమామా, ఒకర్నొకరు అర్థం చేసుకోవటం - ఇదంతా ట్రాష్ అని నా వుద్దేశ్యం. ఇదొకటే కాదు జీవితం....! పెళ్ళి అనేది జీవితంలో ఒక ఫేజ్ మాత్రమే. నీకు తెలుసుగా - నేనేదైనా నమ్మాను అంటే దాన్ని అనుసరిస్తానూ అని''

''ఇంతగా నిన్ను ఆ అమ్మాయి ఎలా ఇంప్రెస్ చేయగలిగింది?''

''ఇందులో ఇంప్రెస్ అన్న ప్రసక్తే లేదు. ఏదో ఒకటి జరగాలి. కాబట్టి - అది అలా జరిగిపోయింది. అంతే''

''అదే - ఎలా జరిగింది?''

అతడు చెప్పటం ప్రారంభించాడు.

11

విశాలమైన వీధులగుండా అతడు మోటార్ సైకిల్‌ని పోనిస్తున్నాడు. మలుపుల్లో అది వంగుతూంటే ఆమెకి భయం వేసింది. పట్టుకోవడానికి ఏమీలేదు - అతడి నడుము తప్ప.

అతడి మోటారు సైకిల్ ఒక పెద్ద హోటల్ ముందు ఆగింది.

ఇద్దరూ ఒక కాబిన్‌లో కూర్చున్నాక అతడేమైనా మాట్లాడతాడేమో అని చూసింది కానీ, అతడు ఆమెతో మాట్లాడటం కన్నా మ్యూజిక్ వినటంలోనే ఎక్కువ లీనమై మోటారు సైకిల్ తాళం చెవుల్తో టేబిల్‌మీద తాళం వేస్తున్నాడు వాటికి సరిపోయేటట్లుగా.

భోజనం పూర్తయ్యేసరికి పదయింది.

''మీరు వుండేది ఎక్కడ?'' బిల్ పేజేస్తూ అడిగాడు. ఆమె చెప్పింది.

ఆమె ఇంటివైపు నడుపుతూ, మెయిన్‌రోడ్ ప్రక్క సందులో కనబడుతూన్న మేడ మీద గది చూపిస్తూ, ''అదిగో అక్కడే నేనుండేది'' అని అంతలో ఆలోచన స్ఫురించినవాడిలా ''పదండి. నా గది చూద్దురుగాని'' అంటూ మోటారు సైకిల్ సర్రున ప్రక్కకి కోసాడు.

ఆమె ''ఇంతరాత్రి ఎందుకు'' అనబోయింది.

అతడు బ్రేక్‌వేస్తూ ‘‘మా ఇంటి ఓనరు ఏమీ అనుకోడులెండి’’ అంటూ లోపలికి దారితీశాడు. సమస్యను తనవైపునుంచే ఆలోచిస్తున్న అతడిని చూస్తే ఆమెకి ఆశ్చర్యం వేస్తోంది.

అతడు రూమ్ తాళం తీసి లోపలికి ప్రవేశించాడు. అతడి రూమ్ మ్యూజియంలా వుంది. ఇంకు బాటిల్సూ, బ్రష్‌లూ, డ్రాయింగ్ బోర్డుమీద దొర్లుతున్నాయి. కిటికీ తలుపులు సరిగ్గా వెయ్యలేదనుకుంటా డ్రాయింగ్ పేపర్లు ఎగిరి నేలమీద వచ్చి పడ్డాయి.

మంచం కొత్తదే అయినా నవారు బిగించకపోవటంవల్ల కుక్కి మంచంలా వుంది. తలదిండ్లు వుండవలసినచోట నాలుగైదు బౌండు పుస్తకాలున్నాయి. గోడకి స్పానిష్ గిటారు వేలాడుతూ వుంది.

‘‘కాఫీ తాగుతారా?’’

‘‘ఇప్పుడేగా భోంచేసేం’’

‘‘పర్లేదు’’ అంటూ ప్లాస్క్‌లో చల్లారిపోయిన కాఫీని స్టౌమీద పెట్టాడు. ఆమె దృష్టి పెద్ద ఫోటోమీద పడింది. దానిమీద వ్రాసి వున్న పేరు చదువుతూ ‘‘ఎవరీ గ్రెగరీపెక్?’’ అని అడిగింది.

‘‘అమెరికాలో పెద్ద క్రికెట్ ప్లేయరు’’ అన్నాడు.

పుస్తకాల రాక్‌లోంచి ఆమె ఒక పుస్తకాన్ని బైటకి తీసింది. 'గీతల్లో భావాలు' అన్న ఇంగ్లీషు పుస్తకం అది.

"మీరు బొమ్మలు కూడా వేస్తారా?"

"వేస్తాను"

"పత్రికల్లో వస్తూ వుంటాయా?"

"ఆ! కార్టూన్లు"

ఆమె చప్పున తలెత్తి "జేమ్స్ అన్న పేరుమీద వేసేది మీరేనా?" అంది.

"నేనే"

అప్రయత్నంగా ఆమె చేతిలో పుస్తకం జారిపోయింది. ఆంధ్రదేశంలోని అతి కొద్దిమంది కార్టూనిస్టులలో అతడొక్కడు. బొమ్మేసి జోకు వ్రాయకుండా బొమ్మతోనే నవ్వు తెప్పిస్తాడు. అప్పడాల కర్ర - గయ్యాళి భార్య జోకులకు దూరంగా వుంటాడు.

"ఇంతసేపూ మీరే 'తను' అని చెప్పలేదేం?"

"ఏదీ ఆ సందర్భం రాలేదుగా"

సులోచనకి తన ఎక్సేంజిలో పనిచేసే ఆపరేటరు గుర్తొచ్చాడు. అతడు తన వచనగేయం పడిన పత్రికని చేతిలో పట్టుకొని తిరిగాడు. ప్రతి సంభాషణనీ ఆ పత్రిక మీదకే తీసుకొచ్చి తన రచనని చూపించేవాడు.

"భలే నవ్వొస్తాయ్? మీరంత బాగా బొమ్మలు ఎలా వేస్తారు?"

"నిరంతరం మానసిక ఘర్షణనుంచి బైటపడటానికి ... ఎలావేస్తాం? డ్రాయింగ్ పేపరు మీద ఇండియన్ ఇంక్‌తో" అన్నాడు నవ్వి. ఆమె ఇంకా ఆ సంభ్రమం నుంచి తేరుకోలేదు.

ఈ లోపులో కాఫీ కాగింది. అతడు కప్పుల్ని వెతకటానికి అయిదు నిముషాలు పట్టింది. న్యూస్ పేపర్ల వెనుక దొరికాయి కప్పులు. ఈ లోపులో కాఫీ చల్లారిపోయింది. దాన్నే తాగేరు.

దూరంగా ఎక్కడో గడియారం ఒక గంటకొట్టి పదిన్నర అయినట్టు సూచించింది.

జేమ్స్ చిన్నలైటు వేశాడు. గది నీలిరంగులో కనిపిస్తుంది. కిటికీలోంచి వెన్నెల పడుతోంది. ఒక్కసారి గదిలో వ్యాపించిన చీకటికి ఆమె బెదిరింది కానీ అంతలో అతడు అడిగాడు.

"మీ ఎక్సేంజి గురించి చెప్పండి"

తన సబ్జెక్ట్ గురించి అతడు అడిగేసరికి ఆమె కొద్దిగా ఉత్సాహపడి ''ఏం చెప్పను'' అంది.

''ఎక్సేంజిలో తెలిసినవాళ్ళు ఎవరైనా వుంటే మనం ఫ్రీగా ఎన్నైనా ఫోన్లు చేసుకోవచ్చునట, నిజమేనా?''

''ఎవరన్నారు? శుద్ధ అబద్ధం'' ఆమె కొద్దిగా కోపంతో అంది.

''అలాగే అంటార్లెండి, నిజం చెప్పండి'' అంటూ బలవంతం చేశాడు. ఆమె ఆలోచించి ''నాకు తెలిసినంతవరకూ అలా చెయ్యలేం - పోతే అంబులెన్స్‌లో తెలిసిన వాళ్ళెవరయినా వుంటే వాళ్ళు లోకల్‌కాల్స్ ఫ్రీగా ఇవ్వచ్చు ననుకుంటా.''

''మీరూ ఆ పొజిషన్‌లోకి ఎప్పుడొస్తారు''

ఆమె నవ్వి ''ఏం? మీరు చెయ్యాల్సిన కాల్సు వున్నాయా'' అంది. అతడు తలూపాడు. ''ఈ విధంగానైనా బిల్లు తగ్గిద్దామనుకుంటున్నాను.'' అని ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా ''లైన్‌మెన్‌ని పట్టుకుంటే ఒకరి బిల్లులు వేరొకరికి పడే ఏర్పాట్లు చేస్తాడట నిజమేనా?'' అని అడిగాడు.

''అంటారు, కానీ నిజం కాదు. మా కొచ్చిన కంప్లయింట్స్ తొంభై తొమ్మది శాతం తప్పుడు కంప్లయింట్లే. ముఖ్యంగా యస్.టి.డి. వచ్చాక ఇళ్ళల్లో ఆడవాళ్ళు దూరప్రాంతాలలో వున్న బంధువులతో గంటల తరబడి

మాట్లాడి ఆ విషయమే మరిచిపోతారు. బిల్లు వచ్చాక మొగవాళ్ళు ఎగిరి పడ్డుంటే తేలుకుట్టిన దొంగల్లా వుండిపోతారు.''

''అంటే రాంగ్ బిల్లింగ్ అన్నదే జరగటం లేదా.''

''ఆ మాత్రం తప్పులు ఏ డిపార్ట్‌మెంట్‌లోనైనా జరుగుతాయి. జేమ్స్! మా డిపార్ట్‌మెంట్‌ని తప్పు పట్టాలంటే ఒకే ఒకటుంది. చాలా నిర్లక్ష్యంగా మా వాళ్ళు చేస్తున్న తప్పు.''

''ఏమిటి?''

''ఇంతమంది ఫోన్లు కావల్సిన వాళ్ళు వెయిటింగ్ లిస్ట్‌లో వున్నారు కదా! భవిష్యత్తులో వీళ్ళు లక్షలదాకా తేల్తారు. ఇంతమందికి కావల్సిన ఫోన్లు డిపార్ట్‌మెంట్ ఎందుకు సమకూర్చలేకపోతుంది? కేవలం బాడ్ ప్లానింగ్! ఇప్పుడొక పదికోట్లు ఖర్చు పెట్టటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని లాభాలు గడించవచ్చు. ఎక్సేంజిలని విస్తృత పర్చటం ద్వారా ఫోన్ అడిగినవాడికి పదిరోజుల్లో ఇచ్చే ఏర్పాటు చెయ్యవచ్చు. ఎందుకు చెయ్యటం లేదు?'' అంటూ, అంతలో తను ఆవేశంగా మాట్లాడుతున్నానని గ్రహించి ఆపు చేసింది. జేమ్స్‌కి ఆ విషయంపట్ల అంత ఉత్సాహం కలగలేదు.

''ఇంకో విషయం చెప్పండి'' అన్నాడు.

ఊరు నిద్రకుపక్రమించటానికి ఆయత్తమవుతుంది, తూర్పు దిక్కుగా వెళ్తున్న పక్షి తెల్లగా కనబడుతుంది కిటికీలోంచి.

"ఏమిటి"

"మనం ఎవర్నైనా ఏడిపించాలంటే వాళ్ళకి ఫోన్ చేసి తిరిగి మన రిసీవర్ సరిగ్గా పెట్టకపోతే వాళ్ళ ఫోన్ పనిచెయ్యదట, నిజమేనా?"

ఆమె కళ్ళు పెద్దవి చేసి "ఇన్ని దారుణమైన ఆలోచనలు మీకెందుకు కలుగుతున్నాయి?" అని అడిగింది.

"నిజమో కాదో చెప్పకూడదా ఏమిటి?"

"నిజమే"

ఇంటి గలవాళ్ళు క్రింద లైట్లు ఆర్పేశారు. వరండాలో చీకటి పల్చగా పరచుకుంది. అతడు కిటికీ తలుపు తెరిచాడు. చల్లటిగాలి రివ్వున వీస్తోంది. టేప్ రికార్డర్ ఆన్ చేస్తూ అన్నాడు. "ఏం మాట్లాడినా ఫోనే కాబట్టి అమ్మాయిలు అంతగా పట్టించుకోరని అంటారు, నిజమేనా?"

"మాకు అవసరమైనదానికన్నా ఎక్కువగా అవతలి వాళ్లు మాట్లాడితే 'కీ' ఆఫ్‌చేస్తాం. అది తెలియక మేము ఇంకా వింటున్నామనుకొని అవతలి వ్యక్తి మాట్లాడటం కొనసాగిస్తాడు. అలాగే తిట్లుకూడా..." అంటూ నవ్వింది.

‘‘నాకు ఆశ్చర్యంగా ఉంటుంది! ప్రొద్దుట్నుంచీ సాయంత్రం వరకూ డయల్ అలా తిప్పుతూనే వుంటారు కదా, వేళ్ళు నొప్పెట్టవూ’’

‘‘పియానో బటన్ సిస్టమ్ వస్తే బావుణ్ను అని మేం అనుకుంటూ వుంటాం.’’

టేప్ రికార్డర్‌లో పాట మంద్రస్థాయిలో వస్తుంది. అతడు పక్కమీదవున్న పుస్తకాలు తీసి అల్మైరాలో సర్దేడు; ఆమె వాచీ చూసుకుంది. అతడు తన గదిలో ఫోన్ చూపిస్తూ, ‘‘ఇది నాకెలా వచ్చిందో తెలుసా?’’ అని అడిగాడు.

‘‘ఎలా వచ్చింది?’’

‘‘మొదటి ఆర్నెల్లూ మానాన్నకి హార్ట్ కంప్లయింట్! తరువాత ఆర్నెల్లూ మా అమ్మకి హృద్రోగం. ఇంట్లో ఎవరికైనా సీరియస్‌గా ఉంటే టెంపరరీ ఫోన్ ఇస్తారు కదా!’’

‘‘వాళ్ళేరి’’ అని అడిగింది వున్న ఒక్క గదిని చూస్తూ.

‘‘నా చిన్నప్పుడే పోయారు.’’ అంటూ నవ్వేడు. ఆమె కూడా నవ్వింది! అతడు చాలా క్యాజువల్‌గా దగ్గరికొచ్చి ఆమెని చేతుల మధ్య తీసుకున్నాడు. ఇదెంతో నిశ్శబ్దంగా మామూలుగా జరిగిపోయింది.

ఒక్క క్షణం ఆమెకేమీ అర్థంకాలేదు. అతడి మొహం దగ్గిరకొస్తూంది. అర్థమయ్యేసరికి ఆమె ఒక్కసారిగా విదిలించుకొని, హిస్టీరిక్‌గా వెనక్కి అడుగువేసి, ''ఏ ... ఏమిటిది'' అని అడిగింది, తడి ఆరిన గొంతుతో.

ఆమె నుంచి ఈ రియాక్షన్ ఆశించనట్టూ అతడో క్షణం విస్తుబోయి ''మీ కిష్టం లేదా?'' అన్నాడు. అతడి కంఠంలో ఆశ్చర్యం కొట్టొచ్చినట్టూ కనబడుతూంది.

''ఏమనుకున్నారు మీరు నా గురించి'' రోషమూ, ఉక్రోషమూ, నిస్సహాయతా, ఏడుపూ కలిసిన కంఠంతో అడిగింది.

అతడూ అంతే నిజాయితీగా, ''ఏమీ అనుకోవటం లేదు'' అన్నాడు. ఈ జవాబుకి ఆమె తెల్లబోయి తలెత్తి చూసింది. అతను అన్నాడు ''మీరూ నేనూ యిద్దరమే వున్నాం గదిలో. టైమ్ రాత్రి పది దాటింది. మీకు ఇష్టమేమో అనుకున్నాను'' అన్నాడు.

''ఒక అమాయకమైన ఆడపిల్ల మిమ్మల్ని నమ్మి గదికి వస్తే ఇక ఆ ఉద్దేశ్యం తప్ప మరేమీ కలగదా మీకు?'' కోపంగా అంది.

''మరీ స్త్రీత్వాన్ని నటించకండి, నటించే వాళ్ళంటే నా కసహ్యం. ఇలా జరగబోతూందని నిజంగా మీకు తెలీదా?'' అన్నాడు.

''నిజంగా నాకు తెలీదు. మీకీ ఉద్దేశ్యం వుందని నేను అనుకోలేదు.'' ఏడుపొక్కటే తరువాయి ఆమె కంఠంలో.

అతడు ఆమె వంక సూటిగా చూసేడు. ఆమె కంఠంలో వినబడిన సిన్సియారిటీ గుర్తించి, ఒక్క క్షణం మౌనంగా వుండి, భుజాలెగరేసి, ''ఓ. కే. ఇట్సాల్‌రైట్...'' అన్నాడు. ''నేనే తొందరపడ్డానేమో, ఇక ఇదంతా మర్చిపోండి.''

ముక్కు పొడుం పెట్టుకుని తుమ్మి సారీ చెప్పినంత సులభంగా అతను ఇదంతా మర్చిపోండి అనేసరికి ఆమె తల తిరిగిపోయింది.

''ఇందుకోసమే నన్నిక్కడికి తీసుకొచ్చారా'' అని అడిగింది.

అతడు తల నిర్లక్ష్యంగా ఎగరేసి, ''ఇంక అదంతా మర్చిపోమన్నాగా'' అన్నాడు.

''కాదు చెప్పండి. నన్నిక భవిష్యత్తులో కలుసుకోరు కదూ?''

''దాన్దేముంది - ఎప్పుడైనా కల్సుకుంటూనే వుంటాం కదా'' తేలిగ్గా అన్నాడు.

''అంటే మీ ఉద్దేశ్యంలో ఆడా మొగా మధ్య స్నేహం అంటే ఇంతే నన్నమాట'' హేళన ధ్వనిస్తూన్న స్వరంతో అంది. అతడు నెమ్మదిగా వెనుదిరిగి ఆమెవైపు సూటిగా చూసేడు.

''ఇంతే అన్న మీ మాటకి అర్థం ఏమిటి? మొదట్లో ప్రేమికుడు చందమామ ఎంత బావుందో అని అంటాడు. అవునంటుంది. మన

భావాలు ఎంత బాగా కలిసిపోయాయో చూసేరా అంటాడు. ఆమె తాదాత్మ్యతలో తలూపుతుంది. నేన్నిన్ను ప్రేమిస్తున్నాను అంటాడు. నేనూ అంతే నువ్వు లేకపోతే బ్రతకలేను ప్రియా అంటుంది. అతడామెను దగ్గరకు తీసుకుంటాడు. ప్రకృతి పులకిస్తుంది. కోయిల పాడుతుంది. ఆమె అతడిలో ఐక్యం అయిపోతుంది. ఇంతకు మొత్తం మీద చివరకు జరిగేదేమిటంటే అతడు ఆమెను అనుభవించటం... దానికోసం ఇంత డ్రామా ఇన్ని రోజులు పాట్లూ ఎందుకు? ప్రతిదీ అక్కడికే వెళ్ళి అంతమయ్యేదానికి, అదేదో అక్కడే ప్రారంభించి ముగించేసుకుంటే - ఆ సమయాన్నంతా మిగతా విలువైన పన్లకి వుపయోగించుకోవచ్చుగా! ఈ ప్రేమికుల్ని చూస్తే నాకు నవ్వొస్తుంది. ప్రేమ అనే ఆత్మవంచన పేరిట ఎంత సమయాన్ని వృధా చేసుకుంటూ వుంటారో! ముఖ్యంగా మా రేవంత్‌లాంటి వాళ్లు.''

''మీరింత మెటీరియలిస్టు అనుకోలేదు.''

''నావి దారుణమైన భావాలే. కానీ నా భావాల్ని నేను పెంపొందించుకునే హక్కు నాకుంది. వీటితో మీరు కన్విన్స్ అవ్వాలని రూల్ లేదు.''

''మనం వెళ్దామా ఇక!''

''పదండి -'' తాళం కప్ప చేతిలోకి తీసుకుంటూ అన్నాడు. ఆమె గుమ్మం దాటబోయేదల్లా ఆగి, ''మైగాడ్?'' అంది.

''ఏం జరిగింది?''

ఆమె కొద్దిగా సిగ్గుతో ''బ్రా తెగినట్టుంది. ఇలా ఎలా వెళ్ళటం?'' అని అటు తిరిగి ''అవునా'' అని అడిగింది.

అతడు ఆమె తెల్లటి వీపుమీద బిగుతుగా వున్న జాకెట్‌ను కొద్దిగా పైకి తీసి, స్ట్రాప్స్ అందుకోవడానికి ప్రయత్నంచేసి, రెండు చేతుల్తో లాగి దగ్గరకు చేరుస్తూ, ''తెగిపోలేదు, హుక్ విడిపోయిందంతే'' అంటూ సరిచేశాడు.

ఆమె బల్లమీద పెట్టిన హేండ్ బ్యాగ్ చేతిలోకి తీసుకొంటూ అతడి వైపు చూసింది. ఒక కారు బాగుచేసిన మెకానిక్ అలసట మాత్రమే కనబడింది అతడి మొహంలో.

ఇద్దరూ గది బైటకొచ్చారు. అతడు గది తలుపులు తాళంవేసి, మెట్లు దిగుతూ చివరి మెట్టు దగ్గిర కొచ్చేసరికి, అప్పటి వరకూ అడగనా వద్దా అన్నట్టూ మనసులోనే మధనపడి ఓ నిర్ణయానికి వచ్చినదాన్లా ఆగి, ''నేనొక ప్రశ్న అడుగుతాను, చెబ్తారా?'' అంది.

''ఏమిటి?''

అమెకు సిగ్గేసింది. కానీ అతడి మనసు లోతుల్లోని అస్పష్టతని తెలుసుకోవాలన్న కుతూహలం ఆ సిగ్గుని పక్కకు నెట్టింది. ''మీకు... మీకు ఏ కోర్కె కలగలేదా?'' అని అడిగింది. అతడి మొహంలో విస్మయం స్పష్టంగా కనబడింది. ''మీరొద్దన్నారుగా! ఒకసారి అన్న తర్వాత ఇక ఎందుక్కలుగుతుంది'' అన్నాడు. అంతలో ఏదో అర్థమైనట్లు నవ్వి ''కేవలము నా నిగ్రహం పరీక్షించటం కోసమే మీరు ఇలా చేసారా ఏమిటి'' అని అంతలోనే మారిన కంఠస్వరంతో ''నా ఆలోచన్లూ, భావాలూ అన్నీ మెటీరియలిస్ట్‌గానే వుంటాయి సులోచనా! ఇంకో వంద సంవత్సరాలు పోయినా - మనం ఇలాగే వుంటాం. మీరు బాత్‌రూంలో సబ్బు అందించమన్నా నాకే కోర్కె కలగదు. మీరు 'నో' అన్న క్షణం నుంచీ మిమ్మల్ని స్త్రీగా గుర్తించటం మానేశాను. అందుకే మనిద్దరి మధ్య భవిష్యత్తులో స్నేహం గురించి ప్రస్తావన వచ్చినప్పుడు తటపటాయించాను. మీతో నేను పేకాడలేను. మనసు బాగోలేనప్పుడు కలిసి మందు కొట్టలేను. ఇంకెలా మీతో స్నేహం చెయ్యటం? మనసులో ఒక భావాన్ని పెట్టుకొని పైకి మరోలా మాట్లాడటం నాకు చేతకాదు. నేను పచ్చిగా మాట్లాడినట్టూ అనిపిస్తే నన్ను క్షమించండి. మీకన్నా సునీల్ గవాస్కర్‌తో కలం స్నేహం చెయ్యటం నాకు ఇష్టం'' అన్నాడు.

''ఎంత దారుణమైన ఆలోచనలు మీవి! మనసుని కూడా అణాపైసల్తో లెక్క కట్టేటట్టూ వున్నారే.''

చంద్రుడు మబ్బులచాటుకి వెళ్ళటంతో వెన్నెల మాయమైంది. ఆ చీకటిలో అతడి మొహంలో భావాలు కనబడుటలేదు. లోతైన స్వరంతో కంఠం మాత్రం వినిపిస్తూంది. ''చాలా దారుణమైన భావాలు అవును, చాలా వ్యాపార సంబంధమైన భావాలు, ఏ మాత్రం లాలిత్యం వున్న అమ్మాయి మనసునైనా తూట్లు పొడిచే భావాలు? నాకు ప్రేమ మీద నమ్మకం లేదు. దాని గురించి ఏళ్ళ తరబడి ఆలోచించి బస్తాలకొద్దీ కావ్యాలు వ్రాస్తారెందుకో అర్థం కాదు. అదో క్రిమినల్ వేస్ట్ ఆఫ్ టైమ్ అని నా ఉద్దేశ్యం''

''ప్రేమపట్ల మీకింత తేలికైన అభిప్రాయాన్ని కలిగించిన వారెవరు?''

''మా కుటుంబ సభ్యులు'' అన్నాడు. ''ఇన్‌సెస్ట్ అన్న పదం మీరెప్పుడైనా విన్నారా? ఇన్‌సెస్ట్ అంటే దగ్గిర బంధువుల్తో శారీరక సంబంధం. ప్రస్తుతం పాశ్చాత్య దేశాల్లో దారుణంగా పెరిగిపోయిన ఈ ఇన్‌సెస్ట్ పాతిక సంవత్సరాల క్రితమే మా ఇంట్లో వుండేది. నా తల్లి స్కూల్ టీచర్. ఓ మధ్యాహ్న ఏదో పనిమీద ఇంటికి వచ్చిన ఆవిడకి తన మొగుడూ, కూతురు పక్కమీద కనబడ్డారు. అక్కడే ఆ ఇద్దర్నీ చంపేసి ఎనిమిది సంవత్సరాల జైలు అనుభవించి అక్కడ జైలర్‌తోనే ఆ తర్వాత లేచిపోయింది.''

అతడు చాలా మామూలుగా మాట్లాడటానికి ప్రయత్నించినా వణికే కంఠాన్ని స్వాధీనంలో ఉంచుకోవటానికి చాలా కష్టపడుతున్నాడని ఆమె గ్రహించింది. అటువైపు తిరిగి ఉండటంవల్ల అతడిమొహం కనపడటంలేదు. అతడు చెప్పసాగేడు. ''చదువుకోవటం కష్టమయింది. స్కాలర్‌షిప్ సరిపోయేదికాదు. ప్రైవేట్లు చెప్పటం తప్పనిసరి అయింది. దాంతో చదువుకి టైమ్ ఉండేదికాదు, రోజుకి పదహారు గంటలు పనిచెయ్యటం అలవాటయింది. చదువు పూర్తయ్యాక ఒక్కసారి సమయాన్ని ఏం చేసుకోవాలో తెలియలేదు. కార్టూన్స్, గిటారు అన్నిటికన్నా ఎక్కువగా పుస్తకాలు వీటితో చీకట్లోంచి వెలుగులోకి వచ్చినట్టయింది. ఇంత ప్రపంచం నా చుట్టూ వుందా అనిపించింది. ఒక్కసారి ఈ 'స్పృహ' కలిగాక ఈ ప్రేమమీద - సున్నితమైన భావాలమీదా నమ్మకం పోయింది. నా ఈ పరిణామానికంతటికీ కలిపి మీరు 'మెటీరియలిజం' అని పేరు పెట్టుకుంటే నాకు అభ్యంతరం లేదు... పదండి మనం ఇలా వరండాలో నిలబడి మనసులు విప్పుకోవటం ఏమీ బాగోలేదు.'' అంటూ కదిలేడు.

ఆమె కదల్లేదు. నిశ్చేష్టురాలైనట్టూ అలానే నిలబడి వుంది. ఏ మనిషీ చెడ్డవాడు కాదు. మనసు లోతుల్లోకి చూడగల్గితే అంతే అనిపించింది ఆమెకి.

''జీవితాన్ని ఇంత బిజినెస్‌లా తీసుకొనే మీరు పెళ్ళెందుకు చేసుకోలేదు. నా ఉద్దేశ్యం భార్యమీద నెలకి ఓ మూడు నాలుగొందలు ఖర్చు పెట్టటం ద్వారా ఓ వంటమనిషి కమ్ - స్త్రీ - కమ్ పనిమనిషి వస్తుంది కదా'' అంది.

ఆమె మాటల్లో ఎగతాళి ఏదైనా వుందేమోనని అతడు ఆమెవైపు చూసేడు. ఆమె నవ్వేసరికి తనూ నవ్వుతూ ''నిజమే, ఈ ఆలోచన నాకు రాలేదు సుమా! అయినా ఇంత పచ్చి అభిప్రాయాలున్న నన్ను ఎవరు చేసుకుంటారు. నాకు మాటల్తో మోసం చెయ్యటం ఇష్టంలేదు'' అన్నాడు.

''నాలాటి ఒంటరి ఆడది ఎవరైనా చేసుకోవచ్చు. అడిగి చూడండి.''

''నిజంగా చేసుకుంటారా?''

''ఓ...''

''థాంక్యూ! రెండు మూడు రోజుల్లో గుడి కానీ, చర్చికానీ ఏది ఖాళీ వుంటే అక్కడ చేసుకుందాం. ఓ.కే.''

''సరే''

* * * * *

''ఏమిటి ఇంతేనా? అయిపోయిందా'' ఆశ్చర్యపోతూ అడిగాడు రేవంత్.

''ఇంతేనా ఏమిటి. అంతే అయిపోయింది'' కుర్చీ వెనక్కి వాలుతూ అన్నాడు జేమ్స్.

''నేను నమ్మలేను, ఇంత తొందరగా కేవలం రెండే రెండు ప్రశ్నలతో ఇద్దరూ ఈ నిర్ణయానికి వచ్చేశారా?''

''జీవితాంతం కలిసి వుండబోయే నిర్ణయాన్ని ఇంత క్యాజువల్‌గా తీసుకున్నారా'' ప్రశ్నమీద ప్రశ్న కురిపించాడు రేవంత్.

''అంటే చేసుకోబోయేముందు ఓ నెలరోజులపాటు ఒకరినొకరు ఐ.క్యూ. టెస్ట్ పెట్టుకోవాలంటావా?''

జేమ్స్ తనని దెబ్బకొట్టాడని అనుకున్నాడు రేవంత్. అయినా వాళ్ళిద్దరి మధ్య ఆ మాత్రం చనువుంది. రేవంత్ ఈ విషయాన్ని జీర్ణించుకోలేక ''ఆమె ఎలాటిదో ఏమిటో నీకు ఏం తెలుసు?'' అని అడిగాడు.

''నీ వెన్నెల్లో ఆడపిల్ల ఎలాంటిదో తెలియకుండానే ఆమెని నువ్వు ప్రేమించటంలేదూ? మూడు నిముషాల పెళ్ళిచూపులు అన్న లాజిక్ నీకూ వర్తిస్తుందని ఎందుకనుకోవూ'' అని ఆగి, ''నువ్వు అడగబోయే రెండో ప్రశ్న నాకు తెలుసు. అర్ధరాత్రి మోటార్‌సైకిల్ ఎక్కి ధైర్యంగా నీ రూమ్‌కి వచ్చిన అమ్మాయి పవిత్రత గురించి నీకు అనుమానం కలుగలేదా! అని అంతేనా? ఈ పవిత్రత గురించి అనేది ఒక ట్రాష్ అని నా ఉద్దేశం. నాకు అనుమానం

కలిగిందే అనుకో... అర్ధరాత్రి ఒక అమ్మాయిని తీసుకొని వెళ్ళిన నా పవిత్రతమీద కూడా ఆమెకి అనుమానం కలగాలి కదా. పురుషుడికి అక్కర్లేని పవిత్రత స్త్రీకి ఎందుకు కావాలంటుందో ఈ సమాజం నాకర్థంకాదు. నేనుట్టి మాటలు చెప్పేవాణ్ణి కాదని నీకు తెలుసు. మేమిద్దరం కలిసివుంటాం అంతే! ఇరవైనాల్గు గంటలు బిజీబిజీ దినచర్య మూడు నిముషాల 'బయాలాజికల్ నీడ్' కోసం పరస్పరం సహకరించుకుంటాం. ఓ యాభై సంవత్సరాల తర్వాత ఇద్దరం చచ్చిపోతాం. ఇంతదానికి ఇంత మానసిక సంఘర్షణా - నిర్ణయాలూ - సిద్ధాంతాలూ ఇవన్నీ ఎందుకు? పెళ్లనేది రిస్కు అయినప్పుడు ఆ రిస్కు ఎవరితోనైతేనేం? ఈ మాటలు నీకు నవ్వు పుట్టించవచ్చు. కానీ జీవితంలో ఎన్నో రాపిడులకు గురి అయిన నా మనసు నాకు నేర్పిన పాఠం ఇది. ఇది నేనేదో కష్టాల్లో వున్నాను, నామనసు నెవరూ అర్థం చేసుకోవటం లేదు, వగైరా సెల్ఫ్‌పిటీ ఆలోచన్లు నాకు అందుకే కలగవు. దీనికి మీరు పెట్టిన పేరు మెటీరియలిజం అయితే నాకు అభ్యంతరం లేదు. ఎందుకంటే అసలు పెళ్ళి అనేది పురుషుడూ స్త్రీ అనే ఇద్దరు మెటీరియలిస్టులు తమ పరస్పర అవసరాలు తీర్చుకోవటం కోసం చేసుకొనేది అని నేను భావిస్తాను. పైకి ఎంత భావుకత్వమూ, సెంటిమెంటూ, కవిత్వమూ చెప్పినాసరే... ఇన్ని ఆలోచించే నేనీ పెళ్ళికి సిద్ధపడ్డాను. ఎల్లుండే పెళ్ళి! వచ్చెయ్యి.''

12

‘‘**చాలా** విచిత్రమైన వ్యక్తిలాగా వున్నాడే’’ అందామె ఫోన్‌లో రేవంత్ జరిగిందంతా చెప్పాక.

‘‘సరిగ్గా మనకు వ్యతిరేకం’’ అన్నాడు రేవంత్. ‘‘మనం నెలరోజుల పాటు పడే మధనని అతడు రెండు నిముషాల్లో పడేసేడు.’’

‘‘కానీ అతని వాదనలో ఎక్కడో లోపం వుంది’’ అందామె... ‘‘ఇరవై నాలుగ్గంటల బిజీబిజీ జీవితంలో చిన్న శరీరావసరమే కాదు, వివాహంలాటి చిన్న చిన్న అనుభూతుల కోసమే మనిషి జీవిస్తాడు. అసలు బిజీ బిజీ అంతా ఎందుకు? జీవించటం కోసమే కదా. మరి జీవించటం ఎందుకు? ఆనందం కోసమే కదా! ఆ ఆనందం ఎలా వస్తుంది. అనుభవం ఇచ్చిన ఆనందంవల్లేకదా! మరి వివాహం అనుభవం కాదూ, అవసరం అని ఎలా చెప్పగలము! నిజం చెప్పండి నేను మొదటిసారి ఫోన్ చేసినప్పుడు మీకు ఎలా అనిపించింది?’’

‘‘ఆ రాత్రంతా మీ కంఠమే వినిపించింది. ఒక అమ్మాయి వాలుగా పక్కమీద పడుకొని గోదావరిలాంటి జడని మెడమీదనుంచి ముందుకు జార్చుకుని, చెవికి ఫోన్ ఆన్చుకుని మాట్లాడే దృశ్యమే కళ్ళలో మెదిలింది.’’

''అంత చక్కటి అనుభూతిని ఏ మెటీరియలిస్టు కొలమానంతో కొలుస్తాం? జీవితం అంటే చక్కటి అనుభూతుల పుష్పగుచ్ఛమే కదా.''

''అవును, అందుకే...'' అంటూ చప్పున ఆపు చేశాడు.

''ఏమిటి ఆగారేం? చెప్పండి''

''ఏం లేదు, ఏం లేదు''

''నాకు తెలుసు మీరేం చెప్పదల్చుకున్నారో.''

''ఏమిటి?''

''నన్ను కేవలం ఆట పట్టించడానికే నా ఫోన్ నెంబర్ తెలియనట్టు నటిస్తున్నారు. నిజానికి మీరు ఎప్పుడో దాన్ని కనుక్కున్నారు. అది చెప్పేస్తే ఈ దాగుడుమూతలు ఇక వుండవని - నెలరోజుల చివరి వరకూ దీన్ని ఇలా సరదాగా లాగాలనీ మీరనుకుంటున్నారు. అవునా!''

రేవంత్ అప్రతిభుడయ్యాడు. నిజానికి అతడు నెంబర్ని కనుక్కున్నాడు. కానీ చెప్పలేదు. అతడికి ఆ అమ్మాయి పరీక్షలో నెగ్గటంకన్నా అమ్మాయితో ఏడిపింపబడటమే సరదాగా వుంది. ఈ విషయం కూడా ఆ అమ్మాయి కనుక్కుంది. అంతే 'మైగాడ్' అనుకున్నాడు.

''నేను కొద్దిగా కన్‌ఫ్యూజ్ అయ్యాను.''

''ఎలా''

''మూడో అంకె సున్నా అని తేలిపోయింది. కానీ చివర మూడు అంకెల్ని ఒకదానితో ఒకటి హెచ్చవేస్తే 24 వస్తుంది అన్నారు. ఒక అంకె సున్నా వుంటే - అంతా సున్నాయే అవ్వాలి కదా!''

''అవ్వాలి! కానీ మీరు సున్నా లెక్కలోకి తీసుకోరు అనుకొన్నాను.''

''నిజానికి తీసుకోలేదు. తీసుకోకపోతేనే వస్తుంది. I ATE NOTHING FOR SIX సరి అయిన అర్థం 18046. ఆ నెంబరు అది కాకపోతే 18226 అయ్యుండాలి. ఈ రెండు నెంబర్లూ ఎనిమిదోక్లాసు కుర్రవాడు రెండు నిముషాల్లో కనుక్కుంటాడు.''

''ఆ నెంబర్లకి చేశారా ఏమిటి కొంపదీసి.''

''చేసేను.''

''ఎవరివా నెంబర్లు?''

''పిచ్చాసుపత్రి, కాన్సర్ ఆసుపత్రులవి.''

అవతల్నుంచి తెరలు తెరలుగా నవ్వు. కొంచెం సేపటికి నవ్వాపుకుని ఆమె అన్నది. ''మీరు నిజానికి చాలా దగ్గరికి వచ్చారు. కానీ చివర్లో కొద్దిగా పప్పులో కాలు వేసేరు. ప్రయత్నించండి. పర్లేదు. తొందర్లోనే

దొరకవచ్చు. ఎనిమిదో క్లాసు కుర్రవాడికన్నా కొద్దిగా ఎక్కువ తెలివి తేటలు వుపయోగించండి. టైమ్‌కూడా ఎక్కువలేదు.''

''ఇంకా నాలుగు రోజులే వుంది.''

''ఆ టైమ్ చాలు.''

''నా మూడో ఉత్తరం అందిందా?''

''మూడో ఉత్తరమా?'' ఆశ్చర్యంగా అడిగాడు. ''ఇంకా రెండో ఉత్తరమే అందనిదే.''

''మా మెకానిక్‌తో పంపించిన చీటీ ఉత్తరం కాదా మాష్టారూ - అదే రెండోది.''

''ఓ అదా'' అన్నాడు రేవంత్ నవ్వి.

''నేను వ్రాయటమే కాని మీరు నాకు వ్రాయరా?''

''నేనా? నేను వ్రాసి ఏ అడ్రసుకి పంపను?''

''మీరు వ్రాయండి. నేను తీసుకుంటాను.''

''అయితే ఇప్పుడే వ్రాస్తాను. ఎలా మీకు పంపాలో గంట తరువాత ఫోన్ చేసి చెప్పండి.''

''ఇది మీ మొదటి ప్రేమలేఖ మాష్టారూ! గంటలో పూర్తవుతుందంటే నేను నమ్మను. ఆఫీసులో సాయంత్రం అయిందింటి వరకూ మీరు కుస్తీపట్టాల్సిందే. అప్పుడు ఫోన్ చేస్తాను'' అంటూ డిస్‌కనెక్ట్ చేసింది.

ఆమె చెప్పింది నిజమే అయింది. ప్యూన్‌తో గులాబిరంగు లెటర్ పాడ్ తెప్పించాడు. అయిదు నిముషాల్లో దాని కాగితాలన్నీ చెత్తబుట్టలోకి చేరుకొన్నాయి. అసలు సంబోధనే కష్టమైంది. 'ప్రియమైన మీకు' అనాలా అన్న మీమాంస మీద రెండు కాగితాలూ, నమస్తే అనాలా, వద్దా అన్న అనుమానం మీద రెండు కాగితాలూ చినిగిపోయాయి. ఇక లాభంలేదని ముందు రఫ్ వ్రాయటం ప్రారంభించాడు.

''నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను'' అని వ్రాద్దామనుకున్నాడు. ప్రపంచంలో అంతకన్నా నాన్సెన్సికల్ వాక్యం మరొకటి వుండదని చింపేసేడు.

''నా జీవితపు ఆఖరి క్షణాల్లో చావుకి ముందు ఎవరైనా నన్ను 'నీ మొత్తం జీవితంలో మరపురాని ఘట్టం ఏమిటి రేవంత్' అని ఆడిగితే 'వెన్నెల్లో ఆడపిల్లతో ఫోన్‌లో మాట్లాడటం' అని వ్రాద్దామనుకున్నాడు. కేవలం మాట్లాడటమే చాలా? అని వేళాకోళం చేస్తుందని విరమించుకున్నాడు.

ఎటూ తోచలేదు. వ్రాస్తున్నాడు. చింపేస్తున్నాడు. ఎన్నెన్నో భావాలు - ఎన్నో కాగితాలు.

మూడయింది - నాలుగయింది - ఐదయింది.

ఫోన్ మ్రోగింది.

''వ్రాసేరా.''

''ఆ'' అని అబద్ధమాడేడు. ''ఎలా అందించాలి?''

''నేనే వచ్చి తీసుకుంటాను.''

ఎగ్జైయిట్‌మెంట్ నిండిన కంఠంతో ''ఎక్కడ?'' అని అడిగాడు.

''మీ ఆఫీసులోనే''

ఒక్కసారిగా రేవంత్ వంట్లో రక్తం వేగంగా ప్రవహించసాగింది ''మీరే వస్తారా?''

''ఆ నేనే స్వయంగా''

''ఎప్పుడు?''

''ఇప్పుడే బయలుదేరుతున్నాను'' అందామె. ''మీరు ఆ కవరు మీ ఆఫీసు వరండాలో విజిటర్లు కూర్చొనే కుర్చీ క్రిందగా పడెయ్యండి. నేను వచ్చి తీసుకుంటాను. అయితే మీరు మాత్రం అక్కడ దొంగతనంగా దాక్కొని చూసే ప్రయత్నం చెయ్యకూడదు. ఈ షరతు మీకు ఓకేనా?''

"ఓకే. మిమ్మల్ని చూడను. అసలా ప్రాంతంలోనే వుండను. మీమీదొట్టు."

"మీరు వచ్చి మీ కారుదగ్గర నిలబడి వుండండి. మిమ్మల్ని అక్కడ చూసుకుని నిర్ధారణ చేసుకుని నేను విజిటర్ కుర్చీల దగ్గిరికి వెళ్తాను."

"సరే అయితే" ఫోన్ పెట్టేసి లెటర్ పాడ్‌లో చివరి కాగితం తీసుకొన్నాడు. దానిమీద ఏమీ వ్రాయకుండా కవర్లో పెట్టి అతికించేడు. కవర్ మీద మాత్రం

"ఓ వెన్నెలమ్మాయీ! ఎన్నో భావాలు ఎన్నెన్నో ముచ్చట్లూ చెప్పాలనుకున్నవన్నీ చెలియలికట్ట దాటి కలగాపులగమైతే మిగిలేది స్వచ్ఛమయిన శూన్యం.

రేవంత్ -"

__ అని వ్రాశాడు.

తరువాత ఇంటర్‌కమ్‌లో జేమ్స్‌ని పిలిచాడు.

"జేమ్స్ ఒక ముఖ్యమైన పనిమీద నిన్ను పిలిచాను. నువ్వు నాకో సాయం చెయ్యాలి" అంటూ జరిగిందంతా చెప్పాడు.

"తొందర్లో ఆ అమ్మాయి పప్పులో కాలేసింది. నన్ను అక్కడ వుండొద్దని అన్నదే కాని - నా స్నేహితులెవర్నీ అక్కడ వుంచకూడదన్న

ప్రామిస్ తీసుకోలేదు. కాబట్టి అక్కడ నువ్వు దాక్కోవాలి, ఆ అమ్మాయిని ఈరోజు ఎలాగైనా పట్టుకోవాలి.''

జేమ్స్ తలూపేడు. ఇద్దరూ విజిటర్స్ వరండాలోకి వెళ్ళారు. రేవంత్ కుర్చీ క్రిందుగా కవర్ పెట్టాడు. సాయంత్రం అయిదయిపోవటం వల్ల ఆఫీసంతా దాదాపు నిర్మానుష్యంగా వుంది.

''నేను కారు దగ్గరకు వెళ్తున్నాను.'' అని రేవంత్ క్రిందికి పరుగెత్తాడు. జేమ్స్ పార్టీషన్ ప్రక్కన మసకనీడలో నిలబడ్డాడు. అయిదున్నర అయినట్టూ గడియారం ఒక గంట కొట్టింది.

విజిటర్స్ లాంజ్ వెనుక చీకట్లో నిలబడి చూస్తున్న జేమ్స్‌కి బైట కారు దగ్గిర నిలబడి వున్న రేవంత్‌కీ టెన్షన్‌లో చెమట్లు పడుతున్నాయి. వచ్చి ఆగిన ప్రతీ కారువంకా తొంగి చూస్తున్నాడు రేవంత్.

అయిదు నిముషాలు గడిచినయ్...

.... పది నిముషాలు...

జేమ్స్ విసుగ్గా వాచీ చూసుకున్నాడు. ఈ అమ్మాయి తమ ప్లాన్ గ్రహించి రావటం మానేసిందేమో అన్న అనుమానం కల్గింది. ఇంతలో రేవంత్ నిశ్శబ్దంగా అక్కడికి వచ్చి, జేమ్స్ వెనగ్గా చెవిలో ''ఏమిటి రాలేదా?'' అని గుసగుసలాడేడు.

''ఊహూ'' అన్నాడు జేమ్స్.

అంతలో రేవంత్ దృష్టి కుర్చీ క్రింద ఉన్న మరో కాగితం మీద పడింది. తాము పెట్టిన ఉత్తరం పక్కనే ఆ కాగితమూ వుంది. దాన్ని చూసుకోలేదు. చప్పున వెళ్ళి ఆ కాగితాన్ని చూసేడు. అమ్మాయి రైటింగ్ అది.

''- ఈ విజిటర్స్ కుర్చీ కింద వద్దు. మొదటి అంతస్తులో నీళ్ళటాంక్ పక్కన పెట్టండి'' అని వుంది అందులో.

స్నేహితులిద్దరూ మొహమొహాలు చూసుకున్నారు. ''మనం కవర్ పడేసేటప్పుడు ఈ కాగితం చూసుకోకపోవటం మనదే తప్పు. పాపమా అమ్మాయి అక్కడ ఎదురుచూస్తూ వుండి వుంటుంది. ఏమీ తెలియనట్టూ నేను వెళ్ళి ఈ కవరు అక్కడ పెట్టేసి వెళ్ళిపోతాను. నువ్వు చాటునవుండి అమ్మాయిని చూడు'' అంటూ మొదటి అంతస్తుకు పరుగెత్తాడు.

నీళ్ళటాంకు పక్కన కవరు పెట్టబోతుంటే అక్కడ ఇంకో చీటీ కనబడింది. ''ఇక్కడా వద్దు, నాలుగో అంతస్థులో టాయిలెట్ తలుపు పక్కన పెట్టండి'' అని.

అక్కడికి వెళితే మూడో అంతస్థు అని వ్రాసి వుంది.

పది నిమిషాలు గడిచేసరికి స్నేహితులిద్దరూ పట్టు వదలని విక్రమార్కుల్లా రొప్పుతూ ఒక అంతస్థు నుంచి ఒక అంతస్థుకి

పరుగెడుతున్నారు. అరగంట అయ్యాక ఆఖరిచీటీ దొరికింది... 'చాలా కష్టపడ్డారు. ఇక మీ గదికి వెళ్ళండి' అని వ్రాసుంది.

రేవంత్ హతాశుడయ్యాడు.

"బహుశా మన ప్లాన్ గ్రహించి ఉంటుందేమో గురూ!" అన్నాడు జేమ్స్.

"అలా అయితే తను ఓడిపోనట్లేగా!" అంటూ తన గది తలుపు తీయబోతూ వుంటే నౌకరు పరుగెత్తుకుంటూ వచ్చి రేవంత్‌తో -

"అమ్మాయిగారు ఇప్పటివరకూ మీ గురించి చూసి వెళ్ళిపోయారు సార్!" అన్నాడు.

రేవంత్ తెల్లబోయి, "ఏ అమ్మాయిగారు?" అని అడిగాడు.

"మీ మామయ్యగారి అమ్మాయి"

రేవంత్, జేమ్స్ ఒకర్నొకరు చూసుకున్నారు. తలుపుతోసి లోపలికి ప్రవేశించిన రేవంత్ తన గదిలోని చెత్తబుట్ట ఖాళీగా వుండడం చూసి ఏదో అర్థమై నిశ్చేష్టుడయ్యాడు.

క్షణంలో ఎన్నో ఆలోచన్లు.

- మామయ్య కూతుర్ని అని చెప్పి, తను లేనప్పుడు తన గదిలో కూర్చొని ఆ అమ్మాయి, తాను ప్రేమలేఖ వ్రాయటానికి ముందు

ఖరాబుచేసిన కాగితాలన్నింటినీ ఏరి మూటగట్టుకు తీసుకువెళ్ళిందన్న మాట. ఫెయిర్‌గా వ్రాసిన ఆఖరి ఉత్తరంకన్నా, దానిముందు వ్రాసిన రఫ్ ఉత్తరాల్లోనే అసలు మనసు తెలుస్తుంది. హిపోక్రసీ ఉండదు. అవే అసలైన ప్రేమలేఖలు. ఈవిడ ఇక్కడ వాటిని తాపీగా కట్టగడుతూంటే... తనేమో పెద్ద డిటెక్టివ్‌లా ఖాళీ కవర్ పట్టుకుని అంతస్థులన్నీ తిరిగాడు.

మొదటి ప్రేమలేఖ వ్రాసేవాడు, తప్పకుండా పాతిక కాగితాలు పాడుచేస్తాడని తెలిసే 'పర్లేదు, సాయంత్రం వరకూ వ్రాయండి'' అని ప్రేమగా టైమ్ ఇచ్చింది. తను ఆ వలలో నాజుగ్గా పడిపోయాడు.

'ఇడియట్' అని తనని తనే తిట్టుకున్నాడు రేవంత్.

అప్పటివరకూ జరిగిందంతా జూస్తున్న జేమ్స్ ఇక ఇది లాభంలేదన్నట్టుగా ''ఈ అమ్మాయెవరో మనం అనుకున్న దానికన్నా తెలివయినదాన్లా ఉంది గురూ. ఈ అమ్మాయి గురించి తెలుసుకోగలిగిన వాడూ, ఆమె నెంబరు కనుక్కోగలిగినవాడూ ఒక్కడే వున్నాడు'' అన్నాడు.

రేవంత్ ఉత్సాహంగా ''ఎవరతను?'' అన్నాడు.

''అతనో కంప్యూటర్ టెక్నాలజిస్ట్. ఎలక్ట్రానిక్ గ్రాడ్యుయేటు. అంతేగాదు; గణితశాస్త్రంలో దిట్టకూడా. అతడు నాకు తెలుసు. యీ పనికి అతడిని రేపే నియమిద్దాం''

''ఎవరతను?''

‘‘పండిత పిచ్చయ్యశాస్త్రి’’

* * * * *

‘‘నమస్కారము. మేము లోపలికి ప్రవేశించవచ్చునా?’’

పనిచేసుకుంటున్న రేవంత్ తలెత్తి చూశాడు. తలుపు దగ్గిర వ్యక్తి నుదుటిమీద బొట్టుతో, నెత్తిమీద చిరు పిలకతో, చేతిలో సంచితో నిలబడివున్నాడు. ఆఫీసుకిలా జ్యోతిష్కులు వచ్చి ఎవరికెప్పుడు ప్రమోషన్లు వస్తాయో చెప్పటం అలవాటే. కొంతమంది చిలకల్ని కూడా తెస్తూవుంటారు.

‘‘ఎవరు మీరు’’ అని అడిగాడు.

‘‘మమ్ముల పండిత పిచ్చయ్యశాస్త్రుల వారందురు.’’

రేవంత్ అదిరిపడి ఆ వ్యక్తివైపు చూశాడు. జేమ్స్ చెప్పినట్టూ ఇతడు ఎలక్ట్రానిక్ గ్రాడ్యుయేట్, కంప్యూటర్ టెక్నాలజిస్ట్ కాడేమో అన్న అనుమానం వచ్చింది.

‘‘మీరు....’’ అన్నాడు సందిగ్ధంగా.

‘‘నేను ఋణ విద్యుదాంక గణశాస్త్ర పట్టభద్ర సాంకేతిక నిపుణుడను. జేమ్స్ నామధేయుడు పంపగా వచ్చితిని’’

''అంటే ఎలక్ట్రానిక్ టెక్నాలజీయా'' అని అనుమానంగా అడిగాడు రేవంత్.

''ఆంగ్లములో చెప్పవలెనన్న అంతియే! కానీ మాతండ్రి వేదవేద పారంగతుడు. మా తండ్రిగారి తండ్రి పండిత పురుషోత్తముడు. అటువంటి శోత్రియ వంశములో పుట్టిన నేను యీనాడు ఏదో ఈ ఆంగ్లభాష నభ్యసించిన కారణముగా సాంప్రదాయమును వదులుకోలేను. అందుకే నా యీ వేషధారణ, భాషా ఉచ్చారణ. దీన్ని చూసి మీరు బెదరకుండా నా మేధా సంపత్తిని సంశయించక - మీ కష్టమును చెప్పుడు''

''ఒక బాలికను నేను ప్రేమించితిని. ఆమె మెదడు ఒక అణుగణాంక పెట్టె. ఆమె ఇంటి శబ్దగ్రహణయంత్ర సంఖ్యను కనుగొనవలెను'' అన్నాడు రేవంత్.

ఇంతలో ఫోన్ మ్రోగింది. రేవంత్ కన్నా ముందే అతడు ఎత్తుకున్నాడు ఫోన్‌ని.

''అవును బాలికా... ఇది రేవంతుని శబ్దగ్రహణ యంత్రమే. అతనిక్కడే వున్నాడు. కానీ అతడి తరపున నేను కొన్ని ప్రశ్నలడుగుదును. సంశయింపక జవాబు ఇమ్ము....''

ఆ అమ్మాయి ఏంమాట్లాడుతుందా అని రేవంత్ ఊపిరి బిగపట్టి చూస్తున్నాడు. వాళ్ళిద్దరికీ మధ్య కొంత సంభాషణ జరిగింది. తనెవరో ఆమెకి చెప్పాడు పిచ్చయ్యశాస్త్రి.

''ఇప్పుడు నా అపూర్వ మేధాసంపత్తి నుపయోగించి నీ అంకెను కనుగొనెదను. ఈ ప్రశ్నలు చాలా తెలివైనవి. జాగ్రత్తగా సమాధానాలు ఇవ్వవలెను సుమా!''

''ఇచ్చెదను, ఇచ్చెదను, అడుగుడు, ఋణవిద్యుదాంక గణ విజ్ఞాన శిరోమణి'' అన్నదా అమ్మాయి అవతల్నుంచి.

''చూపుడు వేలుతో నీ యంత్రమును తిప్పునప్పుడు మొదటి అంకె తిప్పుటకు పట్టుకాలముకంటె రెండో అంకె తిప్పుటకు పట్టుకాలము ఎన్ని రెట్లు ఎక్కువ?''

''రెండు రెట్లు ఎక్కువ''

''అనగా నీ ఉద్దేశ్యం మొదటి అంకె ఒకటయిన రెండో అంకె రెండగునా?''

''మీరు పప్పులో కాలువేసిరనుటకు విచారించుచున్నాను. ఒకటి పక్కనే రెండు వుండును. చివరవరకూ తిప్పుటకు పట్టుకాలము రెంటికి దాదాపు ఒకటే. చాలా కొద్ది తేడాయే వుండును. రెండు రెట్లు వుండదు''

పిచ్చయ్యశాస్త్రి గతుక్కుమని, ‘‘అపూర్వ మేధాసంపత్తి వున్న మాలాంటి మేధావులు ఇటువంటి చిన్న విషయమును మరచిపోవుటలో చిత్రమేమీ లేదు’’ అంటూ సర్దుకున్నాడు.

పండిత శాస్త్రి కాగితం, కలం తీసుకొన్నాడు.

అమె చెప్పింది, ‘‘టాన్ తీటా బై రూట్ ఆఫ్ వన్ ప్లస్ టాన్ స్క్వేర్ తీటా.’’

పిచ్చయ్యశాస్త్రి కంగారుగా ‘‘మరియొకసారి చెప్పుడు’’ అన్నాడు. ఆమె చెప్పింది. చెప్పి తీటా ఎలా కనుక్కోవాలో వివరించింది.

పిచ్చయ్యశాస్త్రి ఆమెతో మాట్లాడటం పూర్తిచేసి ఫోన్ పెట్టేసి, రేవంత్ వైపు తిరిగి ‘‘తెలిసినది - తెలిసినది’’ అన్నాడు.

రేవంత్ విసుగ్గా ‘‘ఏమి తెలిసినది, ఏమి తెలిసినది’’ అన్నాడు.

‘‘ప్రేమికుడా! ఈ బాలిక ఫోన్ సంఖ్య తెలుసుకోవలెనన్న నువ్వు మన పెద్ద బజారు నాలుగుదారుల కూడలి వద్దనున్న నెహ్రూ బొమ్మ దగ్గిరకు పోవలెను.’’

‘‘పోయి ఏమి చేయవలెను?’’

‘‘పావురమును ఎగరవేయు నెహ్రూగారి కుడిచెయ్యి ఆయన శరీరమునకు ఎంత కోణములో వున్నదో కనుగొనవలెను.’’

‘‘ఏడ్చినట్టున్నది.

‘‘అలనాడు రాజకుమారులు ప్రేమకై సప్తసముద్రములు దాటినారు. నీవీ మాత్రము చేయలేవా?’’

రేవంత్ ఆలోచన్లో పడ్డాడు.

జేమ్స్ ప్రోత్సహిస్తున్నట్టూ చూశాడు. రేవంత్ కొద్దిగా తటపటాయించి ‘సరే’ అన్నాడు.

ఆ రాత్రి పదకొండింటికి అతడూ, జేమ్స్ నల్లబట్టలు వేసుకొని నెహ్రూ విగ్రహం దగ్గిరకు చేరుకున్నారు.

అనుకున్నంత సులభంగా కాలేదు పని.

టేపులు పట్టుకుని కొలుస్తుంటే బీటు కానిస్టేబిలు పట్టుకొన్నాడు. తాము అరేబియా దేశస్తులము కామని, శిల్పాలని స్మగ్లింగ్ చేసే వాళ్ళము అసలే కామని ఎంత చెప్పినా విన్లేదు. ‘సర్వే డిపార్ట్‌మెంటు వాళ్ళము’ అని చెప్పారు. కానీ, అర్ధరాత్రి ఆ డిపార్ట్‌మెంటు వాళ్ళు ఎందుకు పనిచేస్తారని ఎదురు ప్రశ్న వేశాడు పోలీసు. కొద్దిగా తెలివితేటలున్నవాడిలా కనబడ్డాడు అతడు. పొరపాటున పోలీసు డిపార్ట్‌మెంటులోకి వచ్చినట్టున్నాడు. అతడికి పదిరూపాయలిచ్చి తప్పించుకొనేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది. చివరికి ఆ కోణం ఎంతో కనుక్కొని ఆ రాత్రికి రాత్రి పిచ్చయ్యశాస్త్రి గారి ఇంటికి బయల్దేరారు.

రాత్రంతా నిద్రలేనట్టూ ఆయన కళ్ళు ఎర్రగా వున్నాయి. చుట్టూ కాగితాలు చెల్లాచెదురుగా పడివున్నాయి. వాటినిండా లెక్కలు వేసి వున్నాయి. వైర్లు, కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ ఇన్స్ట్రమెంట్లు చుట్టూ వున్నాయి. నిన్న ఆ అమ్మాయి చెప్పిన దానిమీద ఈయన ఇన్ని లెక్కలువేసి వుంటాడని అనుకున్నాడు రేవంత్.

"నెప్రూగారి చెయ్యి ఎనభై ఎనిమిది డిగ్రీలతో పైకిలేచి వున్నది. దీనిని బట్టి ఏమి తెలియుచున్నది?" అని అడిగాడు రేవంత్. పిచ్చయ్యశాస్త్రి కాగితంమీద వేశాడు. టాన్ తీటా బై రూట్ ఆఫ్ వన్ ప్లస్ టాన్ స్క్వేర్ తీటా.

$\theta = 88^\circ$

$\tan\theta / \sqrt{1+\tan^2\theta}$ ఆమెసెంబరు

$= \sqrt{\tan^2\theta} / \sqrt{1+\tan^2\theta}$

$= \sqrt{\frac{1+\tan^2\theta - 1}{1+\tan^2\theta}}$

$= \sqrt{1 - \frac{1}{1+\tan^2\theta}}$

$= \sqrt{1-\cos^2\theta}$

$= \sin\theta$

$\theta = 88^\circ$

$\sin\theta = 9994$

చిన్న లెక్కని అంత గందరగోళం చేసినందుకు అతడిని మనసులో అభినందించాడు రేవంత్.

ఆ తరువాత దానికి కొన్ని తీసేశాడు. సెంబర్లు కలిపాడు, కొన్నిటిని కాలిక్యులేటర్‌తో గుణించాడు. కొంచెంసేపు మాంత్రికుడిలా అలోచించాడు. తరువాత కళ్ళు తెరచి "తెలిసినది" అన్నాడు.

''ఏమి తెలిసినది?''

''రేవంతుని ప్రియురాలి టెలిఫోన్ నెంబర్.''

స్నేహితులిద్దరూ ఉద్వేగంతో ఒక్కసారిగా ''ఎంత'' అని అడిగారు. రేవంత్ చేతులైతే టెన్షన్‌తో వణకసాగాయి.

''బాలకుడా! నీ ప్రియురాలి ఫోన్ నెంబర్ 76346''

ఒక్కసారిగా గాలి తీసేసినట్టు రేవంత్ వెనక్కివాలి ''ఇట్స్ నాన్సెన్సికల్'' అన్నాడు.

పిచ్చయ్యశాస్త్రి కోపంగా ''ఇది తప్పుటకు వీలేలేదు'' అన్నాడు.

''మీరెక్కడో పొరపాటు పడ్డారు.''

''మూర్ఖుడా - మామేధా సంపత్తి - నాకాలిక్యులేటర్ల సాంకేతిక నిపుణత - నా విజ్ఞానము - ఎలక్ట్రానిక్స్ ప్రపంచంలో సైంటిస్టులు సాధించిన పరిజ్ఞానమూ - వీటినే పరిహసించుచుంటివా'' అని ఇంగ్లీషులో తిట్టాడు.

రేవంత్ నమ్రతగా అన్నాడు. ''వాటి సంగతి నాకు తెలీదు. ఈ నెంబర్ మాత్రం గన్‌షాట్‌గా కాదు.''

''ఈ నెంబరే''

''ప్రపంచంలో మరే నెంబరైనా కావొచ్చుగానీ, ఇది మాత్రం కాదు''

''అంత గన్‌షాట్‌గా ఎలా చెప్పగలవు?''

''అది నా ఫోన్ నెంబరు కాబట్టి''

13

డియర్ మీ....

బావున్నారా....

కొన్ని వద్దనుకున్నా వెంటాడుతూనే వుంటాయి, అలాంటివి మీ జ్ఞాపకాలు. వాటినుంచి తప్పించుకోవటానికి ప్రయత్నించీ లాభం లేక వూరుకున్నాను. ఆనందం అనే త్రాసు అనుభూతి అనే తులసీదళాలకి తప్ప మరి వేటికీ తూగదనుకుంటా.

నిన్నరాత్రి కారు అద్దాలు పైకెత్తేసి లోపల కూర్చుని నెహ్రూ జంక్షన్ దగ్గిర ఇద్దరబ్బాయిలు పోలీసులతో ఘర్షణ పడటాన్ని చూడటం, గమ్మత్తైన అనుభవం. ఏదో ఇంగ్లీషు పిక్చర్లో కామెడీ సీను గుర్తొచ్చింది.

మీ 'రఫ్' ఉత్తరాలన్నీ చదివాను. ఒక్కో వాక్యం ఎంత బావుందో.... అసలెలా సంబోధించాలా అన్నచోటే పది కాగితాల దాకా పాడు చేసినట్టున్నారు.

''మనసు లేంది నువ్వులేవు... నువ్వు లేనిది లోకం లేదు - లోకం లేంది బాధలు లేవు ఇంక ఆరాట మెవరికి, ఎవరికోసం? విశ్వ తేజస్సు కందక - మమతలో దాచుకొన్న మనసులోని నీడలే భేదాలు - భేదాలు

శోకాలు, రోగాలు.... దేనినుంచీ నువ్వు వేరుకాదు. తెలిసేదీ - తెలుసుకునేది ఆనందమూ, అనుభవమూ - అన్నీ నువ్వే...''

''ఎంత గొప్ప భావాన్ని ఎంత చిన్ని చిన్ని మాటల్లో వివరించాడు చలం. మీ ఉత్తరాల్లో ఇంకో వాక్యం నాకు బాగా నచ్చింది. 'నా యీ భావాన్ని నీకు చెప్పటం కన్నా, నాలో నేను దాచుకుంటేనే మనసు అంతరంగపు పొరల్లో అది నిక్షిప్తమై సంతోషాన్నిస్తుంది. చెప్పటం కన్నా చెప్పకపోవటంలో ఎక్కువ సంతోషం ఉంది కదూ? - అన్నది నా అభిప్రాయం ఎప్పుడూ తప్పుకాదు. పైకి ఎంతో మెటీరియలిస్టిక్‌గా కనబడే మీరు లోలోన ఎంత భావుకులు, అవునా?

మొన్న నాన్నగారు పుట్టినరోజు నాడు ఏదైనా కొనుక్కోమ్మని ఇచ్చిన డబ్బుతో స్మగ్లింగ్ ఫోన్ పరికరాలు తెప్పించి, ఆ విషయం ఇంట్లో చెప్పలేదు. డబ్బంటే నిర్లక్ష్యం ఎక్కువైందని అమ్మ ఓ రెండు గంటలు క్లాసు తీసుకుని టకటక ప్రైవేటు చెప్పేసింది. లెసనేకాదు నోట్సు కూడా ఇచ్చింది. ఈ మధ్య మరీ అల్లరి చేస్తున్నానట!

అల్లరి అంటే జ్ఞాపకం వచ్చింది. మొన్నో చిలిపి పని చేసేను. మీ ఆఫీసు ఎదురి ఫ్లాట్ (నెంబరు చెప్పను) కిటికీలోంచి మీ ఆఫీసు గదిలోకి బైనాక్యులర్స్ పెట్టి నేనూ, నా స్నేహితురాలూ ఓ గంటసేపు వాదులాడుకుంటూ అల్లరిచేస్తూ చూసేం. ఇంతకీ విషయం ఏమిటంటారా?

మాటి మాటికి మీరు క్రాపు సర్దుకునేది కుడిచేత్తోనని నేనూ, ఎడమచేత్తోనని నా స్నేహితురాలూ... మీరెవరితో ఏకీభవిస్తారు ఎడిటర్జీ? (కోపం వస్తే - అసలే నవ్వనా వద్దా అన్నట్టుండే మీ మొహం మరీ బావుంటుంది. నిజం!) మా స్నేహితురాలందీ - మీ నుదురు గోదావరి తిన్నెలా వుందిట. ఇంకా నయం - నోరు కృష్ణలంకలా ఉందనలేదు. ఇంకోసారి కాంప్లిమెంటు చేశావంటే చంపేస్తానన్నాను.

ఇక నా దినచర్య విషయానికొస్తే రెండు రోజుల్నుంచీ అమ్మా నాన్నగారూ ఇంట్లోలేరు. నేనే గొప్ప పాకశాస్త్ర ప్రవీణురాలినన్న మాట. ఇంట్లో మిగతావాళ్ళకి కూడా పెద్ద దిక్కుని నేనే. పెద్ద దిక్కు మా బామ్మ కూడా ఉందనుకోండి. బామ్మ అచ్చు ముళ్ళపూడి వెంకట్రవణగారి స్పెసిమన్. బామ్మతో మాట్లాడేటప్పుడు 'రక్షించు దేవుడా' అని పారిపోవాలనిపిస్తుంది. అన్నీ పెళ్ళిళ్ళూ... సంసారాలూ.... మా యీ అరిస్టోక్రటిక్ వాతావరణంలో కాస్త తెలుగుతనాన్ని జ్ఞాపకం తెచ్చేది బామ్మే!

రేవంత్!

నేను మీ దగ్గర మరీ చనువుగా ప్రవర్తిస్తున్నానా? మొన్న మీకు నేను ''చీకట్లో అమ్మాయి కథ'' చెప్పాక అది అనిపించింది. ఎక్కడో చదివేను. 'ఆడదానికి తననేదో చేస్తారని భయం, చెయ్యాలనే కుతూహలం' రెండూ ఉంటాయట. ఇదెంతవరకూ నిజమో తెలీదు. కానీ మీ దగ్గిర మాత్రం

రెక్కలు విప్పి విహంగంలా ఎగరాలని అనిపిస్తుంది. కోయిల పాడే పాట కనురెప్పల చాటునుంచి జాలువారుతుంది, మన స్నేహం గుర్తొస్తే.

ఆ రోజు టాక్సీ దిగి ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశించి తప్పుకుని దాక్కొన్నాక అలా దూరంగా నిల్చుని, వాకబు చేస్తున్న మిమ్మల్ని చూస్తుంటే పరుగెత్తుకువచ్చి మిమ్మల్ని కలుసుకోవాలని చాలా కోర్కె కలిగింది. కష్టంమీద అణచుకున్నాను. ఎందుకో తెలీదు కానీ కళ్ళల్లో మెరసిన మేఘమల్హార్ బుగ్గ వెంట సాగిన గుర్తు. ముఖేష్ పాట 'చెలిరే సజనీ' గుర్తొచ్చింది.

ముఖేషూ, సైగలూ గుర్తొస్తే - రాత్రికూడా ఒక కొత్త అందాన్ని సంతరించుకుంటుంది. అలా కాకపోయినా ఈ రాత్రి ఎంత బావున్నదో! బైట సన్నగా వర్షం. కరెంటు పోయింది. కొవ్వొత్తి వెలుగులో ఇలా కూర్చొని వ్రాస్తూంటే ఈ గదినిండా మీ జ్ఞాపకాల అల. మధ్యలో నేను మా అమ్మ బారినుంచి దాచుకున్న కాసెట్స్‌లో 'మైతో ఎక్ ఖ్వాబ్ హూ' వుంది. నాకా పాట ఎంతో ఇష్టం. అమ్మ మాత్రం ఎప్పుడూ తురక గోల అంటుంది. అయినా నేనంటే ఎంతో ప్రేమ. రేవంత్! నేను అభిమానిస్తున్నంతగా ఎదుటివాళ్ళు నన్ను అభిమానించటం లేదూ అంటే నేను చాలా బాధపడతాను. కె.వి. అబ్బాస్ నవల చదివారా? 'జోకర్' అంటే నాకెంత ఇష్టమో! ఎన్నిసార్లు ప్రేమను అర్థించినా అది అతడి దగ్గిరకే వచ్చేస్తుంది. చాలా మెలోడీ ఉంది కదూ. ఆ కథలో అబ్బాస్ నవలలకన్నా పొయిట్రి

బావున్నట్టు అనిపిస్తుంది. 'వెన్ ది నైట్ ఫాల్స్' అని ఓ రచన చదివినట్టు గుర్తు. బంగ్లాదేశ్ కవితలు ట్రాన్స్‌లేట్ చేసి చాలా రోజుల క్రితం ఓ మాగజైన్‌లో వేశారు. ఎంత బావున్నాయో! జీవితాన్ని పరిమళింపచేయటానికి ప్రేమొక్కటే కారణం కాదనుకుంటా.

నాకు అనిపిస్తూ ఉంటుంది. రోజుకు ఇరవైనాలుగు గంటలే పెట్టిన దేముడు ఎంత స్వార్థపరుడా అని. పుస్తకాలూ - కవిత్వమూ - చిత్రలేఖనం - సైన్సూ - మెహదీహసను పాటా - కోసనీమలో కొబ్బరాకు కదలికా... ఇంత చిన్న జీవితంలో ఎంతని ఆస్వాదించుకొనగలం? ప్రతి ఫీల్డూ అఖాతమే. కొద్దిగా రుచి చూసేసరికి జీవితంలో చాలా భాగం గడిచిపోతుంది. నిజంగా దేముడు పెద్ద సాడిస్టు కదూ!

రేవంత్ - ఇది మూడో ఉత్తరం. నాలుగోది చివరిదీ అయిన ఆఖరి ఉత్తరాన్ని రెండు మూడు రోజుల్లో వ్రాస్తాను. మీరు వ్రాసి, నాకు ఇవ్వటానికి సిగ్గేసి, చింపేసి, చెత్తబుట్టలో పారేసిన ఉత్తరంలో ఒక్క వాక్యం ఇక్కడ వ్రాసి ఈ ఉత్తరాన్ని ముగిస్తాను.

''మీరు నన్ను నిజంగా ఇంతగా ప్రేమిస్తున్నారా అన్న అనుమానం నాకు కలుగుతూంది. నా ఉద్దేశ్యం మీరు వ్యక్తిని ప్రేమించటం కన్నా ప్రేమిస్తున్నా నన్న భావాన్ని ఎక్కువగా ప్రేమిస్తున్నారని. నిజమేనా?''

చదివినకొద్దీ ఎన్నో అర్థాలు స్ఫురించే ఈ వాక్యాన్ని ఎన్నిసార్లు చదువుకున్నానో! మళ్ళీ నేనేమనుకుంటానో అని ఆ కాగితాన్ని చింపేసేరు

కదూ! మనసులో భావాల్ని నాలా లొడలొడా వ్యక్తీకరించని మీరంటే అందుకే నాకిష్టం రేవంత్. మాట్లాడకుండా ఎప్పుడూ మౌనంగా - గంభీరంగా వుండే వాళ్ళందరూ తెలివయినవాళ్ళు కాదు. కానీ తెలివైనవారందరూ మాటల ఎకనమిస్టులే.

మీ వాక్యం చదివాక నాకుమాత్రం ఆనందం వేసింది. షేక్సిపియర్ గుర్తొచ్చాడు. 'ఎక్కడ ప్రేమ ఉండునో అక్కడ అనుమానం ఉండును' అన్నాడొక మహాకవి. మరిమీకు ఈ అనుమానం నామీద వచ్చింది అంటే.... థాంక్స్ మాష్టారూ...

పోతే -

మీరంటే నాకెంత ఇష్టం అంటే -

మిమ్మల్ని చేరుకోవాలన్నంత ఇష్టం.

.....

మనసు లోపలా బైటా

అంతా గొడవే.

గొడవ గొడవ గొడవ

ఆ గొడవేమిటో తెలుస్తే

ఇంకెందుకు గొడవ?

.... విత్ లాట్స్ ఆఫ్ లవ్

రమ్య''

పి.యస్. మీరింకా నా పూర్తిపేరు కనుక్కోలేదు.

* * * * *

అక్కడ జనం ఎక్కువగా లేదు. కాని ఉన్న వాళ్ళందరూ హడావుడిగా వున్నారు.

జేమ్స్ సూట్‌లో వున్నాడు. సులోచనకి పెళ్ళికళ వచ్చేసింది. ఆమె పట్టుచీరలో వుంది. వేలికి జేమ్స్ బహుమతి యిచ్చిన ఉంగరం వుంది.

పెనున్సులా ఫోడక్ట్స్ ఉద్యోగులు, టెలిఫోన్ ఎక్చేంజిలో పనిచేసే అమ్మాయిలు అక్కడ వున్నారు.

పెళ్ళి జరిగి గంట కావస్తూంది.

బఫే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పెనున్సులా ప్రొడక్ట్స్‌లో చాలామంది అబ్బాయిలే జేమ్స్ స్నేహితులు. అంతమంది అమ్మాయిల్ని ఒకేచోట చూడటం వాళ్ళకి థ్రిల్లింగ్‌గా వుంది. సంభాషణ టెలిఫోన్స్ మీదకు మళ్ళింది. ఒక కుర్రవాడెవరో నోరుజారి, "ఇంత టేవార్స్ డిపార్టుమెంటు ఇంకొకటి లేదు" అన్నాడు. అంతే అమ్మాయిలందరూ సివంగుల్లా అతడిమీద విరుచుకుపడి తిట్టి, కన్విన్స్ చేసి చివరకు తప్పు ఒప్పుకునేలా చేసారు.

పెనున్సులా జి.యమ్. కల్పించుకుని ‘‘ముఖాముఖి మాట్లాడేటప్పుడు చిరునవ్వుతో ఎదుటివాళ్ళని ఎంత ఆహ్లాదపర్చవచ్చో ఫోన్లో కూడా అంతే తియ్యటి కంఠంతో కష్టమర్ని ఆకట్టుకోవచ్చు’’ అన్నాడు.

ఒక అమ్మాయి తన ట్రైనింగ్ కోర్సు జ్ఞాపకం తెచ్చుకుంటూ, ''ఎప్పుడూ ఒకే స్టాండర్డ్ మాటలు, వాటిని ఉపయోగించి ఉపయోగించీ బోర్ కొడుతుంది'' అంది.

''స్టాండర్డ్ మాటలేమిటి?''

''థాంక్యూ.... థాంక్యూ సర్.... యూ అర్ వెల్‌కమ్ సర్.... ఇలాంటి మాటలు.''

ఒక కుర్రవాడు ఓరగా చూస్తూ ''మొదటి రెండు మాటలు ఉపయోగిస్తే పర్లేదేమోకానీ ఆ చివరి మాట వాడితే వేరే అర్థం వస్తుందేమో'' అన్నాడు. గొల్లున నవ్వులు. అమ్మాయిల మొహం మొదట ఎర్రబారినా వాళ్ళూ నవ్వేసేరు.

''ఆల్‌రైట్, వెరీ వెల్ లాంటి పదాలు ఫోన్లో ఉపయోగించ కూడదని చాలామంది అమ్మాయిలకి తెలీదు. మోనోటోన్, కలలో తేలిపోయే కఠం ప్రిల్ వాయిస్ - ఇవన్నీ ప్రాక్టీసు ద్వారా వదిలిపెట్టెయ్యాలి. అంత వరకూ ఎందుకు? మీకు 1000 నెంబర్ కావాలంటే ఎలా పిలుస్తారో చెప్పండి చూద్దాం'' అని ప్రశ్న వేశాడు జి.యమ్. ఆ వయసులో కూడా ఆయనకి అంతమంది అమ్మాయిల్ని చూసేసరికి పాతరోజుల హుషారు గుర్తొచ్చినట్టుంది.

''వన్ త్రిబుల్ జీరో'' అందో అమ్మాయి.

''తప్పు'' అన్నాడు.

''వన్ డబుల్ జీరో, జీరో''

''కాదు వన్ జీరో, డబుల్ జీరో - అనాలి. పోనీ ఇది చెప్పండి. 1114ని ఏమంటారు?''

ముందు ఆయన చెప్పి గుర్తుపెట్టుకొని ఓ అమ్మాయి చప్పున ''వన్ డబుల్ వన్ ఫోర్'' అనేసింది.

''తప్పు''

అబ్బాయిలు, అమ్మాయిల ఓటమిని చిరునవ్వుతో గమనిస్తున్నారు. ఆయన వివరించాడు. ''డబుల్ అనేది మొదటగానీ చివరగానీ సాధ్యమైనంత వరకూ రావాలి. మధ్యలో రాకూడదు. 1114ని డబుల్ వన్ వన్ ఫోర్ అనాలి - అని చాలామందికి తెలియకపోవటంలో తప్పులేదు.''

వీళ్ళిలా మాట్లాడుకుంటున్న సమయానికి వీళ్ళకి దూరంగా బాల్కనీ రెయిలింగ్‌కి ఆనుకుని ప్లేటు చేతిలో పట్టుకుని మౌనంగా స్పూన్‌తో తింటున్నాడు రేవంత్.

''ఏమిటిక్కడ వున్నారు'' అంటూ వచ్చింది సులోచన. రేవంత్ నవ్వి వూరుకున్నాడు. ఇద్దరిమధ్యా నిశ్శబ్దం కొంతసేపు రాజ్యమేలింది.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ అమె ‘‘జేమ్స్ మీకు ఎంతకాలం నుంచీ తెలుసు?’’ అని అడిగింది.

‘‘దాదాపు పది సంవత్సరాల్నుంచీ.’’

మళ్ళీ నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో తటపటాయింపు సందిగ్ధాసందిగ్ధాల మేళవింపు. దూరంగా వున్న జనాన్ని చూస్తూ ఆమె అంది.

‘‘మా జీవితం ఎలా సాగబోతోంది?’’

ఆమె నుంచి ఉన్నట్టుండి ఘాటు అయిన ఆ ప్రశ్న అతడిని ఓ క్షణం తికమక పెట్టింది.

తలెత్తి ఆమెవైపు చూసేడు. ఆమె ముఖంలో కొత్తగా వచ్చిన పెళ్ళికళ భవిష్యత్తుపట్ల కొద్దిగా ఆందోళనతో మిళితమై వుంది. ఆమె దిగులుగా నవ్వింది. ‘‘ఉన్నట్టుండి హఠాత్తుగా అయిపోయింది. ఇదంతా తల్చుకుంటూంటే ఇది కలో నిజమో కూడా అర్థం కావటం లేదు.’’

అతడికి అర్థమయింది.

నవ్వేడు.

‘‘మనసులో ఒకటి పెట్టుకుని పైకి మరొకటి నాజూగ్గా - కృత్రిమంగా మాట్లాడే ఎంతో మందికన్నా జేమ్స్ చాలా మంచివాడు. మనస్సులోని మాటని ఏ భేషజాలూ, హిపోక్రసీ లేకుండా చెప్తాడు. అందుకే అతడి

మాటలు కరుగ్గా, అతడి భావాలు అపాయకరంగా కనబడ్డాయి. వాటికి ముసుగు వెయ్యడు కాబట్టి.... తన ప్రవర్తనకీ తమ మాటలకీ చాలా నిజాయితీతో లంకె వెయ్యగల మనుషులు ఈ కాలంలో అరుదు.''

''కానీ అతడు చాలా ఫ్రీగా సెక్సు గురించి, స్త్రీ పురుష సంబంధాల గురించీ, మాట్లాడటం నాకు భయంగా వుంది. మా వైవాహిక జీవితంలో దీని ప్రభావం ఎలా వుంటుందో అని.''

''అతడు పెరిగిన పరిస్థితులు అలాంటివి'' అన్నాడు రేవంత్. ''ఒక మనిషిమీద అతడి చుట్టూ వున్న పరిస్థితుల ప్రభావం చాలా పడుతుంది. వాటినుంచి బైటపడి తనకిష్టమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవటానికి అతడికి కొంచెం టైం పడుతుంది. కొంతమంది చాలా తొందరగా ఈ మార్పు సాధించగలిగితే, చాలామంది తమ మొత్తం జీవితకాలంలో దీన్ని సాధించలేరు. ఈ ఎవల్యూషన్ గురించి థామస్ హారిన్ అనే సైక్రియాట్రిష్టు బాగా వివరించాడు. వీలైతే 'బార్న్ టు విన్' అనే పుస్తకం చదవండి. జేమ్స్ మనస్తత్వం బాగా అర్థమవుతుంది. చాలా గొప్ప ట్రాన్సాక్షనల్ అనాలిసిస్ వుంది. అందులో మనిషి యొక్క జీవితం పుట్టినప్పటినుంచీ ప్రారంభం అవుతుందీ అనుకుంటే మొదటిస్థితి 'నేను బాగాలేను. ప్రపంచం బాగాలేదు.' అనేది. పసిపిల్ల ఏడవటం దీనికి గొప్ప ఉదాహరణ. దీని తరువాత స్టేజి 'నేను బాగాలేను, ప్రపంచం అంతా బాగానే వుంది' అనేది.

ఏడేళ్ళ కుర్రవాడిని ఇంట్లో వదిలేసి, తల్లిదండ్రులు సినిమాకి వెళ్తూంటే వాడు ఏడ్చే ఏడుపులాంటిది ఇది. ఇది కూడా దాటితే మూడో స్టేజి వస్తుంది. ''నేను బావున్నాను, ప్రపంచమే బావోలేదు'' అనేది పదిహేనూ ఇరవై సంవత్సరాల మధ్య అబ్బాయికీ అమ్మాయికీ తమ స్వశక్తిమీద విపరీతమైన నమ్మకమూ, ఇంటి సభ్యుల మీద అకారణమైన కోపమూ, తల్లిదండ్రుల్తో మాటాడాలంటే నిరాసక్తత, తనని ఎవరూ గుర్తించలేదన్న తపనా, ఈ స్టేజిలో కలుగుతుంది. ఇది కూడా దాటితే ఆఖరిదే అత్యున్నతమైనది. అయితే I AM OK - YOU ARE OK అన్న స్టేజీ వస్తుంది. నూటికి తొంభై తొమ్మిది మంది ఈ స్థితి చేరుకోలేరు. ఒక స్థితిలోంచి మరో స్థితిలోకి ఎంత తొందరగా వెళ్ళిపోతే అంత మంచిది. ప్రతి మనిషి యీ నాలుగు స్థితుల్లోనూ ఏదో ఒక స్థితిలో వుంటాడు. దురదృష్టవశాత్తూ జేమ్స్ మొదటి స్థితి అయిన I AM NOT OK - YOU ARE NOT OK స్టేజీలోనే వున్నాడు. యీ చైల్డ్ స్థితి నుంచి అతడిని అడల్ట్ స్టేజీకి మీరు తీసుకురావాలంటే మీరు పేరెంట్‌గా మారాలి. మొగవాడి జీవితానికి యీ ఆలంబనని ఇవ్వటానికే దేముడు స్త్రీని సృష్టించాడనుకుంటా. తనెవరో తెలియపర్చకుండానే నా మీద అంత ప్రభావం చూపించిన ఫోనులో ఆడపిల్లే దీనికి ఉదాహరణ.''

ఎందుకో తెలీదుకానీ వెన్నెల్లో ఆడపిల్ల ప్రసక్తి రాగానే సులోచన పెదాలమీద నవ్వు వెలిసింది.

14

గదంతా మల్లెపూల పరిమళం నిండివుంది.

తెల్లటి పక్క ఆహ్వానిస్తున్నట్టూ వుంది.

ఆ గదికి కొత్త ఆనందం వచ్చినట్టూ నీట్‌గా వుంది. గిటారు అట కెక్కింది. డ్రాయింగ్ స్టాండ్ మంచం క్రిందకు దూరింది.

రాత్రి పదయింది.

సులోచన - జేమ్స్ మంచంమీద కూర్చొని వున్నారు. దాదాపు అరగంటనుంచీ వాళ్ళు మట్లాడుకుంటున్నారు. వచ్చే జీతం గురించీ - పిల్లలు ఎప్పుడు కావాలీ అనుకొన్నదీ - స్మోకింగ్ పట్ల ఆమె అభిప్రాయం - అన్నీ అతడు అడుగుతూంటే ఆమెకి కొద్దిగా నిరుత్సాహంగా వుంది.

'మొదటి రాత్రి మాట్లాడుకోవల్సిన మాటలేనా యివి?' అనుకొంది.

గడియారం పదకొండు కొట్టింది.

అతడు ఆమెను దగ్గిరకు తీసుకున్నాడు, అతడి మెడ వంపులో ఆమె కళ్ళు మూసుకుంది.

ఆమె నిశ్చింతని భంగపరుస్తూ అతడామెని అడిగాడు ''.... ఆర్యూ గుడ్ ఇన్ బెడ్!''

ప్రశ్న అర్థమయీ అవగానే ఆమె చిగురుటాకులా వణికి వెంటనే సర్దుకుంది. ''ఐయామ్ నాట్ ఓ.కే. - యు ఆర్ నాట్ ఓ.కే....''

''ఏ అమ్మాయి అయినా ముందు ప్రేమని పంచుకోవాలనుకుంటుంది. తరువాతే ఆ ఆప్యాయతనీ ప్రేమని ప్రదర్శించటం కోసం పక్కని పంచుకోవాలనుకుంటుది. అంతే కానీ - ప్రేమంటే తెలియని అమ్మాయికి బెడ్ సంగతి ఎలా తెలుస్తుంది?''

అతడు యీ వాదనకి అప్రతిభుడై ''అయితే నీ గురించి నేను అనుకున్నది తప్పు అన్నమాట'' అన్నాడు.

''ఏమనుకున్నారు నా గురించి? చాలామందితో పరిచయం వుందనుకున్నారా? అలా అనుకున్నాక కూడా నన్ను చేసుకున్నారా?''

చాలా మామూలుగా ''స్త్రీ నాకు కొత్తకాదు. అటువంటప్పుడు నా భార్యకి పురుషుడు కొత్త అవ్వాలని కోరుకునే హక్కు నాకు లేదు. ఒకరి కొకరు తోడు వుండటం కోసం - ఒకరి అవసరాలు వేరొకరు తీర్చుకోవటం కోసం వివాహం అనేది జరుగుతుంది. ఈ ప్రేమా ఇదంతా ట్రాష్ అని నా ఉద్దేశ్యం. ఒకర్నొకరు చూసుకోకుండా గంటలు తరబడి ఫోన్లో మాట్లాడుకుంటూ ప్రేమ, ఆప్యాయత అని పేర్లు పెట్టి అభిమానాన్ని

పెంచుకునే మా రేవంత్, ఆ వెన్నెల్లో ఆడపిల్ల అంటే నాకు నవ్వొస్తుంది'' అన్నాడు.

''అలా మాట్లాడుకోవటంలో ఏమీ లేదంటారు.''

''ఏమీ లేదు!''

ఆమె తేలిగ్గా వూపిరి పీల్చి ''బ్రతికించారు'' అంది.

''ఎందుకు?''

''వెన్నెల్లో ఆడపిల్లని నేనే కాబట్టి'' అంది రాజసులోచన.

జేమ్స్‌కి ఒక క్షణంపాటు ఆమె చెబుతున్నది అర్థంకాలేదు. అయిన తరువాత కూడా అయోమయంలోనే వుండిపోయాడు. ఆ నిజాన్ని వెంటనే అన్వయించుకోలేక సతమతమై చాలా సేపటికి తేరుకుని ''ఏమిటీ'' అన్నాడు. అతడి మెదడంతా ఎవరో నొక్కి పట్టినట్టయి స్తబ్దమైంది. గొంతు బొంగురైంది.

సులోచన మామూలుగానే ''మీ స్నేహితుడు రేవంత్‌కి ప్రతిరోజూ ఫోన్ చేసేది నేనే. మొదట్లో ఏదో సరదాగా చేసేను. మనం ఇలా పెళ్ళి చేసుకుంటామని అనుకోలేదు.'' అంది.

అప్పటికే అతడు పక్కమీద నిటారుగా కూర్చున్నాడు. ఎప్పుడూ లేనిది అతని మొహంలో ఉద్వేగం కొట్టొచ్చినట్టు కనబడుతూంది.

''మైగాడ్!'' అన్నాడు. ''రేవంత్ నిన్ను ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నాడు.''

''ఒకసారి కూడా చూడని అమ్మాయిని ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమించటం సాధ్యమని నేను అనుకోను.''

''నీకు అతని సంగతి తెలీదు. నువ్వెంత తప్పు చేసేవో కూడా నీకు తెలియటం లేదు''

ఆమె మాట్లాడలేదు. కొంచెంసేపు నిశ్శబ్దంగా వుండి మళ్ళీ అతడే అన్నాడు. ''ఐతే ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో చదవడం.''

సులోచన ''అంతా బోగస్'' అంటూ నవ్వింది. అతడు నవ్వలేదు. ఆమె మొహం కేసే చూస్తూండిపోయాడు. ఎన్నో చెప్పాలనుకుంటున్నాడు గానీ నోట మాట రావటం లేదు. ఆమెకి మాత్రం అతడి రియాక్షన్ ఆశ్చర్యంగా వుంది. ''ఏమిటిలా వున్నారు?'' అని అడిగింది.

అతడు తెప్పరిల్లి ''ఏం లేదు'' అని తరువాత మళ్ళీ ఏదో అందామనుకొని మానేసేడు, సిగరెట్ వెలిగించి, తనలో తనే అనుకొంటున్నట్టు ''ఈ దెబ్బకి అతడు కోలుకోలేదు'' అన్నాడు.

సులోచన కదిలి ''మీరింత చిన్న విషయానికి ఎందుకు అనవసరంగా ప్రాముఖ్యత ఇస్తున్నారో అర్థం గావటంలేదు. స్నేహితుడి

భార్యనని తెలిశాక కూడా అతడు ఈ ఇష్టాన్ని ఇలాగే కొనసాగిస్తాడని నేననుకోను'' అంది.

''కొనసాగించటమా? నాన్సెన్స్! నా భార్యవని తెలిశాక ఇక అతడు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడు.''

''మరింకేం.''

''నేను మాట్లాడుతున్నది అతడి సంగతి.''

''దానికేముంది? నేనే వెన్నెల్లో ఆడపిల్లని అతడికి చెప్పే అవసరం ఏముంది? కొంతకాలం ఫోన్ రాకపోయేసరికి అతడే నెమ్మదిగా ఆ విషయం మర్చిపోతాడు. మీరన్నట్టు ఈ ప్రేమా, అభిమానం అంతా ట్రాషేగా?''

జేమ్స్ విసుగ్గా భార్యవైపు చూచి లేచి కిటికీ దగ్గరకు వెళ్ళి కిటికీలోంచి బైటకి చూస్తూ కొంచెంసేపు నిల్చున్నాడు. ''ఎలా? ఇప్పుడెలా?'' అని అతడు అనటం వినిపించింది. ఆమె లేచి అతడి దగ్గరకు వెళ్ళింది. కొంచెం తటపటాయించి నెమ్మదిగా అంది. ''పోనీ నేనది కొనసాగిస్తాను.''

బులెట్ తగిలినవాడిలా అతడు చప్పున వెనుదిరిగి, అర్థంకాక ''ఏమిటీ?'' అన్నాడు.

''వెన్నెల్లో ఆడపిల్లలాగే అతడిని ఫోన్‌లో పలకరిస్తూ వుంటాను. చూస్తే గుర్తుపడతాడు కనక కలుసుకోవటాన్ని ఎలాగో వాయిదా వేస్తూపోతాను. తరువాత నెమ్మదిగా పరిచయాన్ని తగ్గిస్తూ వచ్చేస్తాను - అతడు మర్చిపోతాడు.''

అతడు చేతిలో సిగరెట్ ఆఖరి పఫ్ తాగి విసిరేసేడు. సాలోచనగా గెడ్డం గోక్కుంటూ ''అన్నిటికన్నా ఈ ఆలోచనే కొద్దిగా బావున్నట్టుంది.'' అంటూ వచ్చి పక్కమీద కూర్చొన్నాడు.

ఆమెకూడా వచ్చి కూర్చొంటూ ''నన్ను క్షమించండి. అసలు ఇది మీకు కూడా చెప్పకూడదనే అనుకున్నాను. కానీ మీకు ఫ్రాంక్‌నెస్ ఇష్టమని అనటంతో చెప్పాను.'' అంది.

''లేదు, లేదు చెప్పటమే మంచిదయింది'' ఆమె చేతిమీద చెయ్యివేస్తూ అన్నాడు.

అతడి భుజంమీద తల ఆన్చి నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది సులోచన. అతడు చెయ్యిచాచి లైట్ ఆర్పాశాడు. చీకటి గదిలో పరచుకుంది. బెట్‌లైట్ చీకటిని పారద్రోలలేకపోతూంది.

రాత్రి పదకొండు దాటటంతో ఊరంతా నిశ్శబ్దంలోకి జారుకుంది. ఎక్కడో ఓ కుక్క మాత్రం ఉన్నట్టుండి ఒక్కోసారి ఏడుస్తూంది. ఒక బిచ్చగాడు రామదాసు కీర్తన పాడుకుంటూ వెళుతున్నాడు.

జేమ్స్ తలెత్తి అటకవైపు చూసేడు. గిటారు కనబడింది. డ్రాయింగ్ రూం వెనకాల గూట్లో ఇండియన్ ఇంక్ కనబడింది. ఆ రెండే ఇప్పటివరకూ తన సహచరులు. తన బాధనీ, ఆనందాన్ని పంచుకున్న మిత్రులు....

తలతిప్పి భార్య వంక చూసేడు. సులోచన నిద్రపోతూంది. మళ్ళీ పైకప్పుకేసి చూసేడు. బెడ్ లైట్ చుట్టూ ఒక పురుగు తిరుగుతూంది. అతడికెందుకో ప్రపంచం అంతా ఆనందంగా వున్నట్టు, తనొక్కడే విషాదంగా వున్నట్టు అనిపించింది. అంతా కలిసి తనని మోసం చేస్తున్న ఫీలింగ్. ఫోన్ రాగానే రేవంత్ మొహంలో తొణికిసలాడే ఆనందం, గంటల తరబడి మాట్లాడుకోవటం, తనూ మాట్లాడి సిస్టర్ అనటం -

అప్పుడు కలిగింది అతడికి అనుమానం....

ఆ రోజు తనతో మాట్లాడిన అమ్మాయికీ, సులోచన కంఠానికి తేడా వున్నట్టు.

ఆ అనుమానం రాగానే సంతోషం వేసింది.

కానీ మళ్ళీ అంతలోనే మరో ఆలోచన. ఒకవేళ రెండు కంఠాలూ ఒకటే అయితే మాత్రం నష్టం ఏమిటి? తను ఇటువంటి వాటికి ప్రాముఖ్యం ఇవ్వడుగా. స్త్రీ పురుషులు కలిసి వుండటం కేవలం శారీరకావసరాలు తీర్చుకోవటానికే. తన థియరీ ప్రకారం ప్రేమ ఓ ట్రాష్. ఆ లెక్కన ఈ

సులోచన - తన భార్య - తనకెంత సంతోషాన్నివ్వగలదూ, అన్నదే కావల్సింది. ఆమె గత జీవితం వర్తమాన ప్రవర్తన - ఇవన్నీ ఎందుకు?

అతడు తలతిప్పి చూసేడు. పక్కకి తిరిగి పడుకున్న సులోచన నడుము వంపుమీద లైటు వెలుతురు పడి మెలికలో అదృశ్యమవుతూంది.

ఈ నడుము మీద ఏ పర పురుషుడి చేతులు మొదటిసారి పడి ఆ లేతదనాన్ని ఆస్వాదించాయో, ఈమె ఈ చేతివేళ్ళు మొదటిసారి భయం భయంగా కంపిస్తూ ఏ పురుషుడి మెడచుట్టూ పెనవేసుకున్నాయో...

అతడు ఇబ్బందిగా కదిలాడు. తన వస్తువుని ఎవరో తీసుకుపోతున్న ఫీలింగ్, స్వచ్ఛమైన వర్ణచిత్రాన్ని ఎవరో కల్తీ చేసిన భావన.

అతడు పక్కమీద ఇంకోసారి ఇబ్బందిగా కదిలి లేచి కిటికీ దగ్గరకొచ్చి మరో సిగరెట్ వెలిగించాడు.

ఆ అలికిడికి ఆమె కళ్ళు విప్పి అంత రాత్రి వరకూ అతడు మెలకువగా వుండటం గమనించి, ఆశ్చర్యపడి కూర్చొని - "మీరు నిద్రపోలేదా?" అంది.

అతడు నెమ్మదిగా వెనుదిరిగి భార్యవైపు కన్నార్పకుండా చూసి పక్క దగ్గరగా వచ్చి కూర్చున్నాడు. ''నేను ఈ నిజాన్ని అన్వయించుకోలేకపోతున్నాను.''

''ఏ నిజాన్ని?''

''రేవంత్‌కి ఫోన్ చేయటాన్ని.''

ఆమె వెంటనే జవాబు చెప్పలేదు. గదిలో నిశ్శబ్దం కూడా ఉత్సుకతతో వారిద్దరినీ గమనించసాగింది. ఆమె గొంతు సవరించుకుంది. ఏ అహమూ, స్వాభిమానమూ లేకుండా అతడు అలా చెప్పటం ఆమెకి ముచ్చటేసింది. చేతివేళ్ళవైపు చూసుకుంటూ చిన్న స్వరంతో అన్నది.

''నాకు మనస్తత్వ శాస్త్రమూ, పెద్ద పెద్ద ఇంగ్లీషు పదాలు తెలియవు. మీరు నన్ను అడిగారు, 'ఆర్యూ గుడ్ ఇన్ బెడ్' అని, వేరే సంబంధాలు వున్నా పర్లేదు అని తేలిగ్గా తీసిపడేశారు. కానీ అది అనుకున్నంత తేలిక విషయం కాదు, అని నేను అనుకుంటున్నాను. పైకి అలా అన్నా మనసులో ఏమూలో వుంటుంది. మీ చిన్నప్పటి పరిస్థితులూ, జీవితం మీకు ఈ ప్రపంచంమీద కసినీ, ద్వేషాన్నీ పుట్టించి వుండవచ్చు. అందుకే మీరు మీ ఇష్టాల్ని మనసులో దాచుకొని అయిష్టాన్ని మాత్రం పైకి ప్రదర్శిస్తున్నారు... నేను మీకు చెప్పేటంత పెద్దదాన్ని కాదు. పెద్దగా చదువుకున్న దాన్ని కాదు. ఎలా చెప్పాలో కూడా తెలియటం లేదు.

పరాయి సంబంధాల వరకూ ఎందుకు? సరదాగా నవ్వుతూ మాట్లాడినా భర్తకి బాధగానే వుంటుంది. అలా బాధా, అసూయా వుండటమే ప్రేమ! నేనెవరితోనో ఫోన్లో మాట్లాడానని తెలిసి మీకీ రాత్రంతా నిద్రపట్టటంలేదంటే.... నాకు అంతకన్నా కావల్సిందేముంది. మీ మనసు అట్టడుగు పొరల్లో ఎక్కడో నామీద ప్రేమ వుందన్నమాట! కాదని క్యాజువల్‌గా, నిర్లక్ష్యంగా అనెయ్యటానికి ప్రయత్నించకండి. నా భర్త అలా బాధపడ్డాడని తెలిస్తేనే నాకు గర్వంగా వుంటుంది. ఎందుకంటే అలాటి పరిచయాలు నాకేమీ లేవు కాబట్టి....''

ఆమె ఆఖరి వాక్యం అతనికి వెంటనే అర్థం కాలేదు. అర్థం కాగానే విప్పారిన మొహంతో ''అయితే నువ్వు.... నువ్వు....'' అంటూ అర్ధోక్తిలో ఆపుచేసేడు.

ఆమె నవ్వి ''నేను వెన్నెల్లో ఆడపిల్లను కాను'' అంది.

అతడు గాలిలా ఆమెను చుట్టుముట్టాడు. ఆమెకి వూపిరి సలపలేదు. అయినా పర్లేదు. ఈ ప్రపంచంలో గొప్ప గొప్ప ఆనందాలన్నీ మొదట బాధపెట్టేవే.

అలసి సొలసి అతడి కౌగిలిలో నిశ్చింతగా ఒదిగి నిద్రపోవటానికి ఉపక్రమిస్తూ ఆమె అనుకొంది - 'పర్లేదు, మనసు చుట్టూ పేరుకొన్న పొర కరగటం ప్రారంభం అయింది. తొందర్లోనే అది మామూలు ఆనందాలకీ,

బాధలకీ స్పందించడం మొదలు పెడుతుంది. ప్రపంచంమీద నమ్మకం కుదరటానికి ఇది తొలిమెట్టు. ఇక 'ఐ యామ్ ఓకే - హి విల్ బి ఓకే. థాంక్యూ రేవంత్ -'

ఇక వారి గురించి చెప్పటానికి కథేమీ లేదు.

15

రెండ్రోజుల్నుంచీ ఫోన్ రాకపోవటంతో అతడికి కంగారుగా వుంది. గడువు పూర్తయిపోతూ వుందని కాదు. దానికింకా రెండు రోజులుంది.

అయితే అతడు ఢిల్లీ వెళ్ళవలసింది ఆ రోజే.

ఆ రోజు పదకోండో తారీఖు. రేవంత్‌కి ఆ అమ్మాయి ఓ నెల గడువిచ్చింది. పదమూడో తారీఖు దానికి ఆఖరి రోజు. ఆ సాయంత్రం అయిందింటిలోపు కనుక్కోలేకపోతే ఓడిపోయినట్లే.

రెండ్రోజులు వుంది కదా అని తీరిగ్గా ఆలోచించటానికి వీల్లేదు. సాయంత్రం అయిందింటికి విమానం. మరుసటి రోజు ఢిల్లీలో గేమ్ ఆడి, పదమూడో తారీఖు మధ్యాహ్నం బయలుదేరితే తిరిగి వచ్చేసరికి సాయంత్రం నాలుగవ్వొచ్చు, అయిదవ్వొచ్చు.

వచ్చేసరికి అయిదవుతే గడువుపూర్తయి, ఓడిపోయినట్టే.

ఇంకోలా చెప్పాలంటే ఈ ఒక్కరోజు మాత్రమే, అదీ సాయంత్రం వరకే టైమ్ వుందన్నమాట.

యీ లోపులో ఆమె పూర్తిపేరూ, టెలిఫోన్ నెంబరూ, అడ్రసూ కనుక్కోవాలి. కనుక్కోలేకపోయినా పెళ్ళి జరగవచ్చు. కాని ఆమె దృష్టిలో తను శాశ్వతంగా ఒక తెలివిహీనుడిగా మిగిలిపోతాడు. అదీగాక ఆఖరి రోజైనా సరే పట్టుకుంటానని సవాలు చేసేడాయె.

.... పదకొండయినట్టు గడియారం గంటలు కొట్టడం ప్రారంభించింది. అంటే ఇంకా ఆరుగంటలు కూడా పూర్తిగాలేదు. విమానాశ్రయానికి నాలుగున్నరకల్లా చేరుకోవాలి.

ఇంకా ఫోన్ రాలేదేం?

తను ఢిల్లీ వెళ్ళబోతున్నట్టు చెప్పిన సంగతి మర్చిపోయిందా? లేక తనని పూర్తిగా ఓడగొట్టాలని ఇక చివరి రోజుల్లో ఫోన్ జేయడం మానేసిందా?

అతడిని ఆశానిరాశల మధ్య మరింత ఊగించడం ఇష్టం లేనట్టు ఫోన్ మ్రోగింది.

ఆమె!

''హల్లో''

‘‘ఏమయ్యారు ఇన్నాళ్ళూ మీరు?’’

ఆమె అట్నుంచి నవ్వింది ‘‘చిన్న ప్రోబ్లం....’’

అతడు కంగరుగా ‘‘ఏమిటి’’ అని అడిగాడు.

అదే నవ్వుతో ‘‘తరువాత చెప్తాలెండి, కలుసుకొన్నాక’’ అంది.

‘‘నేనీ రోజు ఢిల్లీ వెళ్తున్నాను తెలుసా?’’

‘‘తెలుసు’’

‘‘మళ్ళీ వచ్చేది ఎల్లుండే’’

‘‘అవును’’

‘‘ఎల్లుండే మన ఆఖరిరోజు’’

‘‘అవును, అందుకే ఇది ఆఖరి ఫోన్’’

ఒక్కసారి అతడు కంగారుపడి ‘‘ఎలా మరి’’ అన్నాడు.

‘‘ఇన్ని సూచన్లు ఇస్తున్నా వూరుకొని - చివరికి వచ్చేసరికి ‘ఎలామరి’ అంటే నేనేం చెప్పను?’’

‘‘అన్నీ తప్పుడు సూచన్లు ఇస్తే ఎలా కనుక్కునేది?’’

‘‘దానికి సమాధానం కూడా చెప్పాను. నాక్కావలసింది లెక్కల మాస్టారు కాదు. అన్నీ సరిగ్గా చేస్తే రెండో క్లాసు కుర్రవాడు కూడా లెక్కగడ్తాడు.’’

‘‘ఇప్పుడు ఎక్కణ్ణుంచి చేస్తున్నారు ఫోన్?’’

‘‘ఒక పెద్ద హోటల్ రూమ్ నుంచీ’’

‘‘హోటల్ నుంచా’’

‘‘అవును రోజులు దగ్గర పడ్తున్నాయి కదా. స్నేహితురాళ్ళకి పార్టీ ఇస్తున్నాను.’’

అతడు అర్థంకాక - ‘‘దేనికి రోజులు దగ్గరపడ్తున్నాయి?’’ అని అడిగాడు.

‘‘మనం కలుసుకున్నాక ఇక ఎలాగూ వాళ్ళని వదిలి పెట్టేయాలి కదా. అందువలన పార్టీ ఇమ్మని బలవంతం చేసేరు.’’

‘‘ఏ హోటల్లో?’’ క్యాజువల్‌గా ధ్వనించేలా అడిగాడు - ఆమె బుట్టలో పడుతుందేమో చూద్దామని.

‘‘అమ్మ ఆశ! చెప్పను.’’

‘‘అయితే ఎలా కనుక్కోవటం?’’

"రెండ్రోజులు ఓపిక పట్టండి. నేనే స్వయంగా మా యింటి ఫోన్‌నెంబరుతో మీ దగ్గరికి వస్తాను."

"అయితే ఇంకే హింటూ చెప్పరా?"

ఆమె ఒక క్షణం మౌనంగా వూరుకొని, "పిచ్చి పిచ్చి ఆలోచన్లు ఏవీ ఆలోచించకుండా నిజాయితీగా నేను చెప్పినట్లు చేస్తారా?" అని అడిగింది.

అతడు హుషారుగా ముందుకు వంగి, "చెప్పండి చేస్తాను" అన్నాడు.

"ప్రామిస్"

"ప్రామిస్"

"నేను ఇప్పుడే హోటల్ నుంచి బయలుదేరి ఇంటికి తిన్నగా వెళ్తున్నాను. నాన్నగారెందుకో రమ్మన్నారు. అక్కడ అయిదు నిముషాలు ఉండి, లంబంగా బయలుదేరి తిన్నగా నెహ్రూబొమ్మ దగ్గరికి వస్తున్నాను. మొత్తం ఈ ప్రయాణమంతా కార్లో గంటకి నలభైమైళ్ళ వేగంతో చేస్తాను. మీరు సరిగ్గా అయిదు నిమిషాల తర్వాత బయలుదేరి అదే వేగంతో వస్తే నెహ్రూబొమ్మకి అట్నుంచి మీరూ, ఇట్నుంచి నేనూ ఒకేసారి చేరుకుంటాం."

"ఇద్దరం ఒకే దూరం ప్రయాణం చేస్తామన్నమాట!"

''పెద్దబాలశిక్ష చదివిన కుర్రవాడెవరయినా ఆ సంగతి చెప్పగల డనుకుంటాను.''

రేవంత్ మొహం ఎర్రబడింది. ''సరే - తరువాతేమిటి చెప్పండి?'' అన్నాడు.

''మీరు కారు డ్రైవింగ్‌లో ఎక్స్‌పర్ట్‌నన్న గర్వం వుందికదా! చూద్దాం. నన్ను పట్టుకోగలరేమో. బహుశా ఇదే మీకు ఆఖరి ఛాన్సు అవుతుంది. పోతే మీరు ట్రిక్కులు ఏమీ ప్లే చేయకుండా అదే స్పీడ్‌లో రావాలి. ముందు వస్తే మాత్రం నేను ఒప్పుకోను. మన రేసు ఆ బొమ్మ దగ్గిరనుంచే మొదలవ్వాలి. మనం బయలుదెరే కిలోమీటర్లన్ని పూర్ణ సంఖ్యలు.''

అతడికి ఆమె చివరి వాక్యం అర్థం కాలేదు. అయినా దాన్ని గురించి అంతగా పట్టించుకోలేదు. అతడి మనసు ఆమెని కలవబోతున్నానన్న సంతోషంలో విహంగంలా ఎగురుతోంది. కారు డ్రైవింగ్‌లో తనకి ధీటు రాగలిగేవారు ఎవరూ లేరని అతడికి తెలుసు.

''సరిగ్గా అయిదు నిమిషాల తర్వాత బయలు దేరుతున్నాను'' అన్నాడు.

''విష్ యూ ఆల్ ది బెస్ట్'' అని ఫోన్ పెట్టేసింది.

అతడు ఈసారి ఏ మోసమూ చెయ్యదలచుకోలేదు. సరిగ్గా అయిదు నిమిషాల తరువాతే బయలుదేరాడు. గంటకి నలభై కిలోమీటర్ల వేగంతో

డ్రైవ్ చెయ్యసాగాడు. ఎక్కడైనా బ్రేక్ వెయ్యవలసివస్తే ఆ టైమ్ గుర్తుంచుకుని వేగం హెచ్చిస్తూ, తగ్గిస్తూ, సగటు లెక్కకట్టేడు.

అతడి ఆఫీసు నుంచి నెహ్రూ బొమ్మ ఇరవై మూడు కిలోమీటర్లు.

ఆ దూరం కవర్ చేయటానికి గంటకి నలభై కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేస్తే ఎంతకాలం పడుతుందో వాచీ చూసుకుని, సరిగ్గా అదే సమయానికి చేరుకొనేలా డ్రైవ్ చేయసాగేడు.

అతడు ఇట్నుంచి వెళ్ళేసమయానికి అట్నుంచి ఓ కారు వస్తోంది. అది నల్లటి ఫియట్. అందులో అమ్మాయి ఆకారం అస్పష్టంగా కనిపిస్తుంది. రేవంత్ కారుముందు ఇంకో జీప్ వుండటం చేత ఆ అమ్మాయి రేవంత్ కారుని చూసే వీలులేదు.

రేవంత్ వూపిరి బిగపట్టాడు.

శిలావిగ్రహానికి అటుఇటుగా వస్తూ రెండు కార్లూ దగ్గిరయ్యాయి.

విగ్రహం చాటునుంచి రేవంత్ కారు పక్కకి రాగానే ఫియట్‌లో వున్న అమ్మాయి దాన్ని గమనించి, ఒక్కసారి స్పృహలోకి వచ్చినట్టు గేరుమార్చి సర్రున కోస్తూ, నెహ్రూబొమ్మని చుట్టి దూసుకుపోయింది. అలా తిప్పడంలో ఆమె ట్రాఫిక్ రూల్స్‌నీ ఎదురుగా వస్తున్న వాహనాలనీ లెక్కచేయలేదు.

ఇది వూహించని రేవంత్ కంగారుపడ్డాడు. అయినా క్షణంలో తేరుకుని కారుని అదే వేగంతో తిప్పేడు. కీచుమన్న టైర్ల ధ్వనిలో పోలీస్ విజిల్ తాలూకు ధ్వని కలిసిపోయింది. ధనస్సునుంచి వెలువడిన బాణంలా అతడి కారు గాలిలోకి దూకింది.

రేస్ మొదలయ్యింది.

కళ్ళప్పగించి చూస్తున్న ట్రాఫిక్ కానిస్టేబిల్స్‌ని దాటుకొని రెండు కార్లూ పరుగెత్తసాగినయ్.

పెదవిని పంటిక్రింద నొక్కిపట్టి ఎదురు కారుకేసి చూస్తూ అతడు డ్రైవ్ చేస్తున్నాడు. గాలి రివ్వున కొడుతుంది.

అదే ఆఖరి ఛాన్సనీ, ఇప్పుడు కనుక్కోలేకపోతే ఇక కనుక్కోవటం అన్న ప్రశ్నే లేదనీ అతడికి తెలుసు.

.... కారు నెప్రూబొమ్మచుట్టూ సర్రున తిరుగుతున్నప్పుడు కెమేరా క్లిక్ మన్నట్టూ క్షణంలో వెయ్యవవంతు ఆమె అతడి కంటపడింది. అయితే, పుత్తడిబొమ్మలాటి ఆ ఆకారం అతడి మెదడులో నిక్షిపంకాకముందే అదృశ్యమైంది. ఆకాశంలో మెరుపు మెరిసినట్టు ఆమె అందం అతడి కళ్ళకి మిరుమిట్లు గొలిపింది.

ఆ మొహం పూర్ణచంద్రబింబమా? కాదేమో? మెలికలు తిరిగిన గోదారి మీద పాపికొండల సాయంసంధ్య నీడ పడినట్టు గడ్డం వంపులో

ఛాయ! కళ్ళు కంజాతదళాలా? కావేమో! చూడగానే చప్పున తిప్పుకున్న ఆ నయనాలని ఏ హరిణి తుషార మేఘోత్తరీయాన్ని కనురెప్పలుగ అద్ది అరువిచ్చిందో! విప్లవ గేయ రచయిత అన్నట్టు ముక్కు సంపెంగా? కాదేమో! తపోభంగ కార్యార్థమై ఇంద్రుడే పంపగా వచ్చిన అప్సరస నృత్యం చేస్తుండగా, ఋషిమీదకు విల్లు ఎక్కుపెట్టిన మన్మథుడు తానే ఆ అందగత్తె అందానికి మైమరచి చెరుకు వింటిని మరింత వంచితే ఆ వంపు వచ్చి ఈమె ముక్కున అమరిందేమో!

పకృతి స్పష్టమైన - ఆకృతిని అస్పష్టం చేస్తుంది. ఎంత గుర్తు తెచ్చుకుందామన్న ఓ మనోహరమైన శిల్పం గుర్తొస్తుందే తప్ప ఆకారం గుర్తు రావడం లేదు.

ఆలోచనలతోనే అతడు డ్రైవ్ చేస్తున్నాడు. ఆమె అందటంలేదు. అతడు రెండు చేతుల్తోనూ స్టీరింగ్ పట్టుకుని, చూపుల్లోకి ఏకాగ్రతనంతా నింపుకుని పట్టుదలతో ఆమెని అందుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడు. వెనుక అద్దాలకి కట్టిన తెరల్లోచి అమె జడలో పూలు కనిపిస్తున్నాయ్.

డ్రైవ్ చెయ్యటానికి తను పడినంత కష్టం ఆమె పడడంలేదని అర్థమవుతుంది. ట్రాఫిక్‌ని చాలా చులాగ్గా తిప్పించుకుపోతుంది. అతడి పంతం పెచ్చింది. గంటకి నూరు కిలోమీటర్ల వరకు సునాయాసంగా

నడపగలడనే పేరు స్నేహితులమధ్య అతడికి వుంది. అందులోనూ అతడిది కొత్త అంబసిడర్ కారు.

అప్పుడు తెలిసింది తనెందుకు వెనుకపడుతున్నాడో.

ఆమెది చిన్న ఫియట్. తనది ఆకారంలో పెద్దదయిన అంబాసిడర్. ట్రాఫిక్ ఇలా వుంటే తను ఆమెని అందుకోలేడు. అందుకే ఆమె ఈ చిన్నవీధిని ఎన్నుకొంది. ఇలా నాలుగు గంటలు ప్రయాణం చేసినా ఏమీ లాభం లేదు.

ఆమె తెలివి చూస్తే ముచ్చటేసింది. అంతలో ఇంకో అనుమానం వచ్చింది. ఈమె మరింత ఇరుకుదారిని ఎందుకు ఎన్నుకోలేదు? అలాటి దారిలో వెళితే ఒక్క నిమిషంలో తన కన్ను గప్పవచ్చుగదా? అలా వెళ్ళలేదూ అంటే - తానలా వెంటాడటం ఆమెకి సరదాగా వుందన్నమాట.

వేగంగా వెళ్తూనే అతడు టైమ్ చూసుకున్నాడు. పన్నెండు కావొస్తుంది. ఇంకా నాలుగుగంటలు టైమ్ మాత్రమే వుంది. తను విమానాశ్రయానికి వెళ్ళటానికి.

మరో అయిదు నిమిషాలు గడిచినయ్.

కార్లు సాగర్‌వైపు వెళుతున్నాయ్. రేవంత్ మెదడులో అది గమనించగానే ఏదో మెరిసినట్టయింది.

ఈమె కారుని ఎలాగైనా టాంక్‌బండ్ మీదకు వెళ్ళేలా చెయ్యాలి. అక్కడయితే ట్రాఫిక్ వుండదు. ఒక్కసారి అలాటి తిన్నటి దారి దొరికిందంటే తన కొత్త అంబాసిడర్ ఆ ఫియట్‌ని రెండు నిమిషాల్లో అధిగమిస్తుంది.

ఆమెకి ఈ ఆలోచన వచ్చిందో? లేదో?

సాగర్ వైపు వెళ్ళకుండా పక్కకి తిరిగిపోవాలంటే ఇంకా ఒక్కటే దారి వుంది. అక్కడి కొచ్చేసరికి ఆమె ఆలోచన ఇటు మళ్ళించి, తిన్నగా సాగిపోయేలా చెయ్యాలి. తరువాత ఇక తప్పించుకోలేదు.

రేవంత్ ఆ సందు దగ్గరికి ఆమె కారు చేరుకొనేసరికి తన కారు నెమ్మది చేశాడు. ఆమె వ్యూ ఫైండర్‌లోంచి చూడటం గమనించాడు. తన కారు కనబడక పోయేసరికి ఆమె కంగారు పడిందని గ్రహించాడు. అతడికి కావల్సిందదే. ఈ లోపులో ఆ సందు దాటిపోయింది.

ఇక అంతా తిన్నటి దారే!

సాగర్ వరకూ.

అక్కడ టాంక్‌బండ్ వుంది. దానిమీద విశాలమైన రోడ్డు.

ఆ అమ్మాయి తను చేసిన తప్పు గ్రహించినట్టు ఆమె కారు వేగం హెచ్చటం ద్వారా తెలిసింది.

రేవంత్ పెదవులపై చిరునవ్వు కదలాడింది. ఆమె ఎంత వేగంగా వెళ్ళినా పర్లేదు. తన కారు వేగం ముందు ఆ పాతమోడల్ పనికి రాదు - అతడు పెట్రోల్ చూసుకున్నాడు - ఫుల్‌గా వుంది.

టాంక్‌బండ్ మీదకు కారు చేరుకుంది. బండ్‌కి క్రిందుగా మరోదారి వుంది. రెండుదార్లూ సమాంతరంగా పయనించి అటుచివర మళ్ళీ కలుస్తాయి. క్రింది దారి లారీలకోసం నిరించబడింది.

బండ్ పైకి చేరుకున్న తరువాత, ముందు ఆమె కారు కనబడకపోవడంతో రేవంత్ కంగారుపడ్డాడు. అయితే బండ్ క్రిందున్న లారీరోడ్డుమీద దూరంగా ఆమె కారు వెళ్లటం చూసి స్థిమితపడ్డాడు. ఆ రోడ్డుని ఎన్నుకోవటం కోసం ఆమె కారువేగం హెచ్చించిందన్నమాట.

రెండుకార్లూ వేగంగా ఒకే దిశలో రెండు రోడ్లుమీదా వెళ్తున్నాయి. మధ్యలో దారులు దూరమయ్యాయి. చెట్లు ఎత్తుగా వున్నాయి. వాటి అవతల వైపు వెళ్తున్న కారు కనిపించటం లేదు.

రేవంత్‌కి అప్పుడో అనుమానం వచ్చింది.

తన కారు వేగం సంగతి తెలిసిన ఆ అమ్మాయి ఏ మాత్రం తెలివివున్నా ముందుకు సాగుతుందా? ఆ చెట్ల చాటున దాగి, తన కారు ముందుకు సాగగానే వెనక్కి తిప్పుతుందా, ఆ ఆలోచన రాగానే సడన్ బ్రేక్ వేసేడు, ఇంకో అనుమానం.

- ఇంటి కప్పుమీద పది కాకులు ఉన్నాయి. తుపాకి పేల్చి ఒక కాకిని చంపితే ఎన్ని ఉంటాయి? ఏమీ ఉండవు. ఎగిరిపోతాయి అని మామూలు వాడు చెప్తాడు. ఒకటి ఉంటుందని కొద్దిగా తెలివైనవాడు చెప్తాడు. తొమ్మిది వుంటాయని అతి తెలివి వున్నవాడు చెప్తాడు; జవాబు చెప్పే ముందు తార్కికంగా ఆలోచించాలి. అన్ని ప్రోబబులిటీసూ చూసుకోవాలి. అలాంటి సమయస్ఫూర్తి ఉన్న అబ్బాయిల్నే అమ్మాయిలు కోరుకుంటారు.

ఈ అమ్మాయి వెనక్కి వెళ్తుందా - ముందుకు వెళ్తుందా -

వేగంగా రేవంత్ కారుని ముందుకు పోనిచ్చాడు. చెట్టుదాటి మలుపు తిరగ్గానే సడెన్ బ్రేక్ వేసి, పక్కకి తీసి ఆపుచేశాడు. అవతలివైపు చెట్లచాటునుంచి ఆ అమ్మాయి తనకారు వెళ్ళిపోవటాన్ని గమనిస్తుందని అతడికి తెలుసు.

కారు ఆపుచేసి, తాళంవేసి, అట్నుంచి వస్తూన్న ఖాళీ టాక్సీని ఆపుచేసి ఎక్కి వచ్చిన దారి వెంటే వెనక్కి పోనిమ్మన్నాడు.

అతడి అంచనా కరెక్టయింది.

ఆమె కారు వెనక్కి వెళ్ళిపోతోంది.

ఆ కారు వెనుకే టాక్సీని అనుసరించమన్నాడు. ఆ అమ్మాయి తాపీగా కారు నడుపుతూంది. వెనక కార్లో రేవంత్ వున్నాడని కలలో కూడా వూహించలేదు.

ఆమె కారు ఫైవ్‌స్టార్ హోటల్‌లోకి ప్రవేశించింది. సరీగ్గా రెండు నిముషాల తరువాత రేవంత్ టాక్సీ అక్కడికి చేరుకుంది. టాక్సీ వాడికి డబ్బులిచ్చి రేవంత్ హోటల్‌లో ప్రవేశించాడు.

పెద్ద పెద్ద అరిస్ట్రోక్రటిక్ కుటుంబాల్లో పుట్టిన అబ్బాయిలూ, అమ్మాయిలూ రెస్టారెంట్‌లలో కాకుండా ఇలా రూమ్స్‌లో పార్టీలివ్వటం మామూలే.

రేవంత్ రిసెప్షన్ వద్దకు చేరుకుని, ''ఎక్స్‌క్యూజ్‌మీ! మిస్ రమ్య పార్టీ ఏ రూమ్‌లోనో చెప్పగలరా?'' అని అడిగాడు.

''ఇప్పుడే ఇలా వెళ్ళారు సార్!''

''అవును ఆమే''

''214''

రేవంత్ లిఫ్టు ఎక్కి రెండో అంతస్తు చేరుకున్నాడు. స్టార్ హోటల్ అవటం వల్ల వరండా నిర్మానుష్యంగా వుంది. కాళ్ళ క్రింద కర్పెట్ మెత్తగా తగులుతూంది.

అతడు వరుసగా గదులు దాటుకుంటూ వచ్చి 214 గది ముందు ఆగేడు. వెంటనే తలుపు కొట్టలేదు. తాళంచెవి కన్నం దగ్గర చెవిపెట్టి విన్నాడు.

''భలే టోకరా ఇచ్చావే రమ్యా!'' అని అంటుందో అమ్మాయి.

రేవంత్ నిటారుగా నిలబడి గుండెల్నిండా గాలి పీల్చుకున్నాడు. ఒక్క నిముషం ఆగి చటుక్కున హాండిల్ తిప్పి తలుపు లోపలికి తోశాడు.

గదిలో అమ్మాయిలు నలుగురూ ఈ హఠాత్ పరిణామానికి తలతిప్పి అతడి వంక చూసేరు. వాళ్ళు ఆ క్షణం అతడిని అక్కడ అలా వూహించలేదు.

ఆ నలుగురిలోనూ తనని ఇంతకాలం ఆటపట్టించింది ఎవరో రేవంత్‌కి తెలియలేదు. అందంలో మాత్రం నలుగురమ్మాయిలూ ఒకర్నొకరు తలదన్నేట్టు వున్నారు. అందరికీ ఒకే వయసు, ఒకే ఛాయ.

అయితే అక్కడ రేవంత్ తెలివిగా వ్యవహరించాడు. 'నేను నిన్ను కారులో చూశానులే' అన్న నమ్మకం కలిగేలా 'హలో రమ్యా'' అన్నాడు చిరునవ్వుతో - ఏ అమ్మాయినీ సూటిగా చూడకుండా.

నలుగురూ ఒకర్నొకరు చూసుకున్నారు. ఆ గదిలో ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది. తనేదో తప్పు చేసేనని మాత్రం రేవంత్‌కి

అర్థమయింది. ఇక లాభం లేదనుకుని ''నిజం చెప్పండి, మీలో రమ్య ఎవరు?'' అని అడిగాడు.

నలుగురూ ఒకేసారి 'నేనే' అనేసి, మిగతా ముగ్గురూ అదే మాట అన్నారని గ్రహించి, నాలిక్కరుచుకుని, మళ్ళీ నలుగురూ ఒకేసారి ''నేనుకాదు'' అన్నారు. తరువాత ఒకర్నొకరు చూసుకుని ఫక్కుమన్నారు.

రేవంత్ మొహం ఎర్రబారింది. ''నేనే కనుక్కుంటాను. కానీ ముందు మీరే చెప్పటం మంచిది'' అన్నాడు.

''రమ్య మాలా మామూలుగా వుంటే చాలా'' కవ్విస్తున్నట్టు అందో అమ్మాయి. రేవంత్ ఏదో అనబోతూ ఉంటే, టాయిలెట్ రూమ్ హాండిల్ కదిలింది. తలుపు తెరుచుకుంటూ వుంటే, నలుగురిలోనూ ఒక అమ్మాయి చప్పున బాత్‌రూమ్ దగ్గిరకు వెళ్ళి ''రమ్యా - బైటకు రాకు. రేవంత్ ఇక్కడే వున్నాడు'' అని అరిచింది. తెరుచుకోబోతున్న తలుపు వెంటనే మూసుకుపోయింది. తరువాత లాక్ వేసుకున్న ధ్వని వినిపించింది.

ఆ గదిలో సూదిపడితే వినబడేంత నిశ్శబ్దం వ్యాపించింది. రేవంత్ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. సరీగ్గా పది అడుగుల దూరంలో వున్న అమ్మాయిని తను కలుసుకోలేక పోతున్నాడు. ఇంతకాలం వెతికిన అమ్మాయినీ ఇంత దగ్గిరగా వచ్చి కూడా పట్టుకోలేకపోతున్నాడు.

ఊహూ - తను! తను ఎలాగైనా సాధించి తీరుతాడు.... అలా అనుకుంటూ, అతడు మిగతా వారివంక చూసేడు. నలుగురు అమ్మాయిలూ అతడివైపే చూస్తున్నారు. వాళ్ళ కళ్ళు అల్లరిగా నవ్వుతున్నాయి.

ఒక ఊపులో వెళ్ళి బాత్‌రూమ్ తలుపు బద్దలుకొడదామా అన్నంత కసి పుట్టింది రేవంత్‌కి. లోపల ఆ అమ్మాయి తలుపుకి ఆనుకొని నిలబడి నవ్వుకుంటూ వుందేమో? ఏం చేద్దామా అని అతడు ఆలోచిస్తూ వుండగా ఇంతలో ఒక అమ్మాయి కదిలి "రేవంత్, ఇక మీరు వెళతారా ఈ గది నుంచి" అంది ఇంగ్లీషులో.

ఆ కంఠంలో కనబడిన కమేండ్‌ని రేవంత్ అర్థం చేసుకున్నాడు. నిజమే తనకి ఇక్కడ వుండటానికి హక్కులేదు. ఎవరిదో ఈ గది.

ఒకసారి నలుగురివైపూ చూసి మౌనంగా అతడు ఆ గదిలోంచి బైటకు వచ్చేసేడు.

అయితే అతడు ఆ గదిలోంచి వచ్చేసేక క్రిందికి వెళ్ళిపోలేదు. వరండా చివరికి వళ్ళి ఒక మూలగా నిలబడ్డాడు. ఇంతకాలం తననేడిపించిన అమ్మాయి బైటకొచ్చేవరకూ, ఎన్ని యుగాలైనా అలాగే నిలబడి వుండటానికి నిశ్చయించుకున్నాడు.

ఈ లోపులో ఆ గది తలుపు తెరుచుకుంది. రేవంత్ ఊపిరి బిగపట్టి మరింత చీకట్లోకి జారుకున్నాడు. అక్కణ్ణుంచి తను కనబడనని అతడికి నమ్మకం.

ఇంతలో ఒక అమ్మాయి తలబైటపెట్టి వరండాలోకి చూసి మళ్ళీ తలుపు వేసేసింది. రేవంత్‌కి లక్ష అనుమానాలు కలిగాయి.

వాళ్ళకి తను ఇక్కడ వున్నట్టు అనుమానం కలిగిందా? అసలు ఏం జరుగుతూంది లోపల? ఈ అమ్మాయిలు ఏం చేస్తున్నారు?

అతడి ఆలోచన్లని భంగపరుస్తూ వెనక అడుగుల చప్పుడు వినిపించింది. నీగ్రోలాంటి వెయిటర్ ఒకడు వచ్చి, ''ఏం చేస్తున్నారు ఇక్కడ?'' అని అడిగాడు. అతడి కంఠంలో మర్యాద ఒక పాలు తక్కువ అవటం రేవంత్ గమనించాడు.

''ఒక స్నేహితుడి కోసం చూస్తున్నాను.''

''మిమ్మల్ని మేనేజరుగారు రమ్మంటున్నారు.''

''ఎందుకు?''

''తెలీదు''

''ఏమైనా మాట్లాడవలసి వుంటే మీ మేనేజర్ని ఇక్కడికి రమ్మను.''

''గొడవ చెయ్యకండి సర్! మీ అంతట మీరే వస్తే మంచిది.'' వెయిటర్ కంఠంలో ఎక్కడా వినయం లేదు. రేవంత్ అతడితో గొడవ పెట్టుకోదల్చుకోలేదు.

అతడితో కలిసి క్రిందికి వెళ్ళాడు. రిసెప్షన్ వెనగ్గా వుంది మానేజర్ రూమ్. ముందు తిడదామనుకున్నవాడల్లా, రేవంత్‌ని చూసి కొద్దిగా మర్యాద తెచ్చుకున్నాడు మానేజర్. ''మీరు రెండో అంతస్థులో ఓ గదికి వెళ్ళి అక్కడ అమ్మాయిల్ని వేధిస్తున్నారట. ఆ గదినుంచి ఫోన్ వచ్చింది'' అన్నాడు.

రేవంత్‌కి అర్థమయింది. తనని ఈ హోటల్ బైటకు పంపటానికి ఈ ఎత్తు వేశారన్నమాట అమ్మాయిలు.

అతడు తిన్నగా మానేజర్ మొహంలోకి చూసి గంభీరంగా అన్నాడు.

''రెండో అంతస్థులో తనకోసం ఎదురుచూడమని ఒక పెద్ద బిజినెస్ ఎగ్జిక్యూటివ్ నన్ను స్నేహితుడిగా అక్కడికి ఆహ్వానించాడు. ఎవరినీ డిస్టర్బ్ చేయకుండా నేను వరండాలో నిలబడివుంటే మీ వెయిటర్ నాతో అమర్యాదగా మాట్లాడి క్రిందికి లాక్కొచ్చాడు. ఇప్పుడు మీరు అనవసరంగా నామీద ఈ అభియోగం మోపుతున్నారు. ఈ విషయమై మీ యాజమాన్యానికి ఫిర్యాదు చేయదలచుకున్నాను. కేవలం ఒక ఫోన్ కాల్

ఆధారంగా మీరు నన్ను ఇలా నిలదీయటంపై దాదాపు యాభైవేలకి మీమీద పరువునష్టం దావా వెయ్యదల్చుకున్నాను.''

అతడు ఆశించినట్టే మానేజర్ మొహంలో భయం కొట్టొచ్చినట్టు కనబడింది.

''సారీ సర్! కానీ రూమ్ నెంబర్ 214 నుంచి ఫోనూ'' అంటూ నసిగాడు. అతడు అలా తడబడటంతో రేవంత్ మరింత విజృంభించాడు.

''ఎవరండీ ఫోన్ చేసింది! క్రిందికొచ్చి కంప్లెయింటు చెయ్యమనండి. రాతపూర్వకంగా తీసుకొండి... రమ్మనండి.... లేకపోతే మనమే వెళ్దాం. అంతే కానీ ఫోన్లేమిటి ఫోను'' అని గద్దించాడు.

''అయిందేదో అయిపోయింది. మీరు 'లాంజ్'లో కూర్చోండి సార్!'' అన్నాడు మానేజరు.

''అలా కుదర్దు. రండి ఆ రూమ్ నెంబర్ 214కి వెళ్దాం. వాళ్ళేం చెప్తారో విందాం'' అంటూ లేచాడు. అతడికి ఎలాగైనా ఆ గదిలోకి హఠాత్తుగా ప్రవేశించాలని వుంది. తను వెళ్ళిపోయాడన్న విజయగర్వంతో వాళ్ళు వుండగానే ఇది జరగాలి.

అతడూ, మానేజరూ కలిసి రెండో అంతస్థుకి వచ్చారు. గది లోపల గడియవేసి వుంది. మానేజర్ తలుపుకొట్టాడు.

''ఎవరూ?'' అని లోపల్నుంచి వినిపించింది.

''మేనేజ్‌మెంట్''

తలుపు తీసిన ధ్వని. రేవంత్ గోడవెనగ్గా కనబడకుండా నిలబడ్డాడు. తలుపు తీసిన అమ్మాయి పూర్తిగా తియ్యకుండా అడ్డంగా నిలబడింది.

''ఎవరో అబ్బాయి వచ్చి గొడవ చేశాడని కంప్లెయింట్ ఇచ్చారు మీరు'' అన్నాడు మానేజరు.

వచ్చింది మానేజరే అని నిశ్చయించుకుని ''అవును, లోపలికి రండి'' అంటూ పక్కకి తప్పుకుంది. మానేజరు లోపలికి వెళ్తూంటే పక్కనుంచి ఒక్క అడుగులో ముందుకొచ్చి అతడి వెనుకే తనూ గదిలో ప్రవేశించాడు రేవంత్. కనురెప్పపాటు కాలంలో ఇది జరిగిపోయింది.

అతడు అంత అకస్మాత్తుగా చీకట్లోంచీ రావటాన్ని వూహించని ఆ అమ్మాయి బిత్తరపోయింది. రేవంత్ సన్నగా నవ్వి ముందుకు అడుగు వేసేడు.

గదిలో అమ్మాయిలందరూ వారివంకే చూడసాగేరు.

''మేడమ్, మీ రూమ్‌కి వచ్చి డిస్టర్బ్ చేసిన అబ్బాయి ఈయనేనా?'' అని అడిగాడు మానేజరు.

''మైగాడ్, కాదండీ'' అంది నమ్రత నిండిన కంఠంతో ఒక అమ్మాయి. రేవంత్ పక్కలో బాంబు పడ్డట్లు అదిరిపడ్డాడు ఆ జవాబుకి.

''ఎవరో నల్లగా రౌడీలా వున్నాడు. తలుపు కొట్టి రావొచ్చా అని అడిగాడు భయపడి మీకు ఫోన్ చేశాం.'' అంది అంతలో మరో అమ్మాయి. ఇంకో అమ్మాయి రేవంత్ వైపు ఆరాధనగా చూస్తూ ''ఈయనలాంటి అబ్బాయి అయితే మీకెందుకు ఫోన్ చేస్తాం?'' అంది అల్లరిగా. అమ్మాయిలందరూ కలిసి తనని ఏడిపిస్తున్నారనీ అర్థమైంది. ఎంత సీరియస్‌గా వుందామని ప్రయత్నించినా వాళ్ళ మొహాల్లో నవ్వు కనబడుతూనే వుంది. అయితే రేవంత్ దాన్ని పట్టించుకోలేదు. టాయిలెట్‌లోకి తొంగి చూసేడు. అది ఖాళీగా వుంది.

అతడు అలా చూడడం గమనించి ''మీరు టాయిలెట్‌కి వెళ్తారా - వెళ్తే మాకు అభ్యంతరం లేదు'' అంది మరో అమ్మాయి. నమిలి తినెయ్యాలన్నంత కోపం వచ్చింది రేవంత్‌కి. బలవంతం మీద అణచుకున్నాడు.

మానేజరు, ''సారీ మేడమ్! మీరు నిర్భయంగా వుండండి'' అంటూ రేవంత్ వైపు తిరిగి ''సారీ సర్, మీరు మీ మిత్రుడికోసం కారిడార్‌లో వెయిట్ చెయ్యండి. షల్ ఐ సెండ్ కాఫీ ఫర్ యూ...'' అని అడిగాడు మర్యాదగా.

రేవంత్ అతడి మాటలు వినటం లేదు, ఆలోచిస్తున్నాడు.

'ఏమైంది ఈ అమ్మాయి! ఈ అయిదు నిముషాల్లోనూ ఎటు వెళ్ళింది!'

ఆలోచిస్తూ అన్యమనస్కంగా అతడు మానేజర్‌తో కలిసి గదిలోంచి బైటకి రాబోతూవుంటే నాలుగో అమ్మాయి ''బిల్ సెటిల్ చేసెయ్యండి,హోస్ట్ వెళ్ళిపోయింది. మేమూ వెళ్ళిపోతాం'' అంది.

ఆ మాటలకి కాలికేదో అడ్డుపడినట్టు అగిపోయాడు రేవంత్.... హోస్ట్ వెళ్ళిపోయిందంటే... అంటే ..... జరిగిందేమిటో ఇప్పుడు అతనికి అర్థం అయింది.

గదిముందు కారిడార్‌లో నిలబడివున్న తనని రెండు నిమిషాలపాటు ఏదో నెపం మీద మానేజరు గదిలోకి పంపించింది. తను లోపలికి వెళ్ళగానే దర్జాగా జారుకున్నదన్న మాట.

మెట్లు దిగుతున్న రేవంత్ ఇప్పుడు మామూలు పాతికేళ్ళ అమాయకమైన యువకుడిలా లేడు. అంతర్జాతీయ చదరంగపు ఆటగాడిలా వున్నాడు. దెబ్బ తగిలిన పులిలా వున్నాడు.

సానపెట్టేకొద్దీ వజ్రం ప్రకాశిస్తుంది. టెన్నిస్‌లో గానీ చదరంగంలో గానీ ప్రత్యర్థి ఆటమీదే ఇవతలివారి ఆట ఆధారపడివుంటుంది. అవతలి ప్రత్యర్థి బాగా ఆడి తిప్పలు పెట్టేకొద్దీ నిక్షిప్తమైవున్న నిజమైన ఆటగాడు

విజృంభిస్తాడు. సర్వశక్తులూ సమగూడ కట్టుకుంటాడు. రేవంత్‌కి అదే జరుగుతూంది.

ఆఖరి క్షణంలోనైనా పట్టుకోవచ్చుననే నిర్లక్ష్యంలో తేలిగ్గా వదిలేసేడు ఇంతకాలం. కానీ యీ రోజు చాలా పకడ్బందీగా ప్లాన్ వేశాడు. పిల్లిని గదిలో పెట్టినట్టు అన్నివైపుల్నుంచీ దార్లు మూసుకుంటూ వచ్చి చూసేసరికి, ఏముంది? తన ఎత్తుకి పై ఎత్తు వేసి జారుకుంది యీ అమ్మాయి. ఇంత ఇరుకు పరిస్థితిలో కూడా ఇంత వూపిరి సలపని టెన్షన్‌లో కూడా తను గదిలోకి వచ్చి పది అడుగుల దూరంలో నిలబడినా కూడా పందెం ఓడిపోకుండా అక్కడికక్కడే షార్ప్‌గా ఆలోచించి తనని మేనేజర్ రూమ్‌లో ట్రాప్ చేయించగలిగిందీ అంటే....

ఇన్నాళ్ళకి తన సమవుజ్జీ దొరికింది. ఇక పై ఎత్తు తనే వెయ్యాలి.

అతడు కౌంటర్ దగ్గిర ఆగి, ‘‘మీ ఫోన్ వాడుకోవచ్చా’’ అని అడిగాడు. రిసెప్షనిస్టు తల వూపేడు.

నెంబరు తిప్పి ‘జేమ్స్’ అన్నాడు.

‘‘స్పీకింగ్’’

‘‘నేను హోటల్ ఆనందాశ్రమ్ నుంచి మాట్లాడుతున్నాను. చెప్పేది జాగ్రత్తగా విను. నువ్వు వెంటనే నీ మోటర్ సైకిల్ వేసుకుని ఇక్కడికి రా,

ఎందుకో తర్వాత చెప్తాను. ఎలా వుంటే అలా వచ్చెయ్యి. టాంక్‌లో పెట్రోల్ వుందో లేదో చూసుకో, క్విక్'' అని ఫోన్ పెట్టేశాడు.

ఇలాటి ఫోన్లు మరో మూడు చేశాడు.

తరువాత మానేజర్ దగ్గిరకు వెళ్ళాడు. చిరునవ్వుతో ''మీరు నాకు కాఫీ ఇస్తానని ప్రామిస్ చేసేరు'' అన్నాడు.

''ఓ ష్యూర్''

రేవంత్ ఎదుట కుర్చీలో కూర్చుంటూ ''ఊరికే కాదులెండి, బిల్ పే చేస్తాను'' అన్నాడు నవ్వుతూ.

అతడూ నవ్వుతూ ''నో, నో... మీకు మేమిచ్చిన శ్రమకి ఇది పెనాల్టీ'' అన్నాడు. అతడూ యువకుడే.

''మిమ్మల్నెక్కడో చూసినట్టుంది'' అన్నాడు రేవంత్. మానేజర్ తలెత్తాడు.

''ఎక్కడ చూసి వుంటారు?''

''సరిగ్గా గుర్తుకు రావటం లేదు'' నుదురుమీద చూపుడువేలుతో తట్టుకున్నాడు రేవంత్.

''పోన్లెండి'' అని కుర్చీలోంచి లేచి, ''.... కాఫీ తెప్పిస్తాను'' అంటూ గదిలోంచి బైటకి వెళ్ళాడు. రేవంత్ బల్లమీదున్న బిల్ బుక్ క్రింద కాళ్ళ దగ్గిర పడేసేడు. తరువాత కాలితో దాన్ని చెత్తబుట్ట పక్కకి తోసేడు.

మేనేజరు కాఫీ పట్టించుకొచ్చాడు.

కాఫీ తాగుతూ క్యాజువల్‌గా ''ఎవరా అమ్మాయిలు ఆ గదిలో వున్నది?'' అడిగాడు రేవంత్.

''మా మేనేజింగ్ డైరెక్టరు గారి కూతురు ఓ అమ్మాయుంది. వాళ్ళేదో పార్టీ అంటే....''

''ఎవరు? రమ్యా...'' తనకందులో ఏమీ ఉత్సాహం లేనట్టు అడిగాడు రేవంత్.

''కాదు అరవింద అని - మనం వెళ్ళేసరికి కోప్పడుతూ తలుపు తీసిందే ఆ అమ్మాయే''

ఇంతలో రిసెప్షనిస్ట్ వచ్చి వెతకటం మొదలుపెట్టాడు.

''ఏం కావాలి''

''బిల్ బుక్ సర్''

''ఇక్కడికి రాలేదే'' అన్నాడు మేనేజరు. రిసెప్షనిస్ట్ వెళ్ళిపోయాడు. మళ్ళీ ఇద్దరూ కబుర్లలో పడ్డారు. అయిదు నిమిషాలు మామూలు

సంభాషణ జరిగాక ''మానేజింగ్ డైరెక్టర్ కూతురికి కూడా మీరు బిల్లు వేస్తారా?'' అని అడిగాడు రేవంత్.

''లిమిటెడ్ కంపెనీ గదా, అదీగాక ఎవరో స్నేహితురాలి పార్టీ అట''

''ఎవరా స్నేహితురాలు? రమ్యా?''

''నాకు తెలీదు''

మళ్ళీ రిసెప్షనిస్ట్ బిక్కమొహంతో వచ్చాడు. మేనేజర్ బల్ల మీదున్న కాగితాలూ, పుస్తకాలూ తీసి చూపించి ఇక్కడ లేదన్నాగా'' అన్నాడు.

ఇంతలో బైట మోటారుసైకిలు వస్తున్న శబ్దం వినిపించింది.

దానికోసమే చూస్తున్న రేవంత్ వంగి ''అరె ఇక్కడేదో పుస్తకం పడివుందే, ఇదేనా'' అంటూ తీసి ఇచ్చాడు. రిసెప్షనిస్టు చాటంతయిన మొహంతో 'ఇదే' అంటూ దాన్ని తీసుకొని వెళ్ళాడు.

కాఫీ పూర్తిచేసిన రేవంత్ కుర్చీలోంచి లేచి ''థాంక్యూ ఫర్ యువర్ కాఫీ'' అని షేక్‌హాండిచ్చి బైట పోర్టికోలోకి వచ్చాడు. అతడు బయటికి వస్తూంటే మరో రెండు మోటారు సైకిళ్ళు లోపలికి ప్రవేశించినయ్.

జేమ్స్ అంతకుముందే చేరుకున్నాడు.

మొత్తం నలుగురూ రేవంత్ దగ్గిరకొచ్చారు. అందులో ఇద్దరు జీన్స్‌లో వున్నారు. ఒకరు చూయింగ్ గమ్ వదులుతున్నారు. పైకి అలా

నిర్లక్ష్యంగా కనబడ్డారు కానీ వాళ్ళందరూ చాలా తెలివైనవాళ్ళు. ఆఫీసులో పని చాలా చురుగ్గా చేసేవాళ్ళు. రేవంత్‌కి సబార్డినేట్స్ అయినా - చాలా దగ్గర స్నేహితులు. వాళ్ళకి ఈ అఫైర్ గురించి, రేవంత్ పడే బాధల గురించీ కొద్దిగా తెలుసు.

రేవంత్ ఆ రోజు తను చేసిన పన్లూ, తన ఆ అమ్మాయిని దాదాపు పట్టుకోబోవటం - ఆ అమ్మాయి తప్పించుకోవటం - అంతా వివరంగా చెప్పాడు వాళ్ళకి.

''కొర్రమీనులా జారిపోయిందన్నమాట'' అన్నాడు సాలోచనగా జేమ్స్ అంతా విని.

''ఇంతకీ మేం చెయ్యాల్సిందేమిటి?''

''ఆ అమ్మాయి అయితే వెళ్ళిపోయింది. కానీ, స్నేహితురాళ్ళు నలుగురూ ఆ రూమ్‌లోనే వున్నారు. ఇంకొంచెంసేపట్లో వాళ్ళూ వెళ్ళిపోబోతున్నారు'' అన్నాడు రేవంత్.

''వాళ్ళను బంధించి ఇంగ్లీషు పిక్చర్లోలా రహస్యం రాబట్టాలా?''

అందరూ నవ్వేరు. రేవంత్ నవ్వలేదు. వాళ్ళు బైటకు రాబోయే గుమ్మంవైపే చూస్తూ అన్నాడు. ''ఈ అయిదుగురు అమ్మాయిలూ చాలా దగ్గిర స్నేహితుల్లా కనబడ్డున్నారు. సాధారణంగా ఇంత దగ్గిర స్నేహితులు ఎవరవుతారు? ఒకే కాలేజీలో చదివినవారు కానీ - ఒకే వీధిలో వుండేవారు

కానీ లేకపోతే వీణా డాన్సులాంటి ఒకే హాబీ వున్నవారుకానీ అవుతారు. అవునా? ఈ నలుగుర్నీ మీ నలుగురూ వేర్వేరుగా ఫాలో అవ్వాలి. నలుగురూ ఒకే వీధివాళ్ళు అయితే మనకి ఆ 'రమ్య' అనే ముద్దు పేరున్న అమ్మాయి ఆడ్రసు దొరికిపోయినట్లే. అలా కాని పక్షంలో వీళ్ళు నలుగురికి కామన్‌గా వున్న అభిరుచి కానీ మరేదైనా కానీ - అదేమిటో పట్టుకోవాలి. దాంతో ఆ అయిదో అమ్మాయి సంగతి తెలిసిపోతుంది.''

అతడి లాజిక్‌కి వాళ్ళు విస్తుపోయారు.

''వీళ్ళు బయటకు వెళ్ళిన తర్వాత రమ్య వీళ్ళను ఎలాగూ కలుసుకుని తీరుతుంది. ఆరు మూడయినా మూడు ఆరయినా పట్టుకుని తీరుతాం గురూ!'' అన్నాడు జేమ్స్ ఉత్సాహంగా.

''ఆరు మూడయితే పర్లేదు కానీ, మూడు ఆరయితే కష్టం. నాకు అయిందింటికే ఫ్లయిటు. ఇంకో గంటలో వివరాలు కావాలి.''

''గంటా! ఇంపాజిబుల్''

''ఒకే వీధి అయితే పర్లేదు. అలా కాకుండా ఏ డాన్సు స్కూలు వాళ్ళో అయితే కష్టం''

''అందుకేగా మిమ్మల్ని ఎన్నుకున్నది'' అంటూ వాళ్ళ 'ఈగో'ని కొద్దిగా రెచ్చగొట్టాడు రేవంత్. అంతలో గుమ్మం దగ్గర అలికిడి వినిపించింది.

రేవంత్ స్తంభం వెనక్కి తప్పుకున్నాడు.

ఇద్దరమ్మాయిలు ఒక కారులోనూ మరో ఇద్దరు ఆటోలోనూ వెళ్ళిపోయారు.

"క్విక్, బయల్దేరండి, ప్రతీ పది నిముషాలకీ మా ఇంటికి ఫోన్ చెయ్యండి" అన్నాడు. మాడ్‌మాక్స్‌లోలా నాలుగు మోటారుసైకిల్స్ పెద్ద చప్పుడుతో బయల్దేరినయ్.

రేవంత్ టైమ్ చూసుకొన్నాడు, రెండు కావొస్తోంది. ఎండ తీక్షణంగా వుంది.

తను వేసిన ఎత్తు మరీ అర్థరహితంగా వుందా అని అనుకున్నాడో క్షణం. ఇక చేయగలిగిందేమీ లేదు. ఈ మూడు గంటల్లో ఏదైనా దొరుకుతే సరేసరి! లేకపోతే ఓడిపోయినట్టే!

అతడు ఇంటికి చేరుకున్న అయిదు నిమిషాలకి జేమ్స్ నుంచి ఫోన్ వచ్చింది. "ఒకమ్మాయిని కార్లో తిలక్ స్ట్రీట్‌లో దింపేసి, రెండో అమ్మాయి ప్రెసిడెంట్ స్ట్రీట్‌వైపు వెళ్ళిపోయింది. నేనిక్కడే ఆగిపోయాను. దీన్నిబట్టి తెలుస్తున్న దేమిటంటే ఈ నలుగురమ్మాయిలూ ఒకే లొకాలిటీవాళ్ళు కాదు" అన్నాడు డిటెక్టివ్‌లా.

"ఆ విషయం వాళ్ళు కారూ - ఆటో ఎక్కి చెరో వైపుకి వెళ్ళిపోయినప్పుడే తెలిసింది" తాపీగా అన్నాడు రేవంత్.

జేమ్స్ గతుక్కుమన్నాడు.

''ఇంతకీ నువ్వేం చేయబోతున్నావు?'' అని అడిగాడు రేవంత్.

''మైగాడ్! అంత సాహసం ఎలా చేస్తున్నావ్?''

''సోషల్ సెక్యూరిటీ అధికారిగా''

''ఇవి నిశ్చయంగా నీ తెలివితేటలు అయివుండవు!''

జేమ్స్ నవ్వి, ''ఏదో నవలలో చదివాను గురూ! అందులో మాంత్రికుడు ఇలానేచేసి హీరోయిన్‌ని కనుక్కొనే ప్రయత్నం చేస్తాడు'' అన్నాడు.

''సామాజిక స్పృహలేని నవలలు చదవటంవల్ల కూడా ఇలా ప్రయోజనాలుంటాయన్న మాట. గో ఎ హెడ్!''

రేవంత్ ఫోన్ పెట్టేసిన రెండు నిముషాలకి మరో ఫోన్ వచ్చింది.

''నేను ఫాలో అయిన అమ్మాయి పోలీసు కమీషనర్ గారి కూతురు'' అన్నాడా యువకుడు.

''గుడ్!''

''కారు దిగి సరాసరి ఇంట్లోకి వెళ్ళిపోయింది.''

''తరువాత ఏమయింది''

"తనెవరో ఫాలో అవుతున్నట్టు ఇంట్లోకి వెళ్ళి చెప్పిందనుకుంటాను. లోపల్నుంచి ఇద్దరు పోలీసులు వచ్చి నన్ను పట్టుకున్నారు."

"ఇప్పుడెక్కణ్ణుంచి ఫోన్ చేస్తున్నావ్?"

"టూ - టవున్ పోలీస్‌స్టేషన్ లాకప్పులోంచి."

* * * * *

మూడో ఫోను వచ్చేసరికి ఆలస్యం అయింది. అయితే ఈ కుర్రవాడు మొత్తం వివరాలు సేకరించి ఫోన్ చేసేడు. రేవంత్ ఫోన్ ఎత్తుకోగానే అంతా విపులంగా చెప్పాడు.

"నేను ఫాలో అయిన అమ్మాయి పేరు అరవింద. ఈ అమ్మాయి ఆనందాశ్రమ్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మానేజింగ్ డైరెక్టరుగారి కూతురు. చాలా చురుకైన అమ్మాయి. పెద్ద పెద్ద కళ్ళూ, ఎప్పుడూ పెదాలమీద నవ్వూ..."

రేవంత్ విసుగ్గా "అవన్నీ అక్ఖర్లేదు - మిగతా వివరాలు చెప్పు" అన్నాడు.

"అరవింద కాలేజీ చదువు అనంతపురం సాయిబాబా కాలేజీలో జరిగింది. హైస్కూలు చదువు రామాపురం స్కూల్లో అయింది. ఈ అమ్మాయికి గిటార్ అంటే ఇష్టం. అక్కినేని నాగేశ్వర్రావ్ అంటే పడిచస్తుంది.

బి.యస్సీ పాసయింది. కలం స్నేహం అంటే ఇష్టం. సినిమాలు తెగ చూస్తుంది. అందులోనూ నాగేశ్వర్రావ్ సినిమా అయితే మొదటిరోజే తప్పదు. జీన్స్ అంటే చాలా ఇష్టం. వాళ్ళ నాన్నకి ఒక్కతే కూతురు. డబ్బు ధారాళంగా ఖర్చు పెడుతుంది. ఇప్పుడా హోటలు బిల్లు కూడా తనే ఇస్తానని పేచీ పెడుతూంది.''

ఉత్సాహంగా వింటూన్న రేవంత్ ఉలిక్కిపడ్డాడు. అర్థంకాక ''హోటల్ బిల్లేమిటి?'' అన్నాడు.

''రెస్టారెంట్ నుంచి మాట్లాడుతున్నాను.''

''అమ్మాయి ఎక్కడుంది?''

''నా పక్కనే''

''మూర్ఖుడా! నే చెప్పిన విషయం ఏమైంది?''

''ఆ అమ్మాయిని నేను ఫాలో అవటం చూసి వెనక్కి తిరిగి నవ్వింది బాస్. వెంటనే స్నేహితులమయిపోయాం. ఆ అమ్మాయే ఈ వివరాలన్నీ చెప్పింది.''

''ఒరే ఇడియట్ - ఈ వివరాలన్నీ ఎందుకు? రమ్య తాలూకు ఫోన్ నెంబర్ కనుక్కుంటే సరిపోతుంది కదా.''

''క్షమించు బాస్! నేనూ అరవింద గాఢంగా ప్రేమించుకుంటున్నాం. ప్రేమలో మోసానికి తావులేదు. నేను నీ గర్ల్ ఫ్రెండ్ గురించి అడిగితే ఆ అమ్మాయికి అనుమానం రావచ్చు. అలా వచ్చిన క్షణం నేను ఇక బ్రతకలేను.''

''నేను నీ కీళ్ళు విరిచెయ్యాదల్చుకున్నాను'' కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు రేవంత్.

''విరిచెయ్యి బాస్! ప్రేమ త్యాగాన్ని కోరుతుంది''

''నీ ప్రేమ తగలెయ్య - మీరు కలుసుకుని అరగంటకూడా కాలేదు కదా!''

''సీత శ్రీరాముణ్ణి ప్రథమ వీక్షణంలో ప్రేమించింది. శకుంతల దు... దు.... దు...''

''దుష్యంతుణ్ణి''

''ఆ - దుష్యంతుణ్ణి మొదటిచూపులోనే ప్రేమించింది. ప్రేమకాలాన్ని గుర్తించదు. ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటూ ఎంత కాలమైనా గడపటం ప్రేమికుల లక్షణం. క్షమించు బాస్! అరవింద పిలుస్తూంది వెళ్ళాలి'' అని ఫోన్ పెట్టేసేడు.

రేవంత్ ఫోన్ పెట్టేసి జుట్టు పీక్కున్నాడు. తన ప్లాన్ సాగేటట్టు లేదు. ఒకడు జైల్లోనూ, ఇంకొకడు అమ్మాయి కొగిలిలోనూ బందీలైపోయారు.

ఏం చేయాలా అని ఆలోచిస్తూ వుండగా నాలుగో ఫోన్ మ్రోగింది. ఈ కుర్రవాడు సిన్సియర్‌గా ఇంగ్లీషులో అన్నీ చెప్పాడు.

''నేను ఫాలో అయిన అమ్మాయి పేరు భానుమతి. వయసు పద్దెనిమిదే. అయినా రెండు నవలలూ, అయిదు కథలూ వ్రాసిందట. ఎస్సెల్సీ వరకూ రామాపురంలో చదువుకుని తరువాత చదువు మానేసి రచనా వ్యాసంగంలోకి దిగింది. ఈ విషయం తెలియగానే ఆమె అభిమానిగా సరాసరి ఇంట్లోకి వెళ్ళిపోయాను. నాపని సులువైంది.''

''కానీ నీకు తెలుగు చదవటం రాదుకదా.''

''ఆ ప్రమాదమేమీ రాలేదు. కేవలం ఆమె మాట్లాడుతూ వుంటే నేను వినటమే జరిగింది. మధ్యలో రెండుసార్లు కాఫీకూడా ఇచ్చింది.''

''ఆ విషయాలు సర్లే. మనకు కావల్సినవి చెప్పు. ఆ అమ్మాయి అభిరుచులు ఏమిటిట.''

''వీణ అంటే ఇష్టం. సితార వింటూ గంటల తరబడి వుండిపోవాలని అనిపిస్తుందట. కవిత్వమూ, పెయింటింగులలో కొద్దిగా ప్రవేశం వుందట. ముగ్గులూ, అల్లికలలో ఉత్సాహం, క్రికెట్ అంటే ఇష్టం. బాలమురళీకృష్ణ

కీర్తనలూ... ఇంకా చాలా చెప్పింది. అన్నీ విన్న తర్వాత ఎందులో ప్రవేశమో ఏది ఇష్టమో నాకు అర్థం కాలేదు.''

''వీటివల్ల మనకేమీ లాభం లేదు, ఇంకేమయినా వివరాలున్నాయా?''

''వివాహంపట్ల ఈమెకి చాలా విచిత్రమైన అభిప్రాయాలున్నాయి. అసలు పెళ్ళి చేసుకోదట. ఒకవేళ చేసుకున్నా తరువాత భర్తని వదిలేస్తుందట. ఈ ప్రపంచంలో గొప్ప గొప్ప వాళ్ళందరూ అవివాహితులూ, భాగస్వామిని వదిలేసినవారూ లేక పెళ్ళయిన తరువాత పరాయి స్త్రీలతో సంబంధాలు పెట్టుకున్న వారేనట, చెప్పొద్దూ... ఈ అమ్మాయికి తొందరగా పెళ్ళయితే బావుణ్ణు అనిపించింది. చాలా విశాలమైన భావాలు'' అని ఫోన్ పెట్టేసేడు - మళ్ళీ చేస్తానంటూ.

రేవంత్‌కి ఏమీ తోచలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్టు వుంది. జేమ్స్ నుంచి ఫోన్ వచ్చింది. అతడు చాలా నిస్సహాయంగా ''ఈ ఇంట్లో ప్రవేశించటమే కష్టంగా వుంది గురూ! గంటనుంచీ ప్రయత్నిస్తున్నా, కుదరటం లేదు. వీళ్ళు చాలా సనాతనుల్లా వున్నారు'' అన్నాడు.

''మరేం చేద్దాం''

''అదే నాకూ అర్థం కావటం లేదు.''

''జేమ్స్! ఒక పని చెయ్యి''

''ఏమిటది''

''హైస్కూలు పాత విద్యార్థుల సంఘం తరపున ఒక మీటింగు పెడుతున్నట్లు విద్యార్థి నాయకుడిగా వెళ్ళు''

''కానీ ఆమె ఏ స్కూల్లో చదివిందో తెలీదు కదా, అందులోనూ ఏడెనిమిది సంవత్సరాల క్రితం.''

''రామాపురం స్కూలు అని చెప్పు''

''కానీ''

''చీకట్లో బాణం వేద్దాం. ఆఖరి బాణం ప్రయత్నించు జేమ్స్'' అని ఫోన్ పెట్టేసేడు.

ఆ తరువాత ఒక్కొక్క క్షణమూ టెన్షన్‌తో గడిచినయ్. మొదటి ఇద్దరు అమ్మాయిలూ ఆ స్కూల్లోనే చదివారు కాబట్టి మూడో అమ్మాయి కూడా అదేచోట చదివి వుంటుందన్నది చాలా సుదూరమైన - లాజిక్‌కు అందని ఆలోచన, మూడూ పది.... మూడుంపావు....

రేవంత్‌కి ముళ్ళమీద కూర్చున్నట్టుంది. ఫోన్‌వేపే ఆత్రుతగా చూస్తున్నాడు. అతడి ఓపికని పరీక్షిస్తున్నట్టు ఫోన్ మ్రోగటం లేదు - ఎంత సేపటికి.

స్నేహితుడిని పోలీసుస్టేషన్నుంచి బైటకు తీసుకొని రావటం ఒక పనివుంది. ఆ విషయం జేమ్స్‌కి చెప్పాలి. ఈ లోపులో ఎయిర్‌పోర్టుకు ఫోన్ చేసి కనుక్కున్నాడు. ఢిల్లో ఫ్లయిట్ అయిదింటికే బయల్దేరుతుంది, లేటు లేదన్నాడు.

అతను ఫోన్ పెట్టెయ్యగానే ఫోన్ మ్రోగింది.

జేమ్స్!

''నువ్వెలా కనుక్కున్నావో తెలీదుకాని గురూ - ఆ అమ్మాయి చదివింది రామాపురంలోనే'' అన్నాడు ఉద్వేగం నిండిన కంఠంతో.

రేవంత్ ఫోన్ పెట్టేసేడు. సంభాషణ కొనసాగించలేదు. ఇక్కణ్ణుంచీ ప్రతినిముషం విలువైనదే. నాలుగున్నరకల్లా ఎయిర్‌పోర్ట్‌లో వుండాలి. అప్పుడే మూడున్నర కావొస్తుంది.

రామాపురం సిటీకి పదిహేను కిలోమీటర్ల దూరంలో మిలిటరీ కంటోన్‌మెంట్ ఏరియా అవతల వుంది. ఆ స్కూలులో ఇంగ్లీషు మీడియం కూడా వుంది. చాలా పురాతనమైన, మంచి స్టాండర్డ్స్ వున్న స్కూలు.

ఆ స్కూలుకి వెళ్ళి - ఏడెనిమిది సంవత్సరాల క్రితపు అటెండెన్సు రిజిష్టరు తీసి - అది అరవింద అన్న పేరున్న సంవత్సరందా కాదా అని చూసి తర్వాత 'ఆర్' అన్న అక్షరంతో మొదలయ్యే పేరు చూడాలి.

గంటలో ఇదంతా సాధ్యమా? వెళ్ళటానికే పావుగంట పడ్తుంటే....

రేవంత్ మరి ఆలోచించలేదు. సరిగ్గా రెండు నిమిషాలు తర్వాత అతడి కారు రామాపురం వైపు దూసుకుపోతూంది -

అతడు రామాపురం చేరుకునేసరికి పావుతక్కువ నాలుగయింది. ఈ లెక్కన - అక్కడ పని పావుగంటలో ముగించుకోవాలి.

అతడికి ఆ అమ్మాయిని పట్టుకోవాలని ఎంతబలంగా కోరిక కలిగిందంటే - అసలు ఢిల్లీ ప్రయాణమే మానుకుందామనుకుంటున్నాడు.

పోలన్‌స్కీతో ఆడటంకన్నా ఈ అమ్మాయితో పందెం గెలవటమే గొప్ప సవాల్‌గా కనిపిస్తూంది.

మళ్ళీ అంతలోనే తన ఆలోచనకి నవ్వొచ్చింది. తన స్వవిషయం కోసం ఇలాటి ఆలోచన రావటమే తప్పు.

అతడు ఆలోచన్లతోనే స్కూలు కాంపౌండులోకి కారు తీసుకెళ్ళాడు. ఆ రోజు స్కూలుకి శెలవనుకుంటా. అటస్థలం, వరండా అంతా నిర్మానుష్యంగా వుంది. సాయంత్రపు ఎండకి స్తంభాల నీడలు పొడవాటి వరండా మీద నిలువుగా పడుతున్నాయి. అతడు నడుస్తూంటే అతడి మొహం మీద పడే వెలుగునీడలు అతడి మనసులో కదిలే అస్పష్టమైన ఆశా నిరాశల్లాగే వున్నాయి.

గెలుస్తాడా?

అదృష్టవశాత్తు ఆఫీసుగది తెరిచే వుంది. అతడు లోపల ప్రవేశించాడు.

విశాలమైన హాలు అది. దాదాపు పది బల్లలదాకా వున్నాయి. ఒక మూల బల్ల దగ్గర మాత్రం అరవై ఏళ్ళ ముసలివాడిలా కనబడ్తూన్న నలభైఏళ్ళ సగటు భారతీయ గుమస్తా కూర్చొని, తలెత్తకుండా పనిచేసుకుంటున్నాడు. రేవంత్ అతడి దగ్గిరగా వెళ్ళి ఎదురుగా నిల్చుని దగ్గాడు నెమ్మదిగా.

అలవాటయిన కంఠంతో "కూర్చో అమ్మాయ్" అంటూ తలెత్తి రేవంత్‌ని చూసి ఆశ్చర్యపోయి, "అరె నువ్వెలా వచ్చావ్? మెయిన్‌గేట్ దగ్గిరే దర్వాన్ మొగాళ్ళని ఆపుచేస్తాడే" అన్నాడు.

"గేటు దగ్గిర ఎవరూ లేరు సార్!" అని నమ్రత నిండిన కంఠంతో అన్నాడు రేవంత్.

"చెప్పబ్బాయ్! నీకేం కావాలి?"

రెవంత్ వెంటనే మాట్లాడలేదు. కొంతసేపటికి జేబులోంచి చేతిరుమాలు తీసుకుని కళ్ళు తుడుచుకున్నాడు. మరింత దుఃఖం పొంగింది.

ముసలాయన ఖంగారు పడ్డాడు. ''ఏమయిందబ్బాయ్? ఏమైంది?'' అని అడిగాడు కుర్చీలోంచి లేస్తూ.

''నా చెల్లి చచ్చిపోయింది సార్!'' అన్నాడు వెక్కిళ్ళ మధ్య రేవంత్.

''అయితే ఇక్కడికి వచ్చి ఎందుకేడుస్తున్నావ్?'' అని అన్లేదు ఆయన. సానుభూతిగా రేవంత్ వైపు చూస్తూ ''ఎప్పుడబ్బాయ్?'' అని అడిగాడు.

''వారం రోజులయింది సార్! ఒక్కగానొక్క చెల్లెలు.''

ఆయన రేవంత్ వైపు జాలిగా చూసేడు. రేవంత్ కాసేపటికి తేరుకొని ''క్షమించండి, మీ పని పాడుచేశాను.'' అన్నాడు.

''ఎవరబ్బాయ్ నీ చెల్లెలు?''

''అరవింద అని .... మీ స్కూల్లోనే చదివింది.''

''అలాగా'' అన్నాడాయన - నేను నీకే సాయం చెయ్యగలను అన్నట్టు చూసి .... రేవంత్ గొంతు సర్దుకుని చెప్పాడు.

''ఒక్కగానొక్క చెల్లెలు సార్! మేమందరం ఎంతో అల్లారుముద్దుగా పెంచాం. ప్చ్, కర్మెవరూ తప్పించలేరు కదా!''

''బాధపడకు నాయనా! చనిపోయిన వాళ్ళందరూ అదృష్టవంతులే''

''అరవింద చనిపోతూ తన ప్రాణమిత్రురాలికి ఈ విషయం చెప్పమంది సార్! ఆ స్నేహితురాలి చిరునామా దొరకటం లేదు.''

''ఎవరా స్నేహితురాలు?''

''పూర్తి పేరు తెలీదండీ. అప్పటికే అరవింద ఎగశ్వాస ప్రారంభమయింది. ర... ర.... రా... అని అంటూంటే, అంతలో ప్రాణం పోయింది'' .... అంటూ మళ్ళీ బావురుమనబోయి కష్టంమీద నిభాయించుకున్నాడు.

''మ్చ్.... ప్రాణం పోయినప్పుడు కూడా తల్చుకొందీ అంటే వాళ్ళెంత దగ్గిరి స్నేహితులో కదా!''

''అవున్సార్! అందుకే ఇంత కష్టపడాల్సివస్తుంది. ఈ విషయం గానీ ఆ అమ్మాయికి తెలియపర్చకపోతే రేపు కర్మరోజున పిండాన్ని కాకులు కూడా ముట్టవు సార్! నా చెల్లెలు ఆ.... త్మ.... క్షో.... భి.... స్తుంది సార్!'' అంటూ కుమిలిపోయేడు.

-తను ఇక్కడ ఆడుతున్న నాటకం ఆ మిత్రబృందానికి తెలిసిందంటే తనని ముక్కలుగా కోసి కాకులకి వేయటం ఖాయం అనుకుంటూ.

ఆయన రేవంత్ భుజంమీద ఓదార్పుగా చెయ్యివేసి, ''బాధపడకు, నేనేం చెయ్యగలనో చెప్పు'' అన్నాడు.

"పిల్లలున్నవారు, నా బాధని అర్థం చేసుకోగలిగారు" అన్నాడు ఆయన్ని ఉబ్బేస్తూ.

"కానీ మా పిల్లలెవరూ చచ్చిపోలేదు నాయనా! ఆరుగురూ బ్రతికే వున్నారు."

రేవంత్ కంగారుపడి "అబ్బెబ్బే.... నా ఉద్దేశం అదికాదు సార్" అంటూ మనసులోనే లెంపలు వేసుకున్నాడు.

"చెప్పు బాబూ, ఏం చేద్దాం?"

"ఆరేడు సంవత్సరాల క్రితం అరవింద ఈ స్కూల్లోనే చదివింది. కాబట్టి ఆ సంవత్సరపు అటెండెన్స్ రిజిష్టర్ తీసి అందులో 'ర'కారంతో ప్రారంభం అయ్యే అమ్మాయి పేరు చూడాలి. ఆ పేరుబట్టి పాత రికార్డు తీసి ఆ అమ్మాయి తండ్రిపేరూ, అడ్రసూ కనుక్కోవాలి. ఇదంతా ఎంతో క్లిష్టమైన పని అని నాకు తెలుసు. కానీ పిండం ... కాకులు..." అనీ మరీ సెంటిమెంటుమీద ప్లేచేస్తే బాగోదని, అర్ధోక్తిలో ఆపుచేసేడు.

ఆయన కదిలిపోయి, "పర్లేదులే నాయనా! కష్టమేముంది - చూద్దాం" అంటూ లేచాడు.

ఇద్దరూ స్టోర్ రూమ్ తాళం తీసి లోపల ప్రవేశించారు. భారతదేశపు ఆర్థికవ్యవస్థలా ఉందా గది.

చిన్న లైటు వేసి పాత రికార్డులు వెతకటం మొదలుపెట్టాడు. అప్పటికే పది నిముషాలు గడిచాయి. రేవంత్ వాచీ చూసుకుని ఉలిక్కిపడ్డాడు. ఇంకా అయిదు నిముషాలు మాత్రమే వుంది. అయిదు నిముషాల్లో బయల్దేరకపోతే విమానాన్ని అందుకోలేడు.

''నీకేమైనా జ్ఞాపకం వుందా - ఆరు సంవత్సరాల క్రితమో? అయిదు సంవత్సరాల క్రితమో?''

''రెండూ చూడాలండి -''

అయిదు సంవత్సరాల క్రితపు రిజిష్టర్ తీసి చూసేడు. అందులో అరవింద పేరు లేదు. అంతకు ముందు సంవత్సరం రిజిష్టర్ తీసిచూసేడు. అందులోనూ లేదు. దాని ముందు సంవత్సరంవి పై అటకమీద వున్నాయి. ముసలాయన పాపం స్టూలు పట్టుకుంటే రేవంత్ ఎక్కి తీసేడు. అతడి తెల్లబట్టలు దుమ్ముతో గోధుమరంగుకి మారేయి.

ఈ సంవత్సరం రిజిష్టర్‌లో ఆ పేరుగానీ లేకపోతే ఇక పందెం ఓడిపోయినట్టే - అని అనుకున్నాడు రేవంత్. ఆ సంవత్సరంవి మొత్తం నాలుగు రిజిష్టర్లు. నాలుగు సెక్షన్లవి.... ముసలాయన 'ఏ' సెక్షన్ తాలూకు పుస్తకం వెతుకుతూ వుంటే, రేవంత్ 'బి' సెక్షన్ తాలూకువి వెతకసాగేడు.

''ఆ దొరికింది'' అని ఇద్దరూ ఒకేసారి అంటూ తలెత్తిచూసేరు.

''ఏ సెక్షన్‌లో కె. అరవింద అని వుంది''

''బి సెక్షన్‌లోనూ వుంది'' అన్నాడు రేవంత్ నిస్సహాయంగా.

''అయితే ఒక పని చేద్దాం. అప్లికేషన్ ఫారం తీస్తే అందులో తెలుస్తుంది కదా! మీ నాన్నగారి పేరు ఏమిటన్నావ్?''

రేవంత్ గొంతులో ఏదో అడ్డుకున్నట్టు అయింది. అతడు జవాబు చెప్పకముందే ముసలాయన పాత ఫైలు ఒకటి తీసి అప్లికేషన్లు బైటకి లాగేడు. ప్రతీ అప్లికేషన్‌కూ ఫోటో ఉండటంతో రేవంత్ తేలిగ్గా ఊపిరి పీల్చుకుని, తనుకూడా చూడటం మొదలుపెట్టాడు.

సగం తీసేక ఆయన ఒక అప్లికేషన్ తీసి పక్కన పెట్టబోతూవుంటే ఆ ఫోటో చూసి, రేవంత్ సంభ్రమాశ్చర్యాలతో ''ఇదే'' అని అరిచాడు. అతడు ఆనందంలో అరచిన అరుపుకి గది కంపించింది. ఆయన దాన్ని బయటకు లాగి ''ఇదేనా'' అన్నాడు.

''ఇదే! ఈ అమ్మాయే'' అని ఎగ్జయిట్‌మెంట్ నిండిన కంఠంతో అన్నాడు.

''తప్పు నాయనా! చెల్లెల్ని అలా అదీ, ఇదీ సంబోధించకూడదు. ఇంతకీ ఏ సెక్షనూ?'' అంటూ అప్లికేషను పరిశీలించి, చూసి ''ఇదేమిటి? దీనిమీద భానుమతి అని వ్రాసుంది?'' అని ప్రశ్నించాడు.

ఒక్క క్షణం రేవంత్ దెబ్బతిన్నా, వెంటనే రెట్టించిన ఉత్సాహంతో ''ఆ అమ్మాయి భానుమతేనండి. మా ఇంటికి అప్పుడప్పుడూ వస్తూ

వుంటుంది. రచనలు కూడా చేస్తుంది... మనం సత్యానికి చాలా దగ్గిరగా వచ్చాం'' అన్నాడు.

ఆయన అప్లికేషన్ కళ్ళదగ్గిరగా పెట్టుకొని పరికిస్తూ, ''.... కానీ ఈమెది సెక్షన్ 'సి' కదా'' అన్నాడు.

రేవంత్ వాక్ప్రవాహం చటుక్కున ఆగిపోయింది. ''అయితే అరవింద అనే ఇంకో పేరు 'సి'గా వుందేమో'' అన్నాడు. మళ్ళీ ఫోటోలు వరసగా చూస్తుంటే ఇంకో తెలిసిన మొహం కనబడింది.

''ఈమెవరు?''

''పోలీసాఫీసరుగారి కూతురు కాత్యాయిని. ఈమె కూడా మీ ఇంటికి వస్తూ వుండేదా?''

రేవంత్ నీరసంగా తలవూపాడు. నిజానికి ఇంత దగ్గిరకు వచ్చినందుకు సంతోషించాలో లేదో కూడా తెలియటం లేదు. చివరికి అరవింద పేరు 'ఎ' సెక్షన్‌లో కనబడింది.

''అందరూ ఒకే సెక్షనులో చదవాలని రూలేం వుందబ్బాయ్? 'సి' డివిజన్‌లో వున్న భానుమతి 'ఎ' సెక్షన్‌లో వున్న నీ చెల్లెలికి స్నేహితురాలయినప్పుడు మరో స్నేహితురాలు ఇంకో డివిజన్‌లో వుండొచ్చుగా?''

‘‘వుండొచ్చు. ఒక్క డివిజనేం ఖర్మ? మొత్తం స్కూల్లోనే ఎక్కడైనా వుండొచ్చు’’ అన్నాడు రేవంత్ జావకారిపోతూ.

ఆయన దాన్ని అంతగా పట్టించుకోకుండా ‘‘మొదటి అక్షరం ఏమన్నావ్? ‘ఆర్’ కదూ... వుండు. మొత్తం నాలుగు సెక్షన్‌లలో ఆ పేరున్నవాళ్ళు ఎంతమంది వున్నారో వెతుకుదాం - ఒకటి... ఆ, ఇదిగో ఇంకొకటి.... ఇప్పుడొకటి .... నాలుగు ... అయిదు ... సెక్షన్ ‘ఎ’లో అయిదు, సెక్షన్ ‘బి’ చూద్దాం - రెండు .... మూడు ... మూడు.. మొత్తం సెక్షన్ ‘సి’లో ఆరు. ఇక ‘డి’ చూస్తే __’’ అంతూ ఇంకా ఏదో చెప్పబోతూ ఉంటే బైట్ కారు స్టార్టయిన ధ్వని వినిపించింది. ఆయన తలెత్తేసరికి ఎదురుగా రేవంత్ లేడు.

కారు విసురుగా పోనిస్తూ, ఇంగ్లీషులో నాలుగక్షరాల్లోనూ, తెలుగులో రెండక్షరాల్తోనూ వున్న ఒక మాటతో తనను తనే తిట్టుకున్నాడు.

16

పెద్ద శబ్దంతో బోయింగ్ ముందుకు నడుస్తుంటే సీటు వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాడు రేవంత్. ఒక అందమైన ఏయిర్ హోస్టెస్ -

విమానం కూలిపోతూవుంటే దేముణ్ణి ఎలా ప్రార్థించాలో ఆక్సీజన్ మాస్క్ పెట్టుకుని వివరిస్తూంది.

తను ఓడిపోయాననీ - ఆ అమ్మాయే గెలిచిందనీ రేవంత్‌కి తెలిసిపోయింది. గడువు ఎల్లుండి సాయంత్రం వరకు ఉంది. అయితే మాత్రమేం తను ఢిల్లీనుంచి బయలుదేరి తిరిగివచ్చేసరికి పదమూడో తారీకు సాయంత్రం అయిదు అయిపోతుంది.

చాక్‌లెట్లు పట్టుకుని వచ్చిన ఎయిర్ హోస్టెస్‌ని ''ఢిల్లీనుంచి తిరిగి వచ్చే ఫ్లయిట్ ఎన్నింటికి వస్తుంది?'' అని అడిగాడు. ''సరిగ్గా సాయంత్రం 4-55కి సర్.''

రేవంత్‌ని భరించలేని నిస్సహాయత ఆవరించింది. తన వూహ నిజమయితే ఆ అమ్మాయి తనని రిసీవ్ చేసుకోవటం కోసం విమానాశ్రయానికి ఆ రోజు వస్తుంది. మరోలా చెప్పాలంటే 'నువ్వు ఓడిపోయావూ' అని తెలియబర్చటం కోసం.

ఎడమ చెయ్యి పిడికిలి బిగించి కుడి అరచేతిలో కొట్టుకున్నాడు రేవంత్.

ప్రొద్దున్న కారు రేసుతో ప్రారంభమయిన వేట - హోటల్‌కి వెళ్ళటం నలుగురమ్మాయిలూ - రామాపురం స్కూలూ ..... ఇంత పకడ్బందీగా ఈ రోజు చేసింది, పందెం ప్రారంభమయిన రోజునుంచీ చేసివుంటే ఎంతో

తొందరగా దొరికిపోవును ఆ అమ్మాయి. తనే ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ఇంతకాలం వదిలేస్తూ వచ్చాడు. చదరంగంలో చివరివరకూ ఓడిపోయినట్టు నటించి చివర్లో ఎత్తువేయడం తనకి అలవాటు. ప్రేమ అనే చదరంగంలో అదే ట్రిక్కు తనమీదే ప్రయోగించిందీ అమ్మాయి. ముందునుంచీ దొరుకుతున్నట్లే నమ్మకం కలిగించి, చివరివరకూ అలానే ఏడిపించింది. ఏడిపిస్తూ గెలిచింది.

ఆలోచనలతోనే ప్లేను మేఘాల్లోంచి క్రిందకు దిగటం గమనించలేదు రేవంత్.

విమానాశ్రయానికి దక్షిణ భారత క్రీడామండలి కార్యదర్శి, రాష్ట్ర చదరంగం బోర్డు సభ్యులూ వచ్చారు. ఆనందమేసింది రేవంత్‌కి. తెలుగువాడి ప్రతిభకు గౌరవం కనీసం బైట రాష్ట్రాల్లోనన్నా దొరుకుతుంది. అందరూ కలిసి హోటల్‌కి బయలుదేరారు.

హోటల్ చేరుకోగానే జేమ్స్‌కి ఫోన్ చేసి, లాకప్‌లో వున్న స్నేహితుడి గురించి కనుక్కుని, అతడు బయట పడ్డాడని తెలుసుకున్నాడు. గుడ్డిలో మెల్ల.

ఆ రాత్రి చాలా సేపటివరకూ నిద్రపట్టలేదు. అద్దాల కిటికీలోంచి నగరాన్నీ, లైట్లనీ చూస్తూ కూర్చున్నాడు. తరువాత ఎప్పుడో ఒంటిగంటకి ఎయిర్ కండిషనర్ ఆఫ్ చేసి పక్కమీద వాలేడు.

17

పోటీ ప్రారంభం అయ్యే హాలుబైట వరండా కిటకిటలాడుతూంది. రేవంత్‌కి షేక్‌హాండిస్తూ ''మీకూ ప్రభాకర్‌కి గొడవవ్వటం మా అదృష్టం. పోలన్‌స్కీ మీతో ఆడటం చూసే అవకాశం మాకు దొరికింది'' అన్నాడు సెక్రటరీ. రేవంత్ నవ్వి వూరుకున్నాడు.

హాల్లోకి ప్రవేశించగానే పోలన్‌స్కీ ఎదురొస్తూ తన పొడవైన చేతిని సాచి, ''హౌ ఆర్యూ మై బోయ్'' అన్నాడు సాదరంగా. రేవంత్ చేతులు కలిపాడు.

సరిగ్గా రెండింటికి పోటీ ప్రారంభమయింది. రేవంత్ టాస్ గెల్చి, బర్డ్స్ వోపినింగ్‌తో తెల్లపావుల్ని ముందుకు జరిపాడు.

గంట గడిచేసరికి ఇద్దరు అంతర్జాతీయ ఆటగాళ్ళూ తమ ఉనికినీ, ప్రపంచాన్నీ మర్చిపోయి ఆటలో నిమగ్నమయ్యారు.

తన కసినీ, ఉక్రోషాన్నీ ఆటలోకి మార్చుకొని విజృంభిస్తున్నాడు రేవంత్. పోలన్‌స్కీకి ఈ ఆట జీవన్మరణ సమస్య. ఈసారి ఓడిపోతే ఇక అంతర్జాతీయ స్థానంలో తను అనధికారంగా ఒక మెట్టు క్రిందికి దిగాల్సిందే అని తెలుసు.

చదరంగం మీద ఉత్సాహం వున్న వాళ్ళు ఆటని పుస్తకాల్లో వ్రాసుకుంటున్నారు.

సాయంత్రమయ్యేసరికి రేవంత్‌ది ఒక రూక్, రెండు పాన్స్ పోయినవి. పోలన్‌స్కీ బిషప్, ఒక పాన్, ఒక రూక్ పోయినయ్. ఎవరివి ఎన్ని పోయినయ్ అన్నది కాదు ప్రశ్న. రేవంత్ గుర్రాలు రెండూ ప్రత్యర్థి పావుల్లోకి చొరబడి వున్నాయి. అతడు నైట్స్‌తో ఎలా కల్లోలం సృష్టించగలడో అందరికీ తెలిసిందే.

ఆ రోజు తాలూకు ఆఖరి ఎత్తు కవర్లో వ్రాసి సీల్ చేసి రెఫ్రీకి ఇచ్చి బైటకొచ్చేశాడు రేవంత్. హోటల్ కొచ్చేసరికి బాగా చీకటి పడింది. ఆ రోజు అతడిని ఎవరో డిన్నర్‌కి పిలిచారు. అన్యమనస్కంగానే వారితో గడిపాడు. టైమ్ చూస్తే అయిదు.

అయిదు.

అంటే సరిగ్గా పన్నెండు గంటలు ఇంకా.

బ్రేక్‌ఫాస్ట్ తీసుకొని బయలుదేరాడు. ఎనిమిదిన్నరకి ఆట తిరిగి ప్రారంభం అయింది. రెఫ్రీ సీలు విప్పి పావుని కదిపాడు.

పదిన్నర అయ్యేసరికి రేవంత్ ప్రత్యర్థి తాలూకు మరో పాన్‌ని తీసుకుని బిషప్‌కి రూక్‌కీ తన నైట్‌తో ఫోర్క్ వేశాడు.

పోలన్‌స్కీ ''మ్చ్'' అని తల విదిలిస్తూ నవ్వి, ''ఈ నైట్‌ని ఎవడు కనిపెట్టాడో గానీ భలే చంపుతుంది. రెండు గళ్ళూ ముందుకు వెళ్ళి లంబంలో ఎటు దూకుతుందో మానవమాత్రుడికి తెలీదు'' అని జోకువేస్తూ బిషప్‌ని తీసుకువచ్చి రేవంత్ క్వీన్ పక్కగా పెట్టాడు.

తను క్వీన్ కదిపితే, తరువాత ఎత్తుగా పోలన్‌స్కీ రూక్‌ని పక్కకి జరుపుతాడా లేదా అన్నది కాదు రేవంత్ ఆలోచిస్తున్నది! తను వేసిన ఎత్తు బారినుంచి అతడు ఎలా తప్పించుకున్నాడా అని కూడా కాదు!!

పోలన్‌స్కీ మాట్లాడిన మాటలు జ్ఞాపకాల దొంతర్లని కదిపి దేన్నో వెలికి తీసినట్టు ఒకే ఒక మాట మెదడు మారుమూలల్లో ప్రతి ధ్వనించింది.

లంబం:

ఇదే మాటని ఆ అమ్మాయికూడా ఉపయోగించింది. చాలా గమ్మత్తైన మాట లంబం....! పెర్పెన్‌డిక్యులర్!!

''నేను ఈ హోటల్ నుంచి తిన్నగా ఇంటికి వెళ్ళి అక్కణ్ణుంచి లంబంగా బయలుదేరి విగ్రహం జంక్షన్ దగ్గరికి తిన్నగా వస్తాను.''

'ఇంటికి వెళ్ళి అక్కణ్ణుంచి జంక్షన్ దగ్గరికి తిన్నగా వస్తాను' అనొచ్చుగా 'లంబంగా' అని ఎందుకు అన్నది? ఇంతలో ప్రేక్షకుల్లోంచి ఎవరో ''టైమ్ రన్ అవుట్ అవుతున్నది'' అని అరిచారు.

రేవంత్ ఉలిక్కిపడి ఆటవైపు చూశాడు. పోలన్‌స్కీ తన ఆట ఆడి చాలాసేపు అయింది. ఇంకో రెండు నిముషాల్లో రేవంత్ ఎత్తు వేయకపోయినట్లయితే ఓడిపోయినట్టే. అతడు తొందర తొందరగా ఆలోచింది, క్వీన్‌ని ముందుకు తీసుకొచ్చాడు.

ఈసారి పోలన్‌స్కీ వంతు.

రేవంత్ మళ్ళి ఆలోచన్లో పడ్డాడు. ఆమె తిన్నగా వెళ్ళి - తిన్నగా వస్తాను అన్నట్టు గుర్తు. తిన్నగా అన్న మాటలకు అంత ప్రాముఖ్యం ఎందుకు ఇచ్చింది?

''ఇట్నుంచి నేను ఏ వేగంతో వస్తే మీరు అట్నుంచి ఆ వేగంతోనే రావాలి. ఇద్దరం ఒకేసారి కలుసుకుంటాం.''

''అంటే మీరూ నేను జంక్షన్‌కి ఒకే దూరంలో వున్నామన్న మాట.''

''ఈ విషయం కనుక్కోవటానికి పెద్దబాలశిక్ష చదువు చాలనుకుంటాను __''

''ఖేలో.... బై ఖేలో....'' అని ఉర్దూలో అరిచారెవరో. నిజానికి పోటీలో అలా అరవకూడదు. రెఫ్రీ అలా అన్న ప్రేక్షకుడిని హెచ్చరింది బైటకు పంపేశాడు.

టైమ్.... టైమ్..... టైమ్..... రేవంత్ తెప్పరిల్లి బోర్డువైపు చూశాడు. పోలన్‌స్కీ తెరచి రాజు చెప్పాడు. తన కింగ్‌ని కదపటం తప్ప వేరే మార్గం లేదు. అందుకే 'ఈ ఎత్తుకోసం ఇంతసేపు ఆలోచించటం ఏమిటి' అని సలహా ఇచ్చారెవరో. అతడి తప్పులేదు.

రేవంత్ కింగ్‌ని కదిపాడు.

మళ్ళీ ఆలోచన్లు.

తన ఆఫీసునుంచి 'కారుపందెం' స్టార్టయిన జంక్షన్ ఎంతదూరమో తన లెఖ్ఖ ముందే కట్టాడు. తనకింకా జ్ఞాపకమే అది ఇరవై మూడు కిలోమీటర్లు. ఇద్దరూ ఆ పాయింటు దగ్గరికి ఒకే సమయానికి చేరుకొనేలా ప్రయాణం చేశారు.

అంటే హోటల్‌నుంచి ఆమె ఇల్లు, అక్కణ్ణుంచి జంక్షనూ కలిపి ఇరవై మూడు కిలోమీటర్ల దూరం ఉందన్నమాట! ఇది తెలుసుకోవటానికి పెద్దబాలశిక్ష చదువు చాలు అన్నది ఈ దూరం గురించే.

''ఇక్కణ్ణుంచి మా ఇల్లూ - అక్కణ్ణుంచి జంక్షనూ కిలోమీటర్లలో పూర్ణ సంఖ్యలు....''

ఆ మాటలకి అప్పుడు తనంత ప్రాముఖ్యత ఇవ్వలేదు. కానీ ఇప్పుడు తరచి చూస్తే అర్థం బోధపడుతోంది.

ఆలోచిస్తూనే తరువాత ఎత్తు వేశాడు రేవంత్. టైమ్ పదకొండు గంటలు కావొస్తుంది. ఇంకో రెండు మూడు గంటల్లో ఆట పూర్తయ్యేట్టు వుంది. రెండున్నర కల్లా ఎయిర్‌పోర్ట్‌లో ఉండాలి. ఆట అవ్వకపోతే ప్రయాణం కాన్సిల్ అవుతుంది.

పోలన్‌స్కీ తరువాత ఎత్తు గురించి ఆలోచిస్తున్నాడు.

రేవంత్ ఆలోచిస్తున్నది ఇంకోదాన్ని గురించి! ఆమె ప్రయాణం చేసిన మొత్తం దూరం తెలుసు. మధ్యలో 90 డిగ్రీలలో తిరిగిందని తెలుసు.

చప్పున అతడి పెదవుల మీద చిరునవ్వు వెలిసింది. చాలా చిన్న లెక్క.

పైతాగరస్ సిద్ధాంతము

కర్ణమూ స్క్వేర్ = భుజమూ స్క్వేర్ + భుజము స్క్వేర్

తనకి రెండు భుజాల మొత్తం ఎంతో తెలుసు. కానీ ఒక్కొక్క భుజమూ ఎంతో తెలియదు, కర్ణము కూడా ఎంతో తెలీదు.



ఏమీ తెలియకుండా ఎలా కనుక్కోవటం? ఆ.... ఇంకొకటి కూడా తెలుసు. కిలోమీటర్లు అన్నీ పూర్ణసంఖ్యలు అని.... నాలుగు రోడ్ల జంక్షన్‌కీ హోటల్‌కీ మధ్య దూరమెంత? అతడు తను ఆ వూర్లో తిరిగిన అనుభవాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఆలోచించాడు.

ఉజ్జాయింపుగా పదిహేను.... ఇరవై కిలోమీటర్ల దూరం ఉండవచ్చు.

- పోలన్‌స్కీ తన ఆట ఆడేసి చుట్ట కాలుస్తున్నాడు. రేవంత్ వైపు ఉన్న స్టాప్‌వాచీ గుర్రున తిరిగిపోతూంది. రేవంత్ తనవంతు ఎత్తుగా గుర్రాన్ని జరిపాడు. జరిపి కళ్ళు మూసుకున్నాడు.

చాలా పెద్ద లెక్క. అతడికి లెక్కల్లో అనుభవం లేదు. కానీ చదరంగంలో ప్రావీణ్యం అతడికి కావల్సినంత జ్ఞాపకశక్తిని ఇచ్చింది. ముందు '15' అన్న సంఖ్యని తీసుకుని లెక్కకట్టి చూసేడు. రాలేదు. తరువాత 16ని తీసుకున్నాడు. రాలేదు. ఒక్కో లెక్కకి పదినిముషాలు పడుతూంది. అన్నీ మనసులోనే లెక్క కట్టడం కష్టంగా వుంది. అయినా పట్టుదల వదల్లేదు. ఏవో ఎత్తులు వేస్తున్నాడు. మనసంతా లెక్కలే ఆక్రమించుకున్నాయి. తను చీకట్లో అనవసరంగా బాణం వేస్తున్నాడా అన్న అనుమానం కూడా రాకపోలేదు. కేవలం '23' అన్న సంఖ్య మాత్రం తెలుసు. ఆ ఒక్క సంఖ్యతో దూరాన్ని కనుక్కోవటం....

అతను పట్టుదల వదల్లేదు. తరువాత సంఖ్య అయిన 17ని తీసుకున్నాడు. ఒకవేళ ఆ దూరం పదిహేడేగానీ అయితే....

$17^2 = x^2 + (23 - x)^2$

$289 = x^2 + 529 + x^2 - 46x$

$x^2 + 120 - 23x = 0$

$(x-8)\ (x-15) = 0$

$x = 8$ or 15

వచ్చేసింది, పూర్ణసంఖ్య 15, 8.

ఆనందాశ్రమం నుంచి గానీ, నాలుగురోడ్ల జంక్షన్ నుంచి గానీ ఆమె ఇల్లు తిన్నగా 8 కిలోమీటర్ల దూరంలో వుంది.

అతడి ఆలోచనలని చెదరగొడుతూ, ''చెక్ మిస్టర్ రేవంత్'' అన్న స్వరం వినబడటంతో కళ్లు విప్పాడు. ప్రత్యర్థి తాలూకు సేన అంతా నేల ఈనినట్టు తన సామ్రాజ్యంలోకి వచ్చి ఉండటాన్ని గమనించి, నిరాసక్తంగా రాజుని కదిపి కళ్ళు మూసుకున్నాడు. దీన్దేముంది? ఫ్రెండ్లీ మాచ్. అంతరంగంలో ఆడే చదరంగం దీనికన్నా విలువైనది. అక్కడ ఓటమి జీవన్మరణ సమస్య! అది కనుక్కోలేకపోతే కాబోయే భార్య జీవితాంతం దెప్పుతూనే ఉంటుంది.

రేవంత్ తన సర్వశక్తులూ కూడగట్టుకున్నాడు.

బ్లైండ్ ఫోల్డ్!

కళ్ళు మూసుకుని, చదరంగంలో అరవై నాలుగు గళ్ళలో ఎక్కడ ఏయే పావులు ఉన్నాయో గుర్తు పెట్టుకోవటం! అయితే ఇప్పుడు అతను గుర్తుకు తెచ్చుకుంటుంది చదరంగం బోర్డు కాదు. తన నగరపు మ్యాప్‌ని. తన ఊరి మ్యాప్‌లో ఏయే ప్రదేశాలు ఎక్కడ ఉన్నాయా అని.

అతడి స్మృతిపథం నుంచి చదరంగం గళ్ళూ మాయమయ్యాయి. గుర్రాలూ, ఏనుగులూ, బిషప్పులూ తొలగిపోయాయి. మెదడు తెల్ల కాగితమయ్యింది. దానిమీద ఓ సరళరేఖ వచ్చి నిలిచింది. అది అంతలో త్రిభుజమైంది. అలాంటి త్రిభుజాలు నాలుగు, నాలుగు ప్రోబబులిటీస్.

ఇన్నాళ్ళూ తను తిరిగిన వూరి ఫోటోగ్రఫీని, సరదాగా ఉటుసుపోక చూసే రోడ్ మ్యాప్‌ని జ్ఞాపకాల దొంతర్ల మధ్యనుంచి, తీయటానికి అతడు



బ్లైండ్ ఫోల్డ్ కన్నా ఎక్కువ కష్టపడాల్సి వచ్చింది.

ఆ మ్యాప్‌మీద ఈ త్రిభుజాన్ని ముద్రించాడు.

ఆ అమ్మాయి ఇల్లు A-B-C-D అన్న నాలుగు స్థానాల్లో సరిగ్గా ఎక్కడో ఒకచోట వుండి వుండాలి. ఎ - సర్వోదయానగర్. బి - గాంధీకాలనీ. సి - టాంక్‌బండ్ ఏరియా. డి - స్లమ్స్.

అయితే ఇందులో రెండు స్థానాల్ని తీసెయ్యవచ్చు. అమ్మాయి కారు జంక్షన్‌కి ఎడంవైపు నుంచి వచ్చి, టాంక్ బండ్ వైపు వెళ్ళింది. కాబట్టి ఇల్లు ఎ - డి ల్లో ఒకటి అయివుంటుంది. 'డి' స్లమ్స్ (పాకలు), కాబట్టి మిగిలింది - ఎ.

వెన్నెల్లో ఆడపిల్ల నివసించేది సర్వోదయా కాలనీలో.

''చెక్ మిస్టర్ రేవంత్! అయిపోయింది.''

అప్పటికే కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి. రేవంత్ బోర్డు వైపు చూశాడు. తను రిజైన్ చేసే స్థితి వచ్చింది.

చిన్న పిల్లవాడు తాను సాధించిన విజయాన్ని చూసుకుని, సంబరపడ్డట్టు - ''నేను గెల్చాను'' అన్నాడు పోలన్‌స్కీ.

రేవంత్ నవ్వి ''నేనూ గెల్చాను'' అన్నాడు.

18

హోటల్‌కి రాగానే బ్రీఫ్‌కేస్ కూడా సర్దుకోకుండా జేమ్స్‌కి లైటినింగ్ కాల్ చేసేడు రేవంత్. అయిదు నిమిషాల్లో జేమ్స్ లైన్‌లోకి వచ్చాడు.

''జేమ్స్! నేనూ - రేవంత్‌ని. మనని ఇన్నాళ్ళూ వేధించిన అమ్మాయి ఎక్కడ వుంటుందో తెలిసిపోయింది.''

''ఎక్కడ?''

''సర్వోదయా కాలనీలో-''

''ఎలా తెలిసింది?''

''అవన్నీ ఇప్పుడు ఫోన్‌లో వద్దులేగానీ - నేను ఇంకో పదిహేను నిముషాల్లో బయల్దేరి వస్తున్నాను! నేను వచ్చేసరికి ఆ అమ్మాయి ఇల్లు కనుక్కోవాలి నువ్వు. దాన్ని బట్టి ఫోన్ నెంబరు కూడా.''

''ఎలా కనుక్కోవటం?''

''సర్వోదయా కాలనీ చాలా పోష్ లొకాలిటి. ఇళ్ళన్నీ ఒకదాని కొకటి దూరంగా విసిరేసినట్టు వుంటాయి. అన్నీ కలిపి వంద ఇళ్లు కూడా వుండవు. మోటార్ సైకిల్ వేసుకుని ఒక్కో ఇల్లూ చూచుకుంటూ వెళ్లు. ప్రయత్నించు. మనం చీకట్లో బాణం వేస్తున్నామని నాకు తెలుసు కానీ ఇంకో మార్గం లేదు - పట్టుమని రెండు గంటలైనా టైమ్ లేదు మనకి - కాని చివరివరకూ ప్రయత్నం చేయటం చదరంగం ఆటగాడి కుండవలసిన ముఖ్య లక్షణం -'' అని ఫోన్ పెట్టేసేడు.

సెక్రటరీ ''వెళ్దామా'' అని అడిగాడు.

''ఇంకొక్క నిముషం''

సెక్రటరీ టైమ్ చూసుకుని, ''విమానాశ్రయంలో రిపోర్టింగ్ టైమ్ అయిపోతూ వుంది'' అన్నాడు.

టైమ్ అప్పటికే రెండున్నర అయింది. విమానం మూడింటికి. నిజానికి గంట ముందే రిపోర్ట్ చేయాలి. అదృష్టవశాత్తూ కలకత్తాలోలా కాకుండా ఢిల్లీ విమానాశ్రయపు దారి అంత ఇబ్బంది పెట్టదు.

రేవంత్ మరో లైటినింగ్ కాల్ చేసేడు. సర్వోదయా కాలనీ అంతా వలవేసి అయినాసరే అతడు ఆ అమ్మాయి ఫోన్ నెంబరు పట్టుకోదల్చుకున్నాడు. ఒక్క మార్గం కూడా వదలదల్చుకోలేదు. అతడు ఇప్పుడు ఫోన్ చేసింది సులోచనకి. అతడీక్షణం - ముందుకు చొచ్చుకుపోయే సైనికులకి - అన్నివైపుల్నుంచీ ఆలోచిస్తూ సూచన్లిచ్చే కమేండర్ - ఇన్ - చీఫ్‌లా వున్నాడు. శత్రువ్యూహాన్ని బ్రద్దలు కొట్టటానికి కంకణం కట్టుకున్నవాడిలా కృతనిశ్చయుడై వున్నాడు.

విమానం బయల్దేరటానికి సరిగ్గా పాతిక నిముషాలు టైమ్ వుంది.

సెక్రటరీ ఆందోళనగా మళ్ళీ ఇంకోసారి టైమ్ చూసుకుని ''పోనీ టికెట్ కాన్సిల్ చెయ్యనా - రేపు వెళ్దురుగానీ'' అన్నాడు. రేవంత్ కంగారు పడి ''లేదు, లేదు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా నేను సాయంత్రం అయిందింటిలోపల మా ఊర్లో వుండాలి'' అని అంటూ వుండగా, అంతలో

అతడు చేసిన ట్రంక్‌కాల్ వచ్చింది. ఫోన్ అందుకుని, "హాల్లో - కొంచెం సులోచనని పిలుస్తారా?" అని గొంతు హెచ్చించి అన్నాడు.

"ఏ సులోచన?" నిరాసక్తంగా అడిగారెవరో అట్నుంచి.

"ఏమో తెలీదు" అని ఫోన్ పెట్టెయ్యబోయారు.

"డోన్ట్ డిస్‌కనెక్ట్!" అని అరిచాడు రేవంత్. చిరాకూ, కోపమూ మిళితమైన స్వరంతో - "ఇది ఢిల్లీ నుంచి లైటినింగ్ కాల్ అని మీకు తెలుసు. అయినా అంత నిర్లక్ష్యంగా ఎలా పెట్టెయ్యగల్గుతున్నారు?"

"సులోచన అన్న పేరు గలవారెవ్వరూ ఇక్కడ లేరు."

"ఆ అమ్మాయి మీ ఎక్స్చేంజిలో ఎనిమిది సంవత్సరాలు పైగా పని చేస్తూంది. మీ సెక్షన్ కాకపోవచ్చు. కానీ ఇది చాలా ముఖ్యమైన విషయం. తోటి ఆపరేటర్‌కి ఈ మాత్రం సాయం చేయలేని మీరు - మీకు అవసరం వచ్చినప్పుడు ఇంకొకరు సహాయం చేస్తారని ఎలా అనుకొంటారు? అసలు టెలిఫోన్ ఆపరేటర్ అంటేనే సహనానికి పెట్టింది పేరని అందరూ అనుకుంటారు. అటువంటిది కనీసం పక్కవాళ్ళనైనా అడక్కుండా ఇంత నిర్లక్ష్యంగా ఆమెవరో తెలీదు అని ఎలా చెప్పగల్గుతున్నారు?"

అతడి మాటలు ఆమె మీద పనిజేసినయ్. అతడికేమీ జవాబు చెప్పకుండా పక్కవాళ్ళ నెవరినో అడగటం వినిపించింది. ఏవో మీటలు

నొక్కిన శబ్దం... తరువాత కొంచెం సేపటికి సులోచన లైన్లోకి వచ్చి ‘‘హల్లో’’ అంది.

* * * * *

ధడధడా శబ్దం చేసుకుంటూ మోటార్ సైకిల్ ఆ తారురోడ్లగుండా నెమ్మదిగా వెళ్తూంది. రోడ్డుకి ఇటూ అటూ చూసుకుంటూ జేమ్స్ ముందుకు కదులుతున్నాడు. ఫియట్ కారున్న ఇళ్ళయితే చాలా వున్నాయ్ కానీ చాలా ఇళ్ళ గారేజీల తలుపులు మూసివున్నాయి. అందులో మరో కారు ఉన్నదో లేదో తెలీదు. ఫియటున్న ప్రతి ఇంటికీ వెళ్ళి ‘‘మీ ఇంట్లో ఇరవై ఏళ్ళ అమ్మాయి ఎవరైనా వుందా?’’ అని ప్రశ్నిస్తే దేహశుద్ధి తప్పదు.

ఒక ఇంటి ముందు టయోటా కనిపించింది. కానీ దాంతోపాటు చాలా కార్లున్నాయి. పైగా ఇంటిముందు షామియానా వేసి వుంది. చాలా మంది జనం వున్నారు.

దాన్ని దాటి వెళ్లిపోయాడు.

దాదాపు అయిదు నిముషాలు గడిచాక మరో టయోటా కనబడింది. పోర్టికోలో అదిగాక గ్యారేజీలో మరో కారు వున్నట్టు తలుపు సందుల్లోంచి తెలుస్తూంది.

రెండుసార్లు ఆ ఇంటిచుట్టూ రౌండ్లు కొట్టి లోపలికి ప్రవేశించాడు జేమ్స్. గేటు లోపల గూర్ఖా కూర్చునే గార్డ్‌ప్లేస్ వుంది. లోపలికి వస్తూన్న మోటార్ సైకిల్‌ని చూసి గూర్ఖా లేచాడు.

* * * * *

"నేనూ - రేవంత్‌ని, ఢిల్లీనుంచి మాట్లాడుతున్నాను. మీతో కొద్దిగా అవసరం వచ్చింది."

"ఏమిటీ?"

ఆ అమ్మాయి వుండేది సర్వోదయా కాలనీలోనని తెలిసింది. దాంతో ఆ అమ్మాయి ఫోన్ నెంబరు కనుక్కోవచ్చుననుకుంటా!"

అతను ఈ విషయానికై తనకి అంతదూరం నుంచి పనిగట్టుకుని ఫోన్ చెయ్యటం ఆశ్చర్యం కలిగించినా "ఎలా?" అని అడిగింది సులోచన తన ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకుని....

ఈ తిరుగు ప్రశ్నని అతడు వూహించలేదు. తెల్లబోయి, "ఏరియా తెలుస్తే ఫోన్ నెంబరు కనుక్కోలేమా?" అన్నాడు.

"మా దగ్గర రెండు రకాల వివరాలు వుంటాయి. ఒకటి - పేరు చెబ్తే నెంబరు చెప్పటం - దీన్ని డైరెక్టరీ ఎంక్వయిరీ అంటారు. ఇదిగాక 'నెంబరు' చెబ్తే అది ఎవరిదో - ఆ అడ్రసు ఏమిటో చెప్పటం రెండోది.... ఈ రెండూ లేక

ఇంకేమీ చెప్పలేం. ఎందుకంటే ఒక లొకాలిటీలో ఫోన్లన్నీ పక్క పక్క నెంబర్లే అయివుండవు...''

''ఆ అమ్మాయి పేరు 'ఆర్' తో మొదలవుతుంది.''

''ఆర్ -తో మొదలయ్యే పేర్లు డైరెక్టరీలో వెయ్యికి తక్కువ వుండవు.''

''అసలు ఆ అమ్మాయి పేరు మీద ఫోన్ వుండకపోవచ్చు.'' రేవంత్ తనకి తానే సమాధానం చెప్పుకున్నట్టు అనుకున్నాడు.

''మరేం చేద్దాం ___''

రేవంత్ వెంటనే జవాబు చెప్పలేదు. గెడ్డం గోక్కున్నాడు. ఏమీ తోచలేదు. జేమ్స్ ఈ పాటికి ఆ కాలనీలో తిరుగుతూ వుండి వుంటాడు. కానీ విసిరేసినట్టు వుండే ఆ కాలనీ ఇళ్ళలో అతడు ఆమెని ఎలా కనుక్కోగలడు? ఆ ఆశ వదిలేసుకోవచ్చు.

''హల్లో''

అతడు తెప్పరిల్లి అట్నుంచి తన సూచన కోసం ఆమె ఎదురుచూస్తూ వుందని గుర్తొచ్చి ''సరే సులోచనా- బహుశా మనమేమీ చెయ్యలేం అనుకుంటా... థాంక్యూ'' అని ఫోన్ పెట్టేసాడు.

సెక్రటరీ వాచీ చూసుకుని ''మనం ఇంక వెళ్ళనక్కరలేదు. టైమ్ అయిపోయింది'' అన్నాడు. అప్పుడు పావుతక్కువ మూడు కావొస్తూంది.

'ఆరు మూడయినా, మూడు ఆరయినా ఈ రోజు సాయంత్రం లోపులో నేను అక్కడ వుండి తీరాలి' అని తనలో తాను అనుకుని, ''తాళాలు నాకివ్వండి - నేను డ్రైవ్ చేస్తాను'' బ్రీఫ్‌కేస్ కార్లో పెట్టు స్టీరింగ్ ముందు కూర్చున్నాడు.

మలుపుల్లో తిప్పినప్పుడు వచ్చిన కీచుమన్న ధ్వని లోపలి వారికి వినిపించే లోపులో మరో మలుపు దగ్గిరికి చేరుకునేటంత వేగంతో నడిచిన ఆ కారుని 'జనపథ్'లో ఆ రోజు చాలామంది గుర్తుపెట్టుకున్నారు. విమానాశ్రయానికి చేరుకునే సమయానికి చిట్టచివరి వెయిటింగ్ లిస్టు మొంబరుకి టిక్కెట్టు ఇవ్వడం జరుగుతూంది.

సెక్రటరీ పరుగెత్తుకెళ్ళి బోర్డింగ్ కార్డు తీసుకున్నాడు. అది తీసుకుంటే ప్రయాణం నిశ్చయమై పోయినట్టే! అయినా రేవంత్ ఏమీ సంతోషంగా లేడు. తను ఓడిపోతున్నానని అతడికి తెలుస్తూంది. ఆ చీకట్లో మినుకు మినుకుమనే ఆశ జేమ్స్ ఒక్కడే!

* * * * *

''అతడిని లోపలికి పంపించు'' గంభీరంగా ఒక కంఠం వినబడటంతో గూర్ఖా, జేమ్స్ ఇద్దరూ తలతిప్పి చూశారు. బాల్కనీలో ఒక ముసలతను

నిలబడి వున్నాడు. వయసులో పెద్దవాడయినా బలంగా, దృఢంగా వున్నాడు. అప్పటికి అయిదు నిముషాల నుంచీ జేమ్స్‌కీ, గూర్ఖాకీ వాగ్వివాదం జరుగుతూ వుంది. ఇంటి యజమాని పిలుపుతో గర్వంగా గూర్ఖావైపు చూసి, జేమ్స్ అటువైపు నడిచాడు.

ఇద్దరూ లోపలికి అటువైపు ప్రవేశించారు.

"ఎవరు నువ్వు? ఏం కావాలి?"

"ఓల్డ్ బాయిస్ అసోసియేషన్ - రామాపురం కాన్వెంట్ - ప్రెసిడెంట్‌ని. పాత విద్యార్థుల మందరం కలసి ఒక సాంస్కృతిక సభ ఏర్పాటు చెయ్యాలని అనుకుంటున్నాం. దానికోసం రమ్యగారిని కూడా ఆహ్వానిద్దామని వచ్చాను."

"రమ్య ఎవరు?"

జేమ్స్ ఒక్క క్షణం తెల్లబోయాడు. వెంటనే సర్దుకుని "ఈ ఇల్లు కాదా? సర్లెండి... ఈ లోకాలిటీలోనే వుంటుందని ఎవరో చెప్పారు. వెతుక్కుంటూ వస్తున్నాను." ఇక అక్కడ వుండటం, టైమ్ వేస్టని బయటికి రాబోయేడు.

"ఓహో - రమ్య సంగతా నువ్వు అడిగేది?"

బులెట్ తగిలినవాడిలా వెనుదిరిగాడు జేమ్స్. మొహంలోకి రక్తం జివ్వున చిమ్మింది. తన ఆత్మతని అతి కష్టంమీద అణుచుకుని - ''అవునండీ - ఉన్నారా?'' అని అడిగాడు.

లోపలికి చూస్తూ ''అమ్మాయ్'' అని పిలిచాడాయన బిగ్గరగా.

''ఏం డాడీ'' - లోపల్నుంచి ఎక్కడినుంచో సన్నగా వస్తూ వినిపించిందో కంఠం. జేమ్స్ ఉద్వేగాన్ని ఆపుకోలేక పోతున్నాడు. తొంగిచూస్తున్న అతడిని ''లోపలికి రావోయ్'' అంటూ తనతో తీసుకెళ్ళాడు. వెంటిలేషన్ కూడా లేక చాలా చీకటిగా వుంది.

లోపలికి ప్రవేశించగానే చిన్న నవ్వు వినిపించి చప్పున వెనుదిరిగాడు జేమ్స్.

అప్పటికే ముసలాయన బైట తలుపు గడియ వేసేసేడు. ''ఇంటి ముందు రెండుసార్లు అటూ ఇటూ తిరిగినప్పుడే అనుమానం వచ్చింది. నన్ను మోసం చెయ్యలేవు అబ్బాయ్ నువ్వు....'' అని బైట్నుంచి వినబడింది!

* * * * *

''మీరు అదోలా వున్నారు. అఫ్‌కోర్స్... ఆటలో గెలుపూ, ఓటమీ రెండూ సమానమే. అది మీకూ తెలుసు కదా'' అన్నాడు సెక్రటరీ.

''అటువంటిదేమీ లేదు'' రేవంత్ బవాబిచ్చాడు.

“మరి మా ఆతిథ్యంలో లోపమా?”

రేవంత్ కంగారు పడి “అబ్బెబ్బె - మీరా ఆలోచనే రానివ్వకండి” అని ఆగి, నెమ్మదిగా “.... ఒక టెలిఫోన్ గొడవేమిటి? మీకు టెలిఫోన్ డిపార్టుమెంట్‌లో ఏదైనా పని కావలిస్తే చెప్పండి. నేను పనిచేసేది అందులోనే” అన్నాడు.

“ఉహు. నాకు కావలసిన పని అటువంటిది కాదులెండి” అంటూంటే అతడి మెదడులో ఎదో మెరిసినట్లయి వెన్నెల్లో ఆడపిల్ల మాటలు జ్ఞాపకం వచ్చినయ్. “.... టైప్ ఇన్‌స్టిట్యూట్ వాడు ఎలానూ అక్కడే వుంటాడు. మీరు ముందు టాక్సీవాడిని అడగాల్సింది నా గురించి .... చేతిలో వున్న ఒక పక్షిని వదిలి పెట్టుకుని పొదలో వున్న రెండు పక్షుల గురించి ప్రయత్నించే అబ్బాయిలు అంత తెలివైనవాళ్ళు కారు. అలాంటి వారిని అమ్మాయిలు మెచ్చుకోరు కూడా....”

"టెలిఫోన్స్‌లో ఏ డిపార్ట్‌మెంట్ మీది?”

“అకౌంట్స్”

రేవంత్ హతాశయుడయ్యాడు. అయినా ప్రయత్నం వదల్లేదు. “మీ డిపార్ట్‌మెంట్‌లో కొన్ని వివరాలు కావాలి. ఎవరైనా చెప్పగలరా?”

“ఎప్పుడు?”

''ఇప్పుడే!''

అంతలో మైక్‌లోంచి ప్రకటన వినబడింది. ''ఐ.సి. 306 - సెక్యూరిటీ చెక్ వెళ్ళుటకు ఇది ఆఖరి పిలుపు'' అని. అయిదు నిముషాల క్రితమే బోర్డింగ్ స్లిప్స్ ఇచ్చే కౌంటరు మూసేసేరు.

ప్రయాణీకులు విమానంవైపు నడుస్తున్నారు.

''ఇప్పుడా?''

''ఇప్పుడే''

''కానీ మిస్టర్ రేవంత్...'' అంటూ ఏదో చెప్పబోతున్న అతడిని ఆపుచేసి __ ''ఆపరేషన్స్ సైడ్ మీకెవరైనా తెలిసి వుంటే చెప్పండి''

''వెంకటేశ్వర్రావని - మన తెలుగువాడే - అసిస్టెంట్ ఇంజనీరు.''

''అతడి నెంబరు?''

సెక్రటరీ చెప్పాడు.

''రండి, ఫోన్ చేద్దాం''

సెక్రటరీ రేవంత్ వైపు చిత్రంగా చూసి, 'నిశ్చయంగా ఇతడికి మతి భ్రమించి వుండాలి' అనుకున్నాడు. అది పట్టించుకోకుండా రేవంత్ పబ్లిక్ బూత్‌వైపు వడివడిగా నడిచాడు.

.... ప్రయాణీకులు సీట్లలో కూర్చున్నారు. బెట్టులు బిగించుకోమని సూచిస్తూ, లైటు వెలుగుతూంది. మరోవైపు సామానులు కార్గో లోపల పెట్టడం పూర్తయింది.

సెక్రటరీ ఫోన్‌కి వెంకటేశ్వర్రావు లైన్లోకి వచ్చాడు. క్లుపంగా రేవంత్‌ని ఫోన్లోనే పరిచయం చేసి, రిసీవర్ రేవంత్‌కి ఇచ్చాడు. రేవంత్ తనకి కావల్సిన విషయం చెప్తూ ''టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌కి 'లొకాలిటీవైజ్' పుస్తకం లేకపోవటం ఏమిటి? ఉదాహరణకి ఒకచోట రోడ్డు మరామత్తు జరుగుతూ వుందనుకోండి. ఒక కట్టలో కొన్ని టెలిఫోన్ వైర్లు తెగి పోయినయ్. ప్రతి కష్టమరూ ఫిర్యాదు చేసేవరకూ మీరు వాటిని బాగుచెయ్యరా?''

''చేస్తాం''

''అలా చెయ్యాలంటే మీకు ఏయే లొకాలిటీలో ఏయే నెంబర్లు వున్నాయో తెలియాలి కదా?''

''తెలియాలి మిస్టర్ రేవంత్. చాలా సున్నితమైన లాజిక్‌కి అందే ప్రశ్న ఇది! నిజానికి ప్రతీ ఎక్ఛేంజీ ఇటువంటి పుస్తకాలు వ్రాసి పెట్టుకోవాలి. కానీ జూనియర్ ఇంజనీర్ల - అసిస్టెంట్ ఇంజనీర్ల నిర్లక్ష్యంవల్ల ఎవరూ వీటిని అప్-టు-డేట్‌గా వుంచుకోరు. ఒకే లొకాలిటీనుంచి పది ఫిర్యాదులు వచ్చినా ప్రతిదాన్నీ ముందు విడివిడిగా పరీక్షించి, ఆ తరువాతే ముఖ్యమైన వైరు తెగిపోయిందనే నిర్ణయానికి వస్తారు తప్ప - ఆ పది

టెలిఫోనులూ ఒకే ఏరియాలో వున్నవన్న విషయం తెలుసుకోరు. ఇది కేవల మా నిర్లక్ష్యం.''

''అలా కాకుండా రిజిష్టర్లు పెట్టుకునేవాళ్ళు ఎవరైనా వున్నారా?''

''నూటికి ఒకటి, రెండు ఎక్ఛేంజిలు వుంటాయి''

రేవంత్ దేమున్ని ఎప్పుడూ ప్రార్థించలేదు. అటువంటిది ఆ క్షణం ప్రార్థించాడు. 'సర్వోదయా కాలనీవున్న టెలిఫోన్ ఎక్ఛేంజి ఆ రెండిటిలో ఒకటి అయ్యేలా చెయ్యి దేవుడా' అని.

* * * * *

పైలట్ వచ్చి కాక్‌పిట్‌లో కూర్చున్నాడు. విమానం లోపలికి ప్రయాణీకులు వెళ్ళటానికి అమర్చిన నిచ్చెన తొలగింపబడ్తూంది. తలుపులు వేసెయ్యడానికి ఎయిర్ హోస్టెస్‌లు ఆయత్తమవుతున్నారు. గ్రౌండ్ కంట్రోలర్ వాకిటాకీలో సూచనలు ఇస్తున్నారు.

అప్పటికి నాలుగుసార్లు తన చేతిలో వున్న టికెట్టు ముక్కలను (బోర్డింగ్ స్లిప్స్) లెక్కపెట్టిన ఆఫీసర్ అనుమానంగా కౌంటర్‌తో పరిశీలించి చూసుకున్నాడు.

ఎన్నిసార్లు చూసినా ఒకటి తేడా వస్తుంది.

ఈ విషయం పైలట్‌కి తెలియజేయబడింది. ఎయిర్ హోస్టెస్‌లు ప్రయాణీకుల్ని లెఖ్క పెట్టారు. మళ్ళీ ఒకటి తేడా?

పైలట్ అరవిందఘోష్‌కి టైమ్ అంటే చాలా ప్రీతి. రెండుగంటల ప్రయాణాన్ని గంటన్నరలో ముగించి, చివాట్లు తింటూ వుంటాడు. ఎప్పుడెప్పుడు గమ్యం చేరి హోస్టెస్‌ని తీసుకెళ్ళి విందు ఆరగిద్దామా అని తొందరగా వుంది. ఈ ఆలస్యానికి విసుగ్గా కాక్‌పిట్ లోంచి బైటకు వచ్చాడు.

విమానాశ్రయపు అన్ని మైకుల్లోంచి ప్రయాణీకుడి మిస్సింగ్ సంగతి చెప్పబడుతూంది. కావల్సిన ప్రయాణీకుడు మాత్రం ప్రభుత్వం అంగవైకల్యం వున్న వారికోసం ఏర్పాటుచేసిన ఫోన్‌నుండి S.T.D.లో సులోచనతో మాట్లాడుతున్నాడు.

సమయం మూడు గంటలా అయిదు నిమిషాలు అయింది.

* * * * *

ఇంక పూర్తిగా రెండు గంటలు కూడా లేదు. రేవంత్ ఈ పాటికి బయల్దేరి వుంటాడు. తనేమో ఇలా ఇరుకు గదిలో ఇరుక్కు పోయాడు.

ఎందుకో కారణం తెలియకుండా?

ఏం చెయ్యాలో జేమ్స్‌కి తెలియలేదు.

జేమ్స్‌బాండ్‌లా కిటికీలోంచి బైటపడదామంటే వున్నవి ఇనుపవూచలాయె? వెంటిలేటర్ లాంటిది ఏమీ లేదు.

అతడు ఈ ఆలోచన్లతో కొట్టుమిట్టులాడుతూ వుండగా, బైట తలుపు తాళం తీస్తున్న ధ్వని వినిపించింది.

ముసలాయన లోపలికి వస్తున్నాడేమో, వెనుకనుంచి తల బ్రద్దలు కొడ్డామని తలుపు చాటున నిల్చున్నాడు జేమ్స్. అతడి ఎత్తు ఆరు అడుగులు, అరచేతులు చాలా బలిష్టమైనది. వాటి దెబ్బకి ఎంతటి బలమైన బుర్ర అయినా రామకీర్తన పాడాల్సిందే! కానీ తలుపు తీసుకుని లోపలకి వచ్చిన తలమాత్రం పూలున్నది. కనకాంబరం పూలు!! 'ఏం డాడీ' అని లోపల్నుంచి అన్న అమ్మాయి —

తలుపు తెరుచుకుని లోపలికి వచ్చింది.

* * * * *

"క్విక్.... టైమ్ లేదు.... డైరెక్టుగా వెళ్ళి ఇంజనీర్‌ని కలుసుకోండి. M.D.F. రిజిష్టరు అంటారు దాన్ని. లొకాలిటీవైజ్ మెయిన్ డిస్ట్రిబ్యూషన్ ఫ్రేమ్ రిజిష్టర్... అది వాళ్ళ ఆఫీసులో వుంచితే మన పని సానుకూల పడినట్టే. ఎలాగో ఒకలా సంపాదించండి. నేను ఫ్లైట్‌లో వస్తున్నాను. మీకు గానీ నెంబరు దొరికినట్టయితే ఎయిర్ పోర్టుకి వర్తమానం పంపండి. వాళ్ళు నాకు చెబ్తారు. ఇదంతా అయిదింటి లోపలే జరగాలి. అయిదు దాటితే మనం ఓడిపోయినట్టే -" అంటూ ఫోన్ పెట్టేసేడు.

తరువాత బ్రీఫ్‌కేస్ పట్టుకుని సెక్యూరిటీవైపు పరుగెత్తాడు.

అక్కడికి చేరుకుని, "నేనే ప్రయాణీకుణ్ణి. నాకోసమే మీరు మైక్‌లో చెబుతున్నది...." అంటూ బ్రీఫ్‌కేస్ విప్పబోయాడు. ముందు విస్తుబోయి,

తరువాత కోపంగా ఏదో అనబోతున్న ఇన్‌స్పెక్టర్ - రేవంత్ చేతిలోంచి తన చేతిలోకి వచ్చిన పదిరూపాయల కాగితాన్ని చూసి నోరు మూసుకున్నాడు. బ్రీఫ్‌కేస్ తెరిచి పరీక్ష చేయకుండానే ''వెళ్ళండి సార్ - ఇప్పటికే ఆలస్యం అయింది'' అన్నాడు.

అక్కణ్ణుంచి విమానం వరకూ ఆటస్థలంలో ఆటగాడు పరుగెత్తినట్టు రేవంత్ వేగంగా పరుగెత్తాడు. చెయ్యవలసిన ఆలస్యం అంతాచేసి చివరి నిముషంలో ఇలా గాలిలా దూసుకువస్తున్న రేవంత్‌ని 'క్రూ' అంతా విచిత్రంగా చూసింది. అతని బాధ వాళ్ళకి తెలియదు....

విమానం ఇంతసేపూ ఎందుకు కదల్లేదో తెలియక విసుక్కుంటున్న ప్రయాణీకులు - అప్పుడే లోపలికి ప్రవేశిస్తున్న రేవంత్‌ని చూసి ప్రధానమంత్రి కొడుకేమో అనుకున్నారు.

''బోర్డింగ్ స్లిప్ తీసుకుని, ఇంతసేపూ ఎక్కడికి వెళ్ళారు?'' కోపంగా అడిగింది హోస్టెస్, కూర్చొని బెల్టు బిగించుకుంటున్న రేవంత్‌ని.

''టాయ్‌లెట్‌కి''

* * * * *

''మమ్మల్ని క్షమించాలి'' అందా అమ్మాయి. తలుపులు పూర్తిగా తీస్తూ ''డబ్బు బ్లాకులో సంపాదించి సంపాదించీ నాన్నగారికి దాదాపు పిచ్చిపట్టింది. అనుమాన పరిస్థితుల్లో ఎవరు తచ్చాడినా వాళ్ళు

ఇన్‌కంటాక్స్ వాళ్ళో - సి.బి.ఐ. వాళ్లో అనుకుంటూ వుంటారు. మీరు అన్యధా భావించకండి''

''ఆయనెక్కడున్నారు ఇప్పుడు?''

''సెడెటిన్ ఇచ్చాను. నిద్రపోతున్నారు.''

ఆరడుగుల జేమ్స్ నవ్వి ''నేను సి.బి.ఐ. వాణ్ణి కాదని నమ్మకం ఏమిటి?'' అన్నాడు. ఆ అమ్మాయి కూడా నవ్వి ''అవ్వనివ్వండి! ఏదో నవలలో ఇలాటి సంఘటనే జరుగుతుంది'' అతడోక్షణం సాలోచనగా ఆమెవైపు చూసేడు. మనసులో భావాల్ని నిష్కల్మషంగా చెప్పగలిగే ఫాస్ట్‌నెస్‌కు అలవాటు పడ్డ కాలేజీ అమ్మాయి కళ్ళల్లో 'మనం స్నేహితుల మవుదామా?' అన్న ఆఫర్ కొట్టొచ్చినట్టు కనబడుతూంది.

అతడు తన మామూలు పద్ధతిలో పేరూ, వివరాలూ చెప్పి ఆమెను కూడా అడిగి - 'మళ్ళీ ఎప్పుడు కలుసుకుందాం' వగైరా పరిచయాన్ని పెంపొందించుకునే ప్రతిపాదనలు చేయబోయాడు. దానికి మొదటి మెట్టుగా అడుగు ముందుకు వేసేడు. అమ్మాయి దగ్గరైంది. అంతలో క్రితం రాత్రి భార్య తాలూకు దగ్గరతనం జ్ఞాపకం వచ్చింది. ఏదో ఇబ్బంది. దానికి నిర్వచనం లేదు.

అడుగు వెనక్కి వేసి ''మీకు ఈ లొకాలిటీలో రమ్య అనే అమ్మాయి తెలుసా?'' అని అడిగాడు.

ఇంకేదో అడుగుతాడనుకున్నవాడు ఈఓ ప్రశ్న అడిగేసరికి విస్మయం చెంది ‘‘రమ్యా - యెవరూ తెలీదే’’ అంది.

‘‘వాళ్ళకి టయోటా కారుంది.’’

‘‘అవతలి వీధిలో... ఆ.... ఆ.... ఒకమ్మాయి వుంది. నిజమే టయోటాలో చూసేను’’

జేమ్స్‌కి జ్ఞాపకం వచ్చింది. అక్కడే అతడు చాలా కార్లనీ, జనాన్నీ చూసేడు. అతడు వడివడిగా బైటకి వెళ్ళటానికి అడుగులు వేస్తూంటే తటపటాయిస్తూ ఆమె అడిగింది - ‘‘మళ్ళీ కలుద్దామా?’’ అని.

ఒకప్పుడయితే సాధారణంగా అతడే ముందు అమ్మాయిల్ని అడిగే ప్రశ్న ఇది - వారం రోజుల క్రితం వరకూ...

ఇప్పుడూ .... పెళ్ళనే పేరుతో సులోచన కొత్తగా ఏదో నేర్పుతూంది. దాన్ని ప్రేమ అనటానికి అహం అడ్డొస్తుంది. కానీ అడుగు ముందెయ్యటానికి మాత్రం ఏదో అడ్డుపడుతూంది.

.... నవ్వేసి మోటార్ సైకిల్ దగ్గరికి పరుగెత్తాడు జేమ్స్. నమ్మిన సిద్ధాంతాన్ని మనస్ఫూర్తిగా అమలు జరపగలిగేవాళ్ళు ఈ ప్రపంచంలో చాలా తక్కువమంది వుంటారు. ప్రపంచం లోతుగా విశ్లేషించకుండా వీళ్ళకి చెడ్డవాళ్ళనే ముద్ర వేస్తుంది.

సిద్ధాంతంలో లాజిక్‌ని వదిలేసి - చెడుని పట్టుకుని.

* * * * *

టెస్ట్ డెస్క్ రూమ్

పదిహేను అడుగుల యెత్తున్న పానెల్స్ ఆ గదిలో నిలువుగా అమర్చబడి వున్నాయి. నాలుగు ఎయిర్ కండిషనర్లు ఆ గదిని చల్లగా వుంచుతున్నాయి.

భూమిలోంచి పొడుచుకువచ్చిన ఇనపగొట్టాలు ఆ పానెల్స్‌లోకి చొచ్చుకుపోయి వున్నాయి. వాటిలోంచి వేల సంఖ్యలో వైర్లు బయటికొచ్చి విడిపోయి వేరువేరు ప్రదేశాల్లో ఇమిడిపోయాయి. పానెల్‌కి కుడివైపు 'లొకాలిటీ' యెడమవైపు 'న్యూమరికల్' పద్ధతిలో ఆ అమరిక వుంది. ఒక్కొక్కవైరూ ఒక్కొక్క ఫోన్‌కి కనెక్షను.

నలుగురైదుగురు యువకులు ఫోన్లదగ్గిర కూర్చొని, నిర్విరామంగా వస్తూన్న ఫిర్యాదుల్ని వ్రాసుకుంటున్నారు. పానెల్‌కి యెడమవైపు ఏయేవైరు ఏ ఫోను తాలూకుదో వరుసగా నెంబర్లు వేసి వున్నాయి.

110000 నుంచి 11100 వరకూ.

11101 నుంచి 11200 వరకూ.

ఇలా వ్రాయబడి వున్నాయి.

తనని తాను పరిచయం చేసుకుని, సులోచన ఇంజనీర్‌ని తనకి కావల్సిన పుస్తకం గురించి అడిగింది. యెవరూ అడగని ఆ పుస్తకం గురించి ఓ ఆపరేటర్ అడగటం చూసి, ఆశ్చర్యపోయినా ''అటువంటి రిజిష్టరు ఈ మధ్యనే వ్రాయటం మొదలు పెట్టాం - నేను వచ్చాక....'' అని సగర్వంగా చెప్పాడు ఇంజనీర్. ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది.

''నాకోసారి ఆ రిజిష్టరు చూడడానికి ఇస్తారా?''

అదేమీ సీక్రేట్ పుస్తకం కాదు. అడుగుతున్నది కూడా తమ సంస్థ ఉద్యోగినే. అందుకని అతడు డ్రాయరులోంచి ఆ పుస్తకాన్ని తీసి ఇస్తూ ''సాధారణంగా చాలా ఎక్సేంజిల్లో ఈ పుస్తకాల్ని వుంచరు. దీని ప్రాముఖ్యత చాలామందికి తెలీదు. ఒక లొకాటీలో....'' అంటూ చెప్పుకుపోతున్నాడు.

ఆమె వినటంలేదు. వణికే వేళ్ళతో ఒక్కొక్క పేజీయే తిప్పసాగింది. ఇంకా పూర్తిగా వ్రాయబడలేదు - ఆ రిజిష్టరు. కొన్ని రోజుల క్రితమే మొదలు పెట్టబడ్డట్టు వుంది. కొన్ని ఏరియాలు లేవు. తనకి కావల్సిన ఏరియా వుందా లేదా అని ఆమె తడబడే చేతులతో ఒక్కొక్కటీ చూడసాగింది. సంతోష్‌నగర్.... సమీర్‌పురా.... సంగత్‌పేట.... ఆ.... తరువాత కనబడింది.

సర్వోదయ కాలనీ:

19

పెద్ద శబ్దం చేసుకుంటూ దిగిన విమానం చిన్న కుదుపుతో ఆగింది. అరవింద ఘోష్ ఆనందంగా వాచీ చూసుకున్నాడు. పన్నెండు నిముషాల తక్కువ అయిదు, గర్వంగా నవ్వుకుంటూ హోస్టెస్ వైపు చూసి కన్ను కొట్టేడు.

''ఎప్పుడో మమ్మల్నందర్నీ చంపేస్తావు నువ్వు. నీ ఫోర్సుకి బెల్లీ లాండింగ్ కూడా వీలుపడదు'' అంది.

''అవును. ఫోర్సుతో బెల్లీ కూడా లాండవనివ్వను'' అన్నాడు. ఆ మాటల్లో మరో అర్థం అర్థమై నవ్వింది ఆమె.

సరిగ్గా అదే సమయానికి రేవంత్ 'అరైవల్' అని వ్రాసివున్న చోటుకి పరుగెడ్తున్నాడు. విమానం తలుపులు తెరుచుకోగానే బయటపడిన మొదటి ప్రయాణీకుడు అతడు. అతడు లోపలికి ప్రవేశిస్తూవుంటే మైక్‌లో వినబడింది.

''మిస్టర్ రేవంత్ - పాసెంజర్ ఫ్రమ్ ఢిల్లో ఈజ్ రిక్వెస్టెడ్ ఎట్ యెంక్వయిరీ కౌంటర్''

అతడు దాని గురించే అలా పరుగెత్తుకుంటూ వచ్చిన వాడిలా అదే వేగంతో ఎంక్వయిరీ కౌంటర్ దగ్గరికి వెళ్ళాడు. అతడికోసం ఫోన్ వచ్చివుంది. అది సులోచన దగ్గిర్నుంచి.

అతడు చప్పున రిసీవరు తీసుకుని తడిఆరిన గొంతుతో ప్రశ్నించాడు. ''ఏం సులోచనా? దొరికిందా?''

''లేదు''

బకెట్ నీళ్ళు ఒక్కసారిగా గుమ్మరించినట్టయింది. ఒక్కసారిగా ఊపిరి వదుల్తూ నిరాశా నిస్పృహలు నిండిన కంఠంతో ''లేదా'' అన్నాడు.

''ఊహూ''

* * * * *

ఆ వీధి చివరివరకూ కార్లు ఆగి వున్నాయి. తనుకూడా మోటార్ సైకిల్ ఒక పక్కగా ఆపి, కార్ల పక్కగా నడుచుకుంటూ వెళ్ళసాగేడు. అతడికి ఆ ఇంట్లో ఏ ఫంక్షనోకూడా అర్థం కాలేదు. అసలా ఇల్లో కాదో కూడా అనుమానమే. ఒకవేళ అదే ఇల్లయితే....

.... అతడికో చిలిపి ఊహ కూడా వచ్చింది. సాయంత్రం అయిదు గంటలతో రేవంత్ పందెం తాలూకు గడువు పూర్తయిపోతుంది. అందుకని విమానాశ్రయాన్నుంచి సరాసరి ఇక్కడికి తెప్పించే ఏర్పాటు చేస్తుందేమో ఈ అమ్మాయి.

కానీ అతడి ఆలోచనకే అతడికి నవ్వు వచ్చింది.

* * * * *

''వంద ఫోన్లదాకా వున్నాయి ఆ లొకాలిటీలో. దాదాపు ప్రతిఫోనూ ప్రయత్నించాను. యెక్కడా దొరకలేదు.''

''యెలా ప్రయత్నించారు?''

''ఫోన్ అవతలివారు ఎత్తగానే 'రమ్య వుందా?' అని అడగటం మొదలు పెట్టాను. నేను తనకి స్నేహితురాలైనట్టు. ప్రతీసారీ లేదనే సమాధానం వచ్చింది.''

నిస్పృహతో అతడు తల విదిలించేడు. అసలు తను వేసిన త్రిభుజాలు, పైతాగరస్ సిద్ధాంతం - అంతా కాకుల లెఖ్ఖేనేమో! కాకుల ప్రసక్తి రాగానే ఆ అమ్మాయి చెప్పిన కాకులు - తుపాకీశబ్దం కథ జ్ఞాపకం వచ్చింది.... తార్కికంగా అలోచించేవాడు యెక్కడా ఏ లొసుగులూ వుంచుకోడు.

''మీరు లొకాలిటీలో అన్ని నెంబర్లకీ చేశారా?''

''చేశాను. ఏం?''

''ఒక్కటి కూడా అవుట్-ఆఫ్-ఆర్డర్ (పాడయినవి) లేదా?''

సులోచన నాలిక్కరుచుకుని ''ఉన్నాయి'' అంది.

''ఏమిటవి?''

ఆమె తన ముందున్న కాగితం చూసుకొని, మూడు నెంబర్లు చెప్పింది.

''నెంబర్లు కాదు, నాకు ఆడ్రసులూ - అవి యెవరివో వివరాలూ చెప్పండి''

సులోచన రిజిష్టర్ తిరగేసి చూడసాగింది. ఈ లోపులో రేవంత్ ఆలోచించసాగాడు. సులోచన చెప్పిన మూడు నెంబర్లూ ఒకటితో మొదలయ్యేవే. కాని వెన్నెల్లో ఆడపిల్ల రకరకాలుగా చెప్పిన లెఖ్ఖల ప్రకారం చివరి మూడు అంకెలూ - 046 అయివుండాలి. ఈ మూడింటిలోనూ అది లేదే!

ఇంతలో సులోచన అన్నది. ''మొదటి నెంబరు ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్‌ది''

''గుడ్, రెండోది?''

''డాక్టర్ పరాంజపే''

వడివడిగా కొట్టుకునే గుండెతో ''మూడోదీ'' అని అడిగాడు.

''భగవంత రావు, ప్రొ. రమ్యా ఇండస్ట్రీస్....'' ఆమె ఇంకా చదువుతూనే వుంది. రేవంత్ ఆనందంతో ''వచ్చేసింది'' అంటూ పెట్టిన

కేకకి ప్రయాణీకులు అందరూ ఒక్కసారిగా అటు తిరిగారు. అతడు పట్టించుకోలేదు. అట్నుంచి సులోచన ఫోన్లో "కంగ్రాట్స్" చెబుతూంది. ఆమెకు తెలుసు - ఇంతకాలం రేవంత్ పడిన పాట్లు! చేతిలోంచి టెలిఫోన్ జారిపోకుండా గట్టిగా పట్టుకున్నాడు రేవంత్.

తనని తాను సంబాళించుకుంటూ "యెంత ఆ నెంబరు?" అని అడిగేడు.

"13733"

"I ATE NOTHING FOR SIX గంటలు" అన్నాడు నవ్వుతూనే. టెన్సింగ్ హిమాలయాల్ని ఎక్కి విజయం సాధించినప్పుడు కూడా అంత ఆనందం అనుభవించి వుండడు. మనసులో కట్టిన లెఖ్కలూ, ట్రంక్ కాల్సూ - విమానంలో టెన్షనూ - అంతా ఆ క్షణం మర్చిపోయాడు. సులోచనకి థాంక్స్ చెప్పి, ఫోన్ పెట్టేసి బ్రీఫ్‌కేస్ పట్టుకొని బైటకు వచ్చాడు. గాజు అద్దాలు దాటుతూంటే ముందొక కారు వచ్చి ఆగింది. రేవంత్ దాన్ని చూసి ఆగిపోయాడు.

టయోటా!

అందులోంచి ఒక ఆజానుబాహువు దిగాడు. ఆయన ఫుల్ సూట్లో వున్నాడు. రేవంత్‌కి ఆయనెవరో తెలుసు. ఒకటి రెండు మీటింగుల్లో చూసేడు.

భగవంతరావు.

* * * * *

జేమ్స్ గేటులోంచి లోపలికి అడుగుపెడుతూ పైనున్న బోర్డు చూసేడు. ‘‘రమ్యా ఇండస్ట్రీస్...’’ అని వుంది. అతడి పెదాలమీద చిరునవ్వు కదలాడింది.

ఇంకా కార్లు వస్తూనే వున్నాయి.

దూరంలో పోర్టికో కనబడుతూంది. అక్కడ జనం చాలామంది వున్నారు. దగ్గరగా వెళ్ళి అక్కడి దృశ్యాన్ని చూసి స్థాణువైపోయాడు.

* * * * *

‘‘మీకు అన్ని విషయాలు తెలుసుననుకుంటా. నా పేరు రేవంత్.’’

‘‘తెలుసు’’ గంభీరంగా అన్నాడాయన ‘‘నా కూతురు అన్నీ చెప్పింది’’

ఇద్దరూ కారు ఎక్కబోతుంటే ‘‘ఒన్ మినిట్’’ అన్నాడు రేవంత్. బోర్డింగ్ స్లిప్ మీద __

‘వెన్నెల్లో ఆడపిల్ల - ఫోన్ నెంబరు 13733. కేరాఫ్ భగవంతరావు’ అంటూ పూర్తి అడ్రసు వ్రాసేడు. వ్రాసి తలెత్తి ‘‘మీ వాచీలో టైమ్ ఎంతయింది?’’ అని అడిగాడు.

“4-58”

“ఆ టైమ్ ఇక్కడ వేస్తున్నాను. రెండు నిమిషాల గడువు ఉండగానే నేను మీ అమ్మాయి ఫోన్ నెంబర్ కనుక్కోవటం ద్వారా గెలిచాను. ఇంటికెళ్ళాక మీరే నాకు సాక్ష్యం ఇవ్వాలి” అంటూ విజయం సాధించినవాడిలా నవ్వాడు.

ఆయన మాట్లాడలేదు. ఇద్దరూ కూర్చున్నాక కారు బయల్దేరింది.

ఆకాశం మేఘావృతమై వుంది. ఒక కొంగలబారు దక్షిణ దిక్కుగా సాగిపోతోంది. రాబోయే తుఫాను భయంతోనా అన్నట్టు నగరం అప్పుడే విశ్రాంతి ముసుగులోకి జారుకుంటోంది. చలిగాలి రివ్వున కారులోకి కొడుతోంది.

రేవంత్ తల తిప్పి భగవంతరావు కేసి చూసేడు. నుదుటిమీద చెయ్యి పెట్టుకుని, సీటు వెనక్కివాలి, కళ్ళు మూసుకుని ఉన్నాడాయన. బాగా అలసిపోయినట్టూ, ఏదో కోల్పోయినట్టూ వున్న ఆయన్ని చూస్తే రేవంత్‌కి అనుమానం వేసింది.... కూతురు తనతో స్నేహం చెయ్యటం ఈయనకి ఇష్టంలేదేమో అని.

పందెం గడువు పూర్తయ్యే సమయానికి ఎయిర్‌పోర్టుకు కూడా కారు పంపిందీ అంటే తండ్రికి పూర్తి వివరాలతో సహా తన గురించి చెప్పే

వుంటుంది. తను ఓడిపోయి వుంటాడనుకుని కారు పంపింది నిజమే.... కానీ చివరి నిముషంలో తను గెలిచాడని తెలిస్తే -?

ఉడుక్కుంటుందా? ఏమో... సంతోషించనూ వచ్చు. ఎవరి గెలుపైనా ఇద్దరి గెలుపేగా?

ఏదో మధురభావనతో అతడి పెదవులమీద చిరునవ్వు కదలాడింది. తనలో తనే మాట్లాడుకొంటున్నట్టూ ''చివరిక్షణంలో నేను గెలుస్తానని ఎవరూ అనుకోలేదు కదూ?'' అన్నాడు. ఆ మాటలకి ఆయన సమాధి నుంచి చెదిరినట్టూ కదిలి కళ్ళు విప్పాడు.

''నువ్వు గెలుస్తావని తనకు తెలుసు. మనుష్యులపట్ల తన అంచనా తప్పుకాదు'' అని డ్రైవరువైపు తిరిగి ''తొందరగా పోనీ'' అన్నాడు. కారు వేగం పుంజుకుంది. విమానాశ్రయంనుంచి సర్వోదయాకాలనీ చాలా దూరం. ఆయన మాట్లాడుతూవుంటే కంఠంలో వినబడిన జీరని అతడు గుర్తించలేదు.

రేవంత్‌కి ఆయన్ని చాలా అడుగుదామని వుంది. కానీ తన ఆత్మత చూసి ఏమైనా - అనుకుంటాడేమో అని వూరుకున్నాడు. ఇన్నాళ్లూ తనని ఇన్ని ఆటలు పట్టించిన ఆ అల్లరి అమ్మాయిని చాలా కొద్దిసేపట్లో చూడబోతున్నానన్న భావన అతడి హృదయాన్ని గగనసీమలో విహరింపజేస్తోంది.

అతడి ఆలోచనల్ని తుంచుతూ ''నీ కోసం ఇది ఇచ్చింది'' అని ఒక కవరు అందించాడు ఆయన. రేవంత్ విస్మయంతో దాన్ని అందుకున్నాడు. చాలా పెద్ద ఉత్తరం అది. కవరు విప్పి అతడు చదవసాగేడు.

''ప్రియమైన రేవంత్!

ఇది నాలుగోది, మీకు వ్రాస్తానన్న దీ అయిన చివరి ఉత్తరం. పందెం గడువుకి ముందే మీ కందాలని నాన్న గారితో పంపుతున్నాను. ఈ రోజు పదమూడో తారీఖు. ఇంతకీ అయిందింటిలోపులో నన్ను - నా ఫోన్ నెంబర్‌ను కనుక్కున్నారా? కనుక్కుంటే మీకు జోహార్లు! లేకపోతే మాత్రం ముందే చెప్పినట్టు.... వ్వె వ్వె వ్వె.

ఏది ఏమైనా మీకు స్వాగతం. భూమిని అభిషిక్తం చేసేటందుకు సువర్ణకలశంలో దివ్యకాంతిని నింపుకుని ప్రభావితం విచ్చేసినట్టు వచ్చే మీ రాకకై మౌనంగా వేచివుంటాను. రండి మిత్రమా - తొందరగా విచ్చేయండి. పచ్చిక బయళ్ళమీద గోధూళి నేల జారకముందే, గొల్లవాడు పిల్లనగ్రోవి సర్దుకోకముందే, ఎర్రటి సూర్యుడు నల్లకొండల వెనుకకు జారకముందే, హేమవర్ణకలశంలో పండువెన్నెల్ని నింపుకొని వచ్చే మీకోసం కలువలా వేచియుంటాను. ముకుళించుకుని వున్నానేమని విచారపడకండి. ప్రొద్దున్న పూచి సాయంత్రానికి వాడిపోయే పూలలాగా - యుగాలే

కాలగర్భంలో నిమజ్జనాలయిపోతూ వుంటే మనిషి ఎంత? రవీంద్ర కవీంద్రుడన్నట్టు...

- మృత్యుదేవత నా తలుపు తట్టినపుడు

నా జీవిత పూర్ణపాత్రని

అతని ముందుంచుతాను.

రిక్తహస్తాలతో అతడిని ఎన్నడూ పంపను.

పగలు గడిచిపోతే, పక్షులింక పాడకపోతే, గాలి అలిసి సొమ్మగిల్లితే.... చీకటిని నా మీద కప్పెయ్యి! ఈ జీవితంలో నిన్ను కలుసుకునే భాగ్యం నాకు లేకపోయినా, నీ దర్శనాన్ని పొందలేక పోయినాననే తీరని వాంఛని నా నుంచి తప్పించకు ప్రభూ - నాకు శలవయింది. మీ అందరికి నమస్కరించి వీడ్కోలు తీసుకుంటున్నాను. నా ఇంటి తాళం చేతుల్ని తిరిగి ఇచ్చేస్తున్నాను....

చదువుతున్న రేవంత్‌కి మనసులో ఏదో అనుమానం కదలాడింది. ఇంతలో పక్కనుంచి వెక్కుతున్న శబ్దం వినిపించి, చప్పున అటు తిరిగాడు. అప్పటివరకూ బింకంగా కూర్చున్న భగవంతరావు రుమాలు నోటికి అడ్డు పెట్టుకుని బలవంతంగా దుఃఖాన్ని ఆపుకోవటానికి ప్రయత్నించటం గోచరమైంది.

అతడు తనవైపు చూడటం గమనించి ఆయన దుఃఖంతో పూడుకుపోయిన కంఠంతో ''నువ్వు వచ్చేవరకూ శవాన్ని కదల్చకూడదన్నది తన ఆఖరి కోర్కె, అందుకని నేనే స్వయంగా....'' అని ఆ పైన ఇక మాట్లాడలేకపోయాడు.

స్తబ్దంగా వున్న హిమవన్నగం అకస్మాత్తుగా కోలాగ్ని జ్వాలల్ని ఎగజిమ్ముకుంటూ విస్ఫోటనమైనట్టు - భ్రమణాన్విత హేలాయుత ప్రకృతి లీలా ఋత జీవనం హఠాత్తుగా స్తంభించిపోయినట్టు - మిన్ను విరిగినట్టు - మిన్ను మన్ను కలసినట్టు....

అతడు ఎంతసేపు అలా వుండిపోయేడో తెలీదు. కారు అవతల దృశ్యాలు కనబడటంలేదు. నోటమాట రాలేదు. మనసూ ఆలోచించడం మానేసింది. వ్యధ దారుణమై ఆర్ణవమై చెలియలికట్ట దాటుతుంటే చేతిలో ఉత్తరమే ఓదార్పు అయింది. కంటిముందు ఏర్పడిన నీటిపొర అక్షరాల్ని కలగాపులగం చేస్తుంటే, ఒక్కో అక్షరము కూడబలుక్కుంటూ చదవసాగేడు.

''ఏ అర్ధరాత్రిపూటో కడుపులో విపరీతంగా నొప్పి వచ్చేది. మామూలుగా గాస్ట్రిక్స్ అన్నారు డాక్టర్లు. ఆక్స్‌ఫర్డ్ నుంచి వచ్చేశాక అది ఎక్కువైంది. ఎవరో స్పెషలిస్టుకి అనుమానం వచ్చి సెప్కెట్రోస్కోప్ పరీక్షిస్తే - అప్పుడు బయటపడ్డ వ్యాధి డాక్టర్లందరూ కలిసి అందమైన పేరు - హెప్టిక్,

టైప్ ఇటర్‌మిటెంట్ ఫార్‌ఫెరియా, మృత్యువు మింగేవరకూ మనిషిని మామూలుగానే మిగిల్చే వ్యాధి.

మరణం అనివార్యమని తెలిశాక బ్రతకటం చాలా కష్టం రేవంత్! బ్రతికిన ఒకటి, రెండునెలలూ హాయిగా, సంతోషంగా నవ్వుతూ, నవ్విస్తూ గడపాలని నా కోర్కె! నా మరణం సంగతి తెలిసింది నాన్నగారికొక్కరికే. ఆయన నాకు తండ్రేకాదు, స్నేహితుడు, గురువు - అన్నీ! ఈనెల రోజులూ నిర్విరామంగా నాకు నేను పని కల్పించుకోవటం కోసం, చావు గురించిన ఆలోచన్ల నుంచి ఓదార్పుపొందటం కోసం నాకో నేస్తం కావల్సివచ్చింది. ఆ రోజుల్లోనే పేపర్లో చూసేను భారతదేశపు ఏకైక గ్రాండ్ మాస్టర్‌ని! నాకు సమవుజ్జి మీరే అనిపించారు. నేను చేస్తున్నది తప్పనీ, మీకు అనవసరమైన ఆసక్తిని కలుగజేస్తున్నానని నాకు తెలుసు రేవంత్, కానీ నా చుట్టూ పని కల్పించుకోవటం కోసం మొదలుపెట్టిన ఈ చదరంగపు ఆటతో నేను మెడలోతు ప్రేమలో కూరుకుపోయాను. తెలివితేటల్ని బయట పడనివ్వకుండా, అమాయకంగా ఫోన్లో ప్రశ్నలడిగే మీరంటే రోజు రోజుకీ ఇష్టం పెరగసాగింది. ఏ సైంటిస్టో నా ఈ వ్యాధికి మందు కనుక్కుంటే ఎంత బావుణ్ణని అనుకోని క్షణం లేదు. నా ఆశని పరిహసించటానికా అన్నట్టు ఈ నొప్పి ఎక్కువకాసాగింది. నేను దగ్గరవుతున్నానుసుమా అని మృత్యువు రక్తరూపంలో నోటినుంచి బైటకొచ్చి అప్పుడప్పుడూ హెచ్చరించేది. పైకి

మాత్రం అందరికీ అల్లరి రమ్యనే. ఈ అల్లరిపిల్ల ఈ మాత్రం దానికే భయపడుతుందా? చావునే పిల్చి డైరెక్టుగా చెప్పేసింది - ఓ మృత్యువా! నీకోసం నేను యెదురు చూడను. నాకై నేనే నిన్ను ఆహ్వానిస్తాను. అప్పుడు ఇంకెలా బాధపెట్టగలవూ? అని -

ఈ వ్యాధికీ, ట్రాంక్విలైజర్స్‌కి పడదు. అందుకే ఒక మాత్ర - ఈ ఉత్తరం పక్క.

ఇంకా కొంతకాలం పోరాడదామనే అనుకున్నాను రేవంత్! కానీ బాగా అలసిపోయాను. జీవితం గురించి వీడ్కోలు తీసుకోబోయే ముందు ఒక అందమైన రోజు మీతో గడపాలని కోర్కెగా వుండేది. మీతో వుంటే అందమైన రోజో, అందమైన రోజు మీతో వుండటమో - ఏదో అర్థం కావటం లేదు. కనీసం నుదుటను ఒక ముద్దయినా అద్దకుండా స్వచ్ఛతని ఆపాదించుకుంటుందీ ప్రాణం.

HOW DELICIOUS IS THE WINNING OF A KISS AT LOVE'S BEGINING.

అని మాత్రం డైరీలో వ్రాసుకున్నాను.

ఏది ఏమైనా - కాలం నన్ను మీ జ్ఞాపకంగానైనా మిగల్చాలని ఆశ. నా అల్లరితో మీ నెలరోజుల సమయాన్ని వృధాపరచి బాధపెట్టానా? తన కుడిస్తనంనుంచి తల్లి తీసినప్పుడు ఏడ్చిన శిశువు, మరుక్షణమే

ఎడమస్తనంలో ఓదార్పు పొందినట్టు, బాధనుంచి ఓదార్పు - స్నేహంలో పొందేను. ఎన్ని కలలు కన్నాను? భవిష్యత్తు గృహప్రాంగణంలో ఎన్ని రంగవల్లులు తీర్చిదిద్దుకున్నాను. కానీ తుఫాను దెబ్బతిన్న ఈ పాత నావనెక్కి రేవునుంచి రేవుకి యెలా ప్రయాణంకాను? నా ఈ నిరాసక్తాంధకార బంధురక పరేత జీవితపు ఆఖరిక్షణాల్లో తోడుగా నిల్చినందుకు నీకు కృతజ్ఞతలు చెప్పుకోనా నేస్తం? లేక అందకుండ ఆశలు కల్పించినందుకు క్షమాపణ వేడుకోనా?

అయినా స్నేహితులమధ్య క్షమాపణ ప్రసక్తే లేదుగా! స్నేహం అంటే నాకో కథ గుర్తొస్తుంది. ఒక రాకుమార్తె స్వయంవర పరీక్షలు పెడుతూ తనని కలుసుకోవటానికి రకరకాల మార్గాలు చెబుతుంది. ఓ రాకుమారుడు అష్టకష్టాలు పడి, పులుల్తో పోరాడి, పిశాచాల్ని తరిమికొట్టి ఆ దారి కనుక్కుని ఆమెను చేరుకున్నాక 'ప్రియతమా, నేను నిన్ను గమనిస్తూనే వున్నాను. ఆ కుడివైపు ద్వారం నుంచి రాబోయి తటపటాయించావెందుకు? అట్నుంచి అయితే సరాసరి నాదగ్గరికి వచ్చేసేవాడివి కదా' అంటుంది.

సరిగ్గా ఆ కథలోలాగే మీరు నా నెంబరు కనుక్కుని కూడా చాలా దగ్గిరికి వచ్చి వెళ్ళిపోయారు. 18046 అని కనుక్కున్నవారు ఆ కాన్సర్

ఆస్పత్రిలో కొద్దిగా ఎంక్వయిరీ చేసివుంటే ఈ పజిల్ అంతా మంచు విడిపోయినట్టు విడిపోయేది కదా!

''ఐ ఏట్ నథింగ్ ఫర్ సిక్స్ ''అన్న వాక్యం యెన్ను కోవటానికి నేను చాలా కష్టపడాల్సి వచ్చింది. ఒకలా చూస్తే ఆస్పత్రి, మరోలాచూస్తే మా ఇంటి నెంబరూ వచ్చే వాక్యం అది. ఇంతకీ మా ఇంటినెంబరు కనుక్కోగలిగేరా? 13733. అయిదుగంటలు దాటింది కదా. మీరు గెల్చారో ఓడారో తెలుసుకోవడానికి నేను వుండను.

ట్రాంక్విలైజరు కళ్ళమీద నిశ్శబ్దాన్ని బలవంతంగా వత్తుతూంది. ఇది ఆఖరు రాత్రి అని ఈ వ్యాధికీ తెలిసిపోయినట్టుంది. ఈ రాత్రి నా మొహం మీదనుంచి యెలాగైనా చిరునవ్వుని తొలగించాలని కంకణం కట్టుకుంది.ప్రేవుల్ని మెలిపెడుతూంది. అయినా దానికి నేనులొంగను. అయినా మరణం అంటేఏమిటి? లేకపోవటమేగా! మనం వుండము. అంతావుంటుంది. మందాకిని గలగలలు, నీహారికా బిందు సందోహాలు, దూకే జలపాతాలూ, గుడి ప్రాంగణంలో పెరిగే గడ్డిపూలు, మలయమారుతాలూ, మయూర నృత్యాలూ -అన్నీ వుంటాయి. లతపాట, గోదావరి కెరటం, సైంటిస్టుల అద్భుత విజయాలూ, రోడ్లు, భవంతులు - ప్రపంచం అంతా కొనసాగిపోతూ వుంటుంది. ప్రేక్షకుల్లో మన సీటు మాత్రం ఖాళీగా వుంటుంది-అంతేగా . ముఖేష్ అన్నట్టు ''న హోథీ హై న ఘోడా హై

- ఖుదాకే పాస్ జానా హైతో వహా ఫైదల్ హీ జానా హై''(దేవుడి దగ్గిరికి వెళ్ళటానికి ఏనుగులూ, గుర్రాలూ వుండవు. అక్కడికి వెళ్ళాలంటే నడిచే వెళ్ళాలి.)

చాలా రాత్రయిపోయింది. యెదురుగా నా రాముడు వెలుగులు విరజిమ్ముతూ వున్నాడు. బుద్ధుడి బొమ్మ దగ్గర నిన్నటి సాయంత్రం పెట్టిన పూలు ఇంకా వికసిస్తూనే వున్నాయి. 'ఎలాగనీ నిండిన మనసందాక నిలిచుండలేక పాడాలనీ' అంటూ కృష్ణశాస్త్రి పాట సన్నగా వస్తూంది. 'ఆ అడుగుల నడి నా యెరుకే - ఆ నడకల వడి నా కొరకే' అంటాడు.

కాలం వేళ్ళ సందుల్లోంచి పాదరసంగా జారిపోతుంది రేవంత్.

మరణించిన మనిషి పై లోకంలో వుంటాడూ అనుకుంటే , ఆ స్వర్గపు వాకిలి స్తంభానికి ఆనుకుని నిల్చుని నీకోసం కలలు కంటాను. చిరుగాలిలో తేలివచ్చే నీ అడుగుల శబ్దం నా కూ వినిపిస్తుంది. యూకలిప్టస్ కొమ్మ చివర్న కట్టి వుంచిన నా హృదయం నీ కోసం వచ్చేదారినంతా పూరేకులు పరచివుంటుంది. ప్యాసాదిన్..... వస్తూ వస్తూ ఆగారెందుకు? తొందరగా రండి. కాలం జీవితాల్ని కలిపే మాట నిజమే అయితే మనం యెక్కడో కలుస్తాం . ప్రత్యూషపు హిమబిందువుల్లోనో ...

సహారా సవేరాల్లోనో.... ! మరి మీరు ప్యాసాదిన్ అవునో కాదో గానీ నేను మాత్రం ప్యాసీషామ్.

రాత్రి మరీ నిశ్శబ్దంగా వుంది. ఈ నిశ్శబ్దంలో శ్మశానపు జిల్లేళ్ళూ, వైరాగ్యపు ఉమ్మెత్తలూ, నిరాశపు ఎడారిపూలు, నీటిమీదకు వంగిన కొమ్మమీద కూర్చొని, సంజె వెలుగులో తిరిగిరాని ప్రేయసి కోసం కోయిలపాడే ఆర్తగీతాన్ని వింటూ, దుఃఖాశ్రువుల్ని లెక్కి పెట్టుకుంటూ మృత్యువు కోసం యెదురు చూడటం.

లాభం లేదు నేస్తం బాధ గెలిచేటట్టువుంది. కన్నీటి చుక్కని అదిమిపెట్టి వ్రాయాల్సి వస్తూంది. చిన్నప్పుడు అమ్మ పాడేది. 'అమ్మణ్ణి కన్నుల్లు - తమ్మి పూవుల్లు - తమ్మి పువ్వుల్లోని కమ్మ తేనెల్లు.... చిన్నారి కళ్ళల్లో కన్నీటిజల్లు - కన్నీరు చూపకే కరుగు నెడదల్లు' అని. అదేమిటి మీ కళ్ళలోనూ నీరు? నేను పాడాల్సి వస్తుంది సుమా -

ఏడవకు ఏడవకు వెర్రి అబ్బాయి - ఏడిస్తే నీ కంట్ల నీలాలూగారు.... నీలాలు కారితే నే చూడలేను పాలైన కారవే బంగారు కండ్ల.'

వెళ్ళొస్తాను స్నేహితుడా! మరి శలవు.

రమ్య.''

* * * * *

కంటినుంచి నీటిచుక్క జారదేం? ఆకాశం రెండుగా విచ్చిపోదేం ?

.... తల వెనక్కి వాల్చి, కళ్ళు గట్టిగా మూసుకున్నాడు అతడు. ఇదంతా నిజం కాదనీ, కల అని యెవరైనా చెబితే బావుణ్ణు.... రెప్పపాటు కాలంలో ఇదంతా యెంత తొందరగా జరిగిపోయింది. తన జీవితంలోకి యెంత మధురంగా ప్రవేశించి, ఎంత వ్యధా భరితంగా తప్పుకుందీ అమ్మాయి. ఆ వెన్నెల్లో ఆడపిల్లా!నన్ను నేను నీకు సమర్పించుకోవటానికి వస్తే ... యెంత కఠినాత్మురాలివి నువ్వు. నా దుఃఖంలో పునర్జన్మ పొందటానికి మరణించావు! ఈ పందెంలో నేను గెలిచి ఓడానా? ఓడి గెలిచానా?..... ... ...

కారు ఇంటిముందు ఆగింది.

దానికోసమే చూస్తున్నట్టు అక్కడ తిరిగి కలకలం మొదలైంది. ''చీకటి పడుతూంది. తొందరగా కానివ్వండి''అంటున్నారెవరో. భగవంతరావు ఎవరి భుజం మీదో ఆసరా తీసుకొని అచేతనావస్థలో వున్నాడు.

- మీద చెయ్యి పడడంతో కళ్ళు విప్పేడు రేవంత్.

జేమ్స్!

ఇద్దరూ మాట్లాడుకోలేదు. ఆలోచనల నిశ్శబ్దాన్ని పంచుకున్నారు. జనం మధ్యనుంచి అరుగుమీద ఆమె కన్పిస్తూంది. గులాబీ రంగుని మించి

ఆ రేకుల మధ్య నుంచి ఆమె చెయ్యి కన్పిస్తూంది. అగరొత్తులపొగ మేఘూల చాటునుంటి ఆమె మొహం అస్పష్టమైంది. కంజాతదళాలు స్పాప్నిక తీరాల్లో విహరించటం కోసం విశ్రాంతి తీసుకున్నట్టు వున్నాయి. షాన్సెరో కుంచెలోంచి జారిన వీనస్ వెన్నెల్లో కరిగిపోవటానికి సిద్ధమవుతూంది.

తీసుకెళ్ళటానికి ఆయత్తమవుతున్నారు. ఒకరొకరే వెళ్ళి చివరి దర్శనం చేస్తున్నారు.

''పద'' అన్నాడు. జేమ్స్ తనూ కదిలి వెళ్తూ.

రేవంత్ కదలకుండా 'వద్దు' అన్నాడు.

''ఏం''ఆశ్చర్యంతో అడిగాడు జేమ్స్.

''ఒక అద్భుతమైన ఊహా శిల్పాన్ని భావనాలోకాల్లో ఇంతకాలం నిర్మించుకుంటూ వచ్చాను - అది కల్పనగానే నిల్చిపోనీ జేమ్స్.''

''ఆమెను చూసినా నువ్వు నిరాశ చెందవు రేవంత్.''

''లేదు. చూస్తే మరింత వ్యధ. ఆమె స్మృతిగానే మిగిలిపోనీ జేమ్స్! రమ్యగానే నిలిచిపోనీ. పేరు తెలుసుకోవాలన్న ఆశ కూడా నాకు లేదు. వాస్తవం కన్నా ఊహ గొప్పది. నా వూహలోనే ఆమెని బ్రతకనీ...''

''.....''

సూర్యుడు కూడా ఆ దృశ్యాన్ని చూడలేక తొందర తొందరగా పడమటికి జారుకుంటున్నాడు. మనుష్యుల నీడలు పొడుగ్గా పడుతున్నాయి. భగవంతరావుని ఆపటము కష్టమవుతూంది. ఆయనకి కూతురంటే ఎంత ప్రేమో అక్కడ చాలామందికి తెలుసు. కూతురుగానే కాకుండా - ఓ అమ్మాయిగా కూడా ఆమె అక్కడ చాలామందికి ప్రియమైనది. తెలివి -అందం - చదువు ఈ మూడు చాలామందికి వుండటం కష్టం.

దూరంగా ఎవరికీ సంబంధం లేకుండా కూర్చొని వున్నాడు రేవంత్. జేమ్స్ కూడా అతడిని మాట్లాడించదలచుకోలేదు. కొరివి పెట్టాక మంటలు నాల్కలు సాచి నిర్దాక్షిణ్యంగా ఆ సున్నితమైన శరీరాన్ని కాల్చి బూడిద చేయటం మొదలుపెట్టాక , అందరూ నిష్క్రమిస్తూ ఉండగా అతడి దగ్గరకి వచ్చాడు. ''పద వెళ్దాం''

''ఊహూ నన్ను కొద్దిసేపు వదిలెయ్యి జేమ్స్! నేనింకా కొంతసేపు ఇక్కడే ఉండదల్చుకున్నాను.''

జేమ్స్ స్నేహితుడి భుజం మీద చెయ్యివేసి, ''వైరాగ్యం వద్దు. ఇక్కడ ఎంతసేపున్నా ఉండాలనే అనిపిస్తుంది''అన్నాడు.

''నేనేదో శ్మశానవైరాగ్యంతో ఇక్కడే వుండిపోవాలని అనుకోవటం లేదు. ఈ స్తబ్దత ఎంతో బాగుంది. నాకు దుఃఖంకూడా లేదు జేమ్స్! నా యీ నిరామయ చేతనావస్థను భగ్నం చేయకు. వెళ్ళిరా''

చీకటి దట్టంగా పరుచుకొంటూంది. ఎర్రటి నిప్పుల మధ్య నుంచి మంటలు సన్నగా లేస్తూనే వున్నాయి. మోకాళ్ళ మీద గెడ్డం పెట్టుకుని ఆ చితినే చూస్తూ కూర్చున్నాడు అతడు.

సుముద్రంలా అనంతమైనది కాలం. ఎంత అందమైన ఆలుచిప్పల్ని తెస్తుందో అని వచ్చే ప్రతి కెరటం కేసి చూడటం - అవి విసురుగా వచ్చి అందంగా కట్టుకున్న పిచ్చుకగూళ్ళని తనలో కలిపేసుకు వెళ్ళిపోవటం .... దేముడా ! రక్షించు నా పిచ్చుకగూళ్ళని. ఇంత తెలివైన అమ్మాయిని ఇంత నిశ్శబ్దంగా మా మధ్యనుంచి తీసుకువెళ్ళి పోవటానికి నీకు మనసెలా వొప్పిందోయీ? ఇంత కఠినాత్ముడవి ఎలా అయ్యావు?

ఓ గాలీ - నువ్వు బలంగా వీచకు! కనీసం బూడిదనైనా ఓ ఆకృతిలో వుండనీ . ఓ భూమీ- నువ్వు వేగంగా కదలకు! కనీసం పంచ ప్రాణాలైనా చెదరకుండా వుండనీ . ఈ బూడిద ఎగిరి ఏ ధాత్రి నలంకరిస్తుందో ... అక్కడో చిరుపొద మొలుస్తుంది. ఆ వెదురు కుంచెగా మారి ఒక గుర్తు తెలియని చిత్రకారు నలంకరిస్తుంది. ఒక రసరమ్య చిత్రానికి అది ఆకృతినిస్తుంది. అసంతృప్తిలో సంతృప్తి.

‘‘వెళ్ళు బాబూ! బాగా చీకటి పడింది. మృతావశేషాలకోసం నక్కలు వచ్చే వేళయింది’’అంటున్నాడు కాటికాపరి.

అతడిని తలెత్తి చూసేడు. తొంబై ఏళ్ళ వృద్ధుడు, చేతికర్ర సాయంతో నిలబడి వున్నాడు. దుఃఖాన్నీ ఆనందాన్నీ సమానంగా పంచుకోవటానికి అలవాటు పడిన అతడి మొహంలో ఎన్నో చావుల్ని - ఆ బంధుమిత్రుల రోదనల్నీ చూసిన అనుభవం వేదాంతమై పండిపోయింది.

‘‘ నాకు కదలాలని లేదు తాతా! అదిగో చూడు ఆమె ఇంకా అక్కడే పడుకుని వున్నట్టు లేదూ?

‘‘పన్నెండు రోజులవరకూ ఆత్మ ఈ బంధాల్ని వొదుల్చుకోలేక ఈడనే తిరుగుతాది బాబూ’’కర్మ రోజున కాకుల్తోపాటు ఎగిరి శూన్యంలో కలిసిపోద్ది. జ్ఞాపకం మాత్రం మనతోటే మిగిలిపోద్ది.’’

రేవంత్ అనిమేష నేత్రాల్తో అతడివంక చూసేడు. హేతువాదం కన్నా ఆజ్ఞానం మనిషి కెంత సంతృప్తి నిస్తుంది.

అది అజ్ఞానమా?

ఆమె నిజంగా మరణించలేదా?

లేదేమో!

ప్రేమలోని వ్యధే వ్యక్తావ్యక్త బిందువై హిమవన్నగాల్లో ఘనీభవించి మేఘాల్లో కరిగి, నదీ జలాల్లో ప్రవహించి, అర్ణవమై విశ్వవ్యాప్తమవుతూంది.అది వెన్నెల అవుతుంది. ఆ వెన్నెల్లో ఒక ఆడపిల్ల ప్రత్యూషానికి ముందే 'కొలని దేవరకి గొబ్బియళ్ళో'అని పాడుతూ మనసు ముంగిలిలో రంగవల్లులు తీర్చుతుంది. తన వెంటే వుంటుంది. తన విజయంలో ఆనందం పొందుతుంది. తన ఓటమిలో వెనుక వుండి ఉత్సాహాన్నీ ధైర్యాన్నీ ఇస్తుంది. తనకి ఆమె ఒక స్ఫూర్తి . అందించిన తాత చెయ్యి పట్టుకుని అతను లేచాడు.

ఇద్దరూ కదిలారు. చితికి దూరంగా.... ఇంకా దూరంగా..... ప్రపంచంలోకి.

కాటిబైటకు వస్తూ అతడు ఆగి వెనుదిరిగి చూసేడు. ఎర్రనిమంట నెమ్మదిగా చల్లారుతున్నట్లు. .... నిస్తేజంగా - అన్నిటినీ తనలో దాచుకుని ... నివురుగప్పుకొంటూ.

ఒక సజీవాకృతి దగ్ధం చేసి.

అప్పుడొచ్చింది ఒక నీటి చుక్క.

అతడి కంటి నుంచి,

వస్తూ వస్తూ అతడితో అన్నది-

"ప్రియ మిత్రమా! ఇన్నాళ్ళూ నేను నీ గుండెలోతుల్లో నిక్షిప్తమై వున్నాను. నీ బాధల్లోనూ పాలు పంచుకున్నాను. ఈ క్షణం నువ్వు పడే ఈ వ్యధను భరించలేక బైటకు వెళ్తున్నాను. నా ఈ వీడ్కోలు నీకే మాత్రమైనా సంతోషాన్నిస్తే - మిత్రమా! నాకు అంతకన్నా కావల్సిందేముంది? ..... శలవు."

తన ఫోన్ నెంబరు కనుక్కోవటానికి
ఆమె ఇచ్చిన నెలరోజుల గడువు పూర్తవటానికి సరిగ్గా 118 నిమిషాలు మాత్రమే ఉంది. విమానం బయల్దేరటానికి రన్‌వే మీద సిద్ధంగా ఉంది. అప్పుడొచ్చింది అతడికి ఫ్లాష్‌లాటి ఆలోచన
ఫలితం ...?

కదుల్తున్న విమానం ఆగిపోయింది. అతడికోసం మైక్‌లో ప్రకటనల మీద ప్రకటనలు వినవస్తున్నాయి. అతడు మాత్రం తాపీగా ఫోన్ చేస్తున్నాడు. మొత్తం టెలిఫోన్ డిపార్టుమెంటంతా వలవేయబడింది. చివరి క్షణంలోనైనా ఆమె (నెంబరు) అతడికి దొరికిందా ...?

ఆక్స్‌ఫర్డ్ అమ్మాయికి చదరంగం ఛాంపియన్‌కి జరిగిన నాజూకు పోరాటం –

చిరు చిరు లెక్కల గిమ్మిక్కుల నుంచి పైతాగరస్ సిద్ధాంతం వరకూ –

టెలిఫోన్ డిపార్టుమెంట్ తీరుతెన్నుల బ్యాక్‌డ్రాప్‌తో –

క్షణక్షణం మిమ్మల్ని సస్పెన్స్‌లో పెట్టి, పూర్తయ్యాక ఒక మధురభావాన్ని మీ మనసులో కలకాలం నిలబెట్టే నవల.

చదవండి!

నవసాహితి బుక్ హౌస్
పీఠారు రోడ్ • విజయవాడ-520002